# క్రాంతి

లోపలి పేజీల్లో...


రెండు రాష్ట్రాల ఎన్నికలు ....17
70 ఏళ్ల స్వాంతంత్రం ....20
నోట్ల రద్దు, జీఎస్‌టీల ప్రభావం ....23
ఉత్తర కొరియా ....25
ప్రజాస్వామిక తెలంగాణ ....28
పౌరసత్వం లేని రోహింగ్యాలు ....34
కాటలోనియా ...37
ప్రపంచ తెలుగు మహాసభలు ....44
తెలంగాణ, డీకేలలో నిర్బంధం ....46
మూలవాసులు-లంబాడీలు ....49



సి.పి.ఐ. (మావోయిస్టు) ఎ.పి., తెలంగాణ., ఎ.ఒ.బి. కమిటీల అధికార పత్రిక

సంపుటి: 41 సంచిక: 3 అక్టోబరు 2017-మార్చ్ 2018 వెల: పది రూపాయలు


# బోల్షివిక్ పార్టీ నేతృత్వంలో రష్యాలో అక్టోబర్ సోషలిస్టు మహా విప్లవం విజయవంతం


## ప్రపంచ పీడిత ప్రజల, జాతుల ఆశాజ్యోతి– మొట్టమొదటి సోషలిస్టు రాజ్యం ఆవిర్భావం

## ప్రపంచ చరిత్రను మలుపు తిప్పిన మహానాయకుడు కామ్రేడ్ లెనిన్ బాటలో నడుద్దాం

**1912–14 సంవత్సరాల మధ్యకాలంలో విప్లవోద్యమం తలయెత్తడం**

స్టోలీపిన్ అభివృద్ధి నిరోధక విజయం ఎక్కువ కాలం వుండలేదు. లాఠీ దెబ్బలు ఉరికంబాలు తప్ప ప్రజలకు ఏమీ ఈయని ప్రభుత్వం నిలువలేక పోయింది. నిర్బంధ చర్యలు ప్రజల్లో భీతిని కలిగించడం మానివేశాయి. కార్మికులు పొందిన అలసట తొలగిపోసాగింది. విప్లవోద్యమంలో నిజమైన పెరుగుదల 1912 ఏప్రిల్ ,మే నెలల్లో ప్రారంభమైంది.

లేనా బంగారు గనుల్లో కార్మికులను తుపాకి గుండ్లకు ఎరజేసిన సందర్భంలో ప్రజా రాజకీయ సమ్మెలు ఏప్రిల్, మే నెలలలో ప్రారంభమయ్యాయి.



మహోపాధ్యాయుడు కామ్రేడ్ లెనిన్

1912 ఏప్రిల్ 4వ తేదీన సైబీరియాలోని లేనా బంగారు గనులలో సమ్మె జరుగుతున్నప్పుడు జారు ప్రభుత్వ పోలీసు సైన్యాధికారి ఆజ్ఞననుసరించి కాల్పులు జరిగాయి. ఇందులో చనిపోయినవారూ, గాయపడినవారూ అయిదువందల మంది. యజమానులతో సంప్రదించేందుకు శాంతియుతంగా పోతున్న నిరాయుధులైన లేనా గని పనివారలపై తుపాకులు పేల్చటం యావత్తు దేశాన్ని కదల్చివేసింది. గని పనివారల ఆర్థిక సమ్మెను భగ్నం చేయటానికీ, ఆ విధంగానే లేనా బంగారు గని యజమానులైన బ్రిటీష్ పెట్టుబడిదారులను సంతోషపెట్టడానికి, ఈ నూతన రాక్షస కృత్యాన్ని జారు నిరంకుశ ప్రభుత్వం గావించింది.

లేనా బంగారు గనుల నుండి బ్రిటీష్ పెట్టుబడిదారులూ, వారి రష్యన్ భాగస్తులూ పెద్దపెద్ద లాభాలను సంపాదించేవారు. సిగ్గు ఎగ్గూ లేకుండా కార్మికులను తీవ్రంగా దోపిడి చేస్తూ సాలీనా డెబ్బై లక్షల రూబుల్స్‌ను సంపాదించేవారు. వారు కార్మికులకు హీనాతిహీనమైన జీతాలిచ్చేవారు. తినడానికి పనికిరాని చెత్తతిండిని సరఫరా చేసేవారు. ఈ నిర్బంధాన్ని, అవమానాన్ని ఇక ఏమాత్రమూ సహించలేక లేనా బంగారు గనులలోని 6వేల కార్మికులు సమ్మె చేశారు.

లేనా కాల్పులకు జవాబుగా సెంట్‌పీటర్స్‌బర్గ్, మాస్కో తదితర పారిశ్రామిక కేంద్రాల, ప్రాంతాల కార్మికవర్గం మీటింగులు జరిపారు. ప్రదర్శనలు చేశారు. ప్రజా సమ్మెలు గావించారు. స్టోలీపిన్ పాలన సృష్టించిన "శాంతి" వాతావరణాన్ని లేనా ఘటనలు తుఫానులా చిన్నా భిన్నం చేసాయి.

సెంట్‌పీటర్స్‌బర్గ్ బోల్షివిక్ వార్తాపత్రిక "జ్వెజ్దా" (నక్షత్రం)లో 1912లో ఈ విషయాన్ని గురించి ప్రస్తావిస్తూ కామ్రేడ్ స్టాలిన్ ఇలా రాశాడు.

"లేనా కాల్పులు నిశ్శబ్దమనే మంచుగడ్డను బద్దలుగొట్టాయి. ప్రజా ఉద్యమం అనే నది ప్రవహించసాగింది. మంచు బద్దలైంది!....ప్రస్తుత రాజ్యంలో వున్న చెడు అంతా, హానికరమైనదంతా, ఎక్కువ బాధపెడుతున్న రష్యాలోని చెడుగులన్నీ ఒక్క విషయంలో బయటపడ్డాయి అది లేనా ఉదంతం. అందుచేతనే లేనా కాల్పులు, సమ్మెలకూ, ప్రదర్శనలకూ సిగ్నల్‌గా పనిచేశాయి."

విప్లవాన్ని పాతి పెట్టాలన్న లిక్విడేటర్ల ట్రాట్స్కీవాదుల ప్రయత్నాలు వృథా అయినాయి విప్లవశక్తులు సజీవంగా వున్నాయనీ అత్యద్భుతమైన విప్లవశక్తి సంపద కార్మికవర్గంలో పోగైవున్నదని లేనా సంఘటనలు తెలియజేశాయి. 1912 మే డే సమ్మెలలో 4లక్షల మంది కార్మికులు పాల్గొన్నారు. ఈ సమ్మెలు స్పష్టమైన రాజకీయ స్వభావాన్ని పొందాయి. ప్రజాతంత్ర రిపబ్లిక్, దినానికి 8గంటలు పని, ఎస్టేటు భూములను వశపరచుకోవడం మొదలైన బోల్షివిక్ విప్లవ నినాదాలతో ఈ సమ్మెలు జరిగాయి. పై ప్రధాన నినాదాలు కార్మిక జన బాహుళ్యాన్ని ఐక్యపరచడానికే గాక, నిరంకుశ ప్రభుత్వంపై విప్లవదాడిని సాగించడానికీ, రైతులను, సైనికులను ఐక్యపరచు వుద్దేశ్యంతో కూడా ఈయబడినాయి.

రష్యాలో యావత్ శ్రామికవర్గం మే దినోత్సవాన సాగించిన బ్రహ్మాండమైన సమ్మె, దానితో పాటు జరిపిన వీధి ప్రదర్శనలు, విప్లవ ప్రకటనలు, కార్మికుల సభలలో విప్లవ ఉపన్యాసాలు- ఇవన్నీ విప్లవాభివృద్ధి దశలో రష్యా ప్రవేశించిందని స్పష్టంగా తెలియజేశాయి''. అంటూ లెనిన్ "విప్లవాభివృద్ధి'' అనే ఒక వ్యాసంలో రాసాడు. -(లెనిన్ సెలెక్టెడ్ వర్క్స్- ఇంగ్లిష్ ఎడిషన్- మాస్కో-1947- 1వ వాల్యూమ్- 537వ పేజీ)

శ్రామికవర్గం పెరుగుటా, పెద్దపెద్ద పరిశ్రమలలో కార్మికుల కేంద్రీకరణా, వీటికి తోడు బోల్షివిక్ పార్టీ లాంటి విప్లవ పార్టీ ఒకటి ఉండటం దేశ రాజకీయ జీవితంలో రష్యన్ కార్మికవర్గాన్ని అన్నింటికన్న అత్యంత బలీయమైన శక్తిగా తయారు చేస్తున్నాయి. ఫ్యాక్టరీలలో కార్మికులను దోపిడి చేయటంలో అవలంబించే అమానుష పద్ధతులూ, జారు ప్రభుత్వ తొత్తుల సహించరాని పోలీసు రాజ్యమూ, ప్రతి పెద్ద సమ్మెకూ రాజకీయ స్వభావాన్ని కలిగించాయి. ఇంతేగాక, ఆర్థిక, రాజకీయ పోరాటాలను జోడించడం వల్ల ప్రజా సమ్మెలకు అసాధారణమైన విప్లవశక్తి అబ్బింది. విప్లవకార్మిక వర్గ ఉద్యమ అగ్రశ్రేణిలో, వీరులైన సెంట్‌పీటర్స్‌బర్గ్ కార్మికవర్గం నడిచింది. వారిని బాల్టిక్ రాష్ట్రాలు, మాస్కో రాష్ట్రం, వాల్గా ప్రాంతం, దక్షిణ రష్యా ప్రాంతాల కార్మికులు అనుసరించారు. 1913లో ఉద్యమం పశ్చిమ ప్రాంతానికీ, పోలెండ్‌కూ, కాకసస్‌కూ వ్యాపించింది. 1912లో సమ్మెలలో పాల్గొన్న కార్మికుల సంఖ్య ప్రభుత్వ లెక్క ప్రకారం 7లక్షల 25వేలు. కాని పూర్తి లెక్కలను బట్టి 10లక్షలకు పైగా కార్మికులు సమ్మెలలో పాల్గొన్నారు. 1913లో సమ్మెలలో పాల్గొన్న కార్మికుల సంఖ్య ప్రభుత్వ లెక్క ప్రకారం 8లక్షల 61వేలు. కాని పూర్తి లెక్కల ప్రకారం 12లక్షల 72వేలు. 1914 మొదటి అర్ధ సంవత్సరంలో సమ్మె చేసిన వారి సంఖ్య అప్పుడే 15లక్షలకు మించింది.

ఆ విధంగా 1912-14 సంవత్సరాలలో విప్లవ విజృంభణ సమ్మె ఉద్యమ ప్రవాహం, 1905 విప్లవ ప్రారంభంలోని దేశ పరిస్థితిలాంటి దానిని కల్గించింది.

తలయెత్తుతున్న కార్మికవర్గ ఉద్యమం, ప్రజా సమ్మెలూ రైతులను కూడా ఉగ్రూతలూగించాయి. వారిని పోరాటాలలోకి లాగాయి. రైతులు తిరిగి భూస్వాములపై తిరుగబడజొచ్చారు. భూస్వామ్య రాజభవనాలనూ, కులక్ వ్యవసాయ క్షేత్రాలనూ నాశనం చేశారు. 1910-14 సంవత్సరాలలో రైతుల క్రోధ చర్యలు 13 వేలకు పైగా జరిగాయి.

సైనికులలో కూడా విప్లవ సంఘటనలు జరిగాయి. తుర్కిస్థాన్‌లో 1912లో సైనికులు సాయుధ తిరుగుబాటు చేసారు. బాల్టిక్ నౌకాదళంలోనూ, సెవాస్టపూల్‌లోనూ తిరుగుబాటు పరిపక్వమౌతోంది.

1912 వేసవిలో లెనిన్, రష్యాకు దగ్గరగా వుండేందుకు పారిస్ నుండి, గెలీషియాకు (పూర్వం ఆస్ట్రియా) వచ్చాడు. ఇక్కడ సెంట్రల్ కమిటీ సభ్యులతోను ముఖ్యమైన పార్టీ వర్కర్లతోను కూడిన రెండు సభలకు అధ్యక్షత వహించాడు. ఈ సభలు ఒకటి 1912 చివరలో క్రాకో (పోలెండ్)లోనూ, రెండవది 1913 ఆకురాలు కాలంలో, క్రాకోకు సమీపంగా ఉన్న పోరోనినో అనే చిన్న పట్టణంలోనూ జరిగాయి. ఈ సభలు కార్మికవర్గ ఉద్యమ ప్రధాన సమస్యలపైన కొన్ని తీర్మానాలు చేశాయి. ఆ ప్రధాన సమస్య లేమంటే విప్లవోద్యమం అభివృద్ధి చెందుటా, సమ్మెల సందర్భంలో పార్టీ కర్తవ్యాలూ, రహస్య సంఘాలను బలపరచుటా, డ్యూమాలోని సోషల్ డెమోక్రటిక్ గ్రూపు, పార్టీ పత్రికలు, కార్మిక భీమా ప్రచారం లాంటివి ఉన్నాయి.

**బోల్షివిక్ వార్తాపత్రిక "ప్రవదా"**

ప్రవదా వెలువడుటకు పూర్వం బోల్షివిక్‌లకు "జ్వెజ్డా" అను వారపత్రిక ఉండేది. అభివృద్ధి చెందిన కార్మికుల కోసం ఈ పత్రిక ఉద్దేశింపబడింది. "జ్వెజ్డా" లేనా ఘటనల సమయంలో ప్రముఖ పాత్ర వహించింది. కామ్రేడ్ లెనిన్, స్టాలిన్‌లు రాసిన ఘాటైన రాజకీయ వ్యాసాలను అనేకం అది ముద్రించింది. ఈ వ్యాసాలు కార్మికవర్గాన్ని పోరాటానికి సమీకరించాయి. తలయెత్తుతున్న విప్లవ వెల్లువను దృష్టిలో ఉంచుకుంటే బోల్షివిక్ పార్టీ అవసరాలకు ఒక వారపత్రిక సరిపోదు. కార్మిక జన బాహుళ్యానికై ఉద్దేశింపబడిన ప్రజా రాజకీయ దినపత్రిక ఒకటి అవసరం. అలాంటి పత్రికయే ప్రవదా.

ప్రవదా శ్రామికవర్గ ప్రజా పోరాటాలను సంఘటితపరచడంలో సహాయపడింది. 1914 వసంత కాలంలో సెంట్‌పీటర్స్‌బర్గ్‌లో పెద్ద లాకౌట్ జరిగినప్పుడు, ప్రజా సమ్మె ప్రకటించుటకు అదను కానపుడు, ప్రవదా కార్మికులను మరోరకపు పోరాటాలను అవలంభించమని కోరింది. ఫ్యాక్టరీలలో పెద్ద పెద్ద సభలూ, వీధులలో ప్రదర్శనలూ గావించమని కోరింది. ఇది పత్రికలో బహిరంగంగా చెప్పటానికి వీలులేదు, కాని, "కార్మికవర్గ ఉద్యమ రూపాలు'' అనే సాధారణ శీర్షికితో లెనిన్ రాసిన వ్యాసాన్ని చదవగానే, ఈ పిలుపును వర్గ చైతన్యం గల కార్మికులు అర్థం చేసుకున్నారు. ఆ సమయంలో సమ్మెలకు బదులుగా కార్మికవర్గ ఉన్నత రూపాన్ని సాగించాలని లెనిన్ రాశాడు. ఇది సమావేశాలను ప్రదర్శనలను సంఘటిత పరచుటకు పిలుపని వారు అర్థం చేసుకున్నారు.

ఈ విధంగా బోల్షివిక్కుల రహస్య విప్లవ చర్యలు కార్మిక జనబాహుళ్యం గావించే బహిరంగ ఆందోళనా చర్యలతో ప్రవాదా ద్వారా జోడింపబడ్డాయి. కార్మికుల జీవితం, వారి సమ్మెలు, ప్రదర్శనలు మొదలగు వాటిని గురించే కాక, రైతు జీవితాన్ని, వారు అనుభవించే కరువుల గురించి భూస్వామ్య ప్రభువులు వారిని దోపిడి చేయటాన్ని గురించి కూడా ప్రవాదా నిత్యమూ వర్ణిస్తుండేది. స్టోలీపిన్ "సంస్కరణ'' ఫలితంగా కులక్ రైతులు రైతుల నుంచి భూములన్నీ ఎలా లాగివేసి దోపిడి చేశారో అది వర్ణించింది. గ్రామసీమలో సర్వత్రా వ్యాపించి భుగభుగలాడుతున్న అసంతృప్తిని గురించి వర్గచైతన్యం గల కార్మికుల దృష్టికి ప్రవాదా తెచ్చింది. 1905 విప్లవ లక్ష్యాలు ఇంకా సాధించబడలేదనీ, మరొక విప్లవం త్వరలో సమీపించనున్నదనీ, శ్రామికవర్గానికి అది బోధించింది. ఈ రెండవ విప్లవంలో శ్రామికవర్గం ప్రజలకు నిజమైన నాయకపాత్ర, మార్గదర్శక పాత్ర వహించాలని చెప్పింది. ఈ విప్లవంలో విప్లవ రైతాంగమనే శక్తివంతమైన మిత్రులు దానికి వుంటారనీ ప్రవాదా బోధించింది.

ప్రవదాను స్థాపించిన కాలంలో రహస్య సోషల్ డెమొక్రటిక్ సంస్థలు పూర్తిగా బోల్షివిక్కుల సారథ్యం కింద ఉన్నాయి. డ్యూమాగ్రూపు, పత్రికలు, వైద్య సహాయక సమితులూ, కార్మికసంఘాలు, మొదలైన చట్టబద్ధ సంఘాలన్నీ ఇంకా పూర్తిగా మెన్షివిక్కుల నుండి లాగివేయబడలేదు. చట్టబద్ధంగా వుంటున్న కార్మికవర్గ సంఘాల నుండి లిక్విడేటర్లను తరిమివేయడానికి బోల్షివిక్కులు కృతనిశ్చయంతో పోరాటాన్ని సాగించవలసివుంది. ప్రవాదా కృషివల్లా ఈ పోరాటంలో బోల్షివిక్కులకు విజయం లభించింది.

కార్మికవర్గ విప్లవ ప్రజా పార్టీని నిర్మించడం అనే పార్టీ ముఖ్య విధానాన్ని అమలుపరచడం కోసం జరిగే పోరాటానికి ప్రవాదా కేంద్రంగా నిలిచింది. రహస్య బోల్షివిక్కు పార్టీ కేంద్రాల పక్షాన చట్టబద్ధంగా ఉంటున్న సంస్థలను ప్రవాదా సమీకరించింది. విప్లవ సన్నాహం అనే ఒక ఖచ్చిత లక్ష్యంతో కార్మికవర్గ ఉద్యమాన్ని ప్రవాదా నడిపింది.

లిక్విడేటర్లకు వ్యతిరేకంగా విప్లవ కార్మికవర్గ ప్రజా పార్టీని నిర్మించడానికి గాను, రెండున్నర సంవత్సరాలు నిరంతరం పోరాటం సాగించిన ఫలితంగా, 1914 వేసవి నాటికి బోల్షివిక్కులు విజయం పొందారు. ప్రవదా ఎత్తుగడలనూ, బోల్షివిక్కు పార్టీని, రష్యాలోని రాజకీయంగా ఉత్సాహవంతులైన కార్మికులలో నూటికి 80 మంది బలపరచారు.

"1912 నాటి ప్రవదా, 1917 లో బోల్షివిక్కు విజయానికి పునాదిరాయిని వేసింది." (కామ్రేడ్ స్టాలిన్)

1912 ఆకురాలు కాలంలో నాల్గవడ్యూమా ఎన్నికలు జరిగాయి. "తమ కార్మిక ప్రతినిధికి సెంట్‌పీటర్స్‌బర్గ్ కార్మికుల ఆదేశం," 1905లో పూర్తిగావించబడని కర్తవ్యాల ఎడల దృష్టిని స్థాపింపజేసింది. ఆ ఆదేశం ఇలా ప్రకటించింది; "రష్యాలో ఇప్పుడు ప్రజా ఉద్యమాలు ప్రారంభమయ్యే కాలంలో ఉందని మేము భావించుకున్నాం. బహుశా ఈ ప్రజా ఉద్యమాలు 1905 లో కంటే మరింత గాఢంగా వుండవచ్చు....1905లో వలెనే రష్యన్ సమాజంలో బాగా అభివృద్ధి చెందిన శ్రామికవర్గం ప్రజా ఉద్యమాల అగ్రశ్రేణిలో వుంటుంది. దాని ఒకేఒక స్నేహితుడు అధికంగా బాధపడుతున్న రైతాంగం, రష్యాను విముక్తి చేయడంలో దీనికి ప్రబల ప్రయోజనాలున్నాయి.

జారు ప్రభుత్వంతోనూ, దానితో రాజీకి ప్రాకులాడుతున్న లిబరల్ బూర్జువాతోనూ వ్యతిరేకంగా రెండు పోరాటాలు సాగించాలి. ప్రజల భావిచర్యలు అలాంటి పోరాట స్వరూపాన్ని పొందాలని ఆ ఆదేశం ప్రకటించింది.

విప్లవ పోరాటాన్ని సాగించాలని కార్మికులను కోరిన ఈ ఆదేశానికి లెనిన్ చాలా ప్రాముఖ్యతనిచ్చాడు.

బోల్షివిక్కు ప్రతినిధులు ఒక్క డ్యూమా పనితోనే సరిపెట్టుకొని కూర్చోలేదు. డ్యూమా బయటకూడా చాలా ఉత్సాహంగా పనిచేశారు. ఫ్యాక్టరీలను, మిల్లులను సందర్శించారు. దేశంలోని కార్మికవర్గ కేంద్రాలకు పర్యటించి ఉపన్యాసాలిచ్చారు. అక్కడ రహస్య సమావేశాలేర్పరచి పార్టీ నిర్ణయాలను విశదపరచారు. పార్టీ సంస్థలను కొత్తవాటిని గూడా ఏర్పరచారు. ఈ ప్రతినిధులు బహిరంగ కార్యకలాపాలను, చట్టవ్యతిరేక - రహస్య కార్యకలాపాలతో చాకచక్యంగా మేళవించారు.

**బహిరంగ సంస్థలలో బోల్షివిక్కుల విజయం- విప్లవోద్యమ నిరంతరాభివృద్ధి- సామ్రాజ్యవాద యుద్ధం**

ఈ కాలంలో శ్రామికవర్గ పోరాటాలలో బోల్షివిక్ పార్టీ అన్ని

విధాలా, అన్ని రూపాలా ఆదర్శమైన నాయకత్వాన్ని వహించింది. అది రహస్య సంఘాలను నిర్మించింది. రహస్య కరపత్రాలను ప్రకటించింది. ప్రజాసామాన్యంలో రహస్య విప్లవకార్యాన్ని కొనసాగించింది. అదే సమయంలో క్రమంగా బహిరంగంగా వుంటున్న వివిధ కార్మిక వర్గ సంస్థలపై నాయకత్వాన్ని సంపాదించింది. కార్మిక సంస్థలను తమ పక్కకు తిప్పుకోవడానికి ప్రజాభవనాలు, సాయంత్రం విశ్వవిద్యాలయాలు, క్లబ్బులు, వైద్య సహాయక సంఘాలు మొదలగు వాటిలో పలుకుబడిని సంపాదించుటకు పార్టీ ప్రయత్నించింది. బహిరంగంగా వుంటున్న ఈ సంస్థలు చాలా కాలం లిక్విడేటర్లకు స్థావరంగా వుంటూవచ్చాయి. బహిరంగంగా ఉంటున్న సొసైటీలను మన పార్టీ బలీయ స్థానాలుగా మార్చడానికి శక్తివంతమైన పోరాటాన్ని బోల్షివిక్కులు ప్రారంభించారు. రహస్య, బహిరంగ కార్యకలాపాలను చాకచక్యంగా మేళవించటం ద్వారా, బోల్షివిక్కులు ముఖ్య పట్టణాలైన సెంట్‌పీటర్స్‌బర్గ్, మాస్కోలలో రెండింటిలోని కార్మిక సంస్థలలో అధిక సంఖ్యను తమవైపుకు తిప్పుకున్నారు.

ప్రభుత్వపు నాల్గవ డ్యూమాలోని సోషల్ డెమోక్రటిక్ గ్రూపులాంటి ప్రధానమైన బహిరంగ సంస్థను గురించి కూడా అదే చెప్పవచ్చు.

ఆ విధంగా బహిరంగంగా ఉంటున్న సంస్థలలో బోల్షివిక్కుల విజయం, మెన్షివిక్కుల అపజయం నిరంతరం కొనసాగింది. డ్యూమా వేదికనుండి ఆందోళన చేసే విషయంలోనూ కార్మిక పత్రికల విషయంలోనూ, బహిరంగంగా ఉంటున్న ఇతర సంస్థల విషయంలోనూ మెన్షివిక్కులు వెనుకకు నెట్టబడ్డారు. కార్మికవర్గం నిశ్చితంగా బోల్షివిక్కుల చుట్టూ నిలబడింది. కార్మికవర్గంలో విప్లవోద్యమం బాగా బలం సంపాదించుకుంది. మెన్షివిక్కులను పక్కకు నెట్టి పారవేసింది.

వీటన్నిటికి తోడు మెన్షివిక్కులు జాతీయ సమస్యలో కూడా దివాలాకోరు తనం ప్రదర్శించారు. రష్యా సరిహద్దు ప్రాంతాలలో విప్లవోద్యమం జాతీయ సమస్యలపై ఒక స్పష్టమైన కార్యక్రమాన్ని కోరింది. కాని మెన్షివిక్కుల కార్యక్రమంలో 'బండ్' యొక్క సాంస్కృతిక విషయాలలో స్వతంత్ర ప్రతిపత్తి తప్పితే మరొక కార్యక్రమం లేదు. కాని ఇది ఎవరినీ సంతృప్తిపరచలేదు. జాతీయ సమస్యపై బోల్షివిక్కులొక్కరికే మార్క్సిస్టు కార్యక్రమం వుంది. కామ్రేడ్ స్టాలిన్ రాసిన "మార్క్సిజం– జాతీయ సమస్య అనే వ్యాసంలోనూ, లెనిన్ రాసిన "జాతుల స్వయం నిర్ణయహక్కు", జాతీయ సమస్యపై విమర్శనాత్మక వ్యాఖ్యలు" అనే వ్యాసాలలోనూ ఈ కార్యక్రమం వివరింపబడింది.

బహిరంగంగా ఉంటున్న సంస్థలలో బోల్షివిక్కుల విజయం యాదృచ్ఛికం కాదు. కాజాలదు. సరియైన మార్క్సిస్టు సిద్ధాంతమూ, స్పష్టమైన కార్యక్రమమూ, యుద్ధాగ్నిలో పదునెక్కిన విప్లవ శ్రామికవర్గ పార్టీ, బోల్షివిక్కులొక్కరికే వున్నాయి. ఇంతేగాక తలెత్తుతున్న విప్లవ వెల్లువను బోల్షివిక్కులు ప్రతిబింబించారు. అందుచే కూడ ఈ విజయం యాదృచ్ఛికం కాదు.

1914 ప్రారంభంలో కార్మికుల సమ్మెలు అణగిపోలేదు సరిగదా కొత్త ఉరవడిని పొందాయి. 1914 సంవత్సరం మొదటి ఆరునెలల్లో (జులై మొదటి భాగంతో సహా) 14లక్షల 25వేల మంది కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. మే నెలలో బాకుతో జరిగిన నూనె పనివారల సర్వవ్యాపిత సమ్మె, రష్యా యావత్ శ్రామికవర్గం యొక్క దృష్టిని ఆకర్షించింది.

జూలై 3వ తేదీన బాకూ సమ్మె సందర్భంలో సెంట్‌పీటర్స్‌బర్గ్‌లోని ప్యూటిలావ్ పరిశ్రమల కార్మికులు ఒక మీటింగు జరిపారు. పోలీసులు కార్మికులపై కాల్పులు జరిపారు. సెంట్‌పీటర్స్‌బర్గ్ పార్టీ కమిటీ పిలుపునందుకొని జూలై 4వ తేదీన ఆ పట్టణ కార్మికులు 90వేల మంది అసమ్మతిగా పనిమానేశారు. ఈ సంఖ్య జూలై 7వ తేదీకి 1లక్ష 30వేలకూ, ఆ మర్నాటికి 1లక్షా 50వేలకూ, జూలై 11వ తేదీకి 2లక్షలకూ పెరిగింది.

కానీ ఆ సమయంలో అంతర్జాతీయ ప్రాముఖ్యంగల ఒక కొత్త విషయం రంగంలోకి వచ్చింది. ఇది సామ్రాజ్యవాద యుద్ధం. అది యావత్ చరిత్ర క్రమాన్నే మార్చి వేసింది.

**సామ్రాజ్యవాద యుద్ధారంభం– దానికి కారణాలు**

19వ శతాబ్దం చివరలోనూ, 20వ శతాబ్దం ప్రారంభంలోనూ పెట్టుబడిదారీ విధానం ఖచ్చితంగా తన అభివృద్ధి ఉన్నత దశలో ప్రవేశించింది. ఇది దాని అంతిమ దశ సామ్రాజ్యవాద దశ. అలాంటప్పుడు ముఖ్యంగా యుద్ధాలు అనివార్యమయ్యాయి. సామ్రాజ్యవాద దశ. సామ్రాజ్యవాదం క్రింద, శక్తివంతమైన పెట్టుబడిదారీ సంస్థలు (మోనోపలీలు అనగా గుత్తవ్యాపార సంస్థలు) బ్యాంకులు పెట్టుబడిదారీ దేశాలలో ప్రాబల్యమైన స్థానాన్ని ఆక్రమించాయి.

19వ శతాబ్దం ఆఖరికి, ప్రపంచమంతా అప్పటికే పెట్టుబడిదారీ ప్రభుత్వాల మధ్య విభజింపబడి ఉంది. అయినప్పటికీ సామ్రాజ్యవాద శకంలో ఇంతకు పూర్వం అత్యంత అగ్రస్థానంలో వున్న కొన్ని దేశాలు, ఇప్పుడు పూర్వంతో పోల్చిచూసినప్పుడు, చాలా నెమ్మదిగ తమ పరిశ్రమలను అభివృద్ధి చేసుకుంటున్నాయి. ఇది వరలో వెనుకబడి వున్న మరికొన్ని దేశాలు, పై వాటిని అధిగమించి త్వరతగతిని గంతులువేస్తూ తమ పరిశ్రమలను వృద్ధి చేసుకుంటున్నాయి. సామ్రాజ్యవాద ప్రభుత్వాల పరస్పర ఆర్థిక సైనిక బలాలలో మార్పువస్తోంది. ప్రపంచాన్ని తిరిగి విభజించుకోవాలనే ప్రయత్నం ప్రారంభమైంది. ఈ పునర్విభజనకై సాగే పోరాటం సామ్రాజ్యవాద యుద్ధం అనివార్యమైనట్లు చేసింది. 1914 యుద్ధం,

ప్రపంచాన్ని తిరిగి పంచుకోవడానికి, ప్రాబల్య ప్రాంతాల కోసమూ జరిగిన యుద్ధమే. సామ్రాజ్యవాద ప్రభుత్వాలన్నీ దానికోసం చాలా కాలం నుండి సన్నాహాలు చేస్తున్నాయి. ఈ యుద్ధానికి అన్ని దేశాల సామ్రాజ్యవాదులూ బాధ్యులే.

కానీ, ముఖ్యంగా జర్మనీ- ఆస్ట్రియాలు ఒక్క పక్కా, ఫ్రాన్స్- గ్రేట్ బ్రిటను ఈ రెండింటిపై ఆధారపడిన రష్యా మరొక ప్రక్కా. ఈ యుద్ధానికి సన్నాహాలు చేశాయి. 1907లో బ్రిటన్, ఫ్రాన్స్, రష్యాలు కలిసి ఒక త్రైరాజ్య కూటమిని ఏర్పరచాయి. జర్మనీ, ఆస్ట్రియా- హంగరీ, ఇటలీ- ఇవి మూడు కలిసి మరొక సామ్రాజ్యవాద ముఠాను ఏర్పరచాయి. కాని 1914 యుద్ధం ప్రారంభమయ్యాక ఇటలీ ఈ ముఠాను విడిచి, త్రైరాజ్య కూటమిలో చేరింది. జర్మనీ, ఆస్ట్రియా- హంగరీలను, బల్గేరియా టర్కీలు బలపరిచాయి. ఈ యుద్ధం ప్రపంచ యుద్ధంగా మారింది.

### రెండవ ఇంటర్నేషనల్ నాయకుల అవకాశవాదం

రెండవ ఇంటర్నేషనల్ అవకాశవాదం గురించి, దాని నాయకుల ఊగిసలాట గురించి పదే పదే లెనిన్ హెచ్చరించాడు. రెండవ ఇంటర్నేషనల్ నాయకులు తాము యుద్ధానికి వ్యతిరేకులమని మాట్లాడుతున్నప్పటికీ, వాస్తవంగా యుద్ధమే ప్రారంభమైతే వారు తమ వైఖరిని మార్చుకొని సామ్రాజ్యవాద పెట్టుబడిదారుల పక్షానికి పోతారనీ, యుద్ధాన్ని బలపరుస్తారనీ, లెనిన్ ఎప్పుడూ నొక్కి చెబుతూ వుండేవాడు. లెనిన్ ముందుగా చెప్పినది యుద్ధం ప్రారంభమైన మొదటి రోజుల్లోనే రుజువయింది.

శాసనసభలలోని సోషలిస్టులు యుద్ధ రుణాలకు వ్యతిరేకంగా వోటు వేయాలని 1910 కోపెన్‌హేగన్ (డెన్మార్కు)లో జరిగిన రెండవ ఇంటర్నేషనల్ నిర్ణయించింది. 1912లో బాల్కన్ యుద్ధం జరుగుతోంది. ఆ సమయంలో రెండవ ఇంటర్నేషనల్ ప్రపంచ కాంగ్రెస్ బాస్లేలో జరిగింది. పెట్టుబడిదారుల లాభాలను వృద్ధి చేయడం కోసం, ఒకరిపై ఒకరు తుపాకులు పేల్చి చంపుకొనటం నేరమని, అన్ని దేశాల కార్మికులూ భావిస్తున్నారని ఈ కాంగ్రెస్ ప్రకటించింది. ఇదీ వారు చెప్పినది. ఇదీ వారు తమ తీర్మానాల్లో ప్రకటించింది.

కాని తుఫాను చెలరేగగానే, సామ్రాజ్యవాద యుద్ధం ప్రారంభంకాగానే, ఈ నిర్ణయాలను ఆచరణలో పెట్టవలసిన సమయం రాగానే, రెండవ ఇంటర్నేషనల్ నాయకులు విశ్వాసఘాతకులనీ, శ్రామిక వర్గానికి ద్రోహం తలపెట్టారనీ, పెట్టుబడిదారులకు సేవకులనీ రుజువు చేసుకున్నారు. వారు యుద్ధాన్ని బలపరచారు.

1914 ఆగస్టు 4వ తేదీన జర్మన్- డెమోక్రట్సు తమ శాసనసభలో యుద్ధ రుణాలకు అనుకూలంగా వోటుచేశారు. సామ్రాజ్యవాద యుద్ధానికి అనుకూలంగా ఓటుచేశారు. ఫ్రాన్స్, బ్రిటన్, బెల్జియం మొదలగు దేశాలలోని సోషలిస్టులలో అత్యధిక సంఖ్యాకులు అలాగే ఓటుచేశారు. రెండవ ఇంటర్నేషనల్ ఉనికి నశించింది. ఒకరిపై ఒకరు యుద్ధం చేసుకొనే ప్రత్యేక జాతీయ దురహంకార పార్టీలుగా అది చీలిపోయింది. సోషలిస్టు పార్టీల నాయకులు శ్రామికవర్గానికి ద్రోహం చేశారు. జాతీయ దురహంకార వైఖరిని అవలంబించారు.

1915 సెప్టెంబరు ప్రారంభంలో అంతర్జాతీయవాదుల మొదటి సభ జిమ్మర్‌వాల్డ్‌లో జరిగింది. యుద్ధానికి వ్యతిరేకంగా అంతర్జాతీయ ఉద్యమాన్ని అభివృద్ధి చేయుటలో ఈ సభ "మొదటి మెట్టని" లెనిన్ అన్నాడు. ఈ సభలో లెనిన్ జిమ్మర్‌వాల్డ్ అతివాద గ్రూపు ఏర్పరచాడు. జిమ్మర్‌వాల్డ్ అతివాద గ్రూపులో లెనిన్ ఆధ్వర్యాన బోల్షివిక్ పార్టీ ఒక్కటే యుద్ధానికి వ్యతిరేకంగా సరియైన, పూర్తిగా సక్రమమైన పంథాను తీసుకుంది. జిమ్మర్‌వాల్డ్ అతివాద గ్రూపు జర్మన్ భాషలో ఒక పత్రికను ప్రకటించింది. దానిపేరు వార్బోట్ (Vorbote- -హెరాల్డ్) దీనికి లెనిన్ వ్యాసాలు రాస్తూ వుండేవాడు.

1916 స్విట్జర్లాండ్‌లోని కీన్‌దాల్ (Kienthal) అనే గ్రామంలో అంతర్జాతీయవాదులు, రెండవ సభను ఏర్పరచగల్గారు. దీనినే రెండవ జిమ్మర్‌వాల్డ్ సభ అంటారు. ఈ సమయానికి దాదాపు ప్రతి దేశంలోనూ అంతర్జాతీయవాదులు గ్రూపులు ఏర్పడ్డాయి.

అంతర్జాతీయ వాదులకూ, జాతీయ దురహంకారులకూ మధ్య అఘాతం మరింత స్పష్టంగా బయటపడింది. అన్నిటికన్నా ముఖ్యమైన విషయమేమంటే ఈ సమయానికి యుద్ధం మూలానా, యుద్ధఫలితంగా కలిగిన దురవస్థవల్లా, ప్రజాసామాన్యం తనంతకు తానే అతివాదులవైపుకు మొగ్గింది. కీన్‌దాల్ సభ ప్రకటించిన ప్రణాళిక పరస్పర విరుద్ధమైన వివిధ గ్రూపులు అంగీకరించిన ప్రణాళిక. జిమ్మర్‌వాల్డ్ ప్రణాళిక కంటే ఇది ముందడుగు.

కాని జిమ్మర్‌వాల్డ్ సభలాగానే కీన్‌దాల్ సభ కూడా బోల్షివిక్ విధానాల ప్రధాన సూత్రాలను అనగా సామ్రాజ్యవాద యుద్ధాన్ని అంతర్యుద్ధంగా మార్చుటా, యుద్ధంలో తమతమ సామ్రాజ్యవాద ప్రభుత్వాలను ఓడించుటా, మూడవ ఇంటర్నేషనల్‌ను ఏర్పరచుటా- మొదలగు ముఖ్య సూత్రాలను అంగీకరించలేదు. అయినప్పటికీ కిన్‌దాల్ సభ అంతర్జాతీయ వ్యక్తులను సృష్టీకరించుటలో సహాయపడింది. తర్వాత వీరితోనే మూడవ ఇంటర్నేషనల్ ఏర్పడింది.

### యుద్ధం-శాంతి-విప్లవం అనే సమస్యలపై లెనిన్

మెన్షివిక్కులూ, సోషలిస్టు-రివల్యూషనరీలూ విప్లవాన్ని విడనాడి యుద్ధకాలంలో "పౌరశాంతి"ని కాపాడాలని ద్రోహకరమైన నినాదం ఇచ్చారు. దీన్ని వ్యతిరేకిస్తూ, బోల్షివిక్కులు "సామ్రాజ్యవాద యుద్ధాన్ని అంతర్యుద్ధంగా మార్చాలి" అనే నినాదాన్ని ఇచ్చారు.

ఈ నినాదానికి అర్థం ఇది. సైనిక దుస్తులతో వున్న సాయుధ కార్మికులు రైతులతో సహా కష్టపడే ప్రజలంతా, తాము యుద్ధాన్ని అంతమొందించి, న్యాయమైన శాంతిని సాధించదలచితే, తమ పెట్టుబడిదారీ వర్గంపై ఆయుధాలను తిప్పాలి. దాని పరిపాలనను కూలద్రోయాలి.

పెట్టుబడిదారీ మాతృభూమిని సంరక్షించాలనే సోషలిస్టు-రివల్యూషనరీల, మెన్షివిక్కుల విధానానికి వ్యతిరేకంగా "సామ్రాజ్యవాద యుద్ధంలో తమ తమ ప్రభుత్వాలను తాము ఓడించాలి" అనే విధానాన్ని బోల్షివిక్కులు ప్రచారం చేశారు.

**పెట్టుబడిదారీ విధానం యొక్క ఉన్నత దశయే సామ్రాజ్యవాదం:**

యుద్ధకాలంలో లెనిన్ రాసిన సిద్ధాంత గ్రంథం ప్రపంచ కార్మికవర్గానికి చాలా ప్రాముఖ్యమైనది. 1916వ వసంతకాలంలో లెనిన్ "పెట్టుబడిదారీ విధానం యొక్క అత్యంత ఉన్నతదశయే సామ్రాజ్యవాదం" అనే గ్రంథాన్ని రాశారు. సామ్రాజ్యవాదం పెట్టుబడిదారీ విధానం యొక్క అత్యంత ఉన్నతదశ. ఈ దశలో "అభివృద్ధికరమైన" పెట్టుబడిదారీ విధానం, పరాన్నభుక్కు, (parasitic) శిధిల మౌతున్న పెట్టుబడిదారీ విధానంగా రూపాంతరం పొందింది. సామ్రాజ్యవాదం అంటే మృత్యుశయ్యపై వున్న పెట్టుబడిదారీ విధానమే- అని లెనిన్ తన గ్రంథంలో తెలియజేశాడు. దీని అర్థం పెట్టుబడిదారీ విధానం శ్రామికవర్గ విప్లవం లేకుండా పెట్టుబడిదారీ విధానాన్ని కూలద్రోయలేమని లెనిన్ నిత్యమూ బోధిస్తూ వచ్చాడు. సామ్రాజ్యవాదమంటే మరణశయ్యపై వున్న పెట్టుబడిదారీ విధానమని నిర్వచిస్తూ లెనిన్ మరొక ప్రక్క ఇలా అన్నాడు. "శ్రామికవర్గ సామాజిక విప్లవమనే ప్రభాతానికి ముందరి రాత్రియే (తొలిసంధ్య) సామ్రాజ్యవాదం" (Imperialism is the eve of social revolution of the proletarial)

లెనిన్ ఇంకా ఇలా తెలియజేశాడు. సామ్రాజ్యవాద శకంలో పెట్టుబడిదారీ పీడన అంతకంతకూ నిరంకుశంగా మారుతుంది. సామ్రాజ్యవాద దశలో పెట్టుబడిదారీ విధాన పునాదులకు వ్యతిరేకంగా శ్రామికవర్గ తిరుగుబాటు పెంపొందుతుంది. పెట్టుబడిదారీ దేశాలలో విప్లవంశాలు పోగవుతాయి. సామ్రాజ్యవాద శకంలో వలస దేశాలలోను, పరాధీన దేశాలలోను, విప్లవ సంక్షోభం మరింత నిశితమవుతుంది. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా విప్లవంశాలు, సామ్రాజ్యవాదం నుండి విముక్తికోసం యుద్ధం చేసే అంశాలు మరింత పోగవుతాయని లెనిన్ తెలియజేశాడు.

లెనిన్ ఇంకా ఇలా తెలియజేశాడు: సామ్రాజ్యవాద దశలో పెట్టుబడిదారీ విధానాభివృద్ధి అసమానతా, వైరుధ్యాలు, ప్రత్యేకంగా తీవ్రమయ్యాయి. మార్కెట్లకోసం, పెట్టుబడిని ఎగుమతి చేయడానికి కావలసిన క్షేత్రాలకోసం పోరాటాలు జరుగుతాయి. ముడి వస్తువులకు మూలధారమయిన వలస దేశాల కోసం పోరాటాలు జరుగుతాయి. ఇందువల్ల పదే పదే ప్రపంచాన్ని తిరిగి వంచుకోవాలని చేసే సామ్రాజ్యవాద యుద్ధాలు అనివార్యమవుతాయి.

పెట్టుబడిదారీ విధానాభివృద్ధిలోని ఈ అసమానతయే సామ్రాజ్యవాద యుద్ధాలకు దారి తీస్తుంది. ఈ యుద్ధాలు సామ్రాజ్యవాద శక్తిని బలహీనపరుస్తాయి. తద్వారా సామ్రాజ్యవాద రంగాన్ని దాని అత్యంత బలహీన ప్రదేశంలో బద్దలు కొట్టడం సాధ్యమయ్యేటట్లు ఈ యుద్ధాలు చేస్తాయి అని లెనిన్ తెలియజేశాడు.

వీటన్నిటి నుండి లెనిన్ తేల్చిన పర్యవసానం ఇది: సామ్రాజ్యవాద రంగాన్ని ఒకచోట లేక అనేకచోట్ల శ్రామికవర్గం బద్దలు చేయడం సాధ్యమౌతుంది. మొదట అనేక దేశాలలో, లేక విడిగా ఒక దేశంలోనైనా, సోషలిజం విజయం పొందడం సాధ్యమవుతుంది. పెట్టుబడిదారీ విధానాభివృద్ధిలో అసమానత మూలంగా అన్ని దేశాల్లోనూ ఒకేసారి విజయం పొందడం అసాధ్యమవుతుంది. మొట్టమొదట ఒక దేశంలోగాని లేక అనేక దేశాలలోగానీ సోషలిజం విజయం పొందడం సాధ్యమౌతుంది. తక్కిన దేశాలు ఇంకా కొన్నాళ్ళు పెట్టుబడిదారీ దేశాలుగానే వుండిపోతాయి.

**ఫిబ్రవరి విప్లవం- జారు ప్రభుత్వ పతనం**

1917వ సంవత్సరం సమ్మెలతో ప్రారంభమైంది. జనవరి 9సమ్మె ఈ సంవత్సరంలో మొదటి సమ్మె. 1917 ఫిబ్రవరి 18వ తేదీన పెట్రోగ్రాడ్‌లోని పూ్యటిలావ్ పరిశ్రమలలో సమ్మె జరిగింది. ఫిబ్రవరి 22వ తేదీన పెద్ద ఫ్యాక్టరీలన్నింటిలోనూ కార్మికులు సమ్మె చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంలో ఫిబ్రవరి 23వ తేదీన (మార్చి 8వ తేదీన) పెట్రోగ్రాడ్ బోల్షివిక్ కమిటీ పిలుపు ననుసరించి, కార్మిక స్త్రీలు యుద్ధానికి, జారు ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిండికోసం వీధులలో ప్రదర్శనలను నిర్వహించారు. పట్టణ వ్యాపిత సమ్మె ఉద్యమం ద్వారా పెట్రోగ్రాడ్ కార్మికులు దానిని బలపరచారు. ఈ రాజకీయ సమ్మె జారు ప్రభుత్వ వ్యతిరేక సర్వవ్యాపిత రాజకీయ ప్రదర్శనగా పెంపొందసాగింది.

ఫిబ్రవరి 24వ తేదీన (మార్చి 9) ప్రదర్శన మరల మరింత పట్టుదలతో సాగింది. దాదాపు రెండు లక్షల మంది కార్మికులు అప్పుడే సమ్మెలో పాల్గొన్నారు. ఫిబ్రవరి 25వ తేదీన (మార్చి10) పెట్రోగ్రాడ్ కార్మికవర్గం యావత్తూ విప్లవోద్యమంలో చేరింది. జిల్లాలలోని (పేటలలోని-అనువాదకుడు) రాజకీయ సమ్మెలు యావత్ పట్టణ సర్వవ్యాపిత రాజకీయ సమ్మెగా రూపొందాయి. ప్రతిచోటా ప్రదర్శనలూ, పోలీసులతో ఘర్షణలూ చెలరేగాయి. "జారు ప్రభుత్వం నశించుగాక, "యుద్ధం నశించుగాక!" "మాకు తిండి కావాలి" అనే నినాదాలు రాసిన ఎర్రబ్యానర్లు కార్మికుల చేతుల్లో రెపరెపలాడాయి.

ఫిబ్రవరి 26 (మార్చి 11) ఉదయానికి రాజకీయా సమ్మె

ప్రదర్శన, తిరుగుబాటు స్వభావాన్ని సంతరించుకున్నాయి. కార్మికులు పోలీసులను నిరాయుధుల్ని చేసి తాము సాయుధులయ్యారు. అయినప్పటికీ జామెన్స్కయా చౌకువద్ద ప్రదర్శనపై పోలీసుల కాల్పులతో ప్రదర్శకుల పోలీసుల మధ్య ఘర్షణ ముగిసింది.

ఫిబ్రవరి 26 (మార్చి 11) ఉదయం పావ్లోవ్స్కీ రెజిమెంటుకు చెందిన 4వ కంపెనీ రిజర్వు బెటాలియన్ కార్మికులపై గాక, వారిలో ఘర్షణ పడుతున్న పోలీసులపై కాల్పులు జరిపింది. ప్రజలందరి అసహ్యానికి గురైన జారిస్టు నియంతృత్వాన్ని కూలదోయడంలో ప్రజలకు సహాయం చేయాలనీ నేరుగా సైన్యానికి పిలుపునిస్తూ, ప్రత్యేకించి మహిళా కార్మికులు వారిపట్ల సోదరభావంతో వ్యవహరించారు. ఈ విధంగా సైనికులను తమవైపు తిప్పుకోవడానికి వారు అత్యంత శక్తివంతంగా ప్రయత్నించారు.

ఫిబ్రవరి 27వ తేదీన (మార్చి 12) పెట్రోగ్రాడ్‌లోని సైన్యాలు కార్మికులపై తుపాకులు పేల్చ నిరాకరించాయి. తిరుగుబాటు చేసిన ప్రజల పక్షాన నిలువసాగాయి. ఫిబ్రవరి 27వ తేదీ ఉదయం తిరుగుబాటులో చేరిన సైనికుల సంఖ్య పదివేలకంటే ఎక్కువలేదు. కాని సాయంకాలంకల్లా 60వేలు దాటిపోయింది.

తిరుగుబాటుకు పూనుకున్న కార్మికులు, సైనికులు జారు మంత్రులను, సైనికాధిపతులను అరెస్టు చేయ ప్రారంభించారు. జైళ్ళ నుండి విప్లవకారులను విడుదల చేయ ప్రారంభించారు. విడుదలైన రాజకీయ ఖైదీలు విప్లవ పోరాటంలో కలిశారు.

ఇండ్ల కప్పుల నుడి మెషిన్‌గన్‌లతో కాల్చుతున్న పోలీసులతోను, సైనికులతోను వీధులలో పోరాటం జరుగుతూనే ఉంది. తుపాకీగుండ్లు ఒకరిపై ఒకరు పేల్చుతూనే వున్నారు. కాని త్వరలోనే సైనికులు కార్మికుల పక్షాన చేరిపోయారు. ఇది జారు నిరంకుశ ప్రభుత్వ పతనాన్ని నిర్ణయించింది. పెట్రోగ్రాడ్‌లో విప్లవ విజయ వార్త ఇతర పట్టణాలకు, యుద్ధ రంగానికి వ్యాపించగానే ప్రతిచోటా కార్మికులు, సైనికులు జారు ఉద్యోగస్తులను పదవులనుండి కిందికి లాగ ప్రారంభించారు.

ఫిబ్రవరి బూర్జువా ప్రజాతంత్ర విప్లవం విజయం పొందింది. "శాంతి– తిండి– స్వాతంత్ర్యం" అని కోరుతూవున్న సైనిక దుస్తులలో వున్న లక్షలాది రైతుల ఉద్యమానికి నాయకత్వం వహించిన కార్మికవర్గం, విప్లవానికి అగ్రగామియగుట వల్లనే విప్లవం విజయం పొందింది. శ్రామికవర్గ నాయక పాత్రయే విప్లవ విజయాన్ని నిర్ణయించింది.

విప్లవ ప్రారంభ దినాల్లో లెనిన్ ఇలా రాశాడు: "శ్రామికవర్గమే విప్లవాన్ని గావించింది. శ్రామికవర్గం వీరత్వాన్ని ప్రదర్శించింది. అది తన రక్తాన్ని ధారపోసింది. కష్టపడే పేద ప్రజానీక బాహుళ్యాన్ని తనతోబాటు తీసుకు వెళ్ళింది." **(లెనిన్, కలెక్టెడ్ వర్క్స్, రష్యన్ ఎడిషన్ 20వ వాల్యూం, 23, 24 పేజీలు)**

**ద్వంద్వాధికారం**

1917 ఫిబ్రవరి 27న బూర్జువాల నాయకత్వంలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడింది. పెట్టుబడిదారీ ప్రభుత్వంతో పాటు కార్మిక సైనిక ప్రతినిధుల సోవియట్‌కు చెందిన మరో ప్రభుత్వం కూడా ఏర్పడింది. సోవియట్‌లోని సైనిక ప్రతినిధులు చాలా భాగం యుద్ధానికి సమీకరించబడిన రైతులే. కార్మిక, సైనిక ప్రతినిధుల సోవియట్ అంటే జారు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏర్పడిన కార్మికుల, రైతుల సమ్మేళనా సాధనం. ఇంతేగాక వారి అధికార సాధనం, కార్మికవర్గ రైతాంగాల నియంతృత్వ సాధనం.

దీని ఫలితంగా రెండు అధికారాల కేంద్రాల విచిత్ర స్థితి. రెండు నియంతృత్వాల స్థితి. ఒకటి తాత్కాలిక ప్రభుత్వం ప్రాతినిధ్యం వహించిన పెట్టుబడిదారీ నియంతృత్వం. రెండవది కార్మిక సైనిక ప్రతినిధుల సోవియట్ ప్రాతినిధ్యం వహించిన శ్రామికవర్గ రైతాంగాల నియంతృత్వం. దీని ఫలితం ద్వంధ్వాధికారం.

విజయాన్ని సాధించిన కార్మికులు, రైతులూ తమకుతామే బూర్జువా ప్రతినిధులకు అధికారాన్ని ఎలా అప్పగించారు? దానికి కారణాలేమిటి?

దీనికి జవాబును లెనిన్ ఈ విధంగా వివరించాడు. "రాజకీయాలలో అనుభవం లేని లక్షలాది ప్రజలు చైతన్యవంతులైన రాజకీయ కార్యాచరణలోకి ముందుకు దూకారు. ఇందులో చాలాభాగం చిన్న స్వంత ఆస్థిదారులు, రైతులు, ఇటీవలివరకు రైతులుగా వుండి ఇపుడు కార్మికులుగా మారినవారు. పెట్టుబడిదారీ వర్గానికి శ్రామికవర్గానికి మధ్యగా వున్న ప్రజలు ఆ కాలంలో యూరప్‌లోని పెద్ద దేశాలన్నిటిలోకి రష్యా చాలా మధ్యతరగతి దేశం (పెటీ బూర్జువాదేశం) ఈ దేశంలోని "బ్రహ్మాండమైన పెటీ బూర్జువా (మధ్య తరగతి) వెల్లువ ప్రతి దానిని తుడిచి పెట్టివేసింది. వర్గ చైతన్యం గల శ్రామికులను సంఖ్య రీత్యానేగాక సిద్ధాంతరీత్యా కూడా ముంచెత్తింది. అంటే కార్మికులలో అత్యధిక భాగానికి పెటీబూర్జువా రాజకీయ దృక్పథం అనే వ్యాధిని సంక్రమింపజేసి జీర్ణింపజేసింది." **(లెనిన్ సెలెక్టెడ్ వర్క్స్ ఇంగ్లీష్ ఎడిషన్- మాస్కో, 1947 రెండవ వాల్యూం- 2వ పేజీ)**

ఈ పరిస్థితులలో బోల్షివిక్ పార్టీ కర్తవ్యం ఇది: ఓపికగా విశదీకరించుట ద్వారా తాత్కాలిక ప్రభుత్వం యొక్క సామ్రాజ్యవాద స్వభావాన్ని తెలియజేసి ప్రజాసామాన్యుల కండ్లు తెరవడం. సోషలిస్టు– రివల్యూషనరీ, మెన్షివిక్కుల ద్రోహాన్ని బట్టబయలు చేయడం, తాత్కాలిక ప్రభుత్వం స్థానే సోవియట్లు ప్రభుత్వాన్ని స్థాపిస్తే తప్ప శాంతిని సాధించలేమని నిరూపించడం. ఇందుకు గాను బోల్షివిక్ పార్టీ ఉన్న శక్తినంతా ఉపయోగించి పనిచేసింది.

**అక్టోబర్ సోషలిస్టు విప్లవ దశ**

ఫిబ్రవరి విప్లనాంతరం దేశంలో పరిస్థితి: విప్లవానికి

సంబంధించిన తొలి వార్తలు వినగానే స్విట్జర్లాండ్‌లో ప్రవాసంలో వున్న లెనిన్ పార్టీని రష్యా కార్మిక వర్గాన్ని వుద్దేశించి "సుదూరం నుండి లేఖలు" రాశారు. అందులో ఆయన ఇలా అన్నారు.

స్విట్జర్లాండ్‌లోని జూరిచ్ నుండి జర్మనీలోని బెర్లిన్, స్వీడన్‌లోని స్టాక్‌హోమ్ గుండా పిన్‌లాండ్ దేశంలో రష్యా సరిహద్దుల్లో ప్రవేశించి, ఏప్రిల్ 3 రాత్రి లెనిన్ పెట్రోగ్రాడ్ చేరుకున్నారు. ఫిన్‌లాండ్ రైల్వేస్టేషన్‌లోను ఎదురుగా ఉన్న చెక్‌లోను వేలాది కార్మికులు, సైనికులు, నావికులు సమావేశమయ్యారు. అక్కడ చికెడ్జ్(chiknieidze) స్కోవ్‌చెవ్ (skobelev) అనే మెన్షివిక్‌లు పెట్రోగ్రాడ్ సోవియట్ తరపున స్వాగతోపన్యాసం ప్రారంభించారు. తమకు లెనిన్‌కు మధ్య సామరస్యం కుదురుతుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేసారు. అయితే లెనిన్ వాళ్ళ మాటలు వినటానికి ఆగకుండా వాళ్ళను వెనక్కినెట్టివేసి కార్మికులు, సైనికులు వున్నవైపుకు వెళ్ళారు. అక్కడ ఒక సాయుధ శకటం పైకెక్కి సోషలిస్టు విప్లవ విజయం కోసం పోరాడాల్సిందిగా ప్రజలకు పిలుపునిస్తూ ప్రసిద్ధమైన ఉపన్యాసం చేశారు. "సోషలిస్టు విప్లవం చిరకాలం వర్ధిల్లాలి" అని అంటూ లెనిన్ పది సంవత్సరాల దీర్ఘకాలిక ప్రవాసం తరువాత తన మొదటి ఉపన్యాసాన్ని ముగించారు.

రష్యాకు వచ్చిన వెంటనే లెనిన్ తీవ్రమైన విప్లవ కార్యాచరణలో నిమగ్నమయ్యారు. వచ్చిన మరుసటి రోజు ఉదయమే ఆయన బోల్షివిక్‌ల సమావేశంలో యుద్ధం– విప్లవం అనే అంశంపై ఒక నివేదికను వివరించారు. ఆ తరువాత మెన్షివిక్‌లు, బోల్షివిక్‌లు హాజరైన మరొక సమావేశంలో ఈ నివేదిక సారాంశాన్ని అందించారు.

**ఏప్రిల్ థీసిస్:**

ఇదే బూర్జువా విప్లవం నుండి సోషలిస్టు విప్లవంగా పరిణామం చెందటానికి ఉపయోగపడే స్పష్టమైన విప్లవ పంథా. పార్టీకి, శ్రామికవర్గానికి అందించిన ఈ పంథానే సుప్రసిద్ధమైన ఏప్రిల్ థీసిస్ (ఏప్రిల్ ప్రతిపాదనలు)

బూర్జువా ప్రజాస్వామిక విప్లవం నుండి సోషలిస్టు విప్లవంలోకి విప్లవం మొదటిదశ నుండి రెండో దశ అయిన సోషలిస్టు విప్లవంలోకి పరిణామం చెందటానికి అవసరమైన అద్భుతమైన పోరాట ప్రణాళికలను కామ్రేడ్ లెనిన్ ఏప్రిల్ థీసిస్‌లో వివరించారు. ఏప్రిల్ థీసిస్‌లో ఉన్న కొత్త అంశం ఏమిటంటే సోషలిస్టు విప్లవ పరిణామపు ప్రారంభదశకు అవసరమైన నిర్దిష్టమైన సైద్ధాంతిక ప్రణాళికను కలిగి ఉండటం.

భూమినంతటినీ జాతీయం చేయటం, ఎస్టేట్‌లను స్వాధీనం చేసుకోవటం, అన్ని బ్యాంకులను కలిపి ఒక జాతీయ బ్యాంకుగా తయారుచేసి దాన్ని కార్మిక ప్రతినిధుల సోవియట్ అజమాయిషీలో వుంచటం, వస్తువుల సామాజిక ఉత్పత్తి పంపిణీల పై అజమాయిషీ వ్యవస్థను రూపొందించటం– ఇవి ఆర్థిక రంగంలో తీసుకోవాల్సిన తొలి చర్యలు.

## -1917 ఏప్రిల్‌లో రైల్వే స్టేషన్‌లో లెనిన్ ప్రసంగం

రాజకీయ రంగంలో పార్లమెంటరీ రిపబ్లిక్ నుండి సోవియట్ రిపబ్లిక్‌గా పరిణామం చెందాలని లెనిన్ ప్రతిపాదించారు. మార్క్సిస్టు సిద్ధాంతంలోను, ఆచరణలోను ఇదొక ప్రముఖమైన ముందడుగు. సోషలిజంలోకి పరిణామం చెందే సమయంలో పార్లమెంటరీ రిపబ్లిక్ అత్యంత రాజకీయ రూపమని మార్క్సిస్టు సిద్ధాంతవేత్తలు అప్పటిదాకా భావిస్తూ వచ్చారు. ఇపుడు లెనిన్ పెట్టుబడిదారీ విధానం నుండి సోషలిజం లోకి పరిణామం చెందే దశలో పార్లమెంటరీ రిపబ్లిక్ కన్నా సోవియట్ రిపబ్లిక్ ఖచ్చితంగా సరియైన రాజకీయ నిర్మాణంగా ప్రతిపాదించారు.

"థీసిస్‌లో ఇలా ఉన్నది. రష్యాలో ప్రస్తుత పరిస్థితి ప్రధాన లక్షణం ఏమంటే విప్లవం మొదటిదశ నుండి రెండవ దశకు పరిణామం చెందటం. కార్మికవర్గానికి తగినంత వర్గచైతన్యం, నిర్మాణం లేకపోవటం చేత అది అధికారాన్ని బూర్జువాల చేతుల్లో ఉంది. ఇది మొదటి దశ, రెండవ దశలో అధికారం తప్పనిసరిగా కార్మికవర్గం, పేద రైతాంగం చేతులలో ఉండాలి. **-(లెనిన్ సెలెక్టెడ్ వర్క్స్ ఇంగ్లీష్ ఎడిషన్- మాస్కో, 1947 రెండవ వాల్యూం- 21వ పేజీ)**

"పార్లమెంటరీ రిపబ్లిక్ కాదు కార్మిక ప్రతినిధుల సోవియట్‌ల నుండి పార్లమెంటరీ రిపబ్లిక్‌గా మారటం తిరోగమనచర్య. కావాల్సింది కార్మిక, వ్యవసాయ కూలీ, రైతు ప్రతినిధుల రిపబ్లిక్ దేశమంతటా పై నుండి కిందిదాకా ఈ రిపబ్లిక్ వుండాలి" **-(లెనిన్ సెలెక్టెడ్ వర్క్స్ ఇంగ్లీష్ ఎడిషన్- మాస్కో, 1947 రెండవ వాల్యూం- 21వ పేజీ)**

ఈ నూతన తాత్కాలిక ప్రభుత్వం కింద యుద్ధం కొల్లగొట్టే సామ్రాజ్యవాద యుద్ధంగానే కొనసాగింపబడుతుందని లెనిన్ అన్నారు. ఈ విషయాన్ని ప్రజాసామాన్యానికి వివరించవలసిన కర్తవ్యం పార్టీపై ఉంది. పెట్టుబడిదారీ వర్గాన్ని కూలదోస్తే తప్ప యుద్ధాన్ని అంతమొందించలేం. నష్టపరిహారాల పేరిట కొల్లగొట్టే దురాశాపూరిత శాంతికాక, నిజమైన ప్రజాతంత్ర శాంతిని ఏర్పరచలేమని విశదపరచడం పార్టీ కర్తవ్యం.

తాత్కాలిక ప్రభుత్వాన్ని గురించి లెనిన్ ఈ నినాదం ఇచ్చాడు. "తాత్కాలిక ప్రభుత్వాన్ని ఎవరూ బలపరచగూడదు." సోవియట్‌లో మన పార్టీ ఇంకా మైనారిటీగానే ఉందనీ, మెన్షివిక్కులు సోషలిస్టు -రివల్యూషనరీలు కలిసివున్న ముఠా ప్రాబల్యంకిందనే సోవియట్లు ఉన్నాయనీ, శ్రామికవర్గం మీద పెట్టుబడిదారీ వర్గ పలుకుబడికి ఈ ముఠా ఒక సాధనమని లెనిన్ పేర్కొన్నాడు. అందుచే పార్టీ కర్తవ్యం ఈ క్రింది విధమైనదని లెనిన్ తన ప్రతిపాదనలో తెలియజేశాడు.

"కార్మిక ప్రతినిధుల సోవియట్లు ఒక్కటే విప్లవ ప్రభుత్వ స్వరూపం అని ప్రజాసామాన్యానికి విశదపరచాలి. అందుచే ఈ ప్రభుత్వం పెట్టుబడిదారీ పలుకుబడికి లొంగి ఉండినన్నాళ్ళూ వారి ఎత్తుగడలలోని తప్పులను ఓపికతో, క్రమపద్ధతిలో వదిలిపెట్టకుండా తెలియజెప్పవలసిన కర్తవ్యం మనది. ఈ విశదీకరణ ప్రజల దైనందిన అవసరాలకు అనుగుణంగా ఉండాలి. మనం మైనారిటీలుగా ఉన్నంతకాలం ఈ ప్రభుత్వం తప్పులను బయటపెట్టి విమర్శిస్తూ ఉండాలి. ఇదే సమయంలో యావత్తు రాజ్యాధికారాన్ని కార్మిక ప్రతినిధుల సోవియట్లకు అప్పజెప్పవలసిన ఆవశ్యకతను గురించి మనం బోధించాలి...." **-(లెనిన్, కలెక్టెడ్ వర్క్స్, రష్యన్ ఎడిషన్ 20వ వాల్యూం- 88వ పేజి).**

దీని అర్థం తాత్కాలిక ప్రభుత్వంపై తిరుగుబాటు తీసుకరమ్మని లెనిన్ చెప్పలేదు. ఆ సమయంలో సోవియట్ల విశ్వాసాన్ని తాత్కాలిక ప్రభుత్వం చూరగొంది.

**తాత్కాలిక ప్రభుత్వ సంక్షోభం ప్రారంభం- రాజధాని నగరంలో (పెట్రోగ్రాడ్) బోల్షివిక్ పార్టీ విజయం**

ఏప్రిల్ సమావేశ నిర్ణయాలనాధారం చేసుకొని ప్రజలను తనవైపు తిప్పుకోవడానికీ, పోరాటానికి వారికి శిక్షణ నిచ్చి సంఘటితపరచటానికి, పార్టీ తన కార్యకలాపాలను విస్తరించి పెంపొందించింది. ఆ కాలంలో పార్టీ పంథా ఏమంటే, బోల్షివిక్కు విధానాన్ని ఓపికగా విశదీకరించడం. మెన్షివిక్కుల, సోషలిస్టు -రివల్యూషనరీల రాజీ విధానాన్ని బట్టబయలు చేసి వారి పార్టీలను ప్రజా సామాన్యం నుండి ఏకాకులను చేయటం సోవియట్లలో మెజారిటీని సంపాదించటం.

సోవియట్లలోని పనికితోడు కార్మిక సంఘాలలోను, ఫ్యాక్టరీ కమిటీలలోను బోల్షివిక్కులు తమ కార్యకలాపాలను విస్తరింపజేశారు. ముఖ్యంగా సైన్యంలో బోల్షివిక్కులు తమ కార్యక్రమాన్ని విస్తృతం చేశారు. ప్రతిచోట సైనిక సంస్థలు తలెత్త ప్రారంభించాయి. 1917 జూన్ 18వ తేదీన ప్రదర్శన విప్లవంలో అమరులైన వీరయోధుల సమాధుల వద్ద జరిగింది. నిజానికి ఈ ప్రదర్శన బోల్షివిక్ పార్టీ శక్తుల సమీకరణకు ఒక దాఖలా. పెంపొందుతున్న ప్రజల విప్లవభావాన్ని, బోల్షివిక్ పార్టీలో పెంపొందుతున్న వారి విశ్వాసాన్ని ఇది బయటపెట్టింది. తాత్కాలిక ప్రభుత్వంలో విశ్వాసం ఉంచవలసిందని, యుద్ధాన్ని కొనసాగించవలసిందని కోరుతూ మెన్షివిక్కులు, సోషలిస్టు-రివల్యూషనరీలు ప్రదర్శించిన నినాదాలు బోల్షివిక్ నినాదపు సముద్రంలో మునిగిపోయాయి. ''యుద్ధం నశించాలి'', "(ఇప్పుడున్న) - 10 మంది పెట్టుబడిదారీ మంత్రులు నశించాలి. "అధికారమంతా సోవియట్లకే'' అనే నినాదాలున్న జెండాలతో నాలుగు లక్షల మంది కార్మికులు ఊరేగింపు చేశారు.

మెన్షివిక్‌లకు, సోషలిస్టు - రివల్యూషనరీలకు ఇది పూర్తిగా అపజయం. రాజధానీనగరం (పెట్రోగ్రాడ్)లోనే తాత్కాలిక ప్రభుత్వానికి ఇది అపజయం. అయినప్పటికీ తాత్కాలిక ప్రభుత్వం సోవియట్ల ప్రథమ కాంగ్రెస్ అండను సంపాదించింది. సామ్రాజ్యవాద విధానాన్ని కొనసాగింప నిశ్చయించింది. అదే రోజున అనగా 18వ తేదీన తాత్కాలిక ప్రభుత్వం బ్రిటిష్, ఫ్రెంచ్ సామ్రాజ్యవాదుల కోర్కెలకు తలయొగ్గి యుద్ధరంగంలోని తన సైనికులను దాడి చేయడానికి ముందుకు నెట్టింది. విప్లవాన్ని అంతమొందించడానికి ఇదొక్కటే సాధనమని పెట్టుబడిదారీ వర్గం భావించింది. ఈ దాడిలో విజయం పొందిన పక్షంలో అధికారాన్నంతా తమ చేతుల్లోకి తీసుకొని, సోవియట్లను రంగంలోనుండి నెట్టివేసి, బోల్షివిక్‌లను అణచవచ్చు. ఒకవేళ అపజయమే సంభవిస్తే తప్పంతా బోల్షివిక్కులపై నెట్టివేసి సైన్యం శిథిలమవడానికి వారే కారకులని నిందించవచ్చు అని పెట్టుబడిదారీ వర్గం ఆశించింది.

యుద్ధరంగంలో దాడి, ఆ తర్వాత దాని ఓటమి రాజధానీ నగరాన్ని ఉద్రిక్త పరచింది. కార్మికుల, సైనికుల క్రోధావేశానికి హద్దులు లేకపోయాయి. తాత్కాలిక ప్రభుత్వం శాంతి విధానాన్ని ప్రకటించినప్పుడు అది ప్రజలను మోసగిస్తున్నదనీ, తాత్కాలిక ప్రభుత్వం సామ్రాజ్యవాద యుద్ధాన్ని కొనసాగించకోరుతున్నదనీ స్పష్టమయింది.

పెట్రోగ్రాడ్ కార్మికుల సైనికుల విప్లవక్రోధావేశం పొంగిపొరలింది. జూలై 3వ తేదీన (16వ తేదీన) పెట్రోగ్రాడ్‌లోని వైబార్గ్ జిల్లాలో వాటంతటవే ప్రదర్శనలు ప్రారంభమయ్యాయి. అవి ఆ రోజంతా సాగాయి. విడివిడిగా బయలుదేరిన ప్రదర్శనలన్నీ కలిసి బ్రహ్మాండమైన సాయుధ ప్రదర్శనగా మారింది. అధికారాన్ని సోవియట్లకు అప్పగించాలని ఈ ప్రదర్శన కోరింది. బోల్షివిక్కు పార్టీ ఆ సమయంలో సాయుధ పోరాటానికి వ్యతిరేకం. ఎందువల్లనంటే విప్లవ సంక్షోభం ఇంకా పరిపక్వం కాలేదని అది భావించింది. రాజధానీ నగరంలోని తిరుగుబాటును బలపరచడానికి సైన్యమూ, ఇతర రాష్ట్రాల ప్రజలూ సిద్ధంగా లేరు. ఒంటరిగా పరిపక్వం కాకుండా తిరుగుబాటుకు గనుక తీసుకొనివస్తే, విప్లవ అగ్రశ్రేణిని అణచివేయటం విప్లవ ప్రతీఘాతకులకు మరింత సులభం అవుతుందని బోల్షివిక్ పార్టీ

భావించింది. కాని ప్రజలను ప్రదర్శన చేయకుండా వుంచడం అసాధ్యమని స్పష్టంకాగానే, ఆ ప్రదర్శనలో పాల్గొని దాన్ని శాంతియుతంగా సంఘటిత రూపాన నడవడానికి పార్టీ నిశ్చయించింది. ఇందులో బోల్షివిక్ పార్టీ విజయం పొందింది.

ప్రదర్శన శాంతియుత స్వభావం కలిగివున్నప్పటికీ ప్రభుత్వం, విప్లవ ప్రతీఘాత యూనిట్లను అనగా సైనికాధికారులు నావికాధికారులతో కూడిన దళాలను ప్రదర్శనను అణచడానికి పంపింది. పెట్రోగ్రాడ్ వీధులు కార్మికులు, సైనికుల రక్తంతో ప్రవహించాయి. అమాయకులైన విప్లవ ప్రతీఘాతుక సైనిక యూనిట్లను, యుద్ధరంగం నుండి కార్మికుల అణచివేత కోసం తెప్పించింది.

జూలై 7వ తేదీన లెనిన్ అరెస్టుకు వారంటు జారీ అయ్యింది.

ద్వంద్వాధికారం పెట్టుబడిదారీ వర్గానికి అనుకూలంగా అంతమయింది. ఎందువల్లనంటే అధికారం తాత్కాలిక ప్రభుత్వం చేతిలోకి పోయింది. పోతే సోషలిస్టు -రివల్యూషనరీ, మెన్షివిక్ నాయకుల ఆధ్వార్యాన ఉన్న సోవియట్లు తాత్కాలిక ప్రభుత్వానికి తోకగా తయారయ్యాయి.

విప్లవ శాంతిదశ అంతమయింది. ఇప్పుడు ఆయుధమే ప్రధానఅంశం. మారిపోయిన పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని బోల్షివిక్కు పార్టీ తన ఎత్తుగడలను మార్చుకొన నిశ్చయించింది. బోల్షివిక్ పార్టీ అజ్ఞాతంలోకి వెళ్ళింది. సాయుధ బలంతో బూర్జువా అధికారాన్ని కూలదోసి సోవియట్ల అధికారాన్ని నెలకొల్పే ఉద్దేశ్యంతో తిరుగుబాటుకు బోల్షివిక్ పార్టీ సన్నాహం చేయసాగింది.

**సాయుధ తిరుగుబాటుకు సన్నాహం**

బోల్షివిక్కులూ, కార్మికవర్గమూ జూలై దినాలలో ఎన్నో నిర్బంధాలకు గురి అయ్యారు. కాని ఈ నిర్బంధ విధానం వల్ల పార్టీ పలుకుబడి తగ్గిపోలేదు సరికదా మరింత హెచ్చింది.

జూలై దినాల తర్వాత దేశంలో రాజకీయ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ద్వంధాధికారం నశించింది. సోషలిస్టు- రివల్యూషనరీల, మెన్షివిక్‌ల నాయకత్వాన ఉన్న సోవియట్లు, సంపూర్ణ అధికారాన్ని తీసుకో నిరాకరించినందున ఉన్న అధికారన్నంతా పోగొట్టుకున్నాయి. ఇప్పుడధికారమంతా బూర్జువా తాత్కాలిక ప్రభుత్వం చేతిలో కేంద్రీకరింపబడివుంది. తాత్కాలిక ప్రభుత్వం విప్లవాన్ని నిరాయుధం చేయడానికి విప్లవ సంస్థలను ధ్వంసం చేయడానికి బోల్షివిక్ పార్టీని నాశనం చేయడానికి ప్రారంభించింది. విప్లవం శాంతియుతంగా అభివృద్ధిచెందే అవకాశం మటుమాయమైంది. కామ్రేడ్ స్టాలిన్ చెప్పినట్లు ఇంక ఒకే విషయం మిగిలివుంది. అది తాత్కాలిక ప్రభుత్వాన్ని కూలదోసి బలప్రయోగం ద్వారా అధికారాన్ని హస్తగతం చేసుకోవడం. పేద రైతాంగంతో కలిసి శ్రామికవర్గ మొక్కటే బలప్రయోగం ద్వారా అధికారాన్ని హస్తగతం చేసుకోగలదు.

ఇపుడు, జూలై దినాల తర్వాత, "అధికారమంతా సోవియట్లకే" అన్న నినాదాన్ని బోల్షివిక్ పార్టీ ఉపసంహరించుకుంది. అంటే దీని అర్థం సోవియట్ల అధికారానికై చేసే పోరాటాన్ని విడనాడటమని కాదు. విప్లవ పోరాట సాధనాలైన అన్ని సోవియట్లను గురించికాక, మెన్షివిక్‌ల, సోషలిస్టు- రివల్యూషనరీల పెత్తనంలో వున్న సోవియట్లను గురించే, ఇప్పుడమలులో వున్న సోవియట్లను గురించే ఈ ప్రశ్న ఉద్భవించింది.



మహోపాధ్యాయుడు కా. స్టాలిన్

కామ్రేడ్ స్టాలిన్ ఇలా అన్నాడు. విప్లవం యొక్క శాంతియుత దశ అంతమొందింది. అశాంతియుతమైన దశ- ఘర్షణల, ప్రేలుడుల దశ ప్రారంభమైంది.

**విప్లవాన్ని అణచడానికి జనరల్ కోర్నిలావ్ కుట్ర**

ఆగస్టు 12వ తేదీన భూస్వాముల, పెట్టుబడిదారు శక్తులను సమీకరించడానికి తాత్కాలిక ప్రభుత్వం మాస్కోలో గ్రాండ్ థియేటర్‌లో స్టేట్ కౌన్సిల్‌ను సమావేశపరచింది. ఈ కౌన్సిల్‌లో ముఖ్యంగా భూస్వాముల, పెట్టుబడిదారుల, సేవానుల, ఉద్యోగుల, కోసక్‌ల ప్రతినిధులు హాజరయ్యారు. సోవియట్ల తరపున మెన్షివిక్కులు, సోషలిస్టు- రివల్యూషనరీలు హాజరయ్యారు.

స్టేట్ కౌన్సిల్‌ను సమావేశపరచడానికి అసమ్మతిగా, సమావేశ ప్రారంభదినాన మాస్కోలో సర్వవ్యాపిత సమ్మె సాగించాలని కార్మికులను బోల్షివిక్కులు కోరారు. అధిక సంఖ్యాక కార్మికులు ఈ సమ్మెలో పాల్గొన్నారు. ఇంకా అనేక ఇతర పట్టణాలలో కూడా ఇదే సమయాన సమ్మెలు జరిగాయి.

సోషలిస్టు- రివల్యూషనరీ కెరెన్స్కీ ఈ కౌన్సిల్‌లో ప్రగల్భాలు

పలుకుతూ విప్లవోద్యమం యొక్క ప్రతి ప్రయత్నాన్ని "తుపాకులతో రక్తపాతంతో ముంచి" అణచివేస్తామని బెదిరించాడు. భూస్వాముల భూములను లాక్కోవడానికి రైతులు అనధికారయుతంగా చేసే ప్రయత్నాలను కూడా రక్తపాతంతో ముంచి వేస్తానని బెదిరించాడు.

విప్లవ ప్రతీఘాతకుడైన జనరల్ కోర్నిలావ్ "కమిటీలను, సోవియట్లను రద్దుపరచాలి" అని కుండ బద్దలుకొట్టినట్లు కఠినంగా కోరాడు. బ్యాంకర్లు, వర్తకులు, పారిశ్రామిక వేత్తలు సైనిక ప్రధాన కార్యాలయం వద్ద కోర్నిలావ్ చుట్టూ మూగారు. కావలసినంత డబ్బు ఇస్తామని, అతన్ని బలపరుస్తామని వాగ్దానం చేశారు.

"మిత్రమండలి" దేశాలైన బ్రిటన్, ఫ్రాన్స్ ప్రతినిధులు కూడా జనరల్ కోర్నిలావ్ వద్దకు వచ్చారు. విప్లవాన్ని అణచడానికి ఏ మాత్రం ఆలస్యం చేయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. విప్లవాన్ని నాశనం చేయడానికి జనరల్ కోర్నిలావ్ చేసే కుట్ర పరిపక్వానికి వచ్చింది.

కెరెన్స్కీ నాయకత్వాన తాత్కాలిక ప్రభుత్వం బోల్షివిక్కులపై అతి క్రూరమైన దాడిని సాగించింది. శ్రామికవర్గ పార్టీపైన దారుణ నిర్బంధ విధానాన్ని తీవ్రతరం చేసింది. ఇదే సమయంలో పెట్రోగ్రాడ్‌పై నడపడానికి సైన్యాలను జనరల్ కోర్నిలావ్ కేంద్రీకరించాడు. ఆ పట్టణంపై తన సైన్యాలను నడిపి సోవియట్లను రద్దుచేసి సైనిక నియంతృత్వాన్ని నెలకొల్పాలని అతడు తలచాడు.

కోర్నిలావ్ తన విప్లవ ప్రతిఘాత చర్య విషయమై కెరెన్స్కీతో ముందుగానే ఒక ఒడంబడిక చేసుకున్నాడు. కాని కోర్నిలావ్ తన దాడిని ప్రారంభించగానే కెరెన్స్కీ ప్రభుత్వం ప్లేటు మార్చి తన మిత్రుడైన కోర్నిలావ్ తోటి తన సంబంధాలను తెగదెంచుకున్నాడు. కోర్నిలావ్ పక్షానికి వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించి వారిని అణచివేస్తారని, కోర్నిలావ్ గొడవతో తాను గనుక తెగదెంపులు చేసుకోనిపక్షంలో దానితో పాటు తన పెట్టుబడిదారీ ప్రభుత్వాన్ని కూలదోస్తారని కెరెన్స్కీ భయపడ్డాడు.

ఆగస్టు 25వ తేదీన కోర్నిలావ్ పెట్రోగ్రాడ్ పైకి మూడవ అశ్వికదళాన్ని జనరల్ క్రిమోఫ్ ఆధిపత్యాన పంపాడు. తాను "మాతృభూమిని రక్షించదలిచానని" ప్రకటించాడు. కోర్నిలావ్ తిరుగుబాటుకు జవాబుగా బోల్షివిక్ పార్టీ సెంట్రల్ కమిటీ విప్లవ ప్రతీఘాతాన్ని సాయుధ పోరాటంతో ఎదుర్కొనవలసిందని కార్మికులను, సైనికులను కోరింది. కార్మికులు హడావిడిగా సాయుధులై ప్రతిఘటనకు తలపడ్డారు. ఈ రోజులలో రెడ్‌గార్డు దళాలు (బోల్షివిక్ వలంటీర్ దళాలు) విపరీతంగా పెరిగాయి.

కోర్నిలావ్ తిరుగుబాటును అణచివేయడానికి ప్రజాసామాన్యాన్ని సమీకరిస్తున్నప్పటికీ, బోల్షివిక్కులు కెరెన్స్కీ ప్రభుత్వాన్ని, మెన్షివిక్కులనూ, సోషలిస్టు రివల్యూషనరీలనూ బట్టబయలు చేశారు. వారి విధానమే ఆచరణలో కోర్నిలావ్ విప్లవ ప్రతీఘాత కుట్రకు సహాయపడుతున్నదని ప్రజలకు తెలియజేశారు. ఈ చర్యల ఫలితంగా కోర్నిలావ్ తిరుగుబాటు అణచివేయబడింది. కోర్నిలావ్ తిరుగుబాటు పరాజయం విప్లవశక్తుల, విప్లవ ప్రతీఘాతశక్తుల బలబలాలను మెరుపులా బయటపెట్టింది.

బోల్షివిక్కు పార్టీ విప్లవ నిర్ణాయకశక్తిగా పెంపొందినదనీ, ఏ విప్లవ ప్రతీఘాత ప్రయత్నాన్నైనా సరే ఓడించగల సామర్థ్యం గలదనీ, కోర్నిలావ్ తిరుగుబాటు పరాజయం తెలియజేసింది. విప్లవ వెల్లువ అంతకంతకూ పెల్లుబుకుతోంది. సోవియట్లను పునరుద్ధరించే సమయం ప్రారంభమైంది.

తిరిగి "అధికారమంతా సోవియట్లకే" అనే నినాదం ప్రతిధ్వనించింది. కాని ఇది మెన్షివిక్కుల సోషలిస్టు – రివల్యూషనరీల సోవియట్లకు అధికారం హస్తగతం చేయమనే పాత నినాదం ఇక ఏమాత్రమూ కాదూ. ఈ సారి ఈ నినాదం తాత్కాలిక ప్రభుత్వంపై సోవియట్లు తిరుగుబాటు చేయాలని కోరుతోంది. దీని లక్ష్యం ఇప్పుడు బోల్షివిక్కులచే నడుపబడుచున్న సోవియట్లకు అధికారాన్నంతా అప్పగించాలని.

**పెట్రోగ్రాడ్‌లో అక్టోబర్ తిరుగుబాటు– దేశవ్యాప్త విప్లవ విజయం**

తిరుగుబాటుకు బోల్షివిక్కులు తీవ్రంగా సన్నాహాలు చేయనారంభించారు. మాస్కో, పెట్రోగ్రాడ్ రెండు ముఖ్యనగరాలలోను కార్మిక, సైనిక ప్రతినిధుల సోవియట్లలో బోల్షివిక్కులు మెజారిటీ సంపాదించారు. అలా బలం చేకూర్చుకున్న బోల్షివిక్కులు అధికారాన్ని తాము హస్తగతం చేసుకోగలరు. చేసుకోవాలి అని లెనిన్ ప్రకటించాడు.

అక్టోబర్ 16వ తేదీన పార్టీ సెంట్రల్ కమిటీ విస్తృత సమావేశం జరిగింది. ఈ సమావేశం తిరుగుబాటును నడపడానికి కామ్రేడ్ స్టాలిన్ నాయకత్వాన ఒక పార్టీ కేంద్రాన్ని ఎన్నుకుంది. ఈ పార్టీ కేంద్రం, పెట్రోగ్రాడ్ సోవియట్ విప్లవసైనిక కమిటీకి గుండెకాయ వంటిది. మొత్తం తిరుగుబాటును ప్రత్యక్షంగా నడిపించవలసిన బాధ్యత ఈ పార్టీ కేంద్రానిది. సెంట్రల్ కమిటీ మీటింగులో లొంగుబాటుదారులైన జినోవీవ్, కామెనివ్‌లు తిరుగుబాటును వ్యతిరేకించారు. పార్టీ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ బహిరంగంగా పత్రికలలో ప్రకటన చేశారు. ఆ విధంగా వారు సెంట్రల్ కమిటీ నిర్ణయాన్ని శత్రువుకు బహిరంగపరచారు. వీరి ద్రోహాన్ని ఖండిస్తూ కా. లెనిన్ వీరిని పార్టీ నుండి తొలగించాల్సిందిగా సెంట్రల్ కమిటీకి సూచించాడు.

పెట్రోగ్రాడ్ సోవియట్ సమావేశంలో మాట్లాడుతూ ట్రాట్స్కీ, తన బడాయి కోరుతనాన్ని పట్టలేక సాయుధ తిరుగుబాటు ప్రారంభించడానికి బోల్షివిక్కులు పథకం వేసుకున్న తేదీని శత్రువుకు తెలిసేటట్లు వాగాడు. తిరుగుబాటును కెరెన్స్కీ ప్రభుత్వం అణచివేయకుండా వుండేందుకుగాను, పార్టీ సెంట్రల్ కమిటీ

మొదట అనుకున్న కాలానికి ముందే తిరుగుబాటు లేవదీసి కొనసాగించడానికి నిశ్చయించింది. సోవియట్ల రెండవ కాంగ్రెస్ ప్రారంభమయ్యే దినానికి ఒకరోజు ముందుగా ఈ తిరుగుబాటు జరిగేటట్లు నిర్ణయించింది.

అక్టోబర్ 24వ తేదీ (నవంబర్ 6వ తేదీ) తెల్లవారుజామున కెరెన్స్కీ బోల్షివిక్‌లపై తన దాడిని ప్రారంభించాడు. బోల్షివిక్ పార్టీ కేంద్రపత్రిక రబోషిపూత్ (Rabochy put workers path) కార్మిక పంథాను అణచివేయమని ఆజ్ఞాపించాడు. దాని సంపాదక కార్యాలయానికి బోల్షివిక్కుల ముద్రణా కార్యాలయానికి సాయుధ దళ శకటాలను పంపాడు. కాని ఉదయం 10 గంటలకల్లా కామ్రేడ్ స్టాలిన్ ఉత్తర్వుల ననుసరించి రెడ్‌గార్డ్స్, విప్లవ సైనికులు సాయుధ శకటాలను వెనక్కి నెట్టివేశారు. ముద్రణా కార్యాలయం మీద 'రబోషిపూత్' సంపాదక కార్యాలయం వద్ద అదనపు కాపలా దళాలను నియమించారు. తాత్కాలిక ప్రభుత్వాన్ని కూలద్రోయవలసిందని ఆదేశమిస్తూ రాసిన రాతలతో 'రబోషీపూత్' 11 గంటలకు వెలువడింది. అదే సమయంలో తిరుగుబాటు పార్టీ కేంద్రం ఉత్తర్వులననుసరించి విప్లవ సైనికదళాలు రెడ్‌గార్డ్స్, స్మోల్నీకి హుటాహుటిగా వెళ్ళారు.


తిరుగుబాటు ప్రారంభమయింది. అక్టోబర్ 24వ రాత్రి లెనిన్ స్మోల్నీలోకి ప్రవేశించి తిరుగుబాటుకు స్వయంగా నాయకత్వం వహించాడు. ఆ రాత్రంతా సైనిక విప్లవదళాలు, రెడ్‌గార్డ్ దళాలు స్మోల్నికి వస్తూనే వున్నాయి. బోల్షివిక్కులు వారిని రాజధానీనగరం మధ్య భాగంలోకి తాత్కాలిక ప్రభుత్వం తిష్టవేసుకు కూర్చున్న వింటర్ భవనాన్ని ముట్టడించడానికి పంపించారు.

అక్టోబరు 25వ తేదీన (నవంబర్ 7న) రెడ్‌గార్డ్‌లు, విప్లవ సైనికులు, రైల్వేస్టేషన్లు, పోస్టాఫీసును టెలిగ్రాఫ్ ఆఫీసును, మంత్రివర్గ కార్యాలయాలను, ప్రభుత్వ బ్యాంకును స్వాధీనపరచుకొన్నారు. తొలి పార్లమెంటు రద్దు చేయబడింది.

పెట్రోగ్రాడ్ సోవియట్, బోల్షివిక్ సెంట్రల్ కమిటీల ప్రధాన కార్యాలయమైన స్మోల్నీ, విప్లవ ప్రధాన కార్యాలయమైంది. అక్కడనుంచే పోరాటానికి ఉత్తరువులు జారీ చేయబడేవి.

తాత్కాలిక ప్రభుత్వం వింటర్ భవనంలో కేడెట్ల మెరుపు దళాల రక్షణ కింద తలదాచుకొంది. అక్టోబరు 25వ తేదీ (నవంబరు 7) రాత్రి కార్మికులు, సైనికులు, నావికులు, వింటర్ భవనాన్ని చుట్టుముట్టి ఆక్రమించి తాత్కాలిక ప్రభుత్వాన్ని అరెస్టు చేశారు. పెట్రోగ్రాడ్‌లోని సాయుధ తిరుగుబాటు విజయం పొందింది.

అక్టోబర్ 25వ తేదీన (నవంబర్ 7) బోల్షివిక్కులు "రష్యన్ పౌరులకు విజ్ఞప్తి" నొకదానిని ప్రకటించాడు. అందులో బూర్జువా తాత్కాలిక ప్రభుత్వం కూలద్రోయబడిందనీ రాజ్యాంగ అధికారం సోవియట్ల హస్తగతమయిందనీ తెలియజేశారు.



**వింటర్ ప్యాలెస్ ముట్టడి**

**సోషలిస్టు సమాజ నిర్మాణంలో కార్మికవర్గ నియంతృత్వం-ప్రజాస్వామ్యం కోసం కా. లెనిన్ చేసిన రాజకీయ కృషి**

**స్వపక్షపరిత్యాగి- రెనెగెడ్ కాట్స్కీ**

సోషల్ డెమోక్రాట్ విద్రోహుల సిద్ధాంతవేత్త కాట్స్కీ 1918లో 'కార్మికవర్గ నియంతృత్వం' అనే పుస్తకాన్ని రచించాడు. ఆ పుస్తకంలో అతడు ఒక పద్ధతి ప్రకారం సోవియట్ ప్రభుత్వం మీద దాడిని ప్రారంభించాడు. బోల్షివిక్కులు ప్రతీఘాతుక విప్లవాన్ని అణచివేయడాన్ని, ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా నియంతృత్వం అనే రీతిలో వివరించాడు. అప్పటినుండి అది సోషలిజంపైన సామ్రాజ్యవాద బూర్జువా ప్రచారదాడిలో విస్తృతంగా వాడుకలోకి వచ్చింది. వెంటనే లెనిన్, 1918 అక్టోబర్‌లో కాట్స్కీ 'కార్మికవర్గ విప్లవం-ద్రోహి కాట్స్కీ' అనే తన గొప్ప రచనలో తగిన విధంగా జవాబిచ్చాడు. అందులో ఆయన, కార్మికవర్గ నియంతృత్వం పరమ అవసరాన్ని సమర్థిస్తూ, బూర్జువా ప్రజాస్వామ్యం కన్నా కార్మికవర్గ నియంతృత్వం యొక్క అపారమైన ఆధిక్యతను పూర్తిగా రుజువు పరిచాడు. ఆ క్రమంలో ఆయన తాను అంతకు ముందు రచించిన 'రాజ్యం- విప్లవం'లో వివరించిన రాజ్యం గురించిన మార్క్సిస్టు అవగాహనను మరింతగా అభివృద్ధిపరచాడు.

ప్రజాతంత్రయుతంగా ఉండటమా, నిరంకుశత్వంగా ఉండటమా అన్న రెండు పద్ధతుల్లోనే సోషల్ డెమోక్రాట్లకు, బోల్షివిక్కులకు మధ్య తేడా ఉందని కాట్స్కీ మోసపూరితంగా చెబుతాడు. సోషల్ డెమోక్రాట్లు "ప్రజాతంత్ర" పద్ధతిని, బోల్షివిక్కులు "నిరంకుశ" పద్ధతిని అనుసరిస్తారని ఆయన చెప్పుకున్నారు.

కాట్స్కీకి సమాధానమిస్తూ, ఈ విధంగా ప్రజాస్వామ్యం గురించి 'సాధారణ' రీతిలో మాట్లాడటం ఎలా పొరపాటో లెనిన్ వివరిస్తాడు. "ప్రజాస్వామ్యం ఎవరి కోసం?' అన్న ప్రశ్నను మనం సదా వేసుకోవాలని ఆయన చెబుతారు. ఇక్కడ సమస్య నియంతృత్వమా, ప్రజాస్వామ్యమా అన్నది కాదు. కార్మికవర్గ పాలనా, బూర్జువా పాలనా అన్నది మాత్రమే.

వర్గాలున్నంతవరకు 'స్వచ్ఛమైన' ప్రజాస్వామ్యం అసాధ్యమని లెనిన్ చెబుతారు. బూర్జువా ప్రజాస్వామ్యం అంటే పెట్టుబడిదారుల పరిపాలన మాత్రమేనని చెప్పిన లెనిన్, కార్మికవర్గ పాలనకు అంటే మెజార్టీ పాలనకు సోవియట్లు ఎలా ప్రాతినిధ్యం వహిస్తాయో వివరిస్తారు. 'కార్మికవర్గ ప్రజాస్వామ్యం', బూర్జువా ప్రజాస్వామ్యం' కన్నా అనేక రెట్లు అధిక ప్రజాస్వామ్యయుతమైందని ఆయన చెబుతారు. సోవియట్ యూనియన్‌లో రాజకీయ వ్యవస్థను, బూర్జువా ప్రజాస్వామ్య దేశాలలోని రాజకీయ వ్యవస్థలను పోల్చి విపులమైన ప్రస్తావనలతో ఈ అంశాన్ని లెనిన్ నిరూపిస్తారు.

నిరంకుశ పద్ధతులు అన్న కాట్స్కీ ఆరోపణలకు సమాధానంగా కార్మికవర్గ పాలన అంటే అత్యధికుల పాలన బూర్జువా వర్గాన్ని అణచివుంచాలని చెబుతోందని లెనిన్ వివరించారు. కార్మికవర్గ రాజకీయవర్గ కార్యాచరణను బూర్జువా రాజ్యవ్యవస్థ పరిధుల్లోనే ఉంచడమంటే అది కార్మికవర్గ ప్రయోజనాలకు ద్రోహం చేయడమేనని లెనిన్ చెబుతారు.

పెట్టుబడిదారీ విధానం 'అభివృద్ధి' చెందుతున్న కాలంలో, 18వ శతాబ్దంలో ఇంగ్లండ్, ఫ్రాన్స్‌లోని పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని చేసిన 'ప్రజాస్వామ్య' పద్ధతులను కాట్స్కీ తన స్వంత వాదనలతో వినియోగించి, ఆ తర్వాత కాలంలో ముఖ్యంగా పారిస్ కమ్యూన్ కాలంలో వారు చేసిన విషయాల్ని కావాలనే వదిలి వేయడాన్ని కా. లెనిన్ ఇక్కడ వివరిస్తున్నారు.

"మార్క్స్, ఎంగెల్స్‌లు పారిస్ కమ్యూన్ని అత్యంత సవివరంగా విశ్లేషించి, "సిద్ధంగా తయారైవున్న రాజ్యాంగ యంత్రాంగాన్ని" ధ్వంసం కావించి, భగ్నం చేసే యత్నంలోనే దాని గొప్పతనం వుందని చూపించారు. ఈ పర్యవసానం ఎంత ముఖ్యమైనదిగా మార్క్స్, ఎంగెల్స్‌లు పరిగణించారంటే, ఈ ఒక్క సవరణను మాత్రమే "కమ్యూనిస్టు ప్రణాళిక" లోని "పాతపడిపోయిన" (కొన్ని భాగాలలో) కార్యక్రమంలో వారు పొందుపరచారు. పారిస్ కమ్యూన్ సైన్యాన్నీ, అధికారవర్గ పరిపాలననూ అంతమొందించిందనీ, పార్లమెంటరీ విధానాన్ని అంతమొందించిందనీ, "పరాన్నభుక్తపు కంత అయిన రాజ్యాంగ యంత్రాన్ని" నాశనం కావించిందనీ, ఇంకా వగైరా కార్యాలను చేసిందనీ మార్క్స్, ఎంగెల్స్‌లు చూపించారు; కాని అన్నీ తెలిసిన కాట్స్కీ నిద్ర పుచ్చేందుకని జోకొడుతూ, ఇంతకుముందు లిబరల్ ప్రొఫెసర్లు వెయ్యిసార్లు చెప్పినట్టి "స్వచ్ఛమైన ప్రజాస్వామ్యం" గురించిన నాయనమ్మ కథే తాను మళ్లీ చెబుతున్నాడు."

"శ్రామికవర్గ నియంతృత్వ భావాన్ని అత్యంత నిరుపమానమైన విధంగా వికృతపరచడమే కాకుండా, మార్క్సును వృత్త సామాన్యపు లిబరల్ కిందకి మార్చివేశాడు మిస్టర్ కాట్స్కీ: అనగా పీడితవర్గంచే విప్లవాత్మక బలప్రయోగమంటేనే అన్నిటికంటెను ముఖ్యంగా భయంతో వెనక్కి జంకుతూ, బూర్జువావర్గ ప్రజాస్వామ్యం యొక్క వర్గ విషయానికి మెరుగులు దిద్ది దానిని దాటవేస్తూన్నట్టీ, "స్వచ్ఛమైన ప్రజాస్వామ్యం" గురించి చప్పచప్పని వాక్యాలు ఉచ్చరించుతూన్నట్టీ లిబరల్ స్థాయికి తానే దిగజారిపోతున్నాడు. పీడకులకు వ్యతిరేకంగా పీడితవర్గం యొక్క విప్లవాత్మక దౌర్జన్యం అదృశ్యమైపోయేటట్టుగా "శ్రామికవర్గ విప్లవాత్మక నియంతృత్వం" భావానికి "భాష్యం చెప్పడంలో," మార్క్సును లిబరల్‌గా వికృతపచడమనే కార్యంలో కాట్స్కీ ప్రపంచపు రికార్డునే భగ్నంచేశాడు. స్వపక్షపరిత్యాగి కాట్స్కీ బెర్న్‌స్టయిన్‌ను తలదన్నాడు." **-(మార్క్స్- ఎంగెల్స్- మార్క్సిజం - తెలుగు-426-427 పేజీలు)**

**బోల్షివిజం చరిత్రలోని ప్రధాన దశలు**

కామ్రేడ్ లెనిన్ అక్టోబర్ విప్లవ విజయానంతరం 1920 ఏప్రిల్, మే నెలల్లో " "వామపక్ష" కమ్యూనిజం- ఒక బాలారిష్టం" అనే గ్రంథం రచించాడు. అందులో 'బోల్షివిజం చరిత్రలోని ప్రధాన దశలు' అనే అధ్యాయాన్ని రాశాడు.

1. విప్లవ సన్నాహపు సంవత్సరాలు (1903-1905).

పెను తుఫాను సమీపించడం సర్వత్రా పసికట్టబడింది. అన్ని వర్గాలూ అస్తిమిత స్థితిలోనూ, సన్నాహాల స్థితిలోనూ వుండినాయి. విదేశాలలో, రాజకీయ ప్రవాసుల పత్రికలు విప్లవానికి చెందిన సకల మౌలిక సమస్యల సిద్ధాంత పార్శ్వాలనూ చర్చించినాయి. మూడు ప్రధాన వర్గాలకూ, మూడు ప్రధాన రాజకీయ ధోరణులకూ- ఉదారవాద బూర్జువా, ("సోషల్ డెమొక్రటిక్," "సోషలిస్టు రివల్యూషనరీ" పేర్ల మరుగున వుండిన) పెటీబూర్జువా ప్రజాతంత్ర, కార్మికవర్గ విప్లవ ధోరణులకు -చెందిన ప్రతినిధులు కార్యక్రమానికీ, యెత్తుగడలకూ చెందిన సమస్యల మీద మహా భీషణమైన పోరాటం చేయడం ద్వారా ఆసన్న బహిరంగ వర్గ పోరాటాన్ని ముందే వాస్తవీకరించి, దాన్ని సిద్ధం చేసినారు. 1905-1907 లోనూ, 1917-1920 లోనూ జనాలు యే సమస్యలమీద పోరాటం చేసినారో ఆ సమస్య లన్నిటినీ, అండ రూపంలో, ఆ కాలపు పత్రికల్లో గమనించవచ్చు (గమనించాలి). ఈ మూడు ప్రధాన ధోరణుల మధ్య బోలెడు మధ్యంతర, లేదా పరివర్తనాత్మక, లేదా అయిష్టపు రూపాలు వుండినాయనుకోండి. అచ్చమైన వర్గ స్వభావం గల రాజకీయ, భావజాల ధోరణులు పత్రికలు, పార్టీల, ముఠాల, బృందాల పోరాటంలో ఘనీభవించినాయని చెప్పడం మరింత సరిగా వుంటుంది; వర్గాలు ఆసన్న యుద్ధాలకుగాను తగిన రాజకీయ, భావజాల ఆయుధాలను తయారు

చేసుకుంటూవుండినాయి.

2. విప్లవ సంవత్సరాలు (1905-1907).

అన్ని వర్గాలూ బహిరంగంలోకి వచ్చినాయి. కార్యక్రమానికీ, ఎత్తుగడలకూ చెందిన అభిప్రాయాలన్నీ జనాల చర్యచేత పరిక్షించి చూడబడినాయి. విస్తృతిలోనూ, తీవ్రతలోనూ ఆ దశ సమ్మె పోరాటానికి ప్రపంచంలో యెక్కడా సాటిలేదు. ఆర్థిక సమ్మె రాజకీయ సమ్మెగానూ, అది తిరుగుబాటుగానూ అభివృద్ధి అయినాయి. నాయకుడుగా కార్మికవర్గానికీ, అనుచరుడుగా ఊగిసలాడే అస్థిర రైతాంగానికీ మధ్య గల సంబంధాలు ఆచరణలో పరీక్షించి చూడబడినాయి. పోరాటపు సద్యోజనిత అభివృద్ధిలో సోవియట్ సంస్థా రూపం అవతరించింది. సోవియట్ల ప్రాముఖ్యం మీద ఆ కాలంలో జరిగిన వివాదాలు (1917-1920) నాటి మహా పోరాటాన్ని ముందే చిత్రించినాయి. పార్లమెంటరీ, పార్లమెంటరీయేతర పోరాట రూపాలు, పార్లమెంటును బహిష్కరించే, పార్లమెంటులో పాల్గొనే యెత్తుగడలూ, చట్టబద్ధ, చట్ట వ్యతిరేక పోరాట రూపాలూ మార్చి మార్చి రావడమూ, వాటి పరస్పర సంబంధాలూ- ఈ అంతటిలోనూ అసాధారణమైన సారం ఉండింది. జనాలకూ, నాయకులకూ, వర్గాలకూ, పార్టీలకూ, అందరికీ రాజకీయ శాస్త్రపు మౌలిక విషయాలను నేర్పడంలో ఈ దశలోని ప్రతినెలా "శాంతియుత", "రాజ్యాంగబద్ధ" అభివృద్ధి గల పూర్తి ఒక యేడాదికి సమానంగా ఉండింది. 1905 నాటి డ్రెస్ రిహార్సల్ లేకుండా 1917లో అక్టోబర్ విప్లవ విజయం అసంభవంగా వుండేది.

3. ప్రగతి వ్యతిరేకత సంవత్సరాలు (1907-1910).

జారిజం జయించింది. సకల విప్లవ పార్టీలూ, ప్రతిపక్ష పార్టీలూ బ్రద్దలు చేయబడినాయి. అధైర్యమూ, ఆత్మవిశ్వాస రాహిత్యమూ, చీలికలూ, అనైక్యతా, స్వపక్ష పరిత్యాగమూ, బూతు సాహిత్యమూ రాజకీయాల స్థానాన్ని ఆక్రమించినాయి. తాత్విక భావవాదం వైపు కొట్టుకపోవడం ఇంకా యెక్కువగా కూడా జరిగింది; విప్లవ ప్రతీఘాత భావాలకు మార్మికవాదం ముసుగు అయింది. కానీ, అదే సమయంలో ఈ గొప్ప అపజయమే విప్లవ పార్టీలకూ, విప్లవ వర్గానికీ నిజమైన, చాల ఉపయోగకరమైన పాఠం నేర్పింది, చారిత్రక గతితర్కంలో పాఠం, రాజకీయ పోరాటాన్ని అర్థం చేసుకోవడంలోనూ, ఆ పోరాటం చేయడం అనే కళలోనూ, శాస్త్రంలోనూ పాఠం అవసరం పడినప్పుడే మిత్రులు యెవరైందీ తెలిసేది. ఓడిన సైన్యాలు బాగా నేర్చుకుంటాయి. విజయం పొందిన జారిజం రష్యాలోని బూర్జువా పూర్వ, పితృస్వామిక జీవిత విధానపు అవశేషాల విధ్వంసనాన్ని త్వరపరచక తప్పలేదు. బూర్జువా పద్ధతులలో దేశ అభివృద్ధి వేగంగా సాగింది. పెట్టుబడిదారీ వ్యవస్థను పరిహరించే అవకాశం గురించి వర్గ విభేదాలకు వెలిగానూ, అతీతంగానూ వుండిన భ్రమలు గాలికి కొట్టుకపోయినాయి. వర్గ పోరాటం మరింత స్ఫుటమైన కొత్త పద్ధతిలో వ్యక్తమైంది.

విప్లవ పార్టీలు తమ విద్యను పూర్తి చేయవలసి ఉండింది. యెలా దాడిచేయవలసిందీ అవి నేర్చుకుంటూ వుండినాయి. అలాంటి జ్ఞానానికి తోడు క్రమపద్ధతిలో తిరోగమించడం యెలా అనే జ్ఞానం వుండాలని ఇప్పుడు అవి గుర్తించవలసి ఉండింది. యెలా దాడి చెయ్యాలి, యెలా సక్రమంగా తిరోగమించాలి అనేవి నేర్చుకొనివుంటే తప్ప విజయం అసాధ్యమని అవి గుర్తించవలసి ఉండింది- బాధాకరమైన అనుభవం ద్వారా విప్లవ వర్గం దీనిని గుర్తించడం నేర్చుకుంటుంది. ఓడిపోయిన ప్రతిపక్ష, విప్లవ పార్టీలకెల్ల బోల్షివిక్కులు అత్యంత క్రమ పద్ధతిలో తిరోగమించినారు, తమ "సైన్యానికి" అత్యంత తక్కువ నష్టంతో, ముఖ్య భాగాన్ని బాగా నిలుపుకొని, తక్కువ ప్రాముఖ్యం గల చీలికలతో (లోతు విషయంలోనూ, పునరుద్ధరణ సాధ్యం కాకపోవడం అనే విషయంలోనూ), తక్కువ గుండె దిటవు చెడడంతో, అత్యంత ప్రమాణంలో, అత్యంత నిర్దుష్టమైన, చురుకైన పద్ధతిలో పనిని మళ్లీ కొనసాగించడానికి అత్యుత్తమైన స్థితిలో. బోల్షివిక్కులు ఇది యెలా సాధించినారంటే, వాళ్ళు విప్లవ వాగాడంబరులను- తిరోగమించవలసి వుంటుందనీ, యెలా తిరోగమించవలసిందీ తెలుసుకోవలసి ఉంటుందనీ, అత్యంత ప్రగతి వ్యతిరేక పార్లమెంటులలోనూ, అత్యంత ప్రగతి వ్యతిరేక ట్రేడ్ యూనియన్లూ, సహకార, ఇన్స్యూరెన్స్ సంఘాలూ, అలాంటి సంస్థలలోనూ చట్టబద్ధంగా యెలా పనిచేయవలసిందీ తప్పనిసరిగా నేర్చుకోవలసి ఉంటుందనీ గ్రహించ గోరనివాళ్ళను- నిర్దాక్షిణ్యంగా గుట్టుకడిగి, బహిష్కరించినారు.

4. పునరుజ్జీవన సంవత్సరాలు (1910-1914)

పురోగతి మొదట నమ్మశక్యం కానంత నిదానంగా ఉండింది, పిమ్మట, 1912 నాటి లేనా ఘటన తర్వాత, అది కాస్త వేగంగా వుండింది. బోల్షివిక్కులు యెన్నడూ లేనట్టి కష్టాలను అధిగమిస్తూ, మెన్షివిక్కులను వెనక్కి నెట్టినారు. కార్మికవర్గ ఉద్యమంలో బూర్జువా ఏజెంట్లుగా యెవరి పాత్రను 1905 తర్వాత యావత్తు బూర్జువావర్గమూ స్పష్టంగా గుర్తించిందో, కనుక ఎవరికి బూర్జువావర్గం బోల్షివిక్కులకు వ్యతిరేకంగా వెయ్యి విధాల అండదండలు ఇచ్చిందో ఆ మెన్షివిక్కులను. కానీ, బోల్షివిక్కులు రహస్య పనిని "చట్టబద్ధ అవకాశాలు" వినియోగించుకోవడంతో మేళవించే- ఇది వాళ్లు నియమంగా పెట్టుకున్నారు- సరైన యెత్తుగడలను అనుసరించి వుండకపోతే, ఈ పనిలో వాళ్ళు ఎన్నడూ విజయం పొందివుండేవాళ్లు కాదు. పరమ ప్రగతి వ్యతిరేకమైన డ్యూమాకు జరిగిన ఎన్నికలలో బోల్షివిక్కులు కార్మిక వర్గానికి పూర్తి అండదండలు సంపాయించినారు.

5. మొదటి సామ్రాజ్యవాద ప్రపంచ యుద్ధం (1914-1917)

మహా ప్రగతి వ్యతిరేకమైన "పార్లమెంటు"తో కలిసిన చట్టబద్ధ

పార్లమెంటరిజం విప్లవ కార్మికవర్గ పార్టీ అయిన బోల్షివిక్కులకు అత్యంత ఉపయోగకరమైన సేవ చేసింది. బోల్షివిక్ పార్టీకి చెందిన పార్లమెంటు సభ్యులు సైబీరియాకు ప్రవాసానికి పంపబడినారు. అన్ని చాయల సోషల్ సామ్రాజ్యవాదమూ, సోషల్ జాతీయ దురహంకారమూ, సోషల్ దేశభక్తీ, అస్థిర, స్థిర అంతర్జాతీయ వాదమూ, శాంతివాదమూ, శాంతివాద విప్లవాత్మక తిరస్కారమూ రష్యన్ విదేశీ పత్రికల్లో పూర్తి వ్యక్తీకరణ పొందినాయి. రెండవ ఇంటర్నేషనల్‌కు చెందిన విద్వన్మూర్ఖులూ, (Learned fools), వృద్ధ నారులూ (Old Women) రష్యన్ సోషలిస్టు ఉద్యమంలోని "ముఠాల" బాహుళ్యాన్నీ, అవి తమలో తాము చేసుకుంటున్న భీషణ పోరాటాన్నీ చూసి అసహ్యంచుకున్నవాళ్లు, యుద్ధం మూలంగా సకల పురోగామి దేశాలలోనూ తమ బడాయికి కారణమైన "చట్టబద్ధత" అంతమైనపుడు, రష్యన్ విప్లవకారులు స్విట్జర్లాండులోనూ, పలు ఇతర దేశాలలోనూ వ్యవస్థీకరించినదానితో రమారమిగా కూడా సమానమైన అభిప్రాయాల నిరాటంక (రహస్య) ఆదాన ప్రదానాలనూ, నిర్దుష్ట అభిప్రాయాలను రూపొందించే నిరాటంక (రహస్య) క్రమాన్నీ వ్యవస్థీకరించలేకపోయినారు. అందువల్లనే సకల దేశాలలోని స్వయంప్రకటిత సోషల్ దేశభక్తులూ, "కౌట్స్కీయెట్టూ" ఉభయులూ కార్మికవర్గానికి పచ్చి ద్రోహులుగా రుజువైనారు. 1917-1920 లో బోల్షివిజం విజయం సాధించడానికి గల ప్రధాన కారణాలలో ఒకటి ఏమిటంటే, అది 1914 అంతం నుండి సోషల్ జాతీయ దురహంకారం యొక్క "కౌట్స్కీయిజం" (దేనికి ఫ్రాన్సులో లోంగెటిజమూ, గ్రేట్ బ్రిటన్‌లోని ఇండిపెండెంట్ లేబర్ పార్టీ నాయకుల, ఫేబియన్ల, ఇటలీలో టురాటీ, వగైరాల అభిప్రాయాలూ అనురూపంగా ఉన్నాయో దాని) యొక్క హీనత్వాన్నీ, నీచత్వాన్నీ నిర్దాక్షిణ్యంగా బట్టబయలు చేయడమూ, తరువాత బోల్షివిక్ అభిప్రాయాలను గురించే జనాలకు తమ స్వానుభవం ద్వారా అంతకంతకూ యెక్కువగా నమ్మకం కలగడమూ. ***-లెనిన్ సంకలిత రచనలు 8వ సంపుటి- (47-50 పేజీలు)***

### అక్టోబర్ విప్లవ ప్రాధాన్యత

కార్మికవర్గ నాయకత్వాన సాధించబడిన అక్టోబర్ విప్లవం బూర్జువా డెమోక్రటిక్ విప్లవాన్ని సంపూర్ణంగా సాధించిందని లెనిన్ చెబుతారు. అంటే ఈ విప్లవం రష్యాలో మధ్యయుగాల అవశేషాలను, అర్ధబానిస వ్యవస్థను, ఫ్యూడలిజాన్ని పూర్తిగా నిర్మూలిస్తుంది. అయితే బూర్జువా డెమోక్రటిక్ విప్లవాన్ని సంపూర్తిగావించడం అన్న కర్తవ్యం కార్మికవర్గ సోషలిస్టు విప్లవ ఉప ఉత్పత్తి సాధించబడింది. నూతన తరహా ప్రజాస్వామ్యం, కార్మికవర్గ నియంతృత్వం అంటే కార్మికవర్గ ప్రజాస్వామ్యం ఆవిర్భవించడాన్ని, సోవియట్ వ్యవస్థను సూచిస్తుంది. ప్రపంచ చరిత్రలో నూతన యుగానికి, నూతన వర్గ పాలనకు నాంది పలికిందని లెనిన్ చెబుతారు.



**బోల్షివిక్ విప్లవం తర్వాత కార్మికులను ఉద్దేశించి రెడ్‌స్క్వేర్‌లో ప్రసంగిస్తున్న కామ్రేడ్ లెనిన్-అక్టోబర్ 26, 1917**

పాత పెట్టుబడిదారీ ప్రపంచం నుండి సోషలిస్టు వ్యవస్థకు మారడం ద్వారా అక్టోబర్ విప్లవం ప్రపంచ చరిత్రలోనే ఒక మూలమలపు అని స్టాలిన్ అక్టోబర్ విప్లవం దశమ వార్షికోత్సవ సందర్భంగా చేసిన ప్రకటనలో పేర్కొన్నాడు. గత విప్లవాలన్నీ ఒక దోపిడీ వ్యవస్థ స్థానంలో మరొక దోపిడీ వ్యవస్థను ప్రవేశపెట్టాయి. కాని అక్టోబర్ విప్లవ లక్ష్యం ఒక దోపిడీ విధానం చేసే మొత్తం దోపిడీ వ్యవస్థను అంతం చేయడం. అందువల్ల అక్టోబర్ విప్లవం అనేది అంతర్జాతీయ ప్రపంచక్రమంలోనే విప్లవం.

1. సామ్రాజ్య వ్యవస్థకు ఈ విప్లవం గండికొట్టింది. మొట్టమొదటిసారిగా పీడిత ప్రజలు, దోపిడీకి గురవుతున్న ప్రజలు పాలకవర్గం స్థాయికి ఎదిగారు. ఈ విప్లవం ఉత్పత్తి సాధనాలను ప్రజాపరం చేసింది. పాత రాజ్యవ్యవస్థను ధ్వంసం చేసింది. కార్మికవర్గ అధికారాన్ని స్థాపించింది. నూతన సోషలిస్టు వ్యవస్థ నిర్మాణానికి పూనుకుంది. ఈ విధంగా అది నూతన యుగానికి, కార్మికవర్గ విప్లవాల యుగానికి నాంది పలికింది.

2. అక్టోబర్ విప్లవం విస్తారమైన రాజ్యంలో పీడిత జాతులను విముక్తం చేసింది. మొట్టమొదటి సారిగా పీడిత జాతులు నిజమైన స్వేచ్ఛను, సమానత్వాన్ని పొందగలిగాయి. ఈ విధంగా అక్టోబర్ విప్లవం ప్రపంచంలోని పీడిత దేశాలతో కార్మికవర్గ మిత్రత్వంలో, కార్మికవర్గ నాయకత్వాన వలస విముక్తి, విప్లవాల యుగానికి కూడా నాంది పలికింది.

3. సామ్రాజ్యవాద కేంద్రాలలోను, దాని పెరటిదొడ్డిగా ఉన్న వలస దేశాలలోను విప్లవ బీజాలను నాటిన అక్టోబర్ విప్లవం మొత్తంగా ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థనే ప్రమాదంలో పడవేసింది. అక్టోబర్ విప్లవంతో పెట్టుబడిదారీ వ్యవస్థ వీగిపోవడం ఆరంభమయింది.

4. అక్టోబర్ విప్లవం మేధోపరమైంది కూడా. కార్మికవర్గ

సిద్ధాంతంలో విప్లవాన్ని తెచ్చింది. సంస్కరణవాదంపైన మార్క్సిజం విజయాన్ని, సోషల్ డెమోక్రసీ మీద లెనినిజం విజయాన్ని చాటి చెప్పి కార్మికవర్గ ఉద్యమంలో సోషల్ డెమోక్రసీపై విజయం సాధించకపోతే పెట్టుబడిదారీ విధానాన్ని అంతం చేయడం సాధ్యపడదని ఈ విప్లవం రుజువు చేసింది. -(*మార్క్సిస్టు సిద్ధాంత గ్రంథాలు- కారన్‌ఫోర్త్ పేజీలు 24-25*)

**బోల్షివిక్ పార్టీ విప్లవ చరిత్ర నుండి నేర్చుకోవాల్సిన విషయాలు:**

a. ప్రపంచ చరిత్ర గతిని త్వరతం చేసిన మార్క్సిజం-లెనినిజం సిద్ధాంత ప్రాముఖ్యత అర్థం చేసుకోవాలి. మార్క్స్, ఎంగెల్స్‌లు చేసిన కృషి వలన మార్క్సిజం అనే సిద్ధాంతం ఉనికిలోకి రాగా, రష్యా నిర్దిష్ట పరిస్థితులకు ఈ సిద్ధాంతాన్ని అన్వయించి కా. లెనిన్ అక్టోబర్ సోషలిస్టు విప్లవాన్ని విజయవంతం చేసాడు. సిద్ధాంతం, ఆచరణ మధ్య లంకె వేసాడు. సిద్ధాంతాన్ని ఆయా దేశాల నిర్దిష్ట పరిస్థితులకు అన్వయించడం ద్వారానే దేశాల్లో విప్లవాలు సంభవిస్తాయి. ఈ సత్యాన్ని మనం గ్రహించాలి.

b. మార్క్సిజం - లెనినిజం అనేది కార్మికవర్గ సిద్ధాంతం. ఇది వర్గపోరాటాన్ని కేంద్రంగా స్వీకరిస్తుంది. ఈ సిద్ధాంతం విప్లవ క్రమంలో ఇతర వర్గాల భావజాలం నుండి ఉద్భవించే భావాలకు వ్యతిరేకంగా నిరంతరం సంఘర్షణకు దిగి కార్మికవర్గ సిద్ధాంతాన్ని రక్షిస్తుంది. అలా విప్లవం విజయవంతం కావడానికి గ్యారంటీ ఏర్పడుతుంది. మార్క్సిజంను తిరగదోడిన బెర్న్‌స్టయిన్, కారల్ కాట్స్కీ, మార్టోవ్, ప్లెహనోవ్, ట్రాట్స్కీ లాంటి వాళ్ళకు వ్యతిరేకంగా పోరాడింది. కార్మికవర్గ వ్యతిరేక సిద్ధాంతాలకు కేంద్రమైన రివిజనిస్టు సిద్ధాంతాలకు వ్యతిరేకంగా మనం రాజీలేని పోరాటం కొనసాగించాలి.

c. విప్లవాలను విజయవంతం చేయాలంటే కార్మికవర్గ పార్టీ తప్పనిసరి అవసరం. కార్మికవర్గ పార్టీ అయిన కమ్యూనిస్టు పార్టీకీ, కార్మికవర్గ క్రమశిక్షణ చాల ముఖ్యమైనది.పార్టీ సిద్ధాంతానికి అంటిపెట్టుకొని ఉండాలి. ఆశయానికి అంకితం కావాలి; కార్మికవర్గం నాయకత్వంలో ఇతర పీడిత వర్గాలను గెలుచుకోవాలి; కేంద్రీకృత ప్రజాస్వామ్యానికి కట్టుబడి ఉండాలి. కార్మికవర్గ నియంతృత్వం కోసం పోరాడాలి; ఇటువంటి లక్షణాలను కలిగిన పార్టీయే విప్లవాన్ని విజయవంతం చేయగలదు.

d. ఒక దేశ లేదా ప్రపంచ విప్లవాన్ని దారి తప్పకుండా నడపాలంటే పార్టీకి వ్యూహం-ఎత్తుగడలు ఎలా అవసరమో బోల్షివిక్ విప్లవం నేర్పింది. ఇందులో ముఖ్యమైన విషయమేమంటే ఆ దేశ సాంఘిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితుల్లో నూతన ప్రజాస్వామిక విప్లవమా? సోషలిస్టు విప్లవమా? ఏ దశను పూర్తి చేయాల్సింది అనే విషయంలో స్పష్టతను ఇచ్చేదే వ్యూహం కాగా, ఈ వ్యూహాన్ని విజయవంతం చేయడానికి ఎత్తుగడలు ఉపయోగపడతాయి. లెనినిజం ఈ విషయాన్ని అత్యంత ప్రతిభావంతంగా ప్రపంచ కార్మికవర్గానికి అందించింది.

e. విప్లవ పార్టీ విప్లవ క్రమంలో ఎదురయ్యే ఆటు-పోట్లను ఎదుర్కోవడానికి సంసిద్ధం కావాలి. విప్లవ పురోగమనంలో సాహసంగా ముందుకు ఉరకాలి. విప్లవ తిరోగమనంలో నిబ్బరంగా తిరోగమించాలి. బోల్షివిక్ విప్లవంలో 1905 బూర్జువా విప్లవం, 1908-12 తిరోగమన సంవత్సరాలు, 1917 ఫిబ్రవరి, అక్టోబర్ విప్లవ కాలంలో బోల్షివిక్కులు అవలంబించిన ఎత్తుగడలు ఈ విషయాన్ని మనకు బోధిస్తాయి.

f. పార్టీ దేశ ప్రజల ముందు ఉద్యమ, రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా ఇచ్చే నినాదాలకు ఎంతో ప్రాధాన్యత ఉంది. ఇది ప్రజలను ఒక్క తాటిపైన ముందుకు నడిపిస్తాయి. బోల్షివిక్ విప్లవంలో "పెట్టుబడిదారుల నేతృత్వంలోని బూర్జువా ప్రభుత్వాన్ని సమర్థించరాదు"; "సోవియట్లకే సర్వాధికారాలు"; "సోషలిస్టు విప్లవాన్ని విజయవంతం చేయండి" అని కా. లెనిన్ ఇచ్చిన నినాదాలు రష్యా ప్రజలను ఏకతాటిపై నడిపి విప్లవాన్ని విజయవంతం చేయడానికి దోహదపడినాయి.

సోషలిస్టు వ్యవస్థ ఉనికిలోకి వచ్చిన వంద సంవత్సరాల్లో, ప్రస్తుతం సోషలిజం వెనకడుగులో ఉన్నప్పటికీ మళ్ళీ ప్రపంచ ప్రజల్లో సోషలిజం పట్ల ఆకాంక్ష పెరుగుతున్నది.

వంద సంవత్సరాల క్రితం లెనిన్ సామ్రాజ్యవాదంపై చెప్పిన సిద్ధాంతం ఇప్పటికీ చెల్లుబాటు అవుతున్నది. కూపస్లు చింపుకొని జీవనాన్ని సాగించే సామ్రాజ్యవాదం నేడు బాండ్ల వ్యాపారంపై ఆధారపడుతూ, అంతులేని సంక్షోభంలో ఇరుక్కొన్నది. అది ఆర్థిక, ద్రవ్య సంక్షోభం అనే శ్లేషంలో పడి ఈగ లాగా కొట్టుకుంటున్నది. ఈ సంక్షోభం నుండి బయటపడే మార్గం లేక అది యుద్ధం-ఫాసిజంను కోరుకుంటున్నది. ఎన్నో ఏళ్ళుగా పెట్టుబడిదారీ విధానం ఎదుర్కొంటున్న సంక్షోభాలను తట్టుకొని నిలబడడానికి చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా నేడు అనుసరిస్తున్న నయా ఉదారవాద లేదా సామ్రాజ్యవాద ప్రపంచీకరణ అనే విధానమే తన వ్యవస్థీకృత సంక్షోభం (Structural Crisis) ఎదుర్కొంటూ సముద్రంలో మునిగిపోతున్న నావలా తయారైంది. ఈ పరిణామాలను మనం రాజకీయంగా విశ్లేషిస్తే అమెరికాలో డోనాల్డ్ ట్రంపు అధికారానికి రావడం ఈ సంక్షోభ ఫలితమే. అమెరికా అంతర్గతంగా సంక్షోభాన్ని ఎదుర్కోవడం అంతర్జాతీయంగా తన ఆధిపత్యాన్ని కోల్పోతున్న క్రమంలో అది అనుసరించబోయే విధానాలకు ట్రంప్ లాంటి వాళ్ల అవసరం ఏర్పడింది. తెల్లజాతిలో చదువుకోని ప్రతిఘాతుక స్వభావం కలిగిన యువత, మధ్యతరగతి, మోనోపలీలో పై అంతస్థు మద్దతుతో అమెరికాలో ట్రంపు అధికారానికి వచ్చాడు. అలాచూస్తే ట్రంపు

*(మిగతా 45వ పేజీలో.....)*

# దేశ రాజకీయాలను మలుపు తిప్పిన గుజరాత్‌లో బీజేపీ బొటాబొటిగ గెలిచింది

## నరేంద్రమోడీ, అమిత్ షా ల 'మిషన్-150' ఓడిపోయింది

గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్ లకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను కేంద్ర ఎన్నికల కమీషన్ డిసెంబర్ 18న ప్రకటించింది. గుజరాత్‌లో మొత్తం 182 స్థానాలలో అధికారంలో ఉన్న బీజేపీ-99 స్థానాలను, కాంగ్రెస్-77(ఇతరులతో కలిసి కాంగ్రెస్ కూటమికి-80) స్థానాలను, ఇతరులు-3 స్థానాలను గెలుచుకున్నారు. హిమాచల్ ప్రదేశ్‌లో మొత్తం 68 స్థానాలల్లో బీజేపీ-44 స్థానాలను, కాంగ్రెస్-21 స్థానాలను, సీపీఎమ్-ఒక స్థానాన్ని, స్వతంత్రులు-2 స్థానాలు గెలుచుకున్నారు. రెండు రాష్ట్రాల్లోనూ బీజేపీ అధికారంలోకి వచ్చింది. ఈ ఎన్నికల్లో 'నోటా'కు వచ్చిన ఓట్లు గుజరాత్‌లో 5.2 లక్షలు, హిమచల్ ప్రదేశ్‌లో 33 వేలు.

హిమాచల్ ప్రదేశ్ చిన్న రాష్ట్రం కావడం, రాజకీయంగా అంత ప్రాధాన్యత లేకపోవడం, స్వయంకృతాపరాధాలు, కాంగ్రెస్ హిమాచల్ ప్రదేశ్‌లో ఓడిపోతుందన్న విషయం ముందు నుంచీ అర్థమవుతున్నదే. కనుక దాని పట్ల ఎవరు ఆసక్తిని కనబరచలేదు. మరొక రాష్ట్రం గెలుచుకోవడంలో వ్యూహాత్మకంగా అడుగులేస్తున్న బీజేపీ అధికార జాబితాలోకి హిమాచల్ ప్రదేశ్ వచ్చి లెక్కల్లో దాని బలాన్ని పెంచితే, కాంగ్రెస్‌కున్న కొద్ది రాష్ట్రాల్లో మరో రాష్ట్రం కూడా చేజారిందనేది వాస్తవం. పాలకవర్గ ముఠా పట్ల ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తితో మరొక పాలకవర్గ ముఠా అధికారాన్ని చేజిక్కించుకోవడం తప్ప ఇది మరొకటి కాదు. తమిళనాడు ఆర్.కే.నగర్ ఉప ఎన్నికలో కూడా అధికారంలో ఉన్న ఏఐడిఎమ్‌కే ఫ్రాక్షన్ బీజేపీ తో కుమ్మక్కై అధికారాన్ని దుర్వినియోగ పరచి ఎన్ని కుతంత్రాలు పన్నినా చివరికి స్వతంత్ర అభ్యర్థిగా దినకరణ్ గెలవడం కూడా ఇటువంటి సూచికే. అక్కడ నోటాకు పడిన ఓట్లు కూడా బీజేపీ అభ్యర్థికి రాలేదు. ఎన్నికల రాజకీయాల పరిధిలో ప్రజల సమస్యలను పరిష్కరించే ప్రత్యామ్నాయం కానరాని గందరగోళ స్థితి మరోసారి వ్యక్తమైంది.

హిమాచల్ ప్రదేశ్‌లా కాకుండా గుజరాత్‌కు చాలా ప్రాధాన్యత ఉన్నది. దేశ రాజకీయాలను మలుపుతిప్పిన 2014 లోక్‌సభ ఎన్నికలను ప్రభావితం చేసింది గుజరాత్. హిందుత్వ ఎజెండా, గుజరాత్ మోడల్, కాంగ్రెస్ అవినీతి మూడు నినాదాలతో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీకి నైతికంగా బలమైన కేంద్రం గుజరాతే. మూడున్నర సంవత్సరాలుగా బీజేపీ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక ఆర్థిక విధానాల, గుజరాత్ రాష్ట్రంలో అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల ఫలితాలు గుజరాత్‌లోనే సరిగా ప్రతిఫలిస్తాయని, ఈ ఎన్నికల్లో గెలుపు-ఓటములే 2019లో జరిగే ఎన్నికలకు సూచనగా కూడా ఉంటాయని అందరూ గుజరాత్‌వైపు చూశారు. అందరూ ఊహించినట్లే బీజేపీ పతనం మొదలైందని ఎన్నికలు ఫలితాలు స్పష్ట పరిచాయి. అలాగే ప్రభుత్వ వ్యతిరేకతను తమ విజయానికి అనుకూలంగా మార్చుకోలేని బలహీన స్థితిలోనే కాంగ్రెస్ ప్రతిపక్షం కొనసాగుతున్నదనే నిజం మరోసారి స్పష్టమయింది.

గుజరాత్, హిమాచల్ ప్రదేశ్ రెండు రాష్ట్రాల్లో ఎన్నికలు జరిగాయి. గుజరాత్ ఎన్నికల పైనే దేశవ్యాప్తంగా కుతూహలం, ఉత్కంఠ ప్రదర్శితమైంది. ప్రస్తుత సందర్భంలో గుజరాత్ రాష్ట్రంలోనే చుక్కెదురవుతుందని, దాని తిరోగమనం మొదలవుతుందని ప్రతిపక్షాలు ఆశించాయి. దానికి భిన్నంగా పూర్తిగా కాంగ్రెస్‌ను ఓడించి 'కాంగ్రెస్ విముక్త భారతం' నిర్మించాలని బీజేపీ ఆశపడుతుంది. గుజరాత్ ఎన్నికలు 2019 లోక్‌సభ ఎన్నికలకు ఒక అంచనాని అందిస్తాయని పరిశీలకులు భావించారు. మీడియా కూడా చాలా ప్రాధాన్యతనిచ్చి అందరి దృష్టిని అటువైపు తిప్పింది.

ఎన్నికలు జరిగి ఫలితాలు వెలువడ్డాక బీజేపీ గత ప్రభావాన్ని కోల్పోయిందనీ, కాంగ్రెస్ ఓడినా కొంత బలాన్ని తిరిగి పొందిందనీ గణాంకాలు చెపుతున్నాయి. గుజరాత్ 1991 లోక్‌సభ ఎన్నికల నుండి బీజేపీకి కంచుకోటగా ఉంది. గత ఐదు అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలిచి రాష్ట్రాన్ని పరిపాలిస్తుంది. ఇప్పుడు 6వ సారి అధికారం కోసం బీజేపీ పోటీ పడింది. దేశ ప్రధాని అయిన మోడీ, రాష్ట్రంలోనూ, కేంద్రంలోనూ అధికారంలో ఉన్న ఆ పార్టీ జాతీయాధ్యక్షుడు అమిత్ షా జంట బొటా బొటిగ బీజేపీని ఎన్నికల్లో గెలిపించారు. 2014తో పోలిస్తే ప్రస్తుత పరిస్థితి బీజేపీకి గడ్డుగానే పరిణమించింది. మొత్తం సీట్లలో 150 మేమే గెలుస్తాము అనే లక్ష్యంతో మిషన్-150 పేరుతో దిగిన అమిత్‌షా జంట గతంలో వచ్చిన మూడంకెల సంఖ్యను కనీసం నిలుపుకోలేక రెండంకెలకు కుదించబడ్డారు. ఓటింగ్ శాతం తగ్గింది. కనీసంగా మరో రెండు శాతం ఓట్లు బీజేపీకి తగ్గితే ఓటమి పాలయ్యే పరిస్థితుల్లో 'చావు తప్పి బయటపడిన చందం'గా గుజరాత్ ఎన్నికల్లో పరువు నిలబెట్టుకున్నారు. దేశ ప్రధాని తన పూర్తి కాలాన్ని గుజరాత్ ఎన్నికల కోసం కేటాయించవలసి వచ్చింది. మొత్తంగా 34 ఎన్నికల ర్యాలీల్లో పాల్గొన్న ప్రధాని గుజరాత్ సెంటిమెంటును, కుల మత విద్వేషాలను, పాకిస్థాన్ వ్యతిరేకతను రెచ్చగొట్టి ప్రజల భావోద్వేగాలను ఓట్లుగా మార్చుకునే కుటిలత్వాన్ని ప్రదర్శించాడు. కాంగ్రెసును ఇరుకున బెట్టేందుకు రామమందిరం వివాదాన్ని ముందుకు తెచ్చాడు. అహ్మద్ పటేల్‌ను ముఖ్యమంత్రిని చేస్తారంటూ పోస్టర్లు వేయించాడు. మణిశంకర్ అయ్యర్ వ్యాఖ్యలపై గుజరాత్ గడ్డమీద పుట్టిన వ్యక్తిని అవమానించాడు అని కుల, ప్రాంతీయతను రెచ్చగొట్టాడు. పాకిస్థాన్ జాతీయులకు అయ్యర్ విందు ఇచ్చాడని, మన్మోహన్ సింగ్ అందులో పాల్గొని తన హత్యకు కుట్రచేశారని

అర్థంపర్థం లేని ఆరోపణలు చేశాడు. 2015 డిసెంబరులో ఆకస్మికంగా లాహోరు వెళ్లి ప్రధాని నవాజ్ షరీప్‌కు తనే స్వయంగా శుభాకాంక్షలు చెప్పిన విషయం మరచిపోయినట్లున్నాడు.

2014తో పోల్చుకున్నప్పుడు గుజరాత్ సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితుల్లో కొన్ని మార్పులు కనబడుతాయి. రాష్ట్రంలో వ్యవసాయ సంక్షోభం దానికితోడు కరువు పరిస్థితులు ఏర్పడ్డాయి. ప్రభుత్వం రైతాంగాన్ని పట్టించుకోలేదని, నిర్లక్ష్యం చేసిందని ప్రజల్లో అసంతృప్తి ఉంది. ఆ తరువాత రెండు సంవత్సరాలు పంటలు బాగా పండినా నోట్ల రద్దు వలన, ధరలు పడిపోవడం వలన ప్రజలు నానా ఇక్కట్లు పడ్డారు. పత్తి, వేరుశనగ లాంటి పంటలకు గిట్టుబాటు ధర లభించలేదు. ఊనా లాంటి సంఘటనల్లో సామాజికంగా దళితులు అణచివేతకు గురికావడంతో వారికి బీజేపీ పట్ల తీవ్ర వ్యతిరేకత పెరిగింది. పాటీదారులు సంఘటితపడి ఉద్యమిస్తున్నప్పుడు వారి సమస్యలను పరిష్కరించలేదు. జీఎస్‌టీతో చిన్న, మధ్యతరగతి ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వరద పరిస్థితుల్లో నిర్లక్ష్యానికి గురైన ప్రజలు ప్రభుత్వ వ్యతిరేకతతో ఉన్నారు. రాబడి లేని సాగుతో ఆలుగడ్డల రైతాంగం నిరసనలు వ్యక్తం చేశారు. నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉండడం, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, చిన్న వ్యాపారాలు అలాగే పారిశ్రామిక అభివృద్ధి దెబ్బతినడంతో నిరుద్యోగ సమస్య మరింతగా పెరిగి సామాజిక ఉద్యమాలుగా ముందుకు వచ్చాయి. ఈ పరిస్థితులకు తోడు రాష్ట్రంలో నాయకత్వంలో మార్పు జరగడం, స్థానిక నాయకత్వం బలపడక, ప్రధాన నాయకులు (మోడీ, అమిత్ షా) ఢిల్లీ నుంచి రిమోట్ చేస్తున్నా అది సరైన ఫలితాలు ఇవ్వకపోవడంతో నిర్మాణ గందరగోళం కూడా బీజేపీ పార్టీలో ఏర్పడింది. అయినప్పటికీ పట్టణ ప్రాంతాల్లోని ముఖ్యంగా ఎనిమిది మున్సిపల్ కార్పోరేషన్‌లలోని మెజార్టీ ప్రజానీకం ఇప్పటికీ బీజేపీకే అనుకూలంగా ఓటు వేయడంతో బీజేపీ ఆరవ సారి అధికారాన్ని చేజిక్కించుకుంది.

ప్రజా సమస్యలు పట్టించుకోవడం విధానం కాదు కనుక పట్టించుకోలేదు. ఎన్నికల ప్రణాళికను ప్రకటించి బీజేపీ కన్నా ముందే ప్రచారంలో ముందడుగు వేయడంతో కాంగ్రెస్ ప్రచార సరళికి ఒక దశలో బీజేపీ భయపడింది. జీఎస్‌టీని 'గబ్బర్‌సింగ్ టేక్స్' అనడం, 'ఆలుగడ్డల నుండి బంగారం తీయడం' మోడీ మరిచారా! అని రాహుల్ కామెంట్ చేయడం, 'ఇంటికి 15 లక్షలు ఇస్తాం' అని వాగ్దానం చేయలేమనడం, 'మేము సేవకులమే కాని హంతకులం కాదనడం' లాంటి అనేక రూపాలలో కాంగ్రెస్ ప్రచారం ముందుకు సాగింది. అలాగే మూడు అసమ్మతి బృందాలైన పాటీదారులు, దళితులు, ఓబీసీ క్షత్రియుల్లో ప్రభుత్వ వ్యతిరేకతను ఒక మేరకు వినియోగించుకుంది. పాటీదార్లకు రిజర్వేషన్లు అమలు చేస్తామని కాంగ్రెస్ తన మేనిఫేస్టోలో వాగ్దానం చేసింది. అయితే ఇదేమీ సులువుగా చేయగల పని కాదు. అయినా కాంగ్రెస్ ఆ పని చేయ గలిగింది. ఈ పరిణామం వల్ల బీజేపీ కలవరపడింది. ఆ పార్టీ నేతలు చేసే పలు ప్రకటనల్లో, ప్రత్యేకించి ఆ కూటమిని విచ్ఛిన్నం చేసే ప్రకటనల్లో అది కనబడుతుంది.

మోడీ ఫోటోతో ముద్రించిన 'నేనే వికాస్, నేనే గుజరాత్' అంటూ ప్రకటించుకున్నారే తప్ప గుజరాత్ అభివృద్ధిని గురించి చెప్పుకునే అంశాలు ఈ ప్రచారంలో కనబడలేదు పైగా నిరుద్యోగము, నీరు, నోట్ల రద్దు, జీఎస్‌టీ ఫలితంగా వచ్చిన ఇబ్బందులని రాహుల్, హార్థిక పటేల్ ప్రశ్నిస్తే మోడీ దారి మళ్లించి హిందూ, ముస్లిం ఓట్లు చీల్చే విధంగా కాంగ్రెస్ మీద ఆధార రహితమైన ఆరోపణలు, అనవసరమైన చర్చలు ముందుకు తెచ్చాడు. అఫీజ్ సయ్యిద్‌కు బెయిల్ వచ్చినందుకు కాంగ్రెస్ సంబరాలు జరుపుకుందని, రాహుల్ గాంధీ కాథలిక్ అవునా, కాదా అని చర్చించింది. ఇంకా హిందీలో ప్రసంగించడం కాకుండా స్థానిక గుజరాతీ భాషలోనే ప్రసంగించడం వల్ల ప్రాంతీయ సెంటిమెంట్‌ను రెచ్చగొట్టడం, హోరాహోరి పోటీ జరుగుతుందన్న భావనను కలిగించడం, ఆ విధంగా ఆత్మరక్షణా స్థితిని ఎంచుకున్నాడని అర్థమవుతుంది.

కాంగ్రెస్‌కు గుజరాత్‌లో యువజన కాంగ్రెస్ నుండి వచ్చిన పాత కాంగ్రెస్ కార్యకర్తలు ఇప్పుడు లేరు. ఆ నిర్మాణం విచ్ఛిన్నమై ఉంది. స్థానిక నాయకులు కొద్ది మంది బీజేపీలో చేరారు. అటువంటి క్లిష్ట పరిస్థితుల్లో ప్రభుత్వ వ్యతిరేక ఓటును పొందాలన్న సరైన వ్యూహంతో ముందుకువెళ్లాల్సి ఉంటుంది. రైతుల గురించి మాట్లాడి రుణమాఫీ ప్రకటించడం, సంఘటితపడిన పాటీదారులకు రిజర్వేషన్లు కల్పిస్తామనడం, పాటీదారుల నాయకుడు హార్థిక్ పటేల్‌ను బీజేపీకి వ్యతిరేకంగా ఎన్నికల ప్రచారంలో శక్తివంతంగా వినియోగించుకోవడం జిఘ్నేష్ మేవానీ లాంటి దళిత నాయకులకు వ్యతిరేకంగా కాంగ్రెస్ అభ్యర్థిని నిలబెట్ట కుండా బీజేపీ పట్ల దళితులకున్న వ్యతిరేకతను సొమ్ముచేసుకోవడం, పాటీదారుల ఉద్యమాన్ని వ్యతిరేకించిన ఓబీసీ ఉద్యమ నేత అల్పేష్ ఠాకూర్‌ను కాంగ్రెస్ అభ్యర్థిగా నిలబెట్టి గెలిపించడం, కాంగ్రెస్ వ్యూహంలో సామాజిక వర్గాల్లో అగ్రవర్ణాలకు వ్యతిరేకంగా ముఖ్యంగా బీజేపీకి వ్యతిరేకంగా కూడ గట్టడంలో ఒక మేరకు విజయం సాధించినట్లే. హిందూ ఓట్లను చీల్చడం కోసం రాహుల్ గాంధీ సోమనాథ దేవాలయం లాంటి అనేక ఆలయాలను దర్శించడం లాంటివి ఎన్నికల జిమ్మిక్కులే. కాంగ్రెస్ తన రాజకీయ నిర్మాణ బలహీనతల నుండి బయటపడలేక పోయింది. మెజారిటీ ప్రజల్లో విశ్వాసాన్ని కల్పించలేకపోయింది.

బీజేపీ ప్రభుత్వ విధానాలపైన వ్యతిరేకత ఉన్నప్పటికీ బీజేపీ సంప్రదాయక ఓటర్లు మెజారిటీ బీజేపీని వదులుకొని కాంగ్రెస్ వైపు మళ్ళడానికి సిద్ధంగా లేరు. జీఎస్‌టీ ప్రభావం సూరత్, అహ్మదాబాద్ లాంటి పట్టణాల్లో వ్యాపారులపై తీవ్రంగా పడింది. వారు ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలు చేపట్టారు. ఈ స్థితిని వినియోగించుకోవడానికి మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌ను కాంగ్రెస్ వారి వద్దకు పంపింది. కాని వారు మాకు ఇబ్బందులు ఉన్నప్పటికీ

బీజేపీని విడిచి మీ వైపు రాలేమని స్పష్టం చేసారు. దీని వలన సూరత్ విభాగంలో బీజేపీకి 15 సీట్లు రాగా కాంగ్రెస్‌కు ఒక్క సీటు మాత్రమే దక్కింది. అహ్మదాబాద్‌లో కూడా ఇదే పరిస్థితి ఏర్పడింది.

అధికారంలో ఉన్న బీజేపీ ఎలక్షన్ కమీషన్‌ను ప్రభావితం చేసి గుజరాత్ ఎన్నికలను బీజేపీకి అనుకూలంగా జాప్యం చేసి ప్రకటించింది. రాహుల్ గాంధీ ప్రచారాన్ని ఒక దశలో ఆపింది. బీజేపీ చేస్తున్న ప్రచారాన్ని మాత్రం ఎటువంటి ఆటంకాలు లేకుండా చూసింది. బీజేపీ ఎన్నికల ప్రణాళికను ఆలస్యంగా విడుదల చేసింది. అందులో వాగ్దానాలు మాత్రమే ఉన్నాయి. అక్కడక్కడా విషయాలను తెచ్చి చేర్చినట్లు ఉంది తప్ప అక్కడి వాస్తవిక పరిస్థితులకు అనుగుణంగా రూపొందించినట్లు లేదు. కాంగ్రెస్ ప్రణాళికలో పాటీదారుల రిజర్వేషన్ మీద ఎన్నికల సందర్భంగా పెద్ద చర్చ రేకెత్తించింది. ముస్లింల గురించి అందులో లేకపోవడం, తరువాత కూడా స్పష్టంగా వైఖరిని వెల్లడించడంలో జంకు కనిపించింది. ఆ మేరకు ఓట్ల శాతం తగ్గింది. ముస్లింల నుండి గణనీయంగా పెరగవలసిన ఓట్ల శాతం తగ్గింది. గుజరాత్‌లోని గ్రామీణ ఓటర్లు అధికంగా కాంగ్రెస్‌కు, 60శాతం ఉన్న పట్టణ ఓటర్లు అత్యధికంగా బీజేపీకి ఓట్లు వేశారు. సౌరాష్ట్ర-కచ్, ఉత్తర గుజరాత్ లలో కాంగ్రెస్‌కు ఎక్కువ సీట్లు వచ్చాయి. గుజరాత్‌లోని ఏడు జిల్లాల్లో పూర్తిగా అన్ని సీట్లు కాంగ్రెస్‌కే రావడం విశేషం. కాంగ్రెస్‌కు మెజార్టీ పటేల్లు, క్షత్రియ, ఆదివాసీ, దళిత, మైనార్టీ ప్రజలు ఎక్కువగా ఓట్లు వేసి గెలిపించారు. మధ్య గుజరాత్, దక్షిణ గుజరాత్‌లలో ప్రధానంగా బీజేపీకే ఎక్కువ సీట్లు వచ్చాయి. అహ్మదాబాద్, సూరత్, వడోదరా, రాజ్‌కోట్, జాంనగర్, జోనాగడ్, భావనగర్, గాంధీనగర్ ఈ ఎనిమిది మున్సిపల్ కార్పోరేషన్‌లు బీజేపీకి ఇప్పటికీ బలమైన కేంద్రాలుగానే ఉన్నాయి.

2007, 2012, 2014 ఎన్నికలలో ప్రభుత్వం సాధించిన విజయాలను బీజేపీ ప్రచారాస్త్రాలుగా వినియోగించుకుంది. కానీ నేడు అది కేంద్రంలో అనుసరించిన విధానాలు ప్రజా వ్యతిరేకమైనవి. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న దళారీ నిరంకుశ పెట్టుబడిదారుల అభివృద్ధి విధానాల వలన సాధారణ ప్రజలకు ఒనగూరుతున్న ప్రయోజనం ఏమీ లేదు. మత దురహంకారాన్ని, జాతి ఉన్మాదాన్ని, కుల వివక్షతను ప్రేరేపిస్తూ పీడిత సెక్షన్ల నుండి దూరమయింది. బ్రాహ్మణ భావజాలాన్ని ఆధిపత్యంలో ఉంచేందుకు అధికారాన్ని, హత్యా రాజకీయాలను బీజేపీ కేంద్ర ప్రభుత్వం వినియోగించుకుంటుందని దేశవ్యాప్తంగా వ్యతిరేకత చోటు చేసుకుని ఉంది. ఈ నేపథ్యంలో గుజరాత్ ఎన్నికల్లో ఇచ్చే తీర్పు భవిష్యత్తులో 2019 ఎన్నికలపై అంచనాను ఇస్తాయని అందరూ ఎదురు చూశారు. అందురూ ఊహించినట్లే బీజేపీ పతనం గుజరాత్‌లోనే మొదలైంది.

గుజరాత్‌లో గత ఎన్నికలతో పోల్చి చూస్తే ఇప్పుడు కొన్ని తేడాలు కనబడుతున్నాయి.

మొత్తం అసెంబ్లీ స్థానాలు 182. అందులో ఎస్టీ కి-27, ఎస్సీకి-13 ఉన్నాయి. గత సంవత్సరం పోలింగ్‌శాతం 71.3 శాతం ఉండగా ఈ సారి 68.4 శాతానికి తగ్గింది. అందులో బీజేపీకి-49.1 శాతం ఓట్లు రాగా, కాంగ్రెస్‌కు-41.4 శాతం ఓట్లు వచ్చాయి. నోటాకు-1.8 శాతం ఓట్లు రావడం విశేషం. ఈ మాత్రం కూడా మిగిలిన పార్టీలకు రాలేదు అంటే కాంగ్రెస్ తర్వాత నోటాకే అధికంగా ప్రజలు ఓట్లేసారు. గ్రామీణ ప్రాంతాల్లోని 98 నియోజకవర్గాల్లో బీజేపీకి 40 మాత్రమే వచ్చాయి. కాంగ్రెస్ కు 55 సీట్లు వచ్చాయి. పాటీదారులున్న 52 నియోజకవర్గాల్లో బీజేపీకి-28, కాంగ్రెస్-24 వచ్చాయి. 27 ఎస్టీ సీట్లలో బీజేపీకి-9 సీట్లు (గతంలో 19), కాంగ్రెస్‌కు-18 (గతంలో 8) సీట్లు వచ్చాయి. 13 ఎస్సీ సీట్లలో బీజేపీకి- 7 (గతంలో 12), కాంగ్రెస్‌కు- 6 (గతంలో ఒక్కటే) వచ్చాయి. ఈ ఎన్నికల్లో గ్రామీణ ప్రాంతాల ఓట్లు, సెక్షనల్ ప్రజల ఓట్లు కాంగ్రెస్‌కు పెరిగినట్లు అర్థమవుతుంది.

గుజరాత్‌లో ముస్లిం ప్రజల్లో ఈ ఎన్నికల పట్ల ఆసక్తి క్రమంగా తగ్గింది. 2011 జనాభా లెక్కల ప్రకారం 9.67 శాతం ముస్లింలు ఉన్నారు. తాజా ఎన్నికల్లో కూడా బీజేపీ ముస్లింలకు సీట్లే కేటాయించ లేదు. కాంగ్రెస్ ఆరుగురికి సీట్లు కేటాయించగా ముగ్గురు గెలిచారు. వీరికి 1.6 శాతం ఓట్లు మాత్రమే లభించాయి.

అంతకు ముందు నుంచీ దళితుల్లో రగులుతున్న అసంతృప్తి ఏడాది కింద ఊనా ఘటనతో జిఘ్నేష్ మేవాని నాయకత్వంలో ఆందోళనా స్థాయికి చేరింది. 2002 మారణకాండ నుండి భయం భయంగా బతుకుతున్న ముస్లిం ప్రజానీకం మారుతున్న పరిస్థితుల్లో బీజేపీని ఓడించడం సాధ్యమే అని నమ్ముతున్న స్థితిలో రాహుల్‌గాంధీ జంధ్యం ప్రదర్శన, గుడులు-గోపురాలు సందర్శించడం ముస్లింలకు వేరే సంకేతాలు ఇచ్చాయి. రాష్ట్రంలోని ప్రధాన సామాజిక వర్గాలన్నీ బీజేపీని ఓడించే దిశగా కదిలినా కాంగ్రెస్ విశ్వసనీయ ప్రత్యామ్నాయంగా వారికి కనబడలేదు. 15 ఏళ్లుగా రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో కరువు పరిస్థితి నెలకొని ఉంది. పత్తి ధర 7 వేల రూ॥ల నుండి 3 వేల రూ॥లకు పడిపోయింది. రైతులకు రుణభారం భరించలేని స్థాయికి చేరుకున్నది. వ్యవసాయ కూలీలకు పనులు దొరకలేదు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సరిగా అమలు జరగలేదు. భారీ పరిశ్రమలకు రాయితీలు ఇచ్చిన ప్రభుత్వం చిన్న, మధ్య తరహా గ్రామీణ పరిశ్రమలను నిర్లక్ష్యం చేయడంతో అవి మూతబడ్డాయి. నిరుద్యోగ యువతకు ప్రభుత్వ ఉద్యోగాలే కాక ప్రైవేటు ఉపాధి కూడా కనుమరుగైంది.

ఈ ఎన్నికల్లో బీజేపీ అభివృద్ధి డొల్ల అని తేలిపోయింది. మోడీ వెలుగు జిలుగులు మసకబారాయి. 2019 ఎన్నికలకు ఇప్పటి నుండి ప్రత్యామ్నాయాలు వెతుక్కోవలసిన దుస్థితి దాపురించిందని బీజేపీ వెనుకనున్న హిందుత్వ శక్తులకు గుజరాత్ ఎన్నికలు

*(మిగతా 22వ పేజీలో......)*

## 70 ఏళ్ళ స్వాతంత్రం

# 'స్వతంత్ర,' 'ప్రజాతంత్ర' భారతదేశ రాజ్యాంగంలో రాసుకున్న హక్కులు ప్రజల స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, సమానత్వం కానరాకుండా పోయాయి

ఒక దేశం స్వతంత్రం సంపాదించుకుని, రిపబ్లిక్‌గా ప్రకటించుకుని, రాజ్యాంగాన్ని రూపొందించుకుని, పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని అనుసరిస్తూ, ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంగా ప్రచారం చేసుకుంటూ ఉన్న భారతదేశంలో ప్రజల ప్రాథమిక హక్కులు, స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, సమానత్వం ఇప్పటికీ కానరాని విషయాలుగానే ఉన్నాయి. ప్రతి సంవత్సరం ఆగస్టు 15 స్వతంత్ర వేడుకలు, జనవరి 26 రిపబ్లిక్‌డే పండుగలు క్రమం తప్పకుండా నిర్వహిస్తూ ప్రజల మౌలిక సమస్యలను, కనీస అవసరాలను పరిష్కరించకుండానే ఏడు దశాబ్దాలు గడిచిపోయాయి. పరిపాలకులు కాంగ్రెసుకు చెందిన మూడు తరాలు నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ పాలన సాగించారు. ఇప్పుడు రాహుల్‌గాంధీని దేశ ప్రధానిని చేసేందుకు పథకాలు రచిస్తున్నారు. ఒకే పార్టీ, ఒకే కుటుంబం పరిపాలనను స్వాతంత్ర భారతావనికి, భారత రిపబ్లిక్‌కు కాంగ్రెస్ ఆదర్శ ప్రాయంగా నిలపాలని చూస్తున్నది. బీజేపీ ఇతర సంకీర్ణ కూటములు కలిపి కూడా అనేక సంవత్సరాల పాటు పరిపాలించిన చరిత్ర ఉంది. ఒకటి, రెండు సందర్భాలలో తప్ప అగ్రవర్ణాలు, ఆధిపత్య మతం (హిందూ) ఈ దేశాన్ని పాలించాయి.

70 ఏళ్ళ క్రిందట భారతదేశం బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి ప్రత్యక్ష వలసగా ఉంది. భారతదేశానికి స్వతంత్ర్యం ప్రకటించాక అధికార మార్పిడి జరగడంతో ప్రత్యక్ష వలస పరోక్ష వలసగా మారింది. బ్రిటన్, అమెరికా, రష్యాల తర్వాత ఇక ఇప్పుడు అనేక సామ్రాజ్యవాద దేశాలకు పరోక్ష వలసగా కొనసాగుతుంది. సామ్రాజ్యవాదుల నయా వలస తరహా దోపిడీకి భారతదేశం తలుపులు బార్లా తెరిచి దేశాన్ని కొల్లగొట్టేందుకు ఆహ్వానిస్తుంది. భారతదేశ స్వాతంత్ర్యాన్ని, సార్వభౌమాధికారాన్ని, సామ్రాజ్యవాదుల కార్పొరేటు శక్తులకు తాకట్టు పెడుతుంది. 70 ఏళ్ళ పరాధీనత కారణంగా భారతదేశంలో సంపదలు విదేశాలకు తరలిపోయాయి. ఇక్కడ ప్రజల హక్కులు కాలరాయబడ్డాయి.

ఈ నేపథ్యంలో భారతదేశంలో స్వతంత్రము, సార్వభౌమాధికారముల ఉనికి ప్రశ్నార్థకం అయ్యింది. ప్రజల మౌలిక సమస్యలు పరిష్కారం ప్రశ్నార్థకం అయింది. దేశంలో స్వేచ్ఛ, స్వతంత్ర్యం, ప్రజాస్వామ్యం ఎవరికి అందుబాటులో ఉన్నాయి?

భారతదేశంలో స్వతంత్రాన్ని, దాని ప్రగతిని వివరంగా తెలుసుకోవడానికి ప్రజల జీవన ప్రమాణాలను, సామాజిక, రాజకీయ, ఆర్థిక అంశాలను, రాజ్యం తాలూకు పరిపాలనా విధానాన్ని, వర్గాల పొందికను, అందులో జరుగుతున్న మార్పులను, అలాగే ముఖ్యంగా సామాజిక చలనంలో ఉత్పత్తి శక్తుల అభివృద్ధి క్రమాన్ని అంచనా వేసుకోవడం, అర్థం చేసుకోవడం అవసరం. 1947 నాటికి పేదరికం అధికంగానే ఉంది. రెండు, మూడు శతాబ్దాలు పరాయి పాలనలో ఉన్న భారతదేశం అంతకంటే గొప్పగా ఉంటుందని ఆశించలేం. 70 ఏళ్ళ 'స్వతంత్రం' తర్వాత పేదరికం మరింత పెరిగింది. ఆదాయన్ని బట్టి, ఖర్చును బట్టి, వినియోగించే ఆహార పదార్థాల క్యాలరీలను బట్టి, కొనుగోలు శక్తిని బట్టి పేదరికం లెక్కలు అంచనాలు ఉంటాయి. ఈ 70 ఏళ్ళలో ప్రభుత్వాలు ఎన్నో పేదరిక నిర్మూలనా కార్యక్రమాలు చేపట్టాయి. లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేసాయి. ఈ ప్రభుత్వాలకు పేదరికాన్ని నిర్మూలించడం సాధ్యం కాలేదు. ఇప్పటికీ అందుబాటులో ఉన్న లెక్కల ప్రకారం కనీసం భారత ప్రజానీకంలో సగం (50, 60 శాతం) పేదరికంలోనే ఉన్నారన్నది పచ్చి నిజం. 'స్వతంత్ర భారత ప్రభుత్వానికి' పేదరికాన్ని నిర్మూలించడం కన్నా ఆ పేరుతో వచ్చే నిధులను రాజకీయ నాయకులు, పెత్తందారులు, మధ్య దళారులు, కాంట్రాక్టర్లు తిని లాభపడ్డమే ముఖ్యమైనది.

అర్హత ఉన్నవారందరికి పని కల్పించాలన్నది ఒక ఆదర్శంగానే మిగిలిపోయింది. దేశంలో అత్యధిక జనాభా గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం మీద ఆధారపడుతున్నప్పటికీ సంవత్సరంలో మూడు నెలలు కూడా పని కల్పించలేని పరిస్థితి ఉంది. జాతీయాదాయంలో వ్యవసాయం వాటా 17 శాతానికి తగ్గిపోయింది. దానితో పాటు వ్యవసాయం గిట్టుబాటుకాక లక్షల సంఖ్యలో ఆత్మహత్యలు పెరిగాయి. ఇప్పటికీ దేశంలో శ్రామిక జనాభా 25శాతం దాటలేదు. జాతీయాదాయంలో దానివాటా కూడా 25శాతం దగ్గరే తచ్చాడుతుంది. ఉత్పత్తి రంగం అభివృద్ధి కాని పరిస్థితుల్లో నిరుద్యోగం పెనుభూతమై పేదరికానికి తోడు ఆకలిని, ఆకలి చావులని రికార్డు చేస్తున్నది. ఈ మధ్య కాలంలో సేవారంగం 50శాతం మించిన జాతీయాదాయపు వాటా చూపిస్తున్నప్పటికీ సేవారంగం పని కల్పిస్తున్నది మాత్రం నాలుగోవంతుకు మించడంలేదు. ఈ లెక్కల్లోంచి చూసినా ఆదాయాల వ్యత్యాసాలు, పని కల్పించలేని పరిస్థితులు దశాబ్దాల తరువాత కూడా పరిష్కారం కాని సమస్యగానే మిగిలిపోయాయి.

విద్యారంగంలో అక్షరాస్యత 4,5 రెట్లు పెరిగినట్లుగా లెక్కలు చెబుతున్నప్పటికి నిజంగా అది 25శాతం కూడా అక్షర జ్ఞానాన్ని అందించలేదనేది వాస్తవం. విద్యారంగంపై ప్రభుత్వ కేటాయింపులు తగ్గి, ఖరీదైన చదువును కొనలేని కుటుంబాల ఆర్థిక పరిస్థితి కారణంగా కోట్లాది మంది ప్రాథమిక విద్యతోనే సరిబెట్టుకుంటున్నారు. 13 కోట్ల మంది ప్రాథమిక పాఠశాలకు చేరితే వరుస డ్రాపౌట్లు కారణంగా ఉన్నత పాఠశాలకు ఆరున్నర

కోట్ల మంది, ఇంటర్మీడియట్‌కు 3 కోట్ల 80 లక్షల మంది, డిగ్రీ స్థాయికి 2 కోట్ల 70 లక్షల మంది, పోస్టు గ్రాడ్యుకేషన్‌కు 40 లక్షల మంది అంటే 3శాతం మంది. 70 ఏళ్ళ స్వతంత్రంలో విద్యాభివృద్ధి ఏ పరిస్థితుల్లో ఉందో అర్థమవుతుంది.

ఆరోగ్యం విషయం చూస్తే జీవిత కాలం రెండింతలయ్యింది. 32 సం॥ల నుండి 68 సం॥లకు పెరిగింది. అయితే శిశు మరణాల సంఖ్య ప్రపంచంలో అనేక దేశాలకన్నా ఎక్కువగా నమోదవుతుంది. పోషకాహార లోపం సంఖ్య భారతదేశంలోనే ఎక్కువ. ఆరోగ్యం కోసం ప్రభుత్వం చేసే ఖర్చు ఒక శాతం కన్నా తక్కువ. ప్రపంచ దేశాల్లో అంత తక్కువ ఖర్చుపెట్టే దేశాలు తక్కువ. భారతదేశంలో ఆదివాసుల, దళితుల, స్త్రీల, పిల్లల ఆరోగ్య ప్రమాణాలు అత్యంత దారుణంగా ఉన్నాయి. ఈ నాటికి కనీస వైద్య సౌకర్యాలు అందని గ్రామాలు, అటవీ ప్రాంతాలు, కొండ ప్రాంతాలు ఎన్నో ఉన్నాయి. ప్రపంచంలోనే అత్యాధునిక, అత్యంత ప్రామాణిక ఆరోగ్య సౌకర్యాలున్న నగరాలు, సాంకేతిక నిపుణులు భారతదేశంలో ఉన్నప్పటికీ 70 ఏళ్ళ స్వాతంత్ర దేశంలో జనాభాలోని 80శాతానికి కనీస వైద్య, ఆరోగ్య సౌకర్యాలు కల్పించలేని పరిస్థితే కొనసాగుతుంది.

భారత సమాజంలో అసమానతలు స్వాతంత్ర్యానంతరం కూడా కొనసాగడమే కాకుండా మరింతగా పెరుగుతున్నాయి. దారుణమైన కులవ్యవస్థ రూపంలో అస్పృశ్యత, వివక్ష కొనసాగుతూనే ఉన్నాయి. బ్రిటీష్ సామ్రాజ్యవాదం అభివృద్ధి నిరోధక భూస్వామ్యంతో మిలాఖతయ్యి ఇక్కడి అసమానతలని కొనసాగనిచ్చింది, పెంచిపోషించిది. వాటిని కూడా తన పాలనా ప్రయోజనాలకు వాడుకుంది. రాజ్యాంగ ప్రవేశికలోను, హోదాలోను, అవకాశంలోను సమానత్వం సాధించడము మన లక్ష్యంగా రాసుకున్నాము. అస్పృశ్యతను రద్దు చేస్తామని, అసమానతలకు తావులేని విధంగా ఆర్థిక అవకాశాల కల్పన జరుగుతుందని ఆదేశిక సూత్రాలలో రాసుకున్నాము. రాజ్యాంగం అమలులోకి వచ్చి 60 ఏళ్ళు గడిచినా కుల అసమానత, స్త్రీ, పురుష అసమానత, మతాల మధ్య అసమానత, భాషల మధ్య అసమానత, ప్రాంతాల మధ్య అసమానత, ఆర్థిక అసమానతలు మరింతగా దారుణమైన స్థితికి దిగజారాయి. నేటి భారత పాలక వర్గాలు రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక విధానాలన్నీ అసమానతలు పెంచడానికే తోడ్పడ్డాయి. వివక్ష, హింసాత్మక ఘర్షణలు నేడు రోజువారీ ఘటనలుగా కొనసాగుతున్నాయి.

భారతదేశంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యమనే పేరుతో బూర్జువా, భూస్వామ్య నియంతృత్వం పాలన ఏడు దశాబ్దాలుగా కొనసాగుతుంది. ప్రజలకు ప్రజాస్వామ్యం ఎన్నడూ అందుబాటులోకి రాలేదు. రాజ్యాంగ ప్రవేశికలో భారత గణతంత్ర రాజ్యానికి 'ప్రజాస్వామ్యం' విశేషణంగా చెప్పబడింది. ప్రజాస్వామ్యం ముసుగులో నియంతృత్వాన్ని కొనసాగిస్తున్న చోట ప్రజాస్వామ్యం అమలు అసాధ్యమని 70 ఏళ్ళ చరిత్ర స్పష్ట పరుస్తుంది. రాజ్యాంగంలో రాసుకున్న 'సర్వసత్తాక, ప్రజాస్వామిక, గణతంత్రం' అన్నదానిని 1976లో 42వ సవరణ ద్వారా విస్తరించి 'సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామిక, గణతంత్రం'గా మార్చారు.

బహు మతాల సమ్మేళనమైన భారత సమాజం పాలనలో మత రహిత లౌకికత్వాన్ని పాటించకపోతే ఎంత ప్రమాదకర, విస్ఫోటకర పరిణామాలు సంభవిస్తాయో, అవి ఎంత హింసాత్మకంగా ఊచకోతలకు దారితీస్తాయో డెబ్బై ఏళ్ళ భారత చరిత్ర అడుగడుగునా చూపుతున్నది. సరిగ్గా బ్రిటిష్ పాలనలో హిందూ ముస్లిం వైరాన్ని రెచ్చగొట్టి, విభజించి పాలించాలని వలసవాద పాలకవర్గాలు భావించాయో, ఈ ఏడు దశాబ్దాలలో కూడ అదే చరిత్ర మరింత విషాదకరంగా పునరావృతమవుతున్నది.

భారతదేశం అనేక విభిన్న జాతుల సమాఖ్య. ఆయా ప్రాంతాలను, జాతులను బల ప్రయోగంతో విలీనం చేసుకున్నప్పుడు భారత పాలకవర్గాలు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి, సమైక్య పాలన పక్కన పెట్టి కేంద్రీకృత నిరంకుశ పాలన సాగిస్తున్నారు. నాగా, మిజో పోరాటాల నుండి మొదలై ఇప్పటి దాకా కొనసాగుతున్న కాశ్మీరు, ఈశాన్య జాతుల పోరాటాల్లో అక్కడి ప్రజల ఆకాంక్షలు, స్వయం నిర్ణయాధికార తపన వ్యక్తమవుతున్నాయి. కొత్త రాష్ట్రాలు కావాలని కోరడం, రాష్ట్రాల ఆర్థిక వనరులు పెంచాలని కోరడం, కేంద్ర, రాష్ట్ర సంబంధాలలో అసమానతల మీద అసంతృప్తి పెరగడం చూస్తే ఆగస్టు15, 1947 తర్వాత ఆయా జాతులకు ఏ ప్రయోజనం చేకూరలేదని స్పష్టమవుతుంది. విశాల అఖిల భారత మార్కెట్ బ్రిటీష్ వలసలో లాగానే అర్ధవలస లో కూడా సామ్రాజ్యవాదులకు, వారి దళారీలకు , విభిన్న జాతుల, రాష్ట్రాల్లోని ప్రాంతీయ దళారీలకు గతం కన్నా ఎక్కువగా ప్రయోజనం చేకూర్చే విధంగా మారింది.

భారతదేశంలో ఉన్న సహజ వనరులు మరేదేశం మీద ఆధారపడకుండా మనుగడ సాగించ గలిగిన స్థాయిలో ఉన్నాయి. స్వతంత్ర్య, స్వావలంబన విధానాలు అనుసరించగలిగిన సుసంపన్నమైన భారతదేశం మనది. కాని పాత పాలక వర్గాలే కొత్త ముసుగుతో అధికారాన్ని చేపట్టాయి కనుక మన విదేశీ సంబంధాలు వలసానంతరం కూడా నయా వలస తరహాలో వారి ఆర్థిక రాజకీయ ప్రయోజనాలు నెరవేర్చుకోవడానికి తోడ్పడ్డాయి. బ్రిటీష్ కామన్‌వెల్త్‌లో చేరడం, ప్రపంచ బ్యాంకు నుండి రుణాలు తీసుకోవడం, నెహ్రూ, ఇందిరాగాంధీ కాలంలో సోవియట్ యూనియన్ వైపు ఆ తర్వాత అమెరికా వైపు మొగ్గి, సామ్రాజ్యవాదులకు దళారీగా దేశ ప్రయోజనాలను తాకట్టు పెట్టి బేర సారా లాడడం జరిగింది. 1990వ దశకంలో ప్రపంచీకరణలో భాగం కావడంతో భారతదేశం సామ్రాజ్యవాద దేశాలకూ,

బహుళజాతి సంస్థలకూ సంపదలను దోచుకునేందుకు అనువైన దేశంగా మారింది. మన విదేశీ సంబంధాలు సామ్రాజ్యవాద అనుకూల పరాధీన సంబంధాలే తప్ప మరేమీ కాదు.

1947లో మన ఆర్థిక వ్యవస్థ 2.7 లక్షల కోట్ల రూపాయలుగా ఉంది. ప్రస్తుత తాజా గణాంకాల ప్రకారం 57 లక్షల కోట్ల రూపాయలు అని అంచనా. విదేశీ మారక ద్రవ్య నిల్వలు 300 కోట్ల డాలర్ల నుండి 3 లక్షల కోట్ల డాలర్లకు పెరిగాయి. ఈ పెరుగుదలతో పాటు ఆయుధాల కొనుగోలు, ఎగుమతి-దిగుమతులు, ఆహారోత్పత్తి, రహదారుల నిడివి , రైలుమార్గాల పొడవు, పరిశ్రమలు, మౌలిక సౌకర్యాలు, విద్యా సంస్థలు, వైద్యశాలలు, పాలనా సౌకర్యాలు అంకెల్లో పెరుగుదలను చూపిస్తున్నాయి. సామాజిక జీవన పెరుగుదల కొన్ని వర్గాలకు మాత్రమే పరిమితమైందని నిర్దిష్టపు సమాచారం స్పష్ట పరుస్తుంది. సంపద, సౌకర్యాలు రెండూ నూటికి పది శాతంగా ఉన్న పై వర్గాలకు మాత్రమే అందుబాటులోకి వచ్చి 90 శాతానికి దారిద్ర్యాన్ని పంచిన అసమానతలు మరింతగా బహిర్గతమవుతున్నాయి.

ఈ 70 ఏళ్ళల్లో రైతాంగం, కార్మికులు, స్త్రీలు, దళితులు, ఆదివాసీలు, మైనార్టీలు, మధ్య తరగతి వంటి విభిన్న, అసంఖ్యాక ప్రజా సమూహాల జీవన స్థితిగతులలో వచ్చిన మార్పులు చూస్తే వలస పాలనా కాలం కంటే మార్పు పెద్దగా లేదని అర్థమవుతుంది. మధ్య తరగతి జనాభా పెరిగి పట్టణ జనాభా పెరగడం, వినియోగ వస్తు, సేవల మార్కెటు విస్తరించడం, ఆ మేరకు ప్రచార, ప్రసార సాధనాలకు ప్రాధాన్యత పెరగడం చూసి దేశమంతా అభివృద్ధి అయిందని అనుకోలేం. 130 కోట్ల జనాభాలో మధ్య తరగతి 20 కోట్లు మాత్రమే. మిగిలిన 100 కోట్ల పైగా ప్రజల జీవన పరిస్థితులు రోజు రోజుకు మరింత దుర్భరంగా మారి ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని, పాలకవర్గాల వివక్షా పూరిత పాలనా విధానాన్ని కళ్ళకు కట్టినట్లు చూపిస్తున్నాయి.

నంవన్నులైన భూస్వాములు, పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు, రాజకీయ నాయకులు, ఉన్నతోద్యోగులు అనుభవిస్తున్న రాజభోగాలు, విలాస జీవితాలకు కావలసిన సంపదంతా ఈ పాలకవర్గ దోపిడీ, అవినీతి విధానాలే సమకూర్చుతున్నాయి. ఒక కోటి మంది మాత్రమే దేశ సంపదనంతా అక్రమంగా కొల్లగొట్టి అనుభవిస్తున్నారు. బ్రిటీష్ పాలనలో ఉన్న శ్రమ ఒకడిది, విలాసం ఒకడిది అన్న పరిస్థితే కొనసాగుతుంది. సామాజిక జీవనంలో గుణాత్మకమైన మార్పులేమీ రాలేదని స్పష్టమవుతుంది.

ఈ 70 సం॥రాలలో ఉత్పత్తి సాధనాల అభివృద్ధిలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడంలో మార్పు, ప్రగతి వున్నప్పటికీ, ఉత్పత్తి సాధనాల అభివృద్ధి జరిగినప్పటికీ, సమాజ స్థితి, మనుషుల పరిస్థితి మారలేదు. అంటే ఉత్పత్తి శక్తుల అభివృద్ధిలో కీలకమైన మానవ శ్రమకు, శ్రామికులకు ఆ అభివృద్ధిలో చోటులేదు. పాత ఉత్పత్తి సంబంధాలు, సామాజిక సంబంధాలు కొనసాగడమే దానికి నిదర్శనం. కాబట్టి సమాజంలో ఉపరితలాంశంలో కూడా సమూలమైన, గుణాత్మకమైన మార్పులు జరగలేదు. కులము, మతము, ఆచారాలు, సంస్కృతి, దైవ భావన, మానవ సంబంధాలు, సాహిత్యం, కళలు, సినిమా, క్రీడలు అన్ని రంగాలలో కాలం చెల్లిన అభివృద్ధి నిరోధక విధానాలే అమలు జరుగుతున్నాయి.

ఇంతటి దయనీయ దుస్థితిని దౌర్భాగ్య వివక్షా పూరితమైన సామాజిక స్వరూపాన్ని చూస్తూ ఇది స్వతంత్ర్య దేశమని, ప్రజాస్వామిక దేశమని, సర్వసత్తాక దేశమని, లౌకిక దేశమని అనగలమా? 90 శాతంగా ఉన్న వివిధ సెక్షన్ల ప్రజలు కార్మికవర్గ నాయకత్వంలో ఉద్యమాలు చేపట్టి ఈ సమాజాన్ని సమూలంగా మార్చటమే పరిష్కారం. ప్రజల మౌలిక సమస్యల పరిష్కారం లక్ష్యంగా సమాజంలో పునాది, ఉపరితలాల్లో గుణాత్మక మార్పులు తెచ్చేందుకు వ్యవసాయక విప్లవం ఇరుసుగా దేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవం చేపట్టాలి. ఆ నాడే స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, సమానత్వం పీడిత ప్రజలందరికీ అందుబాటులోకి వస్తాయి. అందుకు నూతన ప్రజాస్వామిక విప్లవమే మార్గము.

○

---

*(..........19వ పేజీ తరువాయి)*

హెచ్చరిస్తున్నాయి.

ప్రజల్లో మత విద్వేషాలను, కుహన దేశభక్తిని రెచ్చగొట్టడం, పాకిస్థాన్, చైనాలపై విద్వేషాలు, దేశంలో ప్రజల్లో చీలికలు తెచ్చి హిందూ మత ఓట్లను సంపాదించుకొనే తమ వ్యూహాలకు మరింత పదును పెట్టక తప్పనిసరి పరిస్థితి రేపు 2019 ఎన్నికల్లో రాబోతుంది.

కేంద్రంలో అధికారానికి రావడానికి 'గుజరాత్ అభివృద్ధి' మోడల్‌ను ప్రచారం చేసిన మోడీ అసలు రంగు బయటపడింది. 'సబ్‌కా సాత్-సబ్‌కా వికాస్' నినాదం ఇంకా చెల్లదు. గుజరాత్ లాంటి అసంతృప్తి భారతదేశమంతటా ప్రజల్లో ఆవహించి ఉంది. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు, అక్కడ ఏ పార్టీలు అధికారంలో ఉన్నప్పటికీ ప్రజల అసంతృప్తులను ఎదుర్కొంటున్నాయి. ప్రస్తుత స్థితిలో ఏ బూర్జువా పార్టీ కూడా ప్రత్యామ్నాయం కాలేదు. అయితే ఈ స్థితిని వినియోగించుకోవడానికి, దేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని పురోగమింపచేయడానికి విప్లవ, ప్రజాస్వామిక శక్తుల, లౌకిక శక్తులను ఐక్యత చేయడం ద్వారానూ, పటిష్టం చేయడం ద్వారానూ ముందుకు సాగుతుంది.

పార్లమెంటరీ ఎన్నికల బూటకత్వాన్ని ప్రజలు అర్థం చేసుకుంటున్నారు. అన్ని రకాల దోపిడీ వర్గ పాలక పార్టీల అసలు రంగు బహిరంగమైపోయింది. ప్రత్యామ్నాయ మార్గాన్వేషణలో ఉన్న మెజారిటీ ప్రజలు నూతన ప్రజాస్వామిక విప్లవ మార్గాన్ని ఎంచుకుంటారు.

○

## దళారీ నిరంకుశ పెట్టుబడిదారుల ప్రయోజనాలను నెరవేర్చిన నోట్లు రద్దు, జీఎస్‌టీ పీడిత ప్రజల దరిద్ర్యాన్ని, బాధల్ని భరించలేనంత పెంచింది

ప్రపంచీకరణ ఆర్థిక విధానాలను ఒక వైపు అత్యంత వేగంగా అమలు చేస్తూ మరోవైపు వాటికి అంటే అవినీతి, నల్ల ధనానికి వ్యతిరేకంగా పోరాడుతానని చెప్పడం విడ్డూరంగా ఉంది. కార్పోరేట్లకు పెద్ద ఎత్తున రాయితీలు కల్పిస్తున్న బీజేపీ ప్రభుత్వం వారి రుణాలను పెద్ద ఎత్తున మాఫీ చేస్తున్నది. విదేశాల్లో దాగి ఉన్న అక్రమ సంపదను భారత్‌కు తెస్తాననీ, అవినీతి పాలన అంతమొందిస్తాననీ అధికారంలోకి వచ్చిన మోడీ ఆ హామీని నెరవేర్చలేదు.

2016 నవంబరు 8న మోడీ 500రూ॥, 1000 రూ॥ నోట్లు రద్దుచేసి అవినీతి వ్యతిరేక పోరాటం అని ప్రజలను నమ్మించడానికి ప్రయత్నించాడు. 1. నల్ల ధనాన్ని పారదోలడం. 2. నకిలీ కరెన్సీ నోట్లను ఏరివేయడము, 3. ఉగ్రవాదులకు, వామపక్ష తీవ్రవాదులకు నిధులు అందజేస్తున్న మూలాలను పెకలించడం. 4. అసంఘటిత ఆర్థిక వ్యవస్థను సంఘటితంగా మార్చి పన్ను చెల్లింపుదార్ల సంఖ్యను వుద్యోగాల విస్తృతిని పెంచడం. 5. నగదు రహిత ఆర్థిక వ్యవస్థగా మార్చే ప్రక్రియలో భాగంగా డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించడం-అనే ఐదు ప్రధాన లక్ష్యాలను నోట్ల రద్దు సందర్భంగా ప్రకటించారు. సుప్రీంకోర్టుకి చెప్పినదానిలో కూడా 3-4 లక్షల కోట్ల రూపాయల మూలధనం బ్యాంకింగ్ వ్యవస్థలోకి రాకుండా వెలుపలే ఉండిపోయి రద్దయిపోతుందని ఆర్థిక రంగంలో అద్భుతాలు సృష్టిస్తామని నమ్మ బలికింది. రద్దయిన నోట్లలో 99శాతం బ్యాంకింగ్‌లోకి తిరిగి వచ్చాయి. అంటే ప్రభుత్వ అంచనా తప్పని నల్లధనం నగదు రూపంలోనే ఉండదని స్పష్టంగా తేలిపోయింది. ఆ విధంగా నోట్లరద్దు వృధా ప్రయాసని, దండగమారి వ్యవహారమని, ప్రగల్భాలు, ప్రచార ఆర్భాటాలు తప్ప మరేమీ లేదని అర్థమవుతుంది. నల్లడబ్బు తెల్లడబ్బుగా మార్చుకోవడానికి వెసులు బాటు కలిగిందే తప్ప బడా బాబులకు జరిగిన నష్టం ఏమీలేదు. దీని వలన ఆర్‌బిఐకి కొత్త నోట్లు ముద్రించడానికి 8 వేల కోట్ల రూ॥ల అదనపు భారం పడింది. ప్రజల పరంగా చూసినపుడు లక్షల మంది ప్రజలు పనులు మానుకుని క్యూలలో నిలబడి లక్షల కోట్ల పని గంటలు నోట్ల మార్పిడి కోసం వెచ్చించి నష్టపోయారు. విలువైన ఉత్పాదక సమయాన్ని కోల్పోవడంతో మొత్తం ఆర్థిక రంగం కుదేలయ్యింది. నగదుపై ఆధారపడే వేలాది మంది చిరు వ్యాపారులు జీవనోపాధిని కోల్పోయారు. రోజువారీ కూలీల కష్టాలు వర్ణనాతీతం. వివిధ స్లాబుల ద్వార విధించిన వస్తువులపై అమ్మకం రేట్లు ప్రజలకు పెను ఆర్థిక భారంగా మారాయి.

నోట్ల రద్దు నిర్ణయం తదనంతర పరిణామాలపై ఆర్థిక నిపుణులు ఆందోళనను, అసంతృప్తిని వ్యక్తపరిచారు. దేశ ఆర్థిక వ్యవస్థలోని 86శాతం కరెన్సీని రద్దుచేయడం తీవ్ర పరిణామాలకు గురిచేసింది. దేశ ఎగుమతులు తగ్గి దిగుమతులు పెరగడంతో వాణిజ్య లోటు పెరిగింది. 2016లో వాణిజ్య లోటు 23 బిలియన్ డాలర్లు ఉండగా అది 2017కు 41 బిలియన్ డాలర్లుగా ఉంది. ఒక్కసారిగా భారత జీడీపీ వృద్ధి రేటు 2.3శాతం తగ్గిపోవడం అత్యంత ఆందోళన కలిగించింది. జీడీపీ వృద్ధి రేటును ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు 7శాతంగా కుదిస్తే, ఐఎమ్ఎఫ్, భారత రిజర్వుబ్యాంకు 6.7శాతంగా కుదించాయి. 7శాతంకు మించదని వారి అంచనాలే చెపుతున్నాయి. జీడీపీని గతంలో లెక్కించిన పద్ధతిని 2015లో సవరించారు. ఆ ప్రకారం నేడున్న 5.7శాతం వృద్ధిరేటును సరైన అంచనా అసలు వాస్తవాలలోంచి (ఉత్పాదకత దృష్ట్యా చూసినపుడు) అంటే కనీసంగా 2015 ముందు చూసిన విధంగా చూసినట్లయితే నికర వృద్ధి రేటు 3.7శాతం మాత్రమే.

భారతీయ ఆర్థిక వ్యవస్థ నెమ్మదించింది. మన పరిశ్రమల రుణ సామర్థ్యం తగ్గడం. గత సంవత్సరాలతో పోలిస్తే జీడీపీ వృద్ధి రేటు తరగడం. భారత ఆర్థిక వ్యవస్థలోని ఈ క్షీణత వలన నష్టాల్లో ఉన్న భారతీయ కంపెనీలను కొనేందుకు విదేశీ పెట్టుబడులు వస్తున్నాయి. 2015లో ఇక్కడ ఉన్న కంపెనీల కోసం వచ్చిన విదేశీ పెట్టుబడులు కేవలము 25శాతం మాత్రమే. ఇది 2016 కు 45శాతంకి పెరిగింది. విదేశీ పెట్టుబడులలో నేడు కనిపిస్తున్న అభివృద్ధి, అంతా సమస్యల్లో ఉన్న భారతీయ కంపెనీలను విదేశీ పెట్టుబడిదార్లు కొనడం వల్ల పెరిగిందే తప్ప మరొకటి కాదు. అమెరికా, కెనడా, రష్యా, చైనా లకు చెందిన కంపెనీలు ఈ దేశంలోని సమస్యల్లో ఉన్న కంపెనీలను కొనడం చేశాయి. మన దేశంలో పెరుగుతున్న విదేశీ పెట్టుబడులు కొత్త పరిశ్రమలను స్థాపించడం కోసం కాదు. ప్రస్తుతం దేశంలో ఇటువంటి 'శవపేటికల' వ్యాపారం ఊపందుకుంది.

నోట్ల రద్దు, జీఎస్‌టీ వల్ల దేశ ఆర్థిక పరిస్థితి అనిశ్చితికి నెట్టబడింది. ధరలు ఆకాశాన్ని అంటడం, నిరుద్యోగం పెరగడంతో. సామాన్య ప్రజల జీవనం దినదిన గండంగా మారింది. భారత్ అభివృద్ధి పథంలో వేగంగా దూసుకుపోతుందని గణాంకాలు చెపుతున్నప్పటికి వాటి ఫలాలు మాత్రం సమాజంలోని అన్ని వర్గాల వారికి సమానంగా అందడం లేదు. అధికాదాయ సంపన్నులు, బడా కుబేరుల బొక్కసాలలోకే దేశంలోని అత్యధిక సంపద చేరిపోతుంది. ప్రపంచీకరణ విధానాలు మొదలై నేటికి 3 దశాబ్దాలు పూర్తి కాకుండానే సంపన్న వర్గాల (జనాభాలో 1శాతం) సంపద 13 రెట్లు పెరిగింది. దేశ సంపదలో 22శాతం వీరి చేతుల్లోనే వుంది. ఆర్థిక అంతరాలు పెరిగి బడుగు ప్రజల బ్రతుకులు ఛిద్రమై ఈ సంపన్న వర్గాల అభివృద్ధి మాత్రం శరవేగంతో సాగిపోతుంది. నరేంద్ర మోడీ ప్రవేశ పెట్టిన పథకాలన్నీ విఫలం కావడంతో ఆర్థిక వ్యవస్థ మాంద్యం స్థితిలోకి ప్రవేశించే ప్రమాదంలో ఉంది. దేశంలో పారిశ్రామిక ఉత్పత్తి కుదేలయ్యింది. వ్యవసాయం సంక్షోభంలో

పడింది. సర్వీస్ రంగం మందగించింది. ప్రైవేటు పెట్టుబడి కనుమరుగైంది. ఎగుమతులు చతికిల బడ్డాయి. జీడీపి వృద్ధి రేటు కనీస స్థాయికి పడిపోయింది.

అక్రమ సంపదను చట్టబద్ధం చేసుకోవడానికి, పరిశ్రమల్ని ఖాయిలా చూపి లక్షల కోట్ల రూపాయలు దిగమింగిన కార్పొరేట్ కంపెనీల మొండి బకాయిలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయడం వలన దివాళా తీసిన బ్యాంకులకు రక్షణ కల్పించడానికి, ప్రజల సొమ్ముతో బ్యాంకుల ఖజాన నింపి తిరిగి కార్పొరేటులకు రుణాలివ్వడానికి నోట్ల రద్దు ఉపయోగపడింది. బడా పెట్టుబడిదారులు బ్యాంకుల నుంచి తీసుకున్న లక్షల కోట్ల రూ॥ రుణాలను తిరిగి రాబట్టేందుకు చర్యలు తీసుకోకుండా వాటిని రద్దు చేసింది. ఈ ఏడాది కూడా అంబానీ, ఆదానీల కంపెనీలకు చెందిన పాత బాకీలు 81 వేల కోట్ల రూపాయలు రద్దు చేస్తున్నది. అంబానీల కుటుంబం ఆసియాలోనే అత్యంత సంపన్న కుటుంబంగా ఫోర్బ్స్ పత్రిక ఈ ఏడాది జాబితాలో ప్రకటించింది. సామ్‌సంగ్ కంపెనీకి చెందిన లీ కుటుంబాన్ని 2వ స్థానానికి నెట్టి మొదటి స్థానానికి చేరిన అంబానీ కుటుంబ సంపద 4వేల 480 కోట్ల డాలర్లు ఇటువంటి కార్పొరేట్ తిమింగళాలను కాపాడడానికి, వాళ్ళ ఆస్తులు పెరగడానికి మోడీ ప్రభుత్వం భారత ప్రజలను ముంచి, నిరంకుశంగా అణచివేసి వారికి సేవ చేస్తుంది. బ్యాంకులలో నిరర్ధక ఆస్తులు (మొండి బకాయిలు) ప్రతి సంవత్సరము లక్షల కోట్లకు పెరగడం వాటిని ప్రభుత్వాలు రద్దు చేయడం పరిపాటయ్యింది. 9వేల కోట్ల రూ॥లు బ్యాంకులకు ఎగనామం పెట్టి బ్రిటన్‌కు పారిపోయిన లిక్కర్‌కింగ్ విజయమాల్యా వీరితో పోలిస్తే చిన్న చేపే అని అర్థమవుతుంది.

జీఎస్‌టీ కారణంగా నెలకు 17 వందల కోట్ల రూ॥లు, ఏడాదికి 13 వేల కోట్ల రూ॥ నష్టం వచ్చిందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి నివేదించుకుంది. జీఎస్‌టీ పేరుతో చేస్తున్న మోసాలు, నమోదవుతున్న కేసులు వేల సంఖ్య దాటి లక్షల్లోకి పెరిగాయి. జీఎస్‌టీ దెబ్బకు రెవెన్యూ లోటు అనేక రెట్లు పెరిగిపోవడం రాష్ట్ర ప్రభుత్వాల సమస్యయితే, ధరలు విపరీతంగా పెరిగి ప్రతీ సరుకుకు రెండింతలు ఖర్చు చేయవలసిన పరిస్థితి కోట్ల ప్రజలకు దాపురించిన సమస్య. అసమగ్రంగా, హడావిడిగా, ముందస్తు జాగ్రత్తలు లేకుండా చేసిన నోట్ల రద్దు, తెచ్చిన జీఎస్‌టీ దేశంలోని అన్ని రంగాలను సంక్షోభంలోకి నెట్టింది. జీఎస్‌టీ చిన్న వ్యాపారులకు పీడకలగా మారింది. వారిని భయకంపితులను చేసింది. ఒక్క సూరత్‌లోనే (గుజరాత్) 60 వేల మర మగ్గాలు మూతబడ్డాయి. 21 వేల మంది ఉద్యోగాలు కోల్పోయారు. ఇది ఒక్క గుజరాత్‌కు మాత్రమే పరిమితం కాదు. జాతీయ స్థాయిలో ఇదే విధంగా దెబ్బకొట్టింది. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేకపోవడంతో వాటిని రహదారులపై పారబోసి వెడుతున్న దయనీయ స్థితి. అదే రైతాంగం మార్కెటుకు వెళ్ళితే అధిక ధరల భారం. అమ్మితే గిట్టుబాటు కాక, కొనడానికి శక్తి చాలక సతమతమవుతున్న రైతాంగం. వ్యవసాయరంగాన్ని నిర్లక్ష్యం చేయడమంటే మొత్తం గ్రామీణ వ్యవస్థను, దేశంలో అత్యధిక శాతం జనాభాను, దేశ ఆర్థిక వ్యవస్థను, ఒక్కమాటలో ఈ దేశ భవిష్యత్తును నిర్లక్ష్యం చేయడమే. మోడీ పథకాలు, ప్రయోగాలు అన్నీ ముందు చూపు లేనివి. ప్రజలకు నష్టం చేసేవి.

మోడీ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి తోడ్పడిన కార్పొరేట్‌లు తమ ప్రయోజనాలకు అనుకూలంగా ప్రభుత్వ విధానాలను ప్రత్యక్షంగా ప్రభావితం చేస్తున్నారు. ప్రభుత్వానికి చెందిన అన్ని కమిటీలలోను, కార్పొరేటులకు చెందిన ప్రతినిధులు ఉండడం సాధారణంగా మారింది. అనేక రంగాల్లో ప్రైవేటీకరణ అనివార్యం చేయబడుతున్నది. ప్రభుత్వము ప్రజారోగ్య రంగం నుండి కూడా నిష్క్రమించాలని నీతి ఆయోగ్ ప్రభుత్వానికి సలహాయిస్తుంది. ప్రభుత్వరంగ సంస్థలలో పెట్టుబడుల ఉపసంహరణ కారణంగా వుద్యోగాలు కోల్పోతున్నారు. పెద్దనోట్ల రద్దు కారణంగా చిన్న, మధ్యతరహా వాణిజ్య వేత్తలు పరిశ్రమలను మూసి వేయడంతో 1 కోటి 50 లక్షల మంది నిరుద్యోగులుగా మారిపోయారు. "ఒక దేశం ఒక పన్ను" అనే బోగస్ నినాదంతో జీఎస్‌టీ అమలు కారణంగా మరికొన్ని లక్షల మంది నిరుద్యోగులుగా మారిపోయారు. పట్టణ ప్రాంతాల్లో పనులు జరగక బతుకు భారమైన అసంఘటిత కార్మికులు గత్యంతరం లేక గ్రామీణ ప్రాంతాలకు తిరిగి వలస వెళ్తున్నారు. నిరుద్యోగం విలయ తాండవం చేస్తుంది. నిరుద్యోగ సంక్షోభం ఒక్క యువత సమస్య మాత్రమే కాదు. పెద్ద నోట్ల రద్దు, జీఎస్‌టీ విధింపు వంటి వినాశకర చర్యల వల్ల ఉపాధులు కోల్పోతున్న వారి సమస్య కూడా. కార్మికులు, చిన్న పరిశ్రమల యజమానులు కార్పొరేట్ల దాడి, పోటీ కారణంగా నిరుద్యోగ సైన్యంలో చేరిపోతున్నారు.

అంతర్జాతీయంగా ఒక బ్యారల్ క్రూడాయిల్ 2014లో 115 డాలర్లు. ఇపుడది 68 డాలర్లకు తగ్గిపోయింది. కానీ దేశీయ పెట్రోల్ ఉత్పత్తుల ధరలు తగ్గడం లేదు. పెట్రోల్‌పై 133శాతం, డీజిల్‌పై 400శాతం ఎక్సైజ్ డ్యూటీ పెంచడం కారణంగా దేశములో పెట్రోలు, డీజిల్ ధరలు తగ్గడం లేదు.

మోడీ ప్రకటించిన ఐదు లక్ష్యాల్లో ఏ ఒక్కటి నెరవేరలేదు. నెరవేరడం మోడీ ఉద్దేశ్యం కాదు. మోడీ మనస్సులో మాట మనకి చెప్పనిది వాళ్ళకు సంతోషం కలిగించింది వేరే ఉంది. అది కార్పొరేట్లను, వారి సంపదను, వారి పరిశ్రమలను, బ్యాంకులను, వారితో వీరికున్న అనుబంధాన్ని సుసంపన్నం చేయడం. అదివారి నెరవేరిన లక్ష్యం. ప్రజలని, ముఖ్యంగా క్రింది మద్య తరగతిని, పీడిత ప్రజలను చిదగ్గొట్టి సంపన్నులను మరింత సంపన్నులను చేసి, అసమానతలను మరింత పెంచి, దోపిడీ వ్యవస్థను స్థిరీకరించి, చిరకాలం వర్ధిల్లే వారి కలలను పండించుకుని అధికార దర్పంతో, అహంకారంతో విర్రవీగుతున్నారు. వారికి ఘోరీ కట్టక తప్పదు.

○

# కొరియా ద్వీపకల్పంలో సామ్రాజ్యవాద కుట్రలను ఓడిద్దాం ఉత్తర కొరియా ప్రజలకు బాసటగా నిలబడదాం

ప్రస్తుతం ఉత్తర కొరియా ద్వీపకల్పంలో యుద్ధ మేఘాలు కమ్ముకొస్తున్నాయి. అమెరికా రెచ్చగొట్టే విధానాలు ప్రపంచ దేశాలను కలవరపరుస్తున్నాయి. సెప్టెంబర్ 19న ఐక్యరాజ్యసమితిలో అమెరికా అధ్యక్షుడుగా తొలిసారిగా చేసిన ప్రసంగంలో ఉత్తర కొరియాను సర్వనాశనం చేసే సత్తా తనకుందని, నాశనం చేసే ఆలోచ కూడా ఉందని డోనాల్డ్ ట్రంప్ గర్జించాడు. ఉత్తర కొరియా తన అణ్వాయుధాల కార్యక్రమాన్ని ఖండాంతర క్షిపణి ప్రయోగాల్ని ఆపకపోతే అంతు చూస్తానని బెదిరించాడు. ప్రపంచాన్ని పలుమార్లు నాశనం చేయగలిగినన్ని అణుబాంబులు దాచుకున్న అమెరికా అణు కార్యక్రమాల్లోకి దిగుతున్న ఇరాన్, ఉత్తర కొరియా దేశాలను అదిరించి బెదిరిస్తున్నది. ఆర్థిక ఆంక్షలు విధిస్తుంది. మరో పక్క దక్షిణ కొరియా, జపాన్‌లతో కలిసి 50 వేల మందికి పైగా సైనికులతో అమెరికా 10 రోజుల పాటు భూ, సాగర, గగనతలాలలో నిర్వహించిన సైనిక విన్యాసాలు, దక్షిణ కొరియాలో ఏర్పాటు చేసిన అధునాతన క్షిపణి వ్యవస్థ (థాడ్), ఉత్తర కొరియా గగనతలంలో బి-1బి, ఎఫ్-13బి, ఎఫ్-15 కె వంటి అమెరికన్ యుద్ధ విమానాల చొరబాటు వంటి చర్యలతో యుద్ధ వాతావరణాన్ని సృష్టిస్తున్నది. ట్రంప్ అధికారంలోకి రాగానే యుద్ధోన్మాదంతో ఉత్తర కొరియాపై "ఫైర్ అండ్ ఫ్యూరీ" (సర్వనాశనం) విధానం ప్రకటించాడు. అదే కార్యక్రమంతో కొనసాగుతున్నాడు.

అమెరికా సామ్రాజ్యవాద అగ్రరాజ్యం కనుసన్నలలోనే ప్రపంచంలోని ప్రతి దేశము మెలగాలని, అమెరికా కార్పొరేటు సంస్థలు దోచుకోవడానికి అనుమతించాలని శాసిస్తుంది. అలా చేయని దేశాన్ని దుష్ట రాజ్యంగా, ఆ దేశ నేతను నియంతగా చిత్రీకరించడం అమెరికాకు వెన్నతో పెట్టిన విద్య. గత రెండు దశాబ్దాలుగా నిరాయుధులయిన వారి దగ్గర కూడా ఆయుధాలున్నాయని (ఇరాక్, లిబియా) ప్రపంచాన్ని నమ్మించి తనకు నచ్చని పాలకులను చంపేసిన చరిత్ర అమెరికాది. ప్రజాస్వామ్య పరిరక్షణ పేరుతో ఆయా దేశాల అంతర్గత విషయాల్లో జోక్యం చేసుకోవడం, అంతర్యుద్ధాలను ప్రేరేపించడం, ఆ దేశాల నేతలను కుట్రపూరితంగా హత్యలు చేయించడం అమెరికా అనుసరిస్తున్న ప్రపంచాధిపత్య వ్యూహంలో భాగమే. అమెరికా పరిపాలన రిపబ్లికన్‌లు, డెమోక్రాట్‌లు ఎవరి చేతికి వెళ్లినా ఆ దేశ విదేశీ విధానంలో మార్పు ఉండదు. తన మాట వినని దేశాన్ని శత్రు దేశంగా చూడడం, ఆధిపత్య పోరులో లక్షలాది అమాయకులను హత్యగావించడం దానికి మాములు విషయం.

ఉత్తర కొరియాకు అమెరికా నుండి దాపురించిన కష్టాలు ఈ నాటివి కావు. గత 70 ఏళ్ళుగా ఉత్తర కొరియా వాసులు ఈ సామ్రాజ్యవాద యుద్ధోన్మాదులతో సతమతమవుతున్నారు. రెండో ప్రపంచ యుద్ధం ముగిసిన సమయంలో జపాన్ వలసగా ఉన్న కొరియా దేశ ప్రజలు అప్పటికి 35 సంవత్సరాలుగా జాతీయ విముక్తి యుద్ధాలు చేస్తూ ఉన్నారు. ఆనాడు కొరియా ప్రజలకు స్వాతంత్ర్యానికి బదులుగా జాతి విభజన జరిగింది. ఈ కృత్రిమ విభజన కారణంగా 1945లో రెండు కొరియా దేశాలు ఏర్పడ్డాయి. 1. ఉత్తర కొరియాగా పిలువబడుతున్న "ప్రజాస్వామ్య కొరియా ప్రజా రిపబ్లిక్". 2. దక్షిణ కొరియాగా పిలువబడుతున్న "రిపబ్లిక్ ఆఫ్ కొరియా". ఈ విభజన అంతిమంగా 1950-53 కొరియా యుద్ధానికి దారితీయడమేగాక ఎడతెరపిలేని పరోక్ష యుద్ధానికి (కోల్డ్ వార్‌కు) తెరలేపింది. ఈ పరోక్ష యుద్ధ కాష్ఠం దశాబ్దాలుగా మండుతూనే ఉంది.

గత చరిత్రలో అమెరికా కొరియాలో సృష్టించిన బీభత్సాన్ని చూస్తే–

*"గత సంవత్సరకాలంలోనే 20 మిలియన్ జనాభా గల కొరియాను మనం ధ్వంసం చేశాము. ఇంతటి విచ్ఛిన్నాన్ని నేను ఎప్పుడు చూడలేదు. నేను చూసినంతగా మానవ రక్త ప్రవాహాలను, వినాశనాన్ని బహుశా ఇంతవరకు బతికున్న ఏ వ్యక్తి చూసి ఉండకపోవచ్చు. అయినప్పటికీ కొరియాలో జరిగిన విధ్వంసం నా కడుపు దేవేసింది. ఆ మానవ శవాల, స్త్రీల, పిల్లల మృతదేహాల గుట్టలు చూసి నేను వాంతి చేసుకున్నాను. మనం ఇలాగే కొనసాగితే, మరింత మానవ హననం చూడవలసి ఉంటుంది."* – డగ్లస్ మెకార్థర్, సైనిక జనరల్. (1951 మేలో అమెరికా కాంగ్రెస్ ముందు చదివి వినిపించిన నివేదిక నుండి)

మరో సైనికాధికారి కర్టిస్ లీమే ఇలా రాశాడు. *"ఉత్తర, దక్షిణ కొరియాల్లో అన్ని నగరాలను, పట్టణాలను మేం తగలబెట్టేశాం, ఒక 10 లక్షల వరకు జనాభాను చంపేశాము, అంతకుఅంతగా జనాభాను ఊళ్ల నుండి తరిమేశాము."*

అంతటి బీభత్సం, విచ్ఛిన్నత నుండి రెండు కొరియా దేశాలు రెండు భిన్నమైన రాజకీయ, ఆర్థిక విధానాలను అనుసరించి తమ తమ దేశాల పునర్ నిర్మాణాలను చేపట్టాయి. దక్షిణ కొరియా పర తంత్రంతో అమెరికాకు, జపాన్‌కు నయా వలసగా మారింది. సామ్రాజ్యవాదుల రాజకీయాలకు, పెట్టుబడులకు, సైనిక స్థావరాలకు కార్యక్షేత్రంగా మారింది. అయితే ఉత్తర కొరియా మాత్రం అమెరికా, జపాన్‌లకు తలొగ్గక కిమ్‌ఇల్‌సుంగ్ నాయకత్వంలో ఒక స్వతంత్ర దేశంగా నిలిచి పోరాట శైలిని కొనసాగిస్తున్నది.

అమెరికా విధిస్తున్న ఆర్థిక ఆంక్షలను తట్టుకొని తన ఉనికిని కాపాడుకుంటూ స్వతంత్రతను కోల్పోకుండా తమ ప్రజలను కాపాడుకోవడానికి తమ సొంత సైనిక పాటవాలను పెంచుకుంటూ ఎప్పుడైనా ఏ క్షణమైనా సామ్రాజ్యవాద దాడులను ఎదుర్కొనే సంసిద్ధత కలిగిన సుశిక్షిత సైన్యాన్ని, ప్రజా మిలీషియాను, స్థానిక ప్రజా మద్దతును పెంపొందించుకుంటూ ఉత్తర కొరియా సరిహద్దుల్లో ఉన్న దేశాలతో మంచి సంబంధాలను కొనసాగిస్తున్నది. ఈ మాత్రం పటుత్వం, సైనిక శక్తి, యుద్ధ వ్యూహం లేకుంటే ఎప్పుడో ఉత్తర కొరియా నామరూపాలు లేకుండా పోయేదే. ఇరాక్, లిబియా, సిరియా పరిణామాలు ప్రపంచ దేశాలకు, పీడిత ప్రజలకు ఎప్పటికీ ఒక హెచ్చరికగానే ఉంటాయి. అదే ఉత్తర కొరియా ప్రజలను అప్రమత్తం చేస్తున్నది.

క్రీస్తు పూర్వం 5వేల సంవత్సరాలకు ముందు ఈ భూభాగంలోకి కొరియా జాతికి చెందిన ప్రజలు వచ్చి స్థిరపడినట్లు చరిత్ర ఆధారాలు చెబుతున్నాయి. ఇంత సుదీర్ఘ చరిత్ర ఉన్న కొరియా, సామ్రాజ్యవాదుల దుష్ట పన్నాగాల్లో భాగంగా రెండు కొరియాలుగా విభజింపబడింది. ఒకే జాతి రెండు దేశాలు. ఇది ప్రజల మధ్య వచ్చిన విభేదాల సమస్య కాదనేది జగద్విదితమే. ఉత్తర కొరియా 1,20,538 చ.కి.మీ. విస్తీర్ణంలో ఉంది. 2,43,79,089 మంది జనాభా (2008 లెక్కల ప్రకారం). అక్కడ స్కూల్ విద్య ఉచితం. 99శాతం అక్షరాస్యులు ఉన్నారు. దేశమంతటా ఉచిత వైద్యం అందుబాటులో ఉంది. ఉత్తర కొరియాలో ఖనిజ సంపదలు అత్యధికంగా ఉన్నాయి. మాంగ్నాస్టైన్ (ఫైర్ రెసిస్టెన్స్) ప్రపంచంలోనే అత్యధికంగా ఇక్కడే లభ్యమవుతుంది. 6 బిలియన్ టన్నులు ఉన్నదని అంచనా. సీసం, జింక్ 12 బిలియన్ టన్నుల చొప్పునా, బొగ్గు 10 మిలియన్ టన్నులు, ఇనుము 3 మిలియన్ టన్నులు, టంగస్టన్ 2- 1/2 మిలియన్ టన్నులు (దీన్ని జెట్ ఇంజన్లకు, మిస్సైల్స్ తయారీకి ఉపయోగిస్తారు) రాగి, బంగారము, గ్రాఫైట్స్ ఖనిజాలతో పాటు యూరోనియం నిక్షేపాలు కూడా అధికంగానే ఉన్నాయి. అమెరికా, జపాన్‌లు బంగారు నిక్షేపాల నుండి ఎంత కొల్లగొట్టుకున్నారో అంతులేదు. 2003 నుండి చైనాకు ఆ ప్రాంతంపై అదుపు కొనసాగుతున్నది. ఉత్తర కొరియా సముద్రతీరంలో (yellow sea bed) 12 బిలియన్ బ్యారల్స్ పెట్రోల్ ఉన్నట్లు కనుగొన్నారు. ఈ సంపదలను కొల్లగొట్టడం సామ్రాజ్యవాదుల అసలు లక్ష్యం.

ఉత్తర కొరియా తన దేశ రక్షణలో భాగంగా 2005 ఫిబ్రవరిలో న్యూక్లియర్ ఆయుధాలను తయారు చేస్తున్నట్లు ప్రకటించింది. 2006 అక్టోబర్‌లో భూగర్భంలో అణు పరిక్షలు నిర్వహించింది. అది ప్లూటోనియం బాంబు అనీ, అది కిలో టన్ను టీఎన్‌టీ పేలుడు శక్తిని కలిగి ఉందనీ గుర్తించారు. అమెరికా 1945లో నాగసాకి (జపాన్)పై వేసిన అణుబాంబు పేలుడు శక్తి 20 కిలో టన్నుల టీఎన్‌టీ పేలుడు శక్తికి సమానం. అణు పరీక్షలు చేసిన దేశాల జాబితాలో ఉత్తర కొరియా ఎనిమివది. ఈ పరీక్ష అంతర్జాతీయ శాంతికీ, రక్షణకు భంగకరము అని అమెరికా ఒత్తిడి చేయడంతో ఐక్యరాజ్యసమితి ఒక తీర్మానం చేసింది. ఆర్థికంగా, ఆయుధపరంగా సహకారాన్ని బందు పెట్టాలని తీర్మానించడంతో పాటు దక్షిణ కొరియాకు వెళ్ళే ఎగుమతులపై తనిఖీ పెట్టింది. అణు పరీక్షలు ఆపుతానని 2007 ఫిబ్రవరిలో ఉత్తర కొరియా అంగీకరించడంతో అమెరికా 1లక్ష టన్నుల ఆయిల్‌ను, దక్షిణ కొరియా 4లక్షల టన్నుల ఆహార పదార్థాలను సరఫరా చేశాయి.

నిజానికి ఉత్తర కొరియా వద్ద ఉన్న అణుబాంబులు కేవలము వంద లోపు మాత్రమే. ఆ క్షిపణుల సామర్థ్యం కూడా అమెరికా

తీరాన్ని తాకడం కష్టమే. కానీ అమెరికా వద్ద వేల అణుబాంబులు ఉన్నాయి. అందులో 17 వేల బాంబులు ప్రయోగానికి సిద్ధంగా ఉన్నాయి. నేల మీద, నీటిలో సబ్‌మెరైన్‌లపైనా ఉన్న క్షిపణులు, యుద్ధ విమానాల సామర్థ్యంతో పోలిస్తే ఉత్తర కొరియాలో క్షిపణుల, అణుబాంబుల సామర్థ్యం ఏ మూలకు సరిపోదు. అయినా ఉత్తర కొరియాను అణుభూతంగా సామ్రాజ్యవాద మీడియా చిత్రిస్తూనే ఉంది, చూపిస్తూనే ఉన్నది. అనేక కథలల్లి దుర్మార్గమైన ప్రచారాన్ని ప్రపంచమంతా చేస్తూనే ఉంది.

1961లో చైనా, ఉత్తర కొరియా దేశాల మధ్య కుదిరిన సైనిక ఒప్పందం ప్రకారం ఉత్తర కొరియాపై ఏ దేశం దురాక్రమణకు పాల్పడినా చైనా రంగంలోకి వస్తుంది. ఈ విషయం చైనా స్పష్టంగా ప్రకటించింది. మరోవైపు అమెరికా ఉత్తర కొరియాను నాశనం చేయాలనుకుంటే అది ఆశ్రయం ఇస్తున్న జపాన్, దక్షిణ కొరియాలను వదలబోమని ఉత్తర కొరియా హెచ్చరించింది. కేవలము ఒక ఏడాదిలోనే ఉత్తర కొరియా 13 క్షిపణులను పరీక్షించింది. 6 అణుపరీక్షలను నిర్వహించింది. పసిఫిక్‌లో అమెరికా స్థావరాలపై దాడులకు రాకెట్లు సిద్ధంగా ఉన్నాయని కిమ్ 2011లో ప్రకటించాడు. 'అణుబాంబు బటన్ తన టేబుల్ పైనే ఉందని' కిమ్ అంటే, 'ఆ బటన్ పనిచేస్తుందో లేదో గాని నా టేబుల్ మీద బటన్ ఖచ్చితంగా పని చేస్తుందని' ట్రంప్ తిరిగి జవాబిచ్చాడని మీడియా ప్రచారం చేస్తుంది.

2008లో వచ్చిన ఆర్థిక సంక్షోభం నుండి అమెరికా ఆర్థిక వ్యవస్థ కోలుకోలేదు. అది ప్రపంచ వ్యాప్త సంక్షోభంగా మారింది. ప్రపంచంపై అమెరికా ఆధిపత్యం సడలుతుంది. చైనా, రష్యాల నాయకత్వంలోని బ్రిక్స్, షాంఘై సహకార సంస్థలు, ఆసియా–ఐరోపా ఖండాలను కలుపుతూ చైనా నిర్మిస్తున్న 'వన్ బెల్ట్–వన్ రోడ్' ఇవన్నీ అమెరికా సామ్రాజ్యవాద ఆధిపత్యాన్ని సవాల్ చేస్తున్నాయి. మరోవైపు అమెరికాలో కార్మిక సమ్మెలు, వాల్‌స్ట్రీట్ వ్యతిరేక పోరాటాలు, అన్ని జాతుల ప్రజలు యుద్ధ వ్యతిరేక ఐక్య ఆందోళనలు చేపట్టారు. పెద్ద ఎత్తున శాంతి యాత్రలు జరుపుతున్నారు. ఈ పరిస్థితుల్లో ట్రంప్ నాయకత్వంలోని సామ్రాజ్యవాద ఫాసిస్టు శక్తులు దేశంలో నియంతృత్వాన్ని, ప్రపంచంలో యుద్ధాలను ప్రోత్సహించడం ద్వారా ఈ విపత్కర సంక్షోభ స్థితి నుండి బయటపడాలని కోరుకుంటున్నారు.

అమెరికా కబంధ హస్తాల్లో ఉన్న దక్షిణ కొరియా ప్రజలు, ఉత్తర కొరియా ప్రజలకు వ్యతిరేకులు కాదు. అలానే జపాన్ దేశ ప్రజలు యుద్ధాన్ని కోరుకోవడం లేదు. వియత్నాం అనుభవం తరువాత అమెరికా, యూరప్‌ల లోని సాధారణ ప్రజానీకం మరో ప్రపంచ యుద్ధాన్ని ససేమిరా అంటున్నారు. రెండు కొరియా దేశాల్లోని ప్రజలు ఒక్కటవ్వాలనే ఆకాంక్ష వ్యక్తం చేస్తున్నారు. ప్రపంచ శ్రామికులంతా ఒక తాటిపైకి వచ్చి సామ్రాజ్యవాదాన్ని నాశనం చేస్తే తప్ప ప్రపంచ శాంతి నెలకొనదు.

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇటీవల ఆసియాలో పర్యటించినప్పుడు బీజింగ్‌లో ఉండగానే పలు మార్లు కొరియా వ్యవహారంలో చైనా బాధ్యతను ప్రస్తావించి సాధ్యమైనంత వేగంగా పరిస్థితులను చక్కదిద్దాలని విజ్ఞప్తి చేశాడు. చైనా అధ్యక్షుడిని వ్యక్తిగతంగానూ అభ్యర్థించాడు. ఈ సందర్భంగానే చైనా అధ్యక్షుడిని అవసరానికి మించి అతిగా పొగడడం చేశాడు. అమెరికా– చైనా వాణిజ్య లోటుకు కారణం తమ విధానాలే తప్ప చైనా తప్పు కాదని సర్ది చెప్పుకున్నాడు.

కొరియా ద్వీపకల్పంలో ఆవరించి ఉన్న యుద్ధ మేఘాల ప్రభావం అంతర్జాతీయ వ్యాపారంపైనా, అమెరికా ప్రయోజనాలపైనా తీవ్ర ప్రభావం చూపడంతో, ట్రంప్‌పై ఒత్తిడి అధికమైంది. దక్షిణ కొరియా, జపాన్ ప్రజలు, అమెరికా ప్రజలు ట్రంప్ వైఖరిపై అసంతృప్తిగా ఉన్నారు. (అంతర్జాతీయ ఒత్తిడికి లొంగి కొన్ని కీలకమైన ఎగుమతులపై చైనా ఆంక్షలు విధించిన తరువాత ఉత్తర కొరియా వ్యవహరించే తీరుమారింది.) చైనా కమ్యూనిస్టు పార్టీ అంతర్జాతీయ వ్యవహారాల మంత్రి ఆధ్వర్యంలో ఒక ప్రతినిధి బృందం కొరియాకు వెళ్ళింది. ఇది ట్రంప్, జిమ్‌పింగ్‌ల సమావేశం తరువాత జరిగిన నూతన పరిణామం.

ఇటీవల రెండు కొరియా దేశాల మధ్య దక్షిణ కొరియాలో 2017 ఫిబ్రవరిలో జరగబోయే వింటర్ ఒలంపిక్స్‌లో ఉత్తర కొరియా క్రీడాకారుల బృందం పాల్గొనడం గురించి చర్చిస్తున్నారు. కొరియా ద్వీపకల్పంలో ఘర్షణ సద్దుమణిగినా అది తాత్కాలికమే. సామ్రాజ్యవాదం ఉన్నంత వరకు యుద్ధోన్మాదం కొనసాగుతూనే ఉంటుంది. ఉత్తర కొరియా, దక్షిణ కొరియా ప్రజలు ఐక్యమై ప్రపంచ ప్రజలతో కలిసి సామ్రాజ్యవాదాన్ని అంతమొందించడం ద్వారా మాత్రమే శాంతి నెలకొంటుంది. ○

**సామ్రాజ్యవాదం ప్రపంచశాంతికి ప్రమాదకరం**
**యుద్ధాల శాశ్వత పరిష్కారానికి సోషలిస్టు విప్లవమే మార్గం**

# 20 ఏళ్ళ "ప్రజాస్వామిక తెలంగాణ" ఆకాంక్ష

1969 నుండి తెలంగాణ రాష్ట్రం కోసం జరిగిన పోరాటంలో విప్లవోద్యమం ఒక ప్రధాన భూమికను, క్రియాశీల పాత్రను పోషించింది. 1995 తదుపరి తెలంగాణలోని పట్టణ కేంద్రాల్లో, యునివర్శిటీల్లో మరొక్క మారు ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర డిమాండ్ ముందుకు వచ్చింది. ఇది క్రమంగా బలోపేతమవుతూ, ముందుకు సాగింది. ఈ కాలంలో తెలంగాణ విప్లవోద్యమం చాలా బలంగా ఉంది. ప్రజల ఆకాంక్షలను గుర్తించిన విప్లవోద్యమం ఈ ఉద్యమానికి నాయకత్వం వహించడానికి ఒక సమగ్ర కార్యక్రమాన్ని ప్రకటించింది.

1997 డిసెంబర్ 28, 29 తేదీలలో ప్రత్యేక రాష్ట్రం సాధన కోసం పోరాటంలో భాగంగా వరంగల్‌లో ఏ.ఐ.పీ.ఆర్.ఎఫ్. నేతృత్వంలో 2 లక్షల మందితో గొప్ప సభ జరిగింది. అందులో ప్రత్యేక తెలంగాణ– కార్యక్రమాన్ని ప్రకటిస్తూ వరంగల్ డిక్లరేషన్‌ను ప్రకటించుకున్నారు. ఆ డిక్లరేషన్‌లో పేర్కొనబడిన కార్యక్రమం చారిత్రకమైనదనే విషయం ఇప్పుడు మనం గట్టిగా చెప్పవచ్చు. తెలంగాణ రాష్ట్ర సాధనలో మలి దశ ఉద్యమంగా పేర్కొనే ఈ కాలమంతా ఈ కార్యక్రమమే ప్రధాన భూమిక వహించింది. తెలంగాణ రాష్ట్ర సాధనానంతరం కూడా అదే కార్యక్రమం చుట్టూ ప్రజల ఆకాంక్షలు ఉన్నాయి.

తెలంగాణ రాష్ట్ర సాధన అనేది ప్రధానంగా బూర్జువా డిమాండ్. అయితే ఇది జాతుల ఆకాంక్షలో భాగం కాబట్టి కార్మిక వర్గ అగ్రగామి రాజకీయ నిర్మాణం ఈ పోరాటానికి మద్దత్తు ప్రకటించడమే గాకుండా నాయకత్వం వహించడానికి ముందుకు వచ్చింది. ఈ ఉద్యమంలో ప్రారంభం నుండి కార్మికవర్గ పార్టీ నిర్మాణం నాయకత్వం వహించింది. ఈ ఉద్యమంలో విద్యార్థులు, ఉద్యోగస్థులు ముందు పీఠిన నిలబడి పోరాటం కొనసాగించారు.

ఈ ఉద్యమానికి 1956లో, 1969లో తెలంగాణ బూర్జువావర్గం విద్రోహం చేసి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పాలకవర్గాలతో కుమ్మక్కైంది. 1956లో బూర్గుల రామకృష్ణా రావు నాయకత్వంలో ఈ విద్రోహం సాగితే, 1969లో పెల్లుబికిన ఉద్యమాన్ని హైజాక్‌చేసి చెన్నారెడ్డి విద్రోహం తలపెట్టాడు. ప్రత్యేక రాష్ట్రం మలిదశ ఉద్యమంతో విజయం సాధించినప్పటికీ ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదు. ఈ రోజు చంద్రశేఖర్ రావు నాయకత్వంలో బూర్జువా–భూస్వామ్య వర్గాలు 'బంగారు తెలంగాణ' పేరిట సామ్రాజ్యవాదుల, దళారీ నిరంకుశ పెట్టుబడిదారులు–బడా భూస్వామ్య వర్గాల ప్రయోజనాలు నెరవేర్చడానికి అధికారాన్ని కొనసాగిస్తున్నాయి. ఈ మొత్తం 60ఏళ్లలో, ముఖ్యంగా ఈ మలిదశ 20ఏళ్ల కాలంలో తెలంగాణ వర్గ పొందికలో చాల మార్పులు వచ్చాయి. ఒక రకంగా సమాజంలో కొనసాగిన వర్గపోరాటం ఫలితంగా బూర్జువా–భూస్వామ్య, పెటీ బూర్జువా, కార్మికులు, కర్షకుల్లో వర్గ పొందికలో గణనీయమైన మార్పులు వచ్చాయి. సమాజంలో జరుగుతున్న ఈ మార్పులకనుగుణంగానే ఆయా వర్గాల ఆకాంక్షల్లో కూడ మార్పులు జరుగుతూ వచ్చాయి. తత్ఫలితంగా అనేక ఉద్యమాలకు ఈ మార్పులు దోహదం చేశాయి. ఈ నేపథ్యంలోనే మనం ఉద్యమాలను –ప్రజల ఆకాంక్షలను అంచనా వేయాలి. చరిత్ర మన కళ్ళ ముందే కదులుతూ ప్రస్తుతం ఒక దశను అధిగమించింది. చరిత్రను మనం భౌతిక వాస్తవికతపై ఆధారపడి అంచనా వేయాలి.

ప్రజాస్వామిక తెలంగాణ ఉద్యమశక్తులు రెండవ దశ తెలంగాణ ఉద్యమంలో కీలక భూమిక పోషించాయి. అయితే బూర్జువా వర్గం ఉద్యమానికి నాయకత్వం వహించినప్పటికీ, ఇది మలిదశలోనూ, తొలి దశలోనూ దానిది విద్రోహపు చరిత్రే. రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను మలిదశ ఉద్యమం ద్వారా ఉపయోగించుకొని అధికారానికి వచ్చిన ప్రస్తుత బూర్జువా వర్గం బంగారు తెలంగాణ పేరిట బూటకంగా ప్రజలను మోసగించజూస్తున్నది.

తెలంగాణ ఉద్యమంలో ప్రతిఫలించిన ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షలను సొమ్ము చేసుకోవడం, తెలంగాణవాదాన్ని, యాసను, భాషను వాడుకొంటూ తానే తెలంగాణ ప్రజలకు ఏకైక ప్రతినిధిని అంటూ ప్రశ్నించిన వారిని దబాయించడం, అధికారంలోకి వచ్చిన నాటి నుండి పౌర, ప్రజాస్వామిక హక్కులను అణచివేస్తూ ఫాసిస్టు నిర్బంధాన్ని కొనసాగించడం, కుటుంబ పాలనకు ప్రాముఖ్యత నివ్వడం, బ్రాహ్మణీయ సాంస్కృతిక ఆధిపత్య విలువలను ప్రోత్సహించడం వ్యవహారశైలిలో దొరతనాన్ని ప్రదర్శించడం, అంతిమంగా సామ్రాజ్యవాదులకు, భూస్వామ్య వర్గాలకు, దళారీ నిరంకుశ పెట్టుబడిదారులకు, సేవ చేయడం లక్ష్యంగా కేసీఆర్ పాలన కొనసాగుతోంది. ఇది తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న కోట్లాది ప్రజల ఆకాంక్షలకు ఆ ఉద్యమంలో అనేక నిర్బంధాలు అనుభవించిన ప్రజలకు, బలిదానాలు చేసిన వందలాది మంది విద్యార్థులు, యువజనులకు విద్రోహం తలపెట్టడం ద్వార తెలంగాణలో ఏర్పడిన ఈ నూతన పరిస్థితుల్లో కేసీఆర్ పాలనను బూటకమైనదిగా చెప్పాలి.

ఇప్పుడు తెలంగాణ బూర్జువా– భూస్వామ్య పాలకవర్గాలు తెలంగాణ ప్రజల ఆకాంక్షలను అణగదొక్కుతూ ప్రపంచబ్యాంకు ఎజెండాను కొనసాగిస్తున్నాయి. తెలంగాణ రాష్ట్రం సిద్ధిస్తే తమ ఆకాంక్షలు నెరవేరుతాయని ఆశించిన పెటీబూర్జువా, కార్మికులు, కర్షకులకు ఈ మూడున్నర సంవత్సరాల తెలంగాణ రాష్ట్ర సమితి పాలనతో బూర్జువా వర్గాల అసలు స్వభావం అర్థమైంది. ఈ పాలకవర్గాలు తెలంగాణ వాదంతోనే అధికారం చెలాయిస్తూ, సామ్రాజ్యవాదుల, ఆంధ్రప్రాంతపు కాంట్రాక్టర్లు, తెలంగాణలోని భూస్వామ్య, బూర్జువా వర్గాల ప్రయోజనాలు నెరవేర్చుతున్నాయి.

తెలంగాణలో బూర్జువా వర్గం ఇప్పటికీ బలమైన శక్తిగా ఎదగలేదు. అది ఆంధ్ర బూర్జువాజీపై ఆధారపడే స్థితి ఉంది. ఇక్కడ గత 50ఏళ్ళలో ఎదిగిన బూర్జువా వర్గం సంఘటితం కావడం వల్లనే తెలంగాణ రాష్ట్ర ఉద్యమాన్ని లీడ్ చేసిన మాట నిజమే కాని ఆంధ్ర బూర్జువా వర్గం అంతటి బలంగా తయారు కాలేదు. అందుకే నేడు చంద్రశేఖర్ రావు కుటుంబానికి దగ్గరగా ఉన్న భూస్వాములు, పెట్టుబడిదారులు, సంఘటితంగా అధికారంలో ఎక్కువ వాటా కల్గి ఉన్నారు. మలి దశ ఉద్యమంలోనే ఈ కూటమి అభివృద్ధి చెందింది. తెలుగుదేశం పార్టీ నుండి విడిపోయిన చంద్రశేఖర్ రావుకు మద్దత్తు తెలిపిన ఈ వర్గం అధికారానికి వచ్చిన తర్వాత మరింత బలపడింది. తెలుగుదేశంలోనే ఉండిపోయి, రాష్ట్రం కోసం పోరాటం జరిగిన కాలంలో, రాష్ట్రం ఏర్పడిన తర్వాత టిఆర్ఎస్‌లో చేరిన వర్గం అంతా చాలవరకు ఆంధ్ర బూర్జువా వర్గం కనుసన్నలల్లో మెలుగుతున్నదే. అలా తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తెలంగాణ బూర్జువా వర్గం సంఘటితం కావడం పెరిగింది. తెలంగాణలో ప్రధానంగా చంద్రశేఖర్‌రావు కుటుంబ పాలనే నేడు కొనసాగుతున్నది. అయితే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నాటి ఆంధ్ర, తెలంగాణ భూస్వామ్య, బూర్జువా వర్గాల ఆర్థిక ప్రాబల్యం గణనీయంగానే కొనసాగుతున్నది. కాబట్టి ఇప్పటికీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నాటి విధానాలు అమలులో ఉన్నాయి. కాకుంటే తెలంగాణ వాదం పేరిట పేర్లు మార్పు చేసి కొనసాగుతున్నాయి. కె. చంద్రశేఖర్ రావు అమలు చేస్తున్న రకరకాల సంస్కరణలు ప్రపంచబ్యాంకు పాలసీలో భాగంగా అమలవుతున్నాయి.

వరంగల్ డిక్లరేషన్ ప్రకటించిన కాలం నాటికి చంద్రబాబు నాయకత్వంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉంది. తెలుగు ప్రజల ఆత్మగౌరవం నినాదంతో ఎన్టీఆర్ నాయకత్వంలో 1983లో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం పార్టీ తెలంగాణలో కూడ బలమైన స్థానాన్ని సంపాదించింది. తెలంగాణలో 15ఏళ్ళ పాటు తన పాలన కొనసాగించింది. చంద్రబాబు పాలనలో ప్రపంచబ్యాంకు ఆదేశాల మేరకు పరిపాలన కొనసాగడం వలన ప్రజల్లో అసంతృప్తి పెరిగింది. తెలుగుదేశం పరిపాలన కాలంలో ఆంధ్ర ప్రాంతీయ దళారీ బూర్జువా వర్గం బలపడడం పెరిగింది. కాంగ్రెస్ కాలంలో కూడ అది పెరుగుతూనే వచ్చింది. ఈ కాలం నాటికి తెలంగాణ సమాజంలో 70,80,90 దశకాల్లో జరిగిన వర్గ పోరాటం వలన తెలంగాణ బడా భూస్వామ్య వర్గం పట్టణాల్లో తలదాచుకొని, తమ ఆస్థులను పెట్టుబడులుగా మార్చడం ప్రారంభించింది. దీనితో ఆంధ్ర బూర్జువా వర్గంతో క్రమంగా పోటీలో ముందుకు వచ్చింది.

ఈ మలిదశ ఉద్యమంలో పెటీ బూర్జువా వర్గం ముందు వరుసలో ఉంది. ఉద్యమం అనేక ఒడిదుడుకుల్లో ముందుకు సాగుతూ 2009లో విద్యార్థులు, ఉద్యోగులు, లాయర్లతో కూడిన ఉద్యమంతో మరో వెల్లువ ముందుకొచ్చింది. ఈ వెల్లువలో పెటీబూర్జువాలతో పాటు గతంలో లేని విధంగా కార్మిక వర్గం, రైతాంగం చురుకుగా పాలు పంచుకున్నది. ఈ ఉద్యమంలో నిధులు, నియామకాలు, నీళ్ళు అనే డిమాండ్ ప్రధానమైనప్పటికీ ఈ వర్గాల్లో భూమితో పాటు ఇతర మౌలిక సమస్యలు పరిష్కారం కావాలనే ఆకాంక్ష ఇమిడి ఉంది. పెటీ బూర్జువా వర్గంలో 1969లో మిలిటెంట్‌గా ఉద్యమంలో పాల్గొని నాయకత్వం స్థానంలో ఉన్న వాళ్ళు ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీకి అమ్ముడుపోయి పార్లమెంటరీ రాజకీయాల్లో ఉన్నత పదవులు పొందారు. అది గడిచిన చరిత్రకాగా, ఈసారి ఉద్యమంలో రాడికల్ భావాలతో, ప్రజాస్వామిక భావాలతో ఉద్యమంలో పెటీ బూర్జువా సెక్షన్ పాల్గొంది. ఈసెక్షన్‌లో నాయకత్వం ప్రధానంగా 1969 ఉద్యమంలో నేరుగా పాల్గొనడమో, లేదా దానితో ఇన్‌స్పైర్ కావడమో జరిగింది. ఈ ఉద్యమంలో నూతన తరం ఎక్కువగా చేరింది. 1969లో ప్రభుత్వ నిర్బంధంలో పోలీసుల తూటాలకు 370 మంది బలికాగా, ఈ దఫా వేలాది మంది ప్రభుత్వ పాశవిక నిర్బంధానికి గురవడంతో పాటు వందలాది మంది ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఈసారి ఉద్యోగుల సెక్షనులు చాల విస్తృతమైన భాగస్వామ్యం వహించాయి. మిలియన్ మార్చ్, చలో అసెంబ్లీ, సకల జనుల సమ్మెల ద్వారా ప్రజాందోళన పెద్ద ఎత్తున ముందుకొచ్చింది. తెలంగాణ ప్రజలు ఒక్కటై సాగించిన ఈ పోరాటాల వలన 2014 ఫిబ్రవరిలో పార్లమెంటులో బిల్లు పెట్టడం ద్వార తెలంగాణ రాష్ట్రం అవతరించింది.

1997లో వరంగల్ డిక్లరేషన్ విడుదల చేసిన వరంగల్ సభలో పెటీ బూర్జువా సెక్షన్ లోని ప్రధాన నాయకత్వమంతా పాల్గొన్నది. ప్రొ॥ జయశంకర్ మొదలు, నిరంతరం ఉద్యమశీలి అయిన కాళోజి నారాయణ వరకు పాల్గొన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సభలో పాల్గొన్నవారిలో ప్రధానంగా ప్రొ॥ జయశంకర్ లాంటి వాళ్ళు ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన పార్లమెంటరీ ఎన్నికలు, లాబీయింగ్ ద్వారా మాత్రమే సాధ్యం అనే అభిప్రాయం కల్గి ఉన్నారు. ప్రత్యేక తెలంగాణ పార్లమెంట్‌లో చట్టం ద్వారానే అవుతుంది కాని అందుకు పోరాట మార్గమే ప్రధానంగా ఉండాలని ఎక్కువ మంది భావించారు. మొదటి సెక్షన్ 'ప్రజాస్వామిక ప్రత్యేక తెలంగాణ' రాష్ట్ర నినాదం సరియైనది కాదని, 'భౌగోళిక తెలంగాణ' కోసం మాత్రమే పోరాడాలని వీరు ఉద్యమ శక్తులతో విడిపోయి తదుపరి ఏర్పడిన టీఆర్ఎస్ లో ప్రముఖ భూమిక వహించారు. కొదండరామ్ ఉద్యమమని చెప్పినప్పటికీ బూర్జువా ఎన్నికలు, పార్టీల భ్రమల్లోనే ఉన్నాడు. ఆ మేరకు ఉద్యమ శక్తులతో దూరం పాటించే వైఖరి కల్గి ఉంటూనే ఉద్యమం కూడ అవసరమని అభిప్రాయం కల్గి ఉన్నాడు.

ఈ పరిణామాల వలన శక్తులు ఉద్యమంలో క్రమంగా రెండు పాయలుగా విభజింపబడినాయి. మొదటి సెక్షన్ తదుపరి టీఆర్ఎస్ లో చేరి ఎన్నికలు, లాబీయింగ్ మార్గంలో సాగగా, పోరాటమే ప్రధానం అని భావించిన సెక్షన్ చివరి వరకు ఉద్యమాలను చేపట్టి తెలంగాణ సాధనలో ప్రముఖ పాత్ర వహించింది. ఇప్పటికీ టీఆర్ఎస్ నిరంకుశ పాలనను వ్యతిరేకిస్తూ ప్రజాస్వామిక తెలంగాణ కోసం పోరాటం కొనసాగిస్తోంది. 2009 నవంబర్ 29 డిసెంబర్

10 మహోత్తర విద్యార్థి ఉద్యమం తరువాత పార్లమెంటరీ పార్టీలన్ని ఏకమై డిసెంబర్ 23న చేసిన కుట్ర, 2010 జనవరి 5న ఢిల్లీలో శాంతి ఒప్పందం ముసుగులో కేంద్ర ప్రభుత్వంకు, 8 పార్టీలకు మధ్య రహస్య ఒప్పందం జరిగింది. కాంగ్రెస్ పార్టీ ఉద్యమానికి చాంపియన్‌గా చెప్పుకున్నా టీఆర్ఎస్ కలిసి ఉద్యమ శక్తులను చీల్చి తమ దోపిడి వర్గ దళారీల అధిపత్యం చెక్కు చెదరకుండా కాపాడుకునే ప్రయత్నం చేసాయి. ప్రజాస్వామ్య తెలంగాణను బలపరిచిన కొందరు బుద్ధిజీవులు ఇంకా ఎంత కాలం త్యాగాలు, భౌగోళిక తెలంగాణ తర్వాత ప్రజాస్వామిక నిర్మాణం చూసుకోవచ్చని మాట్లాడడం మొదలు పెట్టారు.

ఉద్యమాల ద్వారానే ప్రత్యేక రాష్ట్రం సాధించడం జరుగుతుందని భావించిన నాయకత్వం ఉద్యమ స్వభావాన్ని తెలిపే విధంగా 'ప్రజాస్వామిక తెలంగాణ' ; 'సామాజిక తెలంగాణ' అనే నినాదాల ద్వారా ఉద్యమాలను కొనసాగించారు. పార్లమెంటరీ మార్గంలో వెళ్ళిన వాళ్ళు భౌగోళిక తెలంగాణ నినాదంతో పోరాడారు. 'భౌగోళిక తెలంగాణ' సాధన తర్వాత ప్రస్తుతం బూర్జువా వర్గంతో కలిసి ఈ సెక్షన్ పెటీ బూర్జువా వర్గంలోని ఉన్నత శ్రేణి అధికారంలోకి వచ్చింది. బూర్జువా వర్గంతో పాటు వీరు ప్రజలకు మోసం తలపెట్టారు. కేసీఆర్ పాలనకు ఊతంగా (prop) వీరు పని చేస్తున్నారు. వీరిని బహిర్గతం చేయకుండా ప్రజాస్వామిక తెలంగాణ కార్యక్రమం విజయం కాజాలదు.

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే ప్రజల సమస్యలన్నీ పరిష్కారమవుతాయని టీఆర్ఎస్ పార్టీ, దానిని బలపరిచిన మేధావులు ప్రచారం చేసారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే తమ సమస్యలు పరిష్కారం అవుతాయని భావించిన ప్రజలకు, ఈ మూడున్నరేళ్ళ టీఆర్ఎస్ పాలన చూసిన తర్వాత ఆశలు సన్నగిల్లాయి. ఎన్నో వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన టీఆర్ఎస్ ప్రభుత్వం సామ్రాజ్యవాదుల ఎజెండా, ప్రపంచబ్యాంకు ఆదేశాల మేరకు బూర్జువా, భూస్వామ్య వర్గాల ప్రయోజనాల కొరకు పని చేస్తున్నది. అధికారంలోకి వస్తే 'బంగారు తెలంగాణ' తెస్తామన్న పాలకవర్గం ప్రజలను బజారు పాలు చేస్తున్నది. తెలంగాణలో వనరులపై ప్రజలకు అధికారం, సమగ్ర అభివృద్ధి జరుగుతుందని 3½ కోట్ల తెలంగాణ ప్రజలు ఆశించారు. అందుకు విరుద్ధంగా పాలన జరుగుతున్నది. అభివృద్ధిలో వికేంద్రీకరణ, అన్ని వర్గాలకు, సెక్షన్లకు సమతుల్యమైన అభివృద్ధి, సామాజిక న్యాయం అని భావించిన ప్రజలకు అడియాశ మిగిలింది.

కేంద్రంలో మోడీ ప్రభుత్వంతో పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలతో పాటు తక్కిన రాష్ట్రాల్లో ఇలాంటి ఆకర్షణీయ పథకాలతో కొనసాగించడం, మా ప్రభుత్వాలే అభివృద్ధిని సాధిస్తున్నాయనే ప్రగల్భాలు పలకడం రోజువారి కార్యక్రమంగా ప్రచారం చేసుకుంటున్నాయి. వాస్తవంలో పాలకులు ప్రజలకు అవసరమైన విద్యా, వైద్య రంగాల్లో ప్రభుత్వ ఖర్చులు తగ్గించడం, వ్యవసాయంలో సబ్సిడీల్లో కోత విధించడం చేస్తూనే ఉన్నారు. డిమానిటైజేషన్, జీఎస్టీ వల్ల సాధారణ ప్రజలు, వ్యాపారులు, చిన్న, మధ్య పరిశ్రమలు ఘోరంగా దెబ్బతిన్నాయి. ఈ ప్రజా వ్యతిరేక విధానాలకు మద్దతు పలకడంలో రెండు తెలుగు రాష్ట్రాలు ముందు వరుసలో ఉన్నాయి.

తెలంగాణలో టీఆర్ఎస్ ప్రభుత్వం ఈ విధానాలను నిరంకుశంగా అమలు చేస్తూనే తెలంగాణవాదాన్ని వాడుకోవడానికి నీళ్ళు, నిధుల కోసమే ఈ విధానాలు అనుసరిస్తున్నామని, సాంస్కృతిక రంగంలో బతుకమ్మ, భోనాలు, తెలంగాణ యాస, భాష వాడుకోవడం చేస్తున్నది. ప్రజలు భూములు- నీళు ౢ-నిధులు-ఉద్యోగాలు-హక్కులు-సామాజిక న్యాయం-కనీస హక్కులు కావాలని అడుగుతుంటే మరోవైపు గొర్రెలు, బర్రెలు, చీరలు, సామాజిక వర్గాలకు వివిధ రకాల ఆర్థిక ప్రలోభాలు కలుగజేసే వివిధ ప్రభుత్వ పథకాలు అమల్లో పెడుతున్నది.

రెండు రాష్ట్రాల్లో ప్రజల సహజవనరులైన భూములు, ఇసుక, అడవులను ప్రభుత్వాలు, పెట్టుబడిదారులు విపరీతంగా దోచుకుంటున్నాయి. ఈ దోపిడీ, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాడే ప్రజలపై తీవ్రమైన నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నాయి.

పారిశ్రామికీకరణలో "టి-పాస్" పేరిట హైటెక్ పరిశ్రమలకు, ప్రైవేటు పరిశ్రమలకు పెద్దపీట వేయడం జరిగింది. మూతపడిన పరిశ్రమలు తెరువకుండానే కాగజ్ నగర్ పేపర్‌మిల్లు లాంటివి తరువాత మూతవడ్డాయి. ఆ మిల్లుల భూములు అన్యాక్రాంతమవుతున్నాయి. ఓపెన్‌కాస్టు గనులకు కొత్తగా పర్మిషన్ ఇవ్వడం కొనసాగుతూనే ఉంది. సింగరేణిలో వారసత్వ ఉద్యోగాల సమస్య పరిష్కారం కాని సమస్యగానే మిగిలిపోయింది. పారిశ్రామిక రంగంలో పూర్తిగా ప్రపంచ బ్యాంకు విధానాలనే అనుసరిస్తున్నారు.

ప్రభుత్వ, ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు మూసివేసి, విద్యను ప్రైవేటీకరిస్తున్నారు. ఎస్సీ వర్గీకరణపై సమస్యను పరిష్కరించే విధంగాకాకుండా మాదిగ నాయకత్వాన్ని చీల్చి ఎత్తుగడగా అవలంభిస్తున్నారు. శాంతియుత ప్రజాఉద్యమాల పై నిర్బంధం ప్రయోగింస్తున్నారు. లంబాడీలకు, ఆదివాసీలకు మధ్య వైరుధ్యాన్ని (మధ్య చిచ్చు) పాలక వర్గాలే రగిలించి కుసంస్కరణలతో శాశ్వతంగా పీడిత కులాలను విభజించి పాలించాలని కుట్ర చేస్తున్నాయి.

ఈ మూడున్నర ఏళ్ళలో "బంగారు తెలంగాణ" రాష్ట్రంలో 4 వేల మందికి పైగా రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. ప్రభుత్వం అనుసరిస్తున్న అస్థవ్యస్థ విధానాలు దీనికి కారణం. ప్రస్తుతం 85 శాతం మంది దళితులకు భూమిలేదు. వీరితో పాటు కౌలు రైతుల పరిస్థితి చాలా దుర్భరంగా ఉంది. మధ్య తరగతి రైతాంగంతో సహా వీరంతా మార్కెట్ మాయాజాలానికి, వడ్డీ వ్యాపారుల దోపిడీకి, ప్రభుత్వ నిర్లక్ష్యానికి బలవుతున్నారు.

హరిత హారం పేరిట ప్రభుత్వం ఆదివాసీలపై దుర్మార్గమైన దాడులు చేస్తూన్నారు. దానికి జలగలంచ తాజా ఉదాహరణ. అలాగే

దళితులపై దాడులకు నేరెళ్ల ఘటన పరాకాష్ఠగా చెప్పవచ్చు. తెలంగాణా ఉద్యమంలో క్రియాశీలంగా పాల్గొన్న ముస్లింలకు ఈ ప్రభుత్వం చేసింది ఏమీ లేదు. జ్యూడిషియల్ కస్టడీలో ఉన్న వికారుద్దిన్ లాంటి ముస్లిం యువకులని కాల్చి చంపినా ప్రశ్నించే పరిస్థితి లేకుండా చేశారు. రాష్ట్రంలో మాట, పాట అన్నీ బంద్ చేశారు. హైదరాబాదులో "ధర్నా చౌక్"ను ఎత్తివేశారు. బూటకపు ఎన్‌కౌంటర్లు జరుపుతూ తెలంగాణ బిడ్డలతో పాటు విప్లవకారులు అనేక మందిని హత్యలు చేస్తున్నారు.

ఉద్యమ కాలంలో ఒక ప్రధాన నినాదంగా ముందుకు వచ్చిన వట్టిపోయిన తెలంగాణకు నీళ్ళందించే కార్యక్రమంలో విపరీతమైన అవినీతి, ముడుపులు, కమీషన్లు, బడా కాంట్రాక్టర్లకు, సామ్రాజ్యవాదులకు లాభాలు చేకూర్చే విధానాలు అమలు జరుగుతున్నాయి. ఎక్కడికక్కడ చిన్న స్థాయి డ్యాంల నిర్మాణంపై కేంద్రీకరించకుండా పెద్ద ప్రాజెక్టులకు ప్లానులు చేసారు. రీ డీజైనింగ్ పేరిట ఖర్చును విపరీతంగా పెంచారు. మేడిగడ్డ ప్రాజెక్టు ద్వారా నీళ్ళు ఎగువ ప్రాంతాలకు తరలించే కార్యక్రమంలో సామ్రాజ్యవాదుల నుండి కేసీఆర్ కోటరీకి విపరీతమైన లాభాలు పండుతున్నాయి. పైపులు, శక్తివంతమైన మోటార్లు, విద్యుత్తు కొనుగోలు చేయడంలో దళారీ నిరంకుశ బూర్జువా వర్గానికి, సామ్రాజ్యవాదులకు పెద్దెత్తున లాభాలు దక్కుతున్నాయి.

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సందర్భంగా పాలకవర్గ పార్టీలన్నీ కలిసి పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా తెలంగాణలోని 7 మండలాలను ఆంధ్రప్రదేశ్‌కు అప్పజెప్పడం వలన ఈ భారీ ప్రాజెక్టు నిర్మాణం మూలంగా 2,75,000 (రెండు లక్షల డెబ్బై అయిదువేలు) మంది ఆదివాసులు నిర్వాసితులు కావడం జరిగింది. ఆదివాసుల జీవితాలను చిన్నాభిన్నం చేయడంలో కేసీఆర్ ఆంధ్ర రాష్ట్రం పాలకవర్గాలతో కుమ్మక్కయినాడు.

అధికారానికి రాగానే పోలీసు వ్యవస్థను బలోపేతం చేయడానికి 10 వేల మందిని కొత్తగా చేర్చుకున్నారు. వేల కోట్లు రూ॥ ఖర్చు పెట్టాడు. పది జిల్లాల తెలంగాణను 31 జిల్లాలుగా పెంచాడు. ప్రభుత్వ శాసనాన్ని బందోబస్తుగా చేసి ప్రజలపై కంట్రోల్ తెచ్చుకోవడానికి ఈ విభజనను ఉపయోగించుకుంటున్నాడు. ఒకే రోజు తెలంగాణ అంతా నిర్వహించిన కుటుంబాల సర్వే, ఇప్పుడు సాగిస్తున్న భూసర్వే లాంటి విధానాల ద్వారా బలమైన అడ్మినిస్ట్రేషన్‌ను తయారు చేసుకుంటున్నాడు. ఇవన్నీ పాలకవర్గాలు తమ ఫాసిస్టు పాలన కొనసాగించడానికి అనువైన విధానాలుగా మలచుకుంటున్నాయి. కమాండ్ కంట్రోల్ ద్వారా జన జీవితాన్ని పోలీసు బాసుల చేతిలో పెడుతున్నాడు. ప్రజల స్వేచ్ఛ స్వాతంత్ర్యాన్ని హరించి వేస్తున్నాడు. 50 వేల కోట్ల మిగులుతో తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించగా, ఇటీవల జరిగిన రాష్ట్ర శాసనసభలో రాష్ట్ర అప్పు 1,50,000 కోట్లు అని ముఖ్యమంత్రి ప్రకటించాడు. ఈ భారమంతా నూతన రాష్ట్ర ప్రజలు మోయాల్సిందే.

1998 జనసభ, టీఎస్ఎఫ్, టీకేఎస్ సంస్థలు వరంగల్ డిక్లరేషన్‌లో ఉన్న కార్యక్రమాన్ని ముందుకు తీసుకుపోయినాయి. ఈ సంస్థలు ఈ కార్యక్రమాన్ని తెలంగాణ అంతటా తీసుకెళ్ళి, తెలంగాణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలు నిర్మించాయి. ఇవి రాష్ట్రంలో బలమైన సంస్థలుగా రూపొందుతున్న సమయంలో ప్రభుత్వం ఈ సంస్థల కార్యకర్తలపై హత్యాకాండతో పాటు బీభత్స నిర్బంధకాండ కొనసాగించింది. ఉద్యమాల ద్వారానే తెలంగాణ రాష్ట్రం లభించిందనే విషయాన్ని ఈ రోజు సాధారణ ప్రజలు కూడా అంగీకరిస్తున్నారు. ఉద్యమాల ద్వారానే తెలంగాణ ఏర్పాటు సాధ్యమని ఉద్యమ సంస్థలే ఎల్లప్పుడు చెబుతూ వచ్చాయి. చరిత్ర కూడ ఆ నినాదమే సరియైందని రుజువు చేసింది.

ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమ కారులకు, ప్రజలకు ఏమి దక్కింది- బూర్జువా పాలకవర్గాలకు అధికారాన్ని బంగారు పళ్లెంలో పెట్టి అప్పజెప్పడం తప్ప ప్రజలకు ఒరిగిందేమి లేదని కొంతమంది మేధావులు పదే పదే వ్యాఖ్యానిస్తున్నారు.

ప్రత్యేక తెలంగాణ డిమాండ్‌ను చారిత్రకంగా పరిశీలించాలి. "పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి చెందుతూ వున్న పరిస్థితుల్లో జాతుల సమస్యపై జరిగే పోరాటం బూర్జువావర్గాల మధ్య జరిగే పోరాటమే. కొన్ని సందర్భాల్లో జాతుల ఉద్యమంలోకి కార్మికవర్గాన్ని కూడ బూర్జువావర్గం ఆకర్షించగలుగుతుంది, అలాంటప్పుడు పైకి "జాతి మొత్తం" యొక్క పోరాటంగా అది వ్యక్తమవుతుంది. కాని వాస్తవానికి అది బయటికి కనిపించే లక్షణం మాత్రమే. సారాంశంలో అది ఎప్పుడు బూర్జువా పోరాటమే. ప్రధానంగా బూర్జువాజీ ప్రయోజనాల కొరకు జరిగే పోరాటమే.

"అయితే కొన్ని జాతులు అణగదొక్కబడడానికి వ్యతిరేకంగా కార్మికవర్గం ఏ విధంగానూ పోరాడరాదని దీని అర్థం కాదు".

"ఉద్యమం యొక్క స్వాతంత్ర్యాన్ని అరికట్టడం, వోటింగ్ హక్కును పరిమితం చేయడం, భాషాభివృద్ధినరికట్టడం, పాఠశాలలను మూసి వేయడం, అలాగే ఒక జాతి అభివృద్ధిని అరికట్టే తదితర చర్యలకు పూనుకోవడం ముందుగా బూర్జువా వర్గానికెంత నష్టం వాటిల్లుతుందో దాదాపు కార్మికవర్గం పొందే నష్టంకూడ అంత కంటే తక్కువేమి కాదు. అలాంటి పరిస్థితులు అణగదొక్కబడుతున్న జాతికి చెందిన కార్మికవర్గం యొక్క మేధావి శక్తుల స్వతంత్రాభివృద్ధిని అరికట్టడానికి మాత్రమే ఉపకరిస్తాయి".

-స్టాలిన్

"విభిన్న జాతులకు నిలయంగా ఉన్న ఏ వెనుకబడిన దేశంలోనయినప్పటికీ, భూస్వామ్య విధానానికి, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా జరిగే నూతన ప్రజాస్వామిక విప్లవంలో జాతుల సమస్య విడదీయరాని భాగం"

"వివిధ జాతులు తమ అభివృద్ధికొరకు చేసే పోరాటాలు, భూస్వామ్య, సామ్రాజ్యవాద దోపిడీని దేశవ్యాప్తంగా సమూలంగా

నిర్మూలించడానికి జరిగే పోరాటాలు అవిభాజ్యమైనవి. ఒకే లక్ష్యానికి సంబంధించిన వేరు వేరు అంశాలు. ఒకే ప్రజాతంత్ర విప్లవంలో ఒక దాని అభివృద్ధికి మరొక్కటి తోడ్పడుతూ కొనసాగుతున్న రెండు అంతర్వాహినులుగానే అర్థం చేసుకోవాలి".

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రాజకీయంగా జరిగిన మార్పుని మనం ఈ సైద్ధాంతిక అవగాహనని దృష్టిలో పెట్టుకొని స్పష్టంగా ఈ క్రింది విధంగా అర్థం చేసుకోవడం ద్వారానే తెలంగాణ ఉద్యమాన్ని సరైన దిశలో నడిపించగలుగుతాం.

1. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అధికారానికి వచ్చిన బూర్జువావర్గం, తెలంగాణ ప్రజల సమస్యలకు ఆంధ్ర ప్రాంతం బూర్జువావర్గం కారణం అని ప్రజలను మోసం చేయలేని పరిస్థితిలో తెలంగాణ బూర్జువా, భూస్వామ్య వర్గాలకు వ్యతిరేకంగా తెలంగాణ ప్రజలు సమైక్యంగా పోరాడే స్థితి ఏర్పడడం;

2. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో పాల్గొన్న తెలంగాణ ప్రజల ఆకాంక్షలు, అవి నెరవేర లేని స్థితిలో, వాటి కోసం బలమైన ఉద్యమాలకు ముందుకు వచ్చే స్థితి ఏర్పడడం;

3. ఈ పోరాటాలన్నింటికీ నేరుగా కార్మికవర్గమే నాయకత్వం వహించే స్థితి ఏర్పడడం అనే అనుకూలాంశాల మూలంగా భౌగోళిక తెలంగాణ ఏర్పడినప్పటికీ, ప్రజలు ప్రజాస్వామిక తెలంగాణ సాధనకు ఉద్యుక్తులవడం తప్పనిసరిగా జరుగుతుంది.

ఈ ఉద్యమంలో తాత్కాలికంగా బూర్జువా వర్గానికి లభించిన ప్రయోజనం ఉన్నప్పటికీ, దీర్ఘకాలిక ఉద్యమంలో తెలంగాణ ప్రజలు పొందిన చైతన్యం అంతిమంగా బూర్జువా వర్గం దోపిడీని అంతం చేయడానికి ఉపయోగపడుతుంది. తెలంగాణ వాదాన్ని ఆశ్రయించిన పాలకవర్గాల అసలు గుట్టును ఈ మూడున్నర సంవత్సరాల్లో ప్రజలు అర్థం చేసుకోగలిగారు. ప్రజలను సరియైన నినాదాలపై సమీకరించి పోరాటాలకు సిద్ధం చేసి, సంఘటితం చేయగలిగితే రాబోయే రోజుల్లో తెలంగాణ ప్రజలు బూర్జువా–భూస్వామ్య పరిపాలనను తిరస్కరించి ప్రత్యామ్నాయ పరిపాలన స్థాపన కోసం విజృంభించడం తప్పనిసరిగా జరుగుతుంది. అందుకని 'ప్రజాస్వామిక తెలంగాణ' కేంద్ర రాజకీయ నినాదంతో పాలకవర్గాల ప్రజా వ్యతిరేక విధానాలను బట్టబయలు చేస్తూ ప్రజలను పోరాట రంగంలో కదిలించాలి.

ప్రస్తుతం అధికారంలో ఉన్న టీఆర్ఎస్ ప్రభుత్వం అనుసరిస్తున్న సామ్రాజ్యవాద, భూస్వామ్య, దళారీ నిరంకుశ బూర్జువా విధానాలకు, పరిపాలనకు వ్యతిరేకంగా పోరాడాలి. ఈ ప్రభుత్వం సామ్రాజ్యవాద ఫాసిస్టు, బ్రాహ్మణీయ హిందూ ఫాసిస్టుల అడుగులకు మడుగులు ఒత్తడాన్ని ఎక్స్‌పోజ్ చేయాలి. పోరాట సంప్రదాయం కల్గిన తెలంగాణ ప్రజలు ఒక్కతాటిపై కదిలి, గత 20 ఏళ్ళలో లభించిన అనుభవంపై ఆధారపడి మరింత బలంగా పాలకవర్గాలకు వ్యతిరేకంగా పోరాడి 'ప్రజాస్వామిక తెలంగాణ' సాధనలో విజయవంతం కాగలరని గట్టిగా చెప్పవచ్చు.

టీఆర్ఎస్ పాలన వైఫల్యాలను చూపుతున్న కాంగ్రెస్ 2019లో అధికారంలోకి రావాలని అనేక ప్రయత్నాలు మొదలు పెట్టింది. తెలంగాణ సుదీర్ఘ కాలం కాంగ్రెస్ పాలనలో ఉంది. కానీ తెలంగాణకు జరిగిన అన్యాయం, అణచివేతపై పశ్చాత్తాపం ఎక్కడ వ్యక్తం చేయలేదు. భవిష్యత్ విధానం ప్రకటించలేదు. కాంగ్రెస్ చరిత్ర గతం కన్నా భిన్నంగా ఉండే అవకాశం ఏమిలేదు. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా సారాంశంలో వాటి ఎజెండాలో తేడా లేదు. కనుక అధికార ప్రధాన ప్రతిపక్షాలే కాదు "ఓట్ల విప్లవం" "పార్లమెంటుకు బాట" లాంటి కాలం చెల్లిపోయిన నినాదాలతో వస్తున్న అవకాశవాద శక్తుల, కూటముల పట్ల అప్రమత్తంగా ఉండాలి. సామాజిక న్యాయంకోసం పోరాడుతున్న వర్గాల నిజమైన పోరాటాలను దారి మళ్లించి ఓట్లుగా మార్చుకోవాలనే దివాళాకోరు సిద్ధాంతాలను ప్రజలలో ఎండగట్టాలి.

జీవించే హక్కు, సభ పెట్టుకునే స్వేచ్ఛ, నిర్భయంగా మాట్లాడే అవకాశం, ఉపాధిని పొందటం, విద్యను ఆర్జించటం, సామాజిక అసమానతలు రూపుమాసిపోవటం మొదలైన హక్కులను, అవకాశాలను భారత రాజ్యాంగం ఈ దేశ ప్రజలకు హామి పడింది.

తెలంగాణ సమాజంలో గత అరవై యేళ్ళ కోస్తాంధ్ర పాలనలోనూ, ఇప్పుడు టీఆర్ఎస్ పాలనలోనూ రాజ్యాంగం ఇచ్చిన ఏ అవకాశం అమలు కావడం లేదు. సామాజిక న్యాయం, వనరులపై ప్రజలకు అధికారం, హక్కులు అమలు చేయమని డిమాండ్ చేస్తూ ప్రజాస్వామ్య తెలంగాణ పోరాటాన్ని మరింత ఉత్సాహంగా సాగించాల్సిన చారిత్రక దశలో మనం ఉన్నాం.

ప్రత్యేక తెలంగాణ ఉద్యమ క్రమంలో అమరులైన కామ్రేడ్స్ బెల్లి లలిత, ఐలయ్య, సుదర్శన్, వసంత్, రవీంద్రరెడ్డి, పొన్నాల చంద్రమౌళి, వెంకటేశ్వర్లు, కనకాచారి, భూమయ్య, మద్దిలేటి లాంటి అమరులకు ఈ సందర్భంగా వినమ్రంగా జోహార్లు అర్పిద్దాం. వారి ఆశయ సాధనలో భాగంగా ప్రజాస్వామిక తెలంగాణ సాధనకు ఉద్యమిద్దాం.

ఈ నేపథ్యంలో ప్రజల ఆకాంక్షలు నెరవేర్చుకోగలిగే ప్రజాస్వామిక తెలంగాణ కోసం విశాల ఐక్య సంఘటనను ఏర్పరిచే లక్ష్యంతో కలిసివచ్చే సంస్థలను, శక్తులను, వ్యక్తులను కలుపుకొని పోరాడాలి. కార్మికులు, కర్షకులు, మధ్య తరగతి చిన్న, మధ్య తరగతి పెట్టుబడిదారులు, విద్యార్థులు, యువజనులు, రచయితలు, మేధావులు, కవులు, కళాకారులు, ఉద్యోగులు, మహిళలు, ఆదివాసీలు, దళితులు, మైనారిటీలను కలుపుకొని విశాల ప్రజా ఉద్యమాన్ని నిర్మించుతూ ప్రజాస్వామిక తెలంగాణ కోసం పోరాడాలి.

నేడు అక్కడ "ప్రజాస్వామిక తెలంగాణ" కేంద్ర రాజకీయ నినాదం కావాలి.

O

# ఏకపక్షంగా జెరూ సలేం వివాదాన్ని సృష్టించి మధ్య ప్రాచ్యంలో యుద్ధ జ్వాలలు లేపుతున్న ట్రంప్ విధానాలను ఖండిద్దాం

జెరూసలెం 123 చ.కి.మీ విస్తీర్ణం గల నగరం. 2004 లెక్కల ప్రకారం అక్కడ 7 లక్షల మంది ప్రజలున్నారు. ఇజ్రాయిల్‌కు చెందిన యూదులు మెజారిటీగా 70 శాతం ఉంటే, పాలస్తీనాకు చెందిన అరబ్ మైనారిటీలు 30 శాతం ఉన్నారు.

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ డిసెంబర్ 6న జెరూసలేంను ఇజ్రాయిల్ రాజధానిగా గుర్తిస్తున్నట్లు, అమెరికా రాయబార కార్యాలయాన్ని టెల్ అవివ్ నుండి జెరూసలేంకు తరలిస్తున్నట్లు ప్రకటించాడు. తమ కార్యాలయాన్ని తక్షణమే తరలించే ప్రక్రియను ప్రారంభించవలసిందిగా విదేశాంగ శాఖను ఆదేశించాడు. జెరూసలేంను అధికారికంగా గుర్తించేందుకు ఇదే సమయమని నేను నిర్ణయించాను అన్నాడు. ఈ పనిని ఎప్పుడో చేసి ఉండవలసింది. గతములోని అధ్యక్షులు ధైర్యములేకనో, మనస్సు మార్చుకోవడం కారణంగానో కానీ చేయలేదు అన్నాడు. అమెరికా అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో ట్రంప్ ఇచ్చిన ముఖ్యమైన హామీని ఈ విధంగా అమలు చేయడానికి ప్రయత్నిస్తున్నాడు. దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న వివాదాంశాన్ని ఏక పక్షంగా ప్రకటన చేయడం ట్రంపు దూకుడు స్వభావాన్ని చెబుతుంది. యుఎన్‌ఓ తీర్మాణం 478కి ఇది వ్యతిరేకం.

ట్రంప్ నిర్ణయంపై పలు అరబ్ దేశాల నుండి వ్యతిరేకత వ్యక్తమైంది. అల్లకల్లోలంగా ఉన్న మధ్య ప్రాచ్య దేశాల్లో ఈ నిర్ణయం మరింత ఉద్రిక్తతలకు దారితీస్తుంది. ఇజ్రాయిల్, పాలస్తీనా వివాదంపై ఇది ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతుంది. ఇది ముస్లింలను రెచ్చగొట్టే చర్య. సౌదీ రాజు సల్మాన్ దీనిని ముస్లింల మనోభావాలను రెచ్చగొడుతుందనీ, ఇది ఒక అపాయకరమైన చర్య అనీ అన్నారు. ఇరాన్ అధ్యక్షుడు రౌహాను ఈ నిర్ణయం చట్ట వ్యతిరేకం, అత్యంత ప్రమాదకరం, రెచ్చగొట్టేదని వ్యాఖ్యానించాడు. అరబ్ దేశాలు మాత్రమే కాదు యూరప్ దేశాలు సైతము ట్రంప్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నాయి. అమెరికాలో డెమోక్రాట్‌లు ట్రంప్‌పై అభిశంసన ప్రక్రియను ప్రారంభించాలనే వరకు వెళ్లారు. అమెరికా మిత్రదేశాలు ఫ్రాన్స్, బ్రిటన్, జర్మనీలతో సహా ప్రపంచంలో చాలా దేశాలు ట్రంపు చర్యను వ్యతిరేకించాయి. ఆఖరుకు పోప్ కూడా ఒక ప్రకటనలో దీనిని ఖండించాడు. ఐక్యరాజ్య సమితిలో ట్రంప్ నిర్ణయంపై జరిగిన ఓటింగ్‌లో అమెరికా ఘోరంగా ఓటమి పాలైంది.

ఇజ్రాయిల్ సార్వభౌమాధికారం ఉన్న రాజ్యం, అది రాజధానిగా నిర్ణయించుకున్న నగరంలో దౌత్యకార్యాలయం పెట్టడంలో తప్పేముంది అని ట్రంప్ వాదనకి దిగాడు. ఈ నేపథ్యంలో జెరూసలేం గురించి, ఈ వివాద అంశం గురించి తెలుసుకోవడం అవసరం. జెరూసలేం ప్రపంచంలోనే క్రైస్తవ, ముస్లిం, యూదు మతాలకు చెందిన కోట్లాది మందికి సమానంగా ఆరాధనీయమైన పవిత్ర స్థలం. ఆ మూడు మతాలకు చెందిన పురాతన చిహ్నాలు ఆ నగరంలో ఉంటాయి. జెరూసలేం నగరం పశ్చిమ ప్రాంతంలో ఇజ్రాయిల్ రాజధాని ఉన్న మాట నిజమే. అక్కడ ఆ దేశ ప్రధాని నివాసం, పార్లమెంటు భవనం ఉన్నాయి. 1948 యుద్ధంలో జెరూసలేం పశ్చిమ భాగాన్ని ఆక్రమించడంతో 1949 నుంచి ఇజ్రాయిల్ ఆధీనంలో పశ్చిమ జెరూసలేం మాత్రమే ఉన్నది. 1967లో మరల ఇజ్రాయిల్ ఆ నగరంలోని తూర్పు ప్రాంతంలోకి చొరబడి విలీనం చేసుకుంది (దురాక్రమించింది). రెండవ ప్రపంచ యుద్ధం సృష్టించిన విలయాన్ని చల్లార్చడానికి ఐక్యరాజ్యసమితి 1949లో నియమించిన ఆర్మిస్టిస్ కమీషన్ గీసిన విభజన రేఖ జెరూసలేంని రెండుగా విభజించింది. అందులో పశ్చిమ భాగం ఇజ్రాయిల్‌లో ఉంటే తూర్పు ప్రాంతం పాలస్తినాలో ఉంది. ఆ వివాదంపై ఇరు పక్షాలు కూర్చుని పరిష్కరించుకోవాలనేది ఆర్మిస్టిస్ నిర్ణయం. ఇజ్రాయిల్ జెరూసలేంను రాజధానిగా

# ప్రపంచంలో ఏ దేశంలోనూ పౌరసత్వం లేని పీడిత రోహింగ్యాలను భారత పాలకవర్గాలు శత్రువులుగా చూడడాన్ని నిరసిద్దాం

ఆగ్నేయాసియాలో బర్మా ఒక చిన్న దేశం. 14 రాష్ట్రాలుగా ఉన్న బర్మా విస్తీర్ణం 2 లక్షల 50 వేల చదరపు కి.మీ. దాని రాజధాని నైపీడా. జనాభా 7 కోట్లు. 1989 నుంచి దీనిని మయన్మార్‌గా గుర్తిస్తున్నారు. అర్‌కాన్ (రఖైన్) ఒక పెద్ద రాష్ట్రం. ఇస్లాంలోని సున్నీ సాంప్రదాయాన్ని పాటించే రోహింగ్యాలు తరతరాలుగా రఖైన్ రాష్ట్రంలోనే నివసిస్తున్నారు.

రోహింగ్యాలు ముస్లింలు. ఇస్లాం మతస్తులు. బర్మా దేశం దక్షిణ తీరంలోని వెనుకబడిన ప్రాంతం. దుర్భరమైన రోహింగ్యాల బ్రతుకులకు కారణం నిస్సారమైన భూములు, అత్యల్ప పంటలు, సాగునీటి కొరత, ప్రభుత్వ నిర్లక్ష్యము వెరసి ప్రాధాన్యత లేని ప్రాంతంలో ఆకలి రాజ్యంలో పస్తులు, కన్నీళ్ళు తరతరాలుగా కొనసాగాయి. విలువలేని భూముల్లో కొన ఊపిరితోనైనా ఆనాడు వారి బ్రతుకులు భద్రంగానే ఉండేవి.

1962లో సైనిక కుట్ర ద్వారా సైనిక ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఆ తీర ప్రాంతానికి వ్యూహాత్మక ప్రాధాన్యత పెరిగింది. తీర ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా రూపొందించాలని సైనిక ప్రభుత్వం ఆలోచించింది. ఆ భూములన్నీ రోహింగ్యా పేద రైతాంగానికి చెందినవి. ఆ భూములకు పెరిగిన ప్రాధాన్యత రీత్యా సైనిక ప్రభుత్వం 1982 లోనే ముందు చూపుతో రోహింగ్యాల పౌరసత్వాన్ని రద్దు చేసింది. దానికి ముందు 1977లో విదేశీ జనాభా వడపోత పేరుతో "డ్రాగన్ కింగ్" (ఆపరేషన్ నాగమన్) ప్రభుత్వం కార్యక్రమాన్ని అమలు చేసింది. దీని ఫలితంగా రెండు లక్షల మంది పైగా రోహింగ్యాలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బంగ్లాదేశ్‌కు శరణార్థులుగా వలస పోయారు. 1978లో ఐక్యరాజ్యసమితి మధ్యవర్తిత్వంతో బంగ్లాదేశ్, బర్మాల మధ్య ఒప్పందం కుదిరి వారంతా మయన్మార్‌కు తిరిగి వచ్చారు. 1982లో తెచ్చిన కొత్త పౌరసత్వ చట్టం దేశవ్యాప్తంగా ఉన్న 135 ప్రత్యేక జాతులకు చోటు కల్పించి కూడా రోహింగ్యాలను మాత్రం అందులో చేర్చలేదు. బ్రిటీష్ వలస పాలనలో వచ్చిన అక్రమ వలసదారులుగా వీరిని పరిగణించింది.

1991లో వెట్టిచాకిరీ, అత్యాచారాలు వంటి దారుణాలను తట్టుకోలేక రెండున్నర లక్షల మంది రోహింగ్యాలు మయన్మార్‌ను వదిలి పోయారు. వీరు 1992-97 మధ్య కాలంలో మరో అప్పగింత ఒప్పందంలో భాగంగా ఇప్పుడు రఖైన్‌గా వ్యవహరిస్తున్న అర్‌కాన్‌కు తిరిగి వచ్చారు. 2012లో రోహింగ్యాలకు, రఖైన్ బౌద్ధులకు మధ్య జరిగిన ఘర్షణలలో వంద మందికి పైగా రోహింగ్యాలు మరణించారు. రఖైన్‌లో ఏర్పాటు చేసిన శిబిరంలో సుమారు లక్షా 50 మందికి పైగా రోహింగ్యాలు ఆశ్రయం

---

ప్రకటించుకున్నప్పటికీ ఐక్యరాజ్యసమితి సభ్య దేశాలన్నీ ఆ కమిషన్ నిర్ణయాన్ని గౌరవించి టెల్ అవివ్‌లో తమ రాయబార కార్యాలయాలు అన్నింటినీ ఏర్పాటు చేసుకున్నాయి. అమెరికా అధ్యక్షులు అధికారంలో ఎవరున్నప్పటికీ టెల్ అవివ్‌లో తమ రాయబార కార్యాలయం కొనసాగడానికి ఆమోదిస్తూనే వచ్చారు. 90వ దశకంలో ఓస్లో వేదికగా ఇజ్రాయిల్, పాలస్తీనాల మధ్య శాంతి ఒప్పందం కుదిరినపుడు, తర్వాత 2000ల సం॥లో ఆరాఫత్‌తో చర్చలప్పుడు జెరూసలేం సమస్యను భవిష్యత్తుకు వదిలిపెట్టారు.

ఇజ్రాయల్ దురాక్రమణతో సర్వం కోల్పోయిన పాలస్తీనా వాసులు ఆర్మిస్టిస్ కమీషన్‌ను గౌరవించి తూర్పు జెరూసలేంతో సరిపెట్టుకోవడానికి ప్రయత్నించారు. కానీ ఇజ్రాయిల్ మాత్రం పాలస్తీనాతో చర్చించడానికి, ఒప్పందానికి రావడానికి ఒకపక్కన అంగీకరిస్తూనే, మరో పక్క జెరూసలేంలో మాత్రం ఒక్క అంగుళం భూమి వదిలేది లేదని మొండిగా పేచీ పెడుతుంది. అమెరికా మధ్యవర్తి పాత్రను విడిచి ఇజ్రాయిల్‌కు తిరుగులేని మద్దతుదారునని "అధికారికంగా" రుజువు చేసుకుంది. ట్రంప్ తాజా చర్యతో గాజాస్ట్రిప్ లోనూ, బీరూట్, లెబలాన్‌ల లోను, పాలస్తీనా శరణార్థి శిబిరాల్లోను ఆందోళనలు మొదలయ్యాయి.

మధ్య ప్రాచ్యంలో అమెరికా సైనిక వ్యూహానికనుగుణంగా ఇజ్రాయిల్‌ను సృష్టించి, దాన్ని రెచ్చగొట్టి ఆ మొత్తం ప్రాంతంపై ఆధిపత్యం చెలాయించడానికి దశాబ్దాలుగా అమెరికా కుట్రలు పన్నుతున్నది. ట్రంప్‌కు ముందున్న అధ్యక్షులు, అమెరికా మొత్తం విధానాలు ఆ డైరెక్షన్‌లోనే సాగాయి. ట్రంప్ కూడా వాటినే వేగంగా కొనసాగిస్తున్నాడు. భవిష్యత్‌లో ఇజ్రాయిల్ కేంద్రంగా అనేక దాడులు చేసే వ్యూహంలో భాగంగానే అమెరికన్ అధ్యక్షుడు ట్రంప్ ఇజ్రాయిల్‌ను అక్కడ స్థిరపరచడానికి పాలస్తీనాను లేకుండా చేయడానికి కుట్ర పన్నుతున్నాడు.

అరబ్ ప్రజల న్యాయమైన పోరాటాలకు, పాలస్తీనా విముక్తి పోరాటానికి మద్దతుగా నిలబడడం, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంలో భాగంగా నిలబడడం మన కర్తవ్యం. ట్రంప్ ఒంటెత్తు పోకడలను నిరసించడం, ఒంటరిని చేయడం అంతర్జాతీయ సమాజం ముందున్న తక్షణ కర్తవ్యం. ○

పొందారు.

2016లో రోహింగ్యా మిలిటెంట్ గ్రూప్ జరిపిన దాడులలో 12 మంది సైనికులు మృతి చెందారు. దీనికి ప్రతిగా సైనికులు చేసిన దాడులలో వేలాది మంది బంగ్లాదేశ్‌కు వలస పోయారు. మిలటరీ హత్యలు, అత్యాచారాలు లాంటి అనేక దారుణాలు కోకొల్లలుగా జరిగాయి. రోహింగ్యాలు నివసించే గ్రామాల్లో దాడులు పెరుగుతున్నాయని పురుషులను, మహిళలను, పిల్లలను విచక్షణా రహితంగా మట్టుపెడుతున్నారని ఆరోపిస్తున్నారు. మయన్మార్ హింసాకాండ బాధితులకు ఆహారం, మందులు ఇతర ముఖ్య సరఫరాలను యు.ఎన్.ఓ. సహాయక సంస్థలు అందించడాన్ని ప్రభుత్వం అడ్డుకుంటుంది. ఒక్క నెల రోజులలోనే బంగ్లాదేశ్‌లోకి దాదాపు 1లక్షా 40 వేల మంది రోహింగ్యా ముస్లింలు వలస వచ్చినట్లు అంచనా. అక్కడ పౌర సమస్యలు, శాంతి భద్రతల సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని బంగ్లాదేశ్ ప్రభుత్వం ఆందోళన చెందుతుంది.

మయన్మార్‌లో 8లక్షల రోహింగ్యా ప్రజలు ఉంటే ఇతర దేశాలకు వలస వెళ్ళిన వారు మరో 8లక్షల మంది ఉంటారని అంచన. ఇందులో కొందరు శరణార్థులు, మిగిలిన వారంతా వలస కూలీలు. సౌదీలో 4 లక్షల మంది, బంగ్లాదేశ్‌లో 4 లక్షల మంది ఉంటారని ఒక అంచనా. మరి కొందరు థాయ్‌లాండ్, మలేషియా, భారత్, నేపాల్, అమెరికా లాంటి దేశాలకు వెళ్ళి తలదాచుకుంటున్నారు.

రోహింగ్యా జాతి శుద్ధీకరణ పేరుతో మయన్మార్ ప్రభుత్వం రోహింగ్యాలను మొత్తంగానే అంతమొందించాలని హింసాకాండను సాగిస్తుంది. మయన్మార్ జనాభాలో 90 శాతం బౌద్ధులే. **అహింసకు, శాంతికి మారుపేరుగా చెప్పే బౌద్ధం హింసా, దౌర్జన్యాలతో జన హననం కావించడం బర్మాలో నేటి చారిత్రక వాస్తవం.**

చరిత్రలోకి వెళ్ళితే 8వ శతాబ్దం నుంచి రోహింగ్యాల ప్రస్థావన ఉంది. దక్షిణాసియా సంతతికి చెందిన వీరు ఆధునిక మయన్మార్‌లోని రఖైన్‌లో స్వాతంత్ర రాజ్య నివాసులు. 9, 14 శతాబ్దాల నడుమ వీరికి ఇస్లాంతో పరిచయం కలిగింది. అర్‌కాన్, రఖైన్ మధ్య దృఢమైన సంబంధాలు ఏర్పడ్డాయి. ప్రస్తుత బంగ్లాదేశ్‌లో చిట్టగాంగ్ ప్రాంతం నుండి వాయువ్య బర్మాలోని రఖైన్ ప్రాంతానికి వ్యవసాయ కూలీలుగా వలస వెళ్ళారు. అప్పటిలో అది స్వతంత్ర దేశం. 1784లో బర్మా రాజు అర్‌కాన్‌ను ఆక్రమించుకున్నాడు. ఆ సమయంలో కూడా అర్‌కాన్ నుండి బెంగాల్‌కు శరణార్థులుగా వెళ్లారు. ఈనాడు ఉన్నట్లు ఆనాడు వీసాలు, పౌరసత్వ గొడవలు లేవు. 1828-48 మధ్య బర్మా బ్రిటీష్ వలసగా మారింది. 1942-45 వరకు జపాన్ ఆధీనంలో ఉంది. బ్రిటీష్ వారి సహకారంతో జపాన్ వారిని తరిమి కొట్టడం జరిగింది.

1947లో బ్రిటీష్ వాళ్లు భారతదేశాన్ని వదిలి పోయిన విధంగానే 1948లో బర్మాను కూడా వదిలి పోతున్నప్పుడు రోహింగ్యా ముస్లింలు రఖైన్ రాష్ట్రాన్ని తూర్పు పాకిస్థాన్‌లో కలపాలని డిమాండ్ చేశారు కానీ అది జరగలేదు. జిన్నాను ఆశ్రయించినా ఫలితం లేకపోయింది. 1948 నుంచి స్వతంత్ర బర్మాలో ప్రభుత్వానికీ, రోహింగ్యాలకు మధ్య ఘర్షణ పెరుగుతూ వచ్చింది. బర్మా రాజులు, నియంతలు గతం నుండి రోహింగ్యాలను తమ జాతి వారు కాదంటూ శత్రు భావంతోనే చూసారు. ఇప్పుడు మరొక జాతి గానే కాదు ముస్లిం తీవ్రవాదులుగా మయన్మారు ప్రభుత్వం, బుద్ధిస్టులు వారిని ఉగ్రవాదులుగా చూపెడుతున్నాయి.

రోహింగ్యాల గుర్తింపుకు సంబంధించి చూస్తే - బ్రిటీష్ పాలనలో రోహింగ్యాలకు గుర్తింపు ఉంది. 1948లో బర్మాకు స్వాతంత్ర్యం వచ్చాక రోహింగ్యాలు ప్రజా ప్రతినిధులుగానూ ఎన్నికయ్యారు. 1960లో రోహింగ్యా నాయకుడు మహ్మద్ మంత్రిగా బాధ్యతలు నిర్వహించాడు. అప్పుడే అర్‌కాన్ ప్రాంతాన్ని బర్మాలోనే ఒక రాష్ట్రంగా ప్రకటించాలని కోరారు. 1962 సైనిక పాలన నుండి రోహింగ్యాల పట్ల కఠినంగా వ్యవహరించడం మొదలయింది. 2015లో అంగసాన్ సూకీ నాయకత్వంలోని పార్టీ ప్రతినిధులుగా రోహింగ్యాలు కూడా ఎన్నికయ్యారు.

**ప్రపంచంలో అత్యంత పీడిత మైనార్టీలుగా 2013లో రోహింగ్యాలను గురించి ఐక్యరాజ్య సమితి పేర్కొన్నది.** 2014లో మయన్మారు ప్రభుత్వం జనాభా లెక్కల్లో రోహింగ్యా కమ్యూనిటీ తన జాతిని రోహింగ్యా నుంచి బెంగాలీగా మార్చుకోవాలని సూచించింది. 1978, 1991-92, 2012, 2015, 2016-17 లలో రోహింగ్యాలపై సైనిక దాడులు జరిగాయి. 2016-17 సంక్షోభానికి ముందు మయన్మారులో దాదాపు 12 లక్షలు మంది రోహింగ్యాలు ఉన్నట్లు అంచనా.

2016 ఆగస్టు 25న రోహింగ్యా మిలిటెంట్ ఆర్మీ రఖైన్‌లో పోలీసు సైనిక పికెట్‌లపై దాడిచేసి సైనికులను హతమార్చడంతో (12 మంది అధికారులను) ఇది మరింత తీవ్ర స్థాయికి చేరింది. ఆ తరువాత మయన్మారు భద్రతా దళాలు సాగించిన దమనకాండ అంతా ఇంతా కాదు. కాల్పులల్లో 400 మంది ప్రజలు చనిపోగా, లక్షల మంది ప్రాణాలు అరచేతుల్లో పట్టుకొని కట్టుబట్టలతో పొరుగున ఉన్న బంగ్లాదేశ్‌కు వలస పోయారు. అనేక మంది నీట మునిగి, రోగాలతో, సైన్యం అమర్చిన మందు పాతరలు పేలి

చనిపోయారు. పిల్లలు, వృద్ధులతో సహా అనేక మంది మహిళలు అత్యాచారాలకు గురయ్యారు. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ సమాజం మయన్మారుపై తీవ్రమైన ఒత్తిడులు తెసున్నది. మానవ హక్కులను గౌరవించడం నేర్చుకోవాలని హితవు చెబుతున్నది.

1990 తరువాత వచ్చిన సరళీకరణ విధానాలకు బర్మా ప్రభుత్వం అంగీకరించలేదు. దానితో సామ్రాజ్యవాద శక్తులు ఒత్తిడులు పెంచాయి. అవి అంగ్‌సాన్ సూకీ. "ప్రజాస్వామ్య" ఉద్యమాన్ని బలపరిచాయి. యుఎన్‌ఓతో ఆంక్షలు విధింప చేశాయి. చైనాలో డెంగ్ అధికారంలోకి వచ్చాక బర్మాలో ఐదు రోజుల పర్యటన సందర్భంగా రెండు దేశాల మధ్య సంబంధాలు పెరిగి 1988లో సరిహద్దు వాణిజ్య ఒప్పందం కుదిరింది. 2004లో ఈ ప్రాంతంలో చమురు, సహజ వాయువులు కనుగొనడంతో ఆ బంధం మరింతగా పెరిగింది. 2008లో 25 బిలియన్ డాలర్ల ఒప్పందం జరిగి చమురు సహజ వాయువుల రవాణా కోసం రోహింగ్యాల రాష్ట్రంలోని రఖైన్ రాజధాని సిట్వీ నుండి కొన్మింగ్ పట్టణం (చైనా) వరకు రెండు వేర్వేరు పైపు లైన్లు సమాంతరంగా నిర్మించేందుకు పనిని చేపట్టారు. చమురు, సహజ వాయువుల కోసం తవ్వకాలు, నూనె శుద్ధి కర్మాగారాలు, కార్యాలయాలు, సిబ్బంది కాలనీలు, అనుబంధ సెజ్‌లు ఇతర నిర్మాణాలు పైపు లైన్‌లు లాంటి పనుల కోసం వేల ఎకరాల భూములు అవసరం అయ్యాయి. ఇందుకు గ్రామాలకు గ్రామాలనే ఎటువంటి నష్టపరిహారం లేకుండానే బర్మా ప్రభుత్వం ఖాళీ చేయించింది.

2012లో సామ్రాజ్యవాదుల అన్ని రకాల ఒత్తిడులకు లొంగిన సైనిక ప్రభుత్వం సరళీకరణ ప్రక్రియకు "ప్రజాస్వామ్య" సంస్కరణలకు అంగీకరించి, విదేశీ పెట్టుబడులను అనుమతించింది. ఈ నేపథ్యంలోనే 1963 నాటి రైతు భూమి సంరక్షణా చట్టాన్ని రద్దు చేసి వ్యవసాయ సాగు భూముల సేకరణ చట్టాన్ని, ఖాళీ భూముల చట్టాన్ని రెండింటిని 2012 లోనే తెచ్చింది. 2012 దమనకాండలో అధికారికంగానే 1 లక్షా 40 వేల మంది ప్రాణ భయంతో పొరుగు దేశాలకు శరణార్థులుగా వెళ్ళారు. 2012 భూసేకరణ చట్టాలు తెచ్చిన వెంటనే 17 వేల ఎకరాలను విదేశీ సంస్థలకు అప్పగించిన ప్రభుత్వం ఇప్పుడు మొత్తంగా 31 లక్ష ఎకరాలను స్వాధీనం చేసుకుంది. భూములు కోల్పోయిన వారిలో బౌద్ధ మతస్తులు కూడా ఉన్నారు. **సామ్రాజ్యవాదులు సహజ వనరులను కొల్లగొట్టడానికి ప్రపంచంలోని అనేక చోట్ల జాతి నిర్మూలన చేసినట్లే బర్మాలోని ఒక ప్రాచీన జాతి రోహింగ్యాలను కూడా నాశనం చేస్తున్నారు.**

2015 ఎన్నికల తర్వాత సుక్వి భాగస్వామ్యం, పశ్చిమ దేశాల పెట్టుబడులు రెండూ పెరిగాయి. 2015-16 లలో వచ్చిన 10 వేల బిలియన్ డాలర్ల పెట్టుబడిలో వారిదే ప్రధానం. పశ్చిమ దేశాల చమురు, సహజ వాయువులకు చెందిన షల్, టు టల్, చెవ్రాన్, ఈఎన్‌ఐ లాంటి విదేశీ బహుళజాతి కంపెనీలు రావడంతో రోహింగ్యాల మాతృభూమి రఖైన్ రాష్ట్రం చైనా, అమెరికా, యూరప్ దేశాల ఆయిల్ కంపెనీల అడ్డా(హబ్)గా మారిపోయింది. అక్కడ రోహింగ్యాలు ఇప్పుడు విదేశీయులయ్యారు. తరిమివేయబడుతున్నారు. నోబెల్ శాంతి బహుమతి గ్రహీత అంగ్‌సాన్ సూకీ అనుసరిస్తున్న సామ్రాజ్యవాద అనుకూల ప్రజా వ్యతిరేక విధానాలను ప్రపంచ వ్యాప్తంగా ప్రజలు ఖండిస్తున్నారు.

ఇందులో భారతదేశానికి కొంత వాటా ఉంది. ఇక్కడి రిలయెన్స్ కంపెనీకి ఎమ్-17, ఎమ్-18 అనే రెండు చమురు బావులున్నాయి. ఒక రవాణా పథకం మరో రోడ్ నిర్మాణ కాంట్రాక్టు భారతీయ కంపెనీలకున్నాయి. ఇండో, మయన్మార్ గ్యాస్ పైప్‌లైన్ (సిట్వీ నుండి ఇజ్వాల్‌కు) నిర్మాణ పనిని చేపట్టాయి. అందుకే భారత్ రోహింగ్యాల సమస్యను శత్రు పూరితంగా చూస్తున్నది. అలాగే మత పరమైన వ్యతిరేకతతో వ్యవహరిస్తున్నది. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ లాగానే సంకుచితంగా పరమ దుర్మార్గంగా బీజేపీ నేతృత్వంలోని భారత ప్రభుత్వం రోహింగ్యాల ప్రవేశము దేశ భద్రతకు ప్రమాదమని మాట్లాడుతున్నది. అంతర్జాతీయ మానవతా దృక్పథాన్ని విడిచి యుఎన్‌ఓ నిబంధనలకు విరుద్ధంగా ఒక దేశ ప్రభుత్వం ఇలా వ్యవహరించడం అరుదు. గతంలో మనం బంగ్లాదేశ్, శ్రీలంక లాంటి అనేక దేశాలకు చెందిన లక్షలాది శరణార్థులకు ఆశ్రయం ఇచ్చాము. ఇప్పటికీ వాళ్ళు మనదేశంలో శరణార్థులుగా కొనసాగుతున్నారు. ఈ చరిత్రను విస్మరించి నరేంద్రమోడీ ప్రభుత్వం ప్రపంచ ప్రజల ముందు మన దేశానికే తలవంపులు తెచ్చేలా చేస్తున్నది. ఇటీవల మయన్మార్ వెళ్ళినపుడు మోడీ రోహింగ్యాలకు వ్యతిరేకంగా ప్రభుత్వానికి వత్తాసు పలికి వచ్చాడు.

బర్మా పాలకులు అక్కడి భౌగోళిక, రాజకీయ కారణాలు చూపి రోహింగ్యా జాతి ప్రజలను బలి తీసుకుంటున్నారు. ఇదే కొనసాగితే అన్ని జాతులు, అన్ని మతాలు, అన్ని ప్రజా సమూహాలకు ప్రమాదమే అని బర్మాలోని ప్రజాస్వామిక శక్తులు హెచ్చరిస్తున్నాయి. రోహింగ్యాల విషాదం వెనుక మతేతర వాణిజ్య కారణాలున్నాయని స్పష్ట పరుస్తున్నారు. ప్రపంచంలో ఏదేశానికి చెందిన పౌరసత్వమే లేదంటున్న రోహింగ్యాల దయనీయ పరిస్థితిని అర్థం చేసుకొని ప్రపంచమంతా వారిని ఆదరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మయాన్మార్‌లో పునరావాసం కల్పించి పౌరసత్వంతో పాటు అన్ని రకాల హక్కులను కల్పించాల్సిన అవసరం ఉంది. వారి పోరాటానికి మద్దతు నివ్వాల్సిన అవసరం ఉంది. ○

# స్పెయిన్ జాతి దురహంకారాన్ని ఖండిద్దాం

# కాటలోనియా ప్రజల జాతి పోరాటాన్ని బలపరుద్దాం

స్పెయిన్ దేశంలో ఈశాన్య భాగంలో కాటలోనియా ప్రాంతం ఉంది. కాటలోనియా 32,113 చ.కి.మీ విస్తీర్ణంలో 2007 నాటికి 72,10,508 మంది ప్రజలున్నారు. దానికి వెయ్యేళ్ల చరిత్ర ఉంది. సొంత భాష, జాతీయ జెండా, జాతీయ గీతం కలిగిన ఈ ప్రాంత ప్రజలు వందేళ్లుగా స్వతంత్ర దేశం కోసం పోరాడుతున్నారు. స్పెయిన్ దేశంలో స్వతంత్ర ప్రతిపత్తిగల 17 ప్రాంతాల్లో కాటలోనియా ఒకటి. ఇది అత్యంత సంపద కలిగిన ప్రాంతం.

స్పెయిన్ మొత్తం జనాభాలో 16శాతం కాటలోనియాలోనే ఉన్నారు. స్పెయిన్ ఎగుమతులను 25శాతం, జీడీపీలో 19శాతం కాటలోనియాకి చెందినవి. స్పెయిన్‌ను సందర్శించిన టూరిస్టుల్లో 25శాతం కాటలోనియా సందర్శకులే ఉంటారు. అధిక దిగుబడినిచ్చే పంటలు, పండ్ల తోటలు, పశు సంపద పుష్కలంగా ఉన్నాయి. మద్యం తయారీ, రసాయన పరిశ్రమలు, మత్స్య సంపద, పొటాష్ నిక్షేపాలు వ్యాపార పోర్టులు కాటలోనియాలో ఎంతో కీలకమైనవి. కాటలోనియాలోని ప్రధాన నగరం బార్సిలోనా ఉల్లాస భరితమైన వాతావరణానికి, మంచి ఆర్కిటెక్చర్‌కు ప్రసిద్ధి. 1992లో ఒలింపిక్ క్రీడలు ఇక్కడే జరిగాయి. ఇక్కడ పెద్ద ఫుట్‌బాల్ మైదానం ఉంది. బార్సిలోనా తనదైన ప్రత్యేక సంస్కృతితో ప్రపంచ సందర్శకులను ఆకర్షిస్తుంది.

కాటలోనియా 1640-1659, 1694-1697 మరల 1808-1813 వరకు ఫ్రెంచి ఆధిపత్యంలో ఉంది. ఫ్రెంచి ప్రభావంలో నున్నప్పుడు కాటలాన్ ప్రత్యేక సంస్కృతి అభివృద్ధి చెందింది. స్వయం ప్రతిపత్తి, స్వయం నిర్ణయాధికారం కోసం 19వ శతాబ్దంలో పోరాటం అభివృద్ధి చెందింది. 1930-31 లలో స్పెయిన్ విప్లవం జరిగి రాజు ఆల్‌ఫాన్సో ను తొలగించి ఏర్పర్చిన స్పెయిన్ రిపబ్లిక్‌లో భాగంగా కాటలోనియాకు 1932లో తమ అధ్యక్షుడిని, పార్లమెంటును కలిగి ఉండే హక్కు ఇవ్వబడింది. 1936-39 ల మధ్య జరిగిన స్పెయిన్ అంతర్యుద్ధంలో జనరల్ ఫ్రాన్సిస్కో ఫ్రాంకో నాయకత్వంలోని ప్రతీఘాతుక విప్లవానికి వ్యతిరేకంగా కాటలోనియా రిపబ్లిక్‌ను సమర్థించింది. ఫ్రాంకో గెలిచి అధికారంలోకి రావడంతో కాటలోనియా 1939 నుండి 1975 వరకు స్వయం ప్రతిపత్తిని కోల్పోయింది.

19 శతాబ్దం నాటి సాంస్కృతిక పునరుజ్జీవన నేపథ్యంలోనే కాటలాన్ జాతీయవాద మూలాలున్నాయి. కాటలాన్ భాష, సంస్కృతిని, సాంప్రదాయాలను నిలబెట్టుకోవాలనే తాపత్రయమే కాటలాన్ జాతీయ ఉద్యమంగా రూపుదిద్దుకుంది. గత వంద సంవత్సరాలుగా స్వతంత్ర దేశం కోసం పోరాడుతుంది. 1922లో ఫ్రాన్సెస్ మాసియా కాటలిన్ స్టేట్ పార్టీని స్థాపించాడు. స్పెయిన్ నియంత ప్రిమోడి రివేరా నియంతృత్వంలో మాసియా ఎటువంటి కార్యకలాపాలు నిర్వహించలేని పరిస్థితుల్లో విదేశాల్లో తలదాచుకోవల్సి వచ్చింది. 1931లో నియంత రివేరా పాలన అంతం కావడంతో మాసియా నేతృత్వంలో రిపబ్లికన్ లెఫ్ట్ ఆఫ్ కాటలోనియా (ఇఆర్‌సీ) ఏర్పర్చి, వెంటనే జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో గణ విజయం సాధించారు. ఆ విజయం ఇచ్చిన బలంతో రెట్టించిన ఉత్సాహంతో 'కాటలిన్ ప్రత్యేక దేశం' డిమాండ్‌తో పోరాడినప్పటికి ఆనాటి ప్రత్యేక పరిస్థితుల్లో కాటలోనియా అటానమీతోనే సరిబెట్టుకోవలసి వచ్చింది.

స్పెయిన్ అంతర్యుద్ధంలో జనరల్ ఫ్రాన్సిస్కో ఫ్రాంక్ అధికారంలోకి వచ్చాక ఈ అటానమీని రద్దు చేశాడు. జనరల్ ఫ్రాంక్ మరణించేవరకు (1975) కాటలాన్ జాతీయ ఉద్యమం స్తబ్దంగా ఉండిపోయింది. 1978 నాటికి స్పెయిన్ దేశంలో ప్రజాస్వామ్యం నెలకొనడం, నూతన రాజ్యాంగాన్ని రూపొందించుకోవడం జరిగింది. అందులో జాతులకు, ప్రాంతాలకు స్వయం పాలనాధికారం ఉంటుందని చేర్చడం జరిగింది. ఈ రాజ్యాంగ ప్రతిపాదన కాటలాన్ జాతి స్వయం నిర్ణయాధికారానికి విరుద్ధంగా ఉందని ప్రజలు తీవ్రంగా ప్రతిఘటించడంతో 1979లో కాటలోనియా స్వతంత్ర పాలనా చట్టం ఏర్పడింది. 2003-2006 వరకు భిన్న పార్టీలు భిన్న భావజాలాలతో అనేక పోరాటాలు జరిగి, అనేక తర్జన బర్జనల తర్వాత కొత్తగా 2006లో జరిగిన రెఫరెండమ్ లో 70 శాతం

ప్రజలు స్వాతంత్ర్యాన్ని కోరుతూ ఓట్లు వేసారు. వారు స్వతంత్రతను, స్వయం నిర్ణయాధికారాన్ని కోరుకున్నారు. అది జూలై 1, 2006 నుండి అమలులోకి వచ్చింది. రెవెన్యూపై ప్రాంతీయ అధికారాన్ని, వలసవచ్చేవారి పట్ల ఉండే విధానాన్ని, న్యాయపరమైన నియామకాలు రోడ్లు, రైల్వేలు నిర్మాణం లాంటి హక్కుల కల్పించడంతో ఒక దేశంగా గుర్తింపు వచ్చింది. స్థానికులు కాటలాన్ భాష నేర్చుకోవచ్చు. ఆ విధంగా స్వతంత్ర ప్రతిపత్తితో కూడిన చట్టపరమైన ఏర్పాటు జరిగింది.

ఈ చట్టంలోని ఆర్థిక, భాష, జాతి పరమైన విషయాలపై అభ్యంతరం చెపుతూ స్పెయిన్ రాజ్యాంగ కోర్టులో కాటలాన్ జాతీయవాదులు సవాల్ చేశారు. కొత్త చట్టంలోని అంశాలు రాజ్యాంగ వ్యతిరేకమైనవని పేర్కొంటూనే కోర్టు కాటలన్ జాతీయతను గుర్తించాలని తీర్పు ఇచ్చింది. ఈ నేపథ్యంలో అనేక ఉద్యమాలు చోటు చేసుకున్నాయి. మొన్నటి అక్టోబరు 1 నాటి రెఫరెండమ్‌లు (ప్రజాభిప్రాయ సేకరణ) లాంటివి అనేకం జరిగాయి. 2013లో ఆనాటి అత్యంత కీలకమైన ముసాయిదాలోని 'కాటలిన్ సార్వభౌమత్వం, భవిష్యత్తు స్వయం నిర్ణయాధికారం'లకు వ్యతిరేకంగా స్పెయిన్ ప్రభుత్వం మళ్లీ రాజ్యాంగ ధర్మాసనాన్ని ఆశ్రయించడంతో కోర్టు దానిని రాజ్యాంగ విరుద్ధమని కొట్టివేసింది. అయితే తమ రాజకీయ భవిష్యత్తును నిర్దేశించుకునే హక్కు ఆ ప్రజలకు ఉందని స్పష్టం చేసింది. దానితో ప్రజలు పెద్దెత్తున వీధుల్లోకి వచ్చి ప్రదర్శనలు, ర్యాలీలతో ఉద్యమాన్ని నడిపారు. 2014 రెఫరెండమ్‌లో పెద్దెత్తున ప్రత్యేక రాజ్య ఆకాంక్ష వ్యక్తమైంది. 2015లో కాటలిన్ ప్రభుత్వం స్వతంత్ర్యాన్ని ప్రకటించుకొనే ప్రక్రియ పార్లమెంటులో ప్రకటించడంతో స్పెయిన్ కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. రెండు ప్రభుత్వాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. కాటలిన్ అధ్యక్షుడు క్యార్‌లెస్ ప్యూజిమో 2017 అక్టోబరు 1 రెఫరెండమ్ నిర్ణయాత్మకమైనదని ప్రకటించడంతో ఈ ఘర్షణ తారాస్థాయికి చేరింది. రాజ్యాంగంలోని 155 ఆర్టికల్‌ను ఊటంకిస్తూ రిఫెరెండం చట్ట విరుద్ధమని కోర్టు చెప్పింది. స్పెయిన్ జాతీయత, సమగ్రత, సమైక్యతలను కాపాడడానికి స్పెయిన్ ప్రధానమంత్రి బల ప్రయోగానికి సిద్ధపడతామని చెప్పడంతో నామమాత్రంగా ఉన్న కాటలోనియా స్వయం ప్రతిపత్తి కూడా ప్రమాదంలో పడింది. కేంద్రం కఠిన వైఖరి, యురోపియన్ యూనియన్ సభ్యదేశాల ఒత్తిడి కారణంగా స్వాతంత్ర్య ప్రకటన వాయిదావేయక తప్పలేదు.

కాటలన్ జాతి నిర్ణయాధికార సిద్ధాంతాన్ని అడ్డుకోవడానికి స్పెయిన్ జాతీయవాదాన్ని కూడా బలంగా ముందుకు తెస్తున్నారు. స్పెయిన్ నియంత జనరల్ ఫ్రాంకో కాలం నుండి అనేక ఆధిపత్య శక్తులు దేశవ్యాప్తంగా పని చేస్తున్నాయి. **కాటలాన్ విడిపోతే తమ ప్రయోజనాలకు, ఆధిపత్యానికి విఘాతం కలుగుతుందని వారంతా కాటలాన్ ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షను తుంచేస్తున్నారు. ఈ.యూ. తన అస్తిత్వానికే ప్రమాదంగా భయపడుతుంది,** కనుక ఫ్రాన్స్, జర్మనీ లాంటి దేశాలు బలంగా కాటలాన్ ప్రజల ఆకాంక్షలను వ్యతిరేకిస్తున్నారు. స్పెయిన్ ఆధిపత్య వర్గాలు రాజ్యాంగం పేరుతో స్థిరపడిన పార్లమెంటరీ రాజరికాన్ని కొనసాగిస్తున్నారు. కార్మికవర్గ పాత్ర స్వతంత్ర్య రాజ్య సాధనతో ఆగిపోదని కార్మికవర్గం, యువత మిలిటెంట్‌గా పాల్గొని విప్లవకర పద్ధతుల్లో ముందుకు సాగడాన్ని చూసి భయపడుతున్న కాటలాన్ జాతీయవాద శక్తుల్లో ఒక సెక్షను (మితవాద) మిలిటెంట్ ఉద్యమాన్ని వ్యతిరేకిస్తున్నారు. స్పెయిన్ దేశవ్యాప్తంగా పరివర్తన రాకుండా యధాతథ స్థితిలో తమ ఆధిపత్యం నెలకొనేలా రైట్‌వింగ్ శక్తులన్నీ ఐక్యమవుతున్నాయి. కాటలాన్ రిపబ్లిక్ ఆకాంక్షను రూపుమాపడంతో పాటు దేశవ్యాప్తంగా సామాజిక ఉద్యమాలు తలెత్తకుండా అడ్డుకోవడం వీరి లక్ష్యం.

అక్టోబరు 1 రెఫరెండమ్‌కు భయపడిన ప్రభుత్వం ఆర్మీతో అరాచకానికి పాల్పడింది. దీనిని నిరసిస్తూ అక్టోబరు 3న ప్రజలు అతిభారీ ర్యాలీని (జూలై 18, 1936 నాటి తిరుగుబాటు ర్యాలీతో సమాన స్థాయిలో) నిర్వహించారు. ఇది జరిగిన ఐదు రోజులకే అక్టోబరు 8న రైట్‌వింగ్ శక్తులన్నీ కాటలాన్ సివిల్ సొసైటీ పేరుతో స్పెయిన్ రాజ్య వ్యవస్థ అండదండలతో ఆర్మీ, పోలీసుల పూర్తిస్థాయి సహాయంతో సమస్త రాజ్య యంత్రాంగం, మీడియా మద్దతుతో పెద్ద ర్యాలీని, ఉద్యమ వ్యతిరేక ప్రచారాన్ని చేపట్టారు. కాటలోనియాలో జరిగిన సామ్యవాద విప్లవ మార్గాలు స్పెయిన్‌లోనే కాకుండా ఈ.యూ. సభ్యదేశాల ప్రజల్లో కొత్త కదలికలను తెచ్చి ఆ దేశాల పాలకవర్గాల్లో కలకలం రేకెత్తించాయి. ఇటలీలోని వెనెటా, సార్డినీయా ప్రాంతాలు, బెల్జియంలోని ఫ్లాండర్స్, స్పెయిన్‌లోని బాస్క్ అలాగే ఉత్తర్ ఐర్లాండ్ ఇంకా మరిన్ని ప్రాంతాల్లో స్వాతంత్ర్య రాజ్య ఆకాంక్ష పెరిగిపోతుందని ఈ.యూ. ఆందోళన చెందుతుంది.

కార్పొరేట్‌ల రాజ్యంలో అన్ని రకాల ఆధిపత్యాలను దోపిడీ రూపాలను కూల్చే విధంగా నూతన రాజ్య నిర్మాణ లక్ష్యంగా పోరాటాలు ముందుకు సాగాలి. కార్పొరేటుల రాజ్యంలో కాటలాన్‌లైనా, కశ్మీర్‌లైనా చరిత్ర మొత్తం రక్తతర్పణాలు చేస్తూనే అంతిమ విజయం సాధించాలి. కార్మికవర్గ నాయకత్వంలో సమసమాజ లక్ష్యంగా జాతుల విముక్తి పోరాటాలు ముందుకు సాగాల్సి ఉంటుంది. కాటలోనియా స్వతంత్ర పోరాటాన్ని సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంలో భాగంగా అభివృద్ధి చేయడం, మద్దతును అందించడం ప్రపంచ కార్మికవర్గం బాధ్యత. ○

# వలస పోవద్దు, మెరుగైన జీవితం కోసం పోరాటమే మార్గం!

పొట్ట కూటి కోసం దూరతీరాలకు వలస పోవడం అనేది తరతమ తేడాలతో దేశవ్యాప్తంగా ఉన్న సమస్యే. ఛత్తీస్‌గఢ్‌లోనూ ఈ సమస్య తీవ్రంగా వుంది. ఇక్కడి వార్తా పత్రికల్లో తరచూ ఇట్లా వలస పోయిన కూలీల గురించిన వార్తలూ, కథనాలు చోటు చేసుకుంటుంటాయి.

ఈ సమస్య ఈనాటిది కాదు. బ్రిటిష్ కాలంలోనే ఇక్కడ వలసలు ప్రారంభమయ్యాయి. ఆ రోజుల్లోనే అస్సాం టీ తోటల్లో పని చేయడానికి ఇక్కడి నుండి కూలీలను తీసుకొని పోయినట్టుగా చరిత్ర చెబుతున్నది. ఢిల్లీలో ఒక ఛత్తీస్‌గఢ్ బస్తీ వుండడం కూడా ఇక్కడి వలస తీవ్రతను అర్థం చేయిస్తుంది.

ఆదివాసీ జనాభా ఎక్కువగా నివసించే అటవీ ప్రాంతంలోనూ ఈ సమస్య తీవ్రంగానే వుంది. ఈ మధ్య కాలంలో విపరీతంగా పెరుగుతున్నది. ఈ ప్రాంతానికే పరిమితమై ఈ సమస్యను చర్చించుకుందాం.

ఈ ప్రాంతం నుండి ఈ మధ్య కాలంలో వలసలు పెరగడానికి మూడు కారణాలు కనిపిస్తున్నాయి. మొదటిదీ, ప్రధానమైనదీ ఆర్థిక కారణమే. వ్యవసాయం, అటవీ ఉత్పత్తులు రెండూ ఇక్కడి ప్రజల జీవనాధారాలుగా వున్నాయి. దేని మీద ఎంత ఆధారపడుతారనే ప్రశ్నకు అటవీ ప్రాంతమంతటా ఒకే జవాబు రాదు. ఎందుకంటే అటవీ ప్రాంతమంతా ఏకశిలా సదృశం కాదు. మైదాన ప్రాంతాలకు దగ్గరగా వున్న గ్రామాల్లో వ్యవసాయమే ప్రధానంగా వుంటే, లోతట్టు గ్రామాల్లో రెండూ కుడి ఎడమలుగా వుంటాయి. ఒక సంవత్సరం వ్యవసాయంలో ఎక్కువ ఆదాయం వస్తే, మరో సంవత్సరం అటవీ ఉత్పత్తుల ద్వారానే ఎక్కువ ఆదాయం వచ్చే పరిస్థితి వుంటుంది. దట్టమైన అడవులు, కొండల మధ్య వున్న మరి కొన్ని గ్రామాల్లో అటవీ ఉత్పత్తులే మొదటి స్థానాన్ని ఆక్రమిస్తాయి. ఒకటీ, అరా అయినప్పటికీ పాడి, చేతి వృత్తుల మీద ఆధారపడే కుటుంబాలు కూడా చాలా గ్రామాల్లో వుంటాయి. ప్రాథమిక విద్యనే గగనం కనుక ఉద్యోగాల శాతం అత్యంత స్వల్పం. లోతట్టు గ్రామాల్లో చాలా అరుదుగా ఎక్కడో ఒకచోట చప్రాసీ, అంగన్‌వాడీ, టీచర్ వంటి ఉద్యోగాలు చేస్తున్న వాళ్లు కనబడుతారు. మొత్తంగా చూసుకుంటే ఉపాధి కల్పనలో వ్యవసాయానిదే మొదటి స్థానం.

కానీ, అది చాలా వెనకబడి వుంది. దశాబ్దాలుగా ప్రభుత్వాలు చేసిన ఘోర నిర్లక్ష్య ఫలితమిది. ఇక్కడి వ్యవసాయం పూర్తిగా వర్షాధారమే. సాగు పద్ధతులు కూడా చాలా ప్రాథమిక దశలోనివి. కొన్ని లోతట్టు గ్రామాల్లో నాగలితో దున్నడం తెలియదు. దున్నే చోట్ల నాట్లు వేయడం తెలియదు. ప్రజలను అటువైపు మరలించే ప్రయత్నాలు ప్రభుత్వాలు ఏనాడు చేయలేదు. వాటికా ఉద్దేశం కూడా లేదు. వ్యవసాయాన్ని ఆధునికం చేయడమన్నది పెద్ద మాట. కనీసం సాంప్రదాయకంగా అమలవుతున్న సాగు పద్ధతుల్లో మెరుగుదల తీసుకురావాలన్నా సాగునీటి వసతి కల్పించడం అన్నది ప్రాథమిక షరతుగా వుంటుంది. ప్రజా శ్రేయస్సు పట్టని ప్రభుత్వాల నుంచి ఇటువంటివి ఆశించలేం. ఫలితంగా ఇక్కడ పంటల దిగుబడి చాలా తక్కువ.

ఇక్కడ తిండి కోసం పూర్తిగా వ్యవసాయం మీదనే ఆధారపడాల్సిన అవసరం లేదు. ప్రకృతి సహజంగా లభించే ఆకులు, కాయలు, పండ్లు, దుంపలు, చేపలు, ఎండ్రకాయలు, మరెన్నో రకాల అటవీ జంతువులు ఇక్కడి ప్రజల ఆహారంలో ప్రధానంగా వుంటాయి. కాబట్టి పంటలు తక్కువ పండినప్పటికీ ప్రజలకు పస్తులుండే పరిస్థితి రాదు. ఆకలి చావులు అసలే వుండవు. వ్యవసాయ పెట్టుబడి ఖర్చు చాలా తక్కువ. శ్రమే వాళ్ల ప్రధాన పెట్టుబడి. కనుక అప్పు చేసే పరిస్థితి వుండదు. ఆత్మహత్యలు చేసుకొనే పరిస్థితి అసలే వుండదు.

అటవీ ఉత్పత్తుల సంగతి చూస్తే – ఇప్పపూలు, చింతపండు, మామిడి పండ్లు, లక్క, సారపప్పు, పట్టు, చీపురు వంటివెన్నో దొరుకుతాయి. వెదురు దొరికే చోట గంపలు, బుట్టలు వంటివి తయారు చేసి అమ్మడం కూడా వుంది. అటవీ ఉత్పత్తుల లభ్యత అన్ని గ్రామాల్లో ఒకేలా వుండదని చెప్పుకున్నాం. దొరికే రకాల్లో కూడా వైవిధ్యం వుంటుంది. ఒకే గ్రామంలో సైతం ప్రతీ ఏడూ ఒకేలా దొరకవు. ఎక్కువ తక్కువలు వుంటూ ఉంటాయి.

అటవీ ఉత్పత్తులను అమ్మడం ద్వారా ఆహారేతర అవసరాలను తీర్చుకుంటారు. కొంతమంది వ్యవసాయోత్పత్తులను కూడా అమ్ముకుంటారు. తునికాకు సేకరణ, వెదురు నరకడం ద్వారా కూడా ప్రతి సంవత్సరం కొంత ఆదాయం వస్తుంది. నిజానికి ఇక్కడి ప్రజానీకం తీర్చుకునే ఇతర అవసరాలు చాలా తక్కువ. బయటి సమాజం నిత్యావసరాలుగా భావించేవెన్నో ఇక్కడి సమాజానికింకా అవసరాలుగా మారనే లేదు. ఇక అక్కడి విలాసాలు ఇక్కడి ఊహకే అందనివి. బట్టలు, పెళ్లిళ్లు, పండుగలే ఇక్కడి ప్రధాన ఆహారేతర అవసరాలు. వైద్యం, విద్య వంటి వాటికి పెడుతున్న ఖర్చు చాలా తక్కువ. లోతట్టు ప్రాంతాల్లో సైకిల్, రేడియో, చేతి గడియారాలు వంటివి ఇప్పటికీ విలాస వస్తువులే.

వ్యవసాయ ఉత్పత్తులకైనా, అటవీ ఉత్పత్తులకైనా ప్రభుత్వం

గిట్టుబాటు ధరలు నిర్ణయించడం లేదు. నిర్ణయించిన ధరలనైనా సంతల్లో వ్యాపారులు చెల్లించడం లేదు. కొలతలు, తూకాల్లో మోసాలు సర్వసాధారణం. తునికాకు తెంపడం, వెదురు నరకడం వంటి పనులకు శ్రమకు తగిన వేతనం చెల్లించడం లేదు. అటవీ, వ్యవసాయోత్పత్తుల గిట్టుబాటు ధరల కోసం విప్లవోద్యమ నాయకత్వంలో ప్రతి సంవత్సరమూ జరిగే ప్రజాపోరాటాల మూలంగా కొంతమేరకు ధరలు పెరుగుతున్నాయి. అయినప్పటికీ ప్రజల కనీస అవసరాలు తీరడం లేదు. ఫలితంగా తల్లిదండ్రులనూ, భార్యా పిల్లలనూ, ఇండ్లూ వాకిళ్లనూ వదులుకొని తమ శ్రమను అమ్ముకోవడానికి దూరతీరాలకు సాగిపోతున్నారు.

ఇక వలసకు రెండో కారణం సాంస్కృతికపరమైనది. లోతట్టు గ్రామాల్లోకి చొచ్చుకు వస్తున్న సామ్రాజ్యవాద విష సంస్కృతి ఇక్కడి యువతలో లంపెనైజేషన్‌ను పెంచుతున్నది. కాబట్టి సరదాగా తిరిగి రావాలనే, పట్టణాలు చూడాలనే కోరికతో కూడా కొంత మంది వలస వెళ్తున్నారు. పెట్టుబడిదారీ వినిమయ సంస్కృతి యువతలో మంచి బట్టలు, మొబైల్ ఫోన్లు, గడియారాలు, సైకిల్ మోటార్లు తదితర వస్తువులను కొనుక్కోవాలనే కోరికలను పెంచుతున్నది. మొబైల్ టవర్లు లేని లోతట్టు గ్రామాల్లో కూడా సినిమాలు చూడ్డానికీ, పాటలు వినడానికి ప్రతి ఒక్కరూ మొబైల్ ఫోన్లు కొంటున్న పరిస్థితి వుంది. ఈ వస్తువులు కొనుక్కోవాలనే లక్ష్యంతోనే వలస పోతున్న వాళ్లు ఎందరో.

ఇక మూడో కారణం. పోలీసు నిర్బంధం. దీన్ని రాజకీయ కారణంగా చెప్పుకోవచ్చు. విప్లవోద్యమాన్ని అణచివేసే లక్ష్యంతో మొదటి నుండీ ఇక్కడ నిర్బంధం కొనసాగుతూనే వుంది. ప్రస్తుత ఆపరేషన్ గ్రీన్‌హంట్‌లో భాగంగా అది తీవ్ర రూపం దాల్చింది. గ్రామాలపై దాడులు, అరెస్టులు, చిత్రహింసలు, జైలు నిర్బంధాలు, బూటకపు ఎన్‌కౌంటర్లు, మహిళలపై లైంగిక అత్యాచారాలు సర్వ సాధారణమయ్యాయి. విప్లవోద్యమ కార్యకలాపాలతో సంబంధం వున్న వాళ్లపైనే కాదు, సంబంధం లేని వాళ్లపైనా ఈ నిర్బంధం కొనసాగుతున్నది. ఈ నిర్బంధాన్ని ఎదుర్కొనేందుకు వాళ్ల ముందు వున్న సరైన మార్గం ప్రతిఘటనే. నిరాయుధంగానో, సాయుధంగానో, సంఘాల్లో, మిలీషియాలో పని చేస్తూనో, పీఎల్‌జీఏ భర్తీ అయ్యో మొత్తంగా ప్రతిఘటన మాత్రమే ఈ నిర్బంధాన్ని ఓడించే ఆయుధం. అటువంటి సంసిద్ధత లేనివాళ్లు నిర్బంధం నుండి పారిపోయే మార్గంగా వలసను ఎన్నుకుంటున్నారు.

ఒకసారి పోయి వచ్చిన వాళ్లు చెప్పే ఆకర్షణీయమైన మాటలు అమాయకంగా నమ్మి పోతున్న వాళ్లు కొందరు. ఏజెంట్ల ప్రోద్భలంతో పోతున్న వాళ్లు మరి కొందరు.

**స్వేచ్ఛా జీవితం నుండి అర్ధ బానిసత్వంలోకి**

సాధారణంగా ఇక్కడి నుండి తమిళనాడు, కర్నాటక. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ తదితర రాష్ట్రాలకు వెళ్తున్నారు. ఎక్కువగా భవన నిర్మాణంలో, బోరింగ్ గాడీల్లో, కోళ్ల ఫారాల్లో, కట్టెకోత మిషన్లలో పనులకు కుదురుతున్నారు. కొంత మంది ఛత్తీస్‌గఢ్‌లోని వివిధ పట్టణాలకు ముఖ్యంగా రాయ్‌పుర్, ధమ్‌దరి, దుర్గ్‌లకు వలసపోతున్నారు. ఇక్కడి బియ్యం, పప్పులూ, కట్టెకోత మిల్లుల్లో పనిచేస్తున్నారు. మెజారిటీ యువతీ యువకులే వెళ్తున్నారు. యువతులైతే దాదాపుగా పెళ్లి కాని వారే వెళ్తున్నారు. చాలా అరుదుగా పెళ్లయి, ఇంకా పిల్లలు పుట్టని యువతులు, తమ భర్తలతో కలిసి వెళ్తున్నారు. భార్యా పిల్లల్ని వదిలి నడీడు పురుషులు కూడా ఎక్కువ సంఖ్యలోనే వెళ్తున్నారు. ఇలా వెళ్తున్న వారిలో బాల బాలికల సంఖ్య కూడా తక్కువేమీ వుండడం లేదు.

వీళ్లు అనేక రకాలుగా మోసపోతారు. నెలకు ఇన్ని వేలు ఇస్తారని ఏజెంటు ఇక్కడ చెప్తాడు. తీరా అక్కడికి వెళ్లిన తర్వాత తక్కువ ఇస్తామంటారు. అంత దూరం వెళ్లాక చేసేదేమీ లేక పనిలోకి దిగుతారు. ఆ ఇచ్చే పైసలు కూడా నెల నెలా ఇవ్వరు. తమ ప్రాంతాలకు తిరిగి వెళ్లేటప్పుడు ఇస్తామంటారు. కొన్ని చోట్ల తిండి వాళ్లే పెడుతారు. కొన్ని చోట్ల వీళ్లే వండుకొని తింటారు. తిండి వాళ్లే పెడితే నెలకో 50 రూపాయలు చిల్లర ఖర్చులకు ఇస్తారు. వీళ్లే వండుకొని తినేట్టయితే బియ్యం, ఉప్పులు, పప్పుల కోసం వారానికింత చొప్పున ఇస్తారు. ఇవన్నీ వాళ్లకు ఇచ్చే జీతంలో కట్ చేస్తారు. పురుషులతో సమానంగా చేసినప్పటికీ మహిళలకు పురుషులతో సమానంగా కూలీ ఇవ్వరు.

దాదాపు ఎవరూ ఒంటరిగా వెళ్లరు. ఒక జట్టుగా వెళ్తారు. అయితే అట్లా వెళ్లిన వాళ్లను చాలా మేరకు విడగొట్టి, వేర్వేరు చోట్ల పెడతారు. అట్లా వాళ్ల సంఘటితత్వాన్ని దెబ్బ తీసి వాళ్లను మానసికంగా బలహీనుల్ని చేస్తారు.

సాధారణంగా వీళ్ల చేత ఎక్కువ గంటలు పని చేయిస్తారు. ఎనిమిది గంటల పని దినం ఎక్కడా అమలు కాదు. సాధారణంగా రోజుకు 12 గంటలు చేయాల్సి వుంటుంది. బోర్ గాడీల్లో పని చేసేవాళ్లకు, స్లాబ్‌లు వేసేవాళ్లకు ఒక్కోసారి కొంచెం కూడా నిద్ర, విశ్రాంతి వుండదు. 24 గంటలూ పని చేయాల్సి వస్తుంది. ఇటువంటి చోట్ల మధ్యాహ్నం అన్నం తిని కాస్సేపు కూడా విశ్రాంతి తీసుకోకుండా వెంటనే పనిలోకి దిగాల్సి వుంటుంది.

వ్యవసాయ పనులు ముగిశాక నవంబర్, డిసెంబర్ నెలల్లో ఎక్కువగా వెళ్తారు. ఎన్ని నెలలకు తిరిగి రావాల్సో ముందే నిర్ణయించుకొని వెళ్తారు. కొందరు ఇప్పపూవు రాలే మార్చి నెలలో

రావాలనుకుంటారు. మరికొందరు వ్యవసాయపు పనులను అందుకోవడానికి తొలకరి వర్షాలకు ముందే రావాలనుకుంటారు. ఎప్పుడంటే అప్పుడు తిరిగి రావచ్చని ఏజెంటు నమ్మబలుకుతాడు. కానీ తిరిగి రావడం వీళ్ల చేతిలో వుండదు. కాంట్రాక్టర్లు రానివ్వరు. మేం అయిదు నెలలే వుంటామని చెప్పాం అని కూలీలంటే, పది నెలలు వుంటారని చెప్పి మీ ఏజెంటు పైసలు తీసుకుపోయాడని కాంట్రాక్టర్లు అంటారు. ఇక్కడ ఏజెంటు మోసం చేశాడో తెలియదు. కాంట్రాక్టర్ మోసం చేస్తున్నాడో తెలియదు. ఇద్దరూ చేయడానికి అవకాశాలు మెండుగా వున్నాయి. కొంత కాలానికి గాను వాళ్లను కొనుక్కున్నట్టే కాంట్రాక్టర్లు ప్రవర్తిస్తారు. మనుషులను ఎత్తుకొచ్చి బానిసలుగా అమ్మడం, కొనడం చేసేవారని మనం చరిత్రలో చదువుకున్నాం. ఇక్కడ ఏజెంట్లు ఎత్తుకుపోరు. మాయమాటలు చెప్పి తీసుకుపోతారు. ఆరు నెలల కోసమో, పది నెలల కోసమో వాళ్లను కాంట్రాక్టర్లకు అమ్మివేస్తారు. బలవంతంగా పడి వుండడం తప్ప వీళ్ల ముందు మరో గత్యంతరం వుండదు. చదువుకోని, తమ మాతృభాష గోండీనో, హల్బీనో తప్ప మరో భాష తెలియని వాళ్లు ఆ మహా నగరాల నుంచి పారిపోయి రావడం కష్టం. పారిపోయే వాళ్లను పట్టుకొని తిరిగి అప్పజెప్పడానికి కాంట్రాక్టర్ల చేతిలో గూండాలు కూడా వుంటుంటారు. ఎలాగోలా రాగలిగినా అట్లా వస్తే వాళ్లకు పైసా దక్కదు. ఏ నెల జీతం ఆ నెల ఇవ్వనిది, వాళ్లను అట్లా నిర్బంధంగా వుంచడానికే. కాంట్రాక్టర్లు ఈ కూలీల పట్ల ఎంత అమానవీయంగా ప్రవర్తిస్తారంటే వాళ్ల కుటుంబ సభ్యులు ఎవరైనా అనారోగ్యానికి గురైనట్టు తెలిసినా, ఆఖరికి చనిపోయినా పంపరు. ఒకవేళ పంపినా మళ్లీ రావాలని చెప్పి ఒక్క పైసా కూడా ఇవ్వకుండా పంపుతారు. బయటి సమాజంలో విప్లవోద్యమ పూర్వపు రోజుల్లో భూస్వామ్య విధానం బలంగా వున్న చోట కట్టు బానిసత్వం అమల్లో వుండేది. దీని ప్రకారం అప్పు తీసుకొన్న వాళ్లు అప్పు ఇచ్చిన వాళ్లకి జీతం వుండాలి. అప్పు తీర్చే దాకా వాళ్ల కష్టాన్ని యజమానులు ఉత్త పుణ్యానికి దోచుకుంటారు. మధ్యలో జీతం మానేసే అవకాశం వుండేది కాదు. ఇప్పటి వలస కూలీలపై అమలవుతున్న దోపిడీ అంతకంటే ఘోరం అనిపిస్తుంది. కట్టుబానిసత్వంలో ఇచ్చిన పైసల కింద కష్టం చేయించుకునేవాళు _. కానీ ఇక్కడ పైసలేమీ ఇవ్వకుండానే, ఇస్తామని ఆశ చూపి కష్టం చేయించుకుంటున్నారు.

వలస కాలమంతా కొంత మందికి తమ కుటుంబ సభ్యుల బాగోగుల గురించి ఏమీ తెలువదు. కొంత మంది మాత్రం తమ ఏజెంట్లకు ఫోన్ చేసి సమాచారం తెలుసుకుంటారు.

ఇక తిండి, వసతి, పని పరిస్థితులు చాలా ఘోరంగా వుంటాయి. నాసి రకం బియ్యం, అగ్గువకు దొరికే కూరగాయలు, మసూరి పప్పుతో రుచీ, పచీ లేని తిండి పెడతారు. మురుక్కాలువల పక్కనే వంట చేయడం, తినడం ఇక్కడి వాళ్లకు సహించని విషయం. ఒకే గదిలో చాలా మందిని ఉంచుతారు. గబ్బు కొట్టే బాత్‌రూంలు, లెట్రిన్లు వాడడానికి వీళ్లు చాలా ఇబ్బంది పడుతారు. మహిళలకు ఈ పరిస్థితి మరీ ఇబ్బందిగా వుంటుంది. తమిళనాడు వంటి ప్రాంతాల్లో బోరింగ్ గాడీల్లో పని చేసేవారికి పదిహేను, నెల రోజులకోసారి కూడా స్నానం చేయడానికి నీళ్లు దొరకవు.

వేగంగా పని చేయమని నిరంతరం అదిలిస్తూ వుంటారు. తిట్లు, దెబ్బలు, అవమానాలు, ఎగతాళి సర్వ సాధారణం. జాతి పేరిట కూడా అవమానిస్తారు. ఇట్లా ఆత్మ గౌరవాన్ని చంపుకొని పడి వుండాల్సి వుంటుంది. ఇక మహిళలపై కాంట్రాక్టర్లు, సూపర్‌వైజర్లు, మేస్త్రీల లైంగిక వేధింపులు, అత్యాచారాలు సర్వ సాధారణం. మాయమాటలు చెప్పి వాళ్లను లోబరుచుకొనే ప్రయత్నాలు కూడా నిరంతరం వుంటాయి. వీటన్నింటికీ పరాకాష్టగా అమ్మాయిలను అమ్మేస్తున్న ఘటనలు కూడా జరుగుతున్నాయి. కొంతమంది మహా నగరాల రద్దీలో తప్పిపోయి ఏళ్ల తరబడి ఆచూకీ లేకుండా వున్నారు.

ఇక యిన్ని కష్టాలకు, ఇబ్బందులకోర్చుకొని కాంట్రాక్టరు పోవడానికి అనుమతినిచ్చే వరకూ పని చేసి తిరుగు ప్రయాణం కడితే వాళ్ల కష్టార్జితాన్నంతా ఇవ్వరు. ఏవేవో సాకులు చెప్పి సగం పైసలు మాత్రమే చేతిలో పెడుతారు. బకాయి పైసల కోసం మళ్లీ రమ్మంటారు. వెళ్తే మరి కొంత కాలం పని చేయించుకొంటారు. వెళ్లకపోతే వాళ్ల కష్టార్జితాన్ని కాజేస్తారు. మరీ అమాయకులకు బస్సు కిరాయిలు మాత్రమే చేతిలో పెడతారు. ఎంతోమంది నెలల తరబడి రెక్కలు ముక్కలు చేసుకొని ఖాళీ చేతులతో తిరిగి వస్తారు. అనారోగ్యాలకు గురై మధ్యలో వచ్చే వాళ్లకు కూడా సరిగా పైసలు ఇవ్వరు. కొందరికి అసలే ఇవ్వరు.

అనారోగ్యం మూలంగానో, పని స్థలాల్లో ప్రమాదవశాత్తుగానో చనిపోతే నష్ట పరిహారం కాదు కదా మృతుల కష్టార్జితాన్ని కూడా ఇవ్వరు. యాజమాన్యం ఇచ్చినా ఏజెంట్లు కాజేసే సందర్భాలు కూడా వుంటాయి.

ఇక్కడ ఏ చట్టాలూ అమలు కావు. చట్టం ప్రకారం ఇవ్వాల్సిన కనీస వేతనం ఇవ్వరు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వకుండా మహిళలకు తక్కువ కూలీ ఇస్తారు. బాల కార్మికుల నిషేధ చట్టం సాక్షిగా బాల బాలికల చెమటనూ, రక్తాన్నీ కూడా పిండుకుంటూ అధిక లాభాల్ని సంపాయించుకుంటున్నారు.

ఏజెంట్లు, కాంట్రాక్టర్లు, యజమానులు చేసే దోపిడీ, దౌర్జన్యాలు,

మోసాలను మౌనంగా భరించడం తప్ప మరో మార్గం వుండదు. ఇటువంటి వారి సమస్యల కోసం పని చేసే కొన్ని సంస్థలున్నాయి. అవి ఎంత చిత్తశుద్ధితో పని చేస్తాయన్నది వేరే సంగతి. కానీ వలస వెళుతున్న వారిలో దాదాపు నిరక్షరాస్యులే వుంటారు. చదువుకున్నా చాలా ప్రాథమికంగానే వుంటుంది. కాబట్టి వాళ్ల సమస్యలను అటువంటి సంస్థల దృష్టికి తీసుకెళ్లే పరిస్థితి కూడా వాళ్లకు వుండదు. సరిగ్గా ఇందుకే ఇటువంటి వాళ్లను పనిలో పెట్టుకుంటారు.

**పనికి రాని చట్టం**

ఉపాధి పెంచడం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రవేశపెట్టబడిన మన్‌రేగా, స్వయం ఉపాధి పథకాలు నిష్ప్రయోజనంగా తేలిపోయాయి. ఫలితంగా రోజు రోజుకూ వలసలు పెరుగుతూనే వున్నాయి. వలసకూలీల వెతల గురించిన కథనాలు ప్రసార, ప్రచార మాధ్యమాల్లో చోటు చేసుకోవడం మూలంగా దీనిని నియంత్రించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఒక చట్టాన్ని చేసింది.

ఈ చట్టం ప్రకారం ఎవరు వలసపోయినా ముందుగా పోలీసు స్టేషన్లో ఎక్కడికి వెళ్తున్నారు? ఎంత మంది వెళ్తున్నారు? ఏజెంటు ఎవరు? తదితర అన్ని వివరాలు ఫోటో సహా ఇచ్చి వెళ్లాలి. అట్లా ఇవ్వక పోతే ఏజెంట్లను పోలీసులు అరెస్టు చేస్తారు. తీసుకెళ్తున్న వాళ్లను వెనక్కి పంపిస్తారు. ఈ చట్టం కూలీలకు ఒనగూర్చిన ప్రయోజనం మాటేమో గానీ పోలీసుల జేబులను మాత్రం నింపుతున్నది. రైల్వే స్టేషన్లలో, బస్టాండ్లలో కాపేసి ఇట్లా పోయేవాళ్లను పట్టుకొని ఏజెంట్ల దగ్గర పైసలు తీసుకొని వదిలేస్తున్నారు. ఇది క్రమంగా ఏజెంట్లు, పోలీసుల నడుమ కుమ్మక్కుకు దారి తీస్తున్నది. ఫలితంగా ఏజెంట్లు తాము తీసుకెళు_న్న వారిలో సంఘ సభ్యుల, ఉద్యమ సానుభూతిపరుల వివరాలను పోలీసులకు ఇస్తున్నారు. ఆ వివరాలపై ఆధారపడి పోలీసులు వెళు_న్నప్పుడో, వస్తున్నప్పుడో వాళ్లను పట్టుకొని నయానో, భయానో ఇన్ఫార్మర్లుగా తయారు చేయడానికి ప్రయత్నిస్తున్నారు. కొంత మేరకు సఫలం అవుతున్నారు. ఇది ప్రజలకు, ఉద్యమానికి చాలా చేటు చేస్తున్నది. ప్రజల ఐక్యతను దెబ్బ తీస్తున్నది.

**వలస వేస్తున్న ప్రభావం**

కొంత మంది ఖాళీ చేతులతో వచ్చినా మెజారిటీగా ఎంతో కొంత సంపాదించుకుని వస్తున్నారు కనుక ఇక్కడి ఆర్థిక స్థితిలో మెరుగుదల వస్తుందని పైపైన పరిశీలిస్తే అనిపిస్తుంది. కానీ లోతుగా పరిశీలిస్తే వలస మూలంగా ఈ ప్రాంతానికి జరుగుతున్న నష్టం అవగతమవుతుంది. ఇక్కడి ఆర్థిక వ్యవస్థకు నష్టమే వాటిల్లితున్నది. సంపాయించుకొని తెచ్చిన పైసలతో కొంత మంది ఎడ్లు కొనుక్కుంటున్నారు. భూములు చదును చేయించుకొంటున్నారు. ఇది వ్యవసాయాభివృద్ధికి దారితీస్తుందనిపించవచ్చు. కానీ వలస వెళ్లిన వాళ్లెవరూ సకాలంలో తిరిగి రాకపోవడం వల్ల అదను దాటిపోయి, వ్యవసాయ పనులు కుంటుపడుతున్నాయి. ఒక మనిషి తక్కువైనా ఆ మేరకు అటవీ ఉత్పత్తుల సేకరణ కూడా ప్రభావితం అవుతుంది. కూలికి పోవడం మూలంగా ఇక్కడి ఆర్థిక వ్యవస్థకు జరుగుతున్న నష్టాన్ని, కూలికి పోయి సంపాదించిన ఆదాయం పూడ్చలేదు.

**ఈ దోపిడీని అర్థం చేసుకోవడానికి పూర్వ బస్తర్ డివిజన్‌లో చేసిన ఒక సర్వే గణాంకాలు చూడండి**

| జిల్లా | పంచాయితీ | కూలీల సంఖ్య | ఇవ్వజూపిన కూలీ (అందరి మొత్తం) | ఇచ్చిన కూలీ (అందరి మొత్తం) | దోపిడీ (మొత్తం) |
|---|---|---|---|---|---|
| కొండగాం | వెచ్చ | 27 | 9,36,645 | 3,77,800 | 5,58,845 |
| కొండగాం | మాందొడ | 14 | 5,46,430 | 3,31,530 | 2,14,900 |
| కొండగాం | వెడమ | 7 | 80,000 | 39,400 | 41,000 |
| కొండగాం | కిల్లం | 4 | 92,400 | 61,500 | 30,900 |
| బీజాపూర్ | ఆదెవేడ | 19 | 5,60,760 | 5,17,760 | 43,000 |

ఇక్కడి ఆర్థిక వ్యవస్థను విప్లవీకరించడానికి విప్లవోద్యమం విశేషమైన కృషి చేస్తున్నది. దాన్నొక అభివృద్ధి నమూనాగా ఈ దేశ ప్రజల ముందు పెడుతున్నది. ఆర్థిక వ్యవస్థ విప్లవీకరణకు జల్, జంగల్, జమీన్‌లను కాపాడుకోవడం మొదటి షరతు. సుదీర్ఘ రాజకీయ కృషి ద్వారానే ఇది సాధ్యం. ప్రజలు, ముఖ్యంగా యువత ఈ కృషిలో పెద్ద ఎత్తున భాగం కావడం ద్వారానే ఈ ప్రక్రియ వేగవంతం అవుతుంది. సారవంతమైన భూములు, అపారమైన

ప్రకృతి వనరులకు తాము హక్కుదారులమనీ, వాటిని సరిగా వినియోగించుకోవడం ద్వారానే తమ బతుకులను శాశ్వతంగా మార్చుకోవాలనే చైతన్యం ప్రజల్లో రేకెత్తినప్పుడే వాళ్ల భాగస్వామ్యం పెరుగుతుంది. కానీ తాత్కాలిక వెసులుబాటు కోసం వలస వెళ్లడం అనేది శాశ్వత పరిష్కారం దిశగా కృషి చేయాలనే చైతన్యాన్ని మసకబారుస్తుంది. ఇది ఇక్కడి సమాజపు భవిష్యత్‌కే కాదు, దేశ భవిష్యత్‌కే పెద్ద ప్రమాదం.

సాంస్కృతికంగా కూడా పెద్ద నష్టం జరుగుతున్నది. ఆటా పాటా ఇక్కడి సంస్కృతిలో విడదీయరాని భాగంగా వుంటాయి. సినిమాలూ, టీవీలు బయటి సమాజంలో ఎన్నో కళా రూపాలను దెబ్బతీశాయి. ఆదివాసీ కళా రూపాలు కూడా ఆ ప్రభావానికి కొంత లోనవుతున్నప్పటికీ అవి శిథిలం కాలేదు. కూలికి పోయిన కాలంలో వీళ్లు తమ ఆట పాటలకు పూర్తిగా దూరంగా వుంటారు. ఒళ్లు హూనమయ్యే శ్రమ నుండి ఉపశమనం కోసం మొబైల్ ఫోన్లలో సినిమా పాటలు వింటారు. సినిమాలు చూస్తారు. సినిమా, టీవీల ప్రభావం బయటి సమాజాన్ని ఎంత వికృతం చేస్తున్నదో తెలియంది కాదు. ఆ ప్రమాదానికి ఆదివాసీ సమాజం కూడా లోనయ్యే ప్రమాదం వుంది. లంపెనైజేషన్, వినిమయ సంస్కృతి పెరుగుతున్న దాఖలాలు ఇప్పటికే కనబడుతున్నాయి. ఇక్కడి సంస్కృతిలో భాగంగా వున్న సమిష్టితత్వం తగ్గిపోయి పోటీతత్వం, వ్యక్తివాదం పెరిగే అవకాశాలున్నాయి. కూలీ పని చేసిన వాళ్లలో కొంత మంది హుషారైన వాళ్లు క్రమంగా ఏజెంట్లుగా మారి తమ తోటి వారిని మోసం చేయడానికి వెనుకాడ్డం లేదు. అంతేకాదు ఇక్కడి సమాజం శ్రమను గౌరవిస్తుంది. కాని నిర్బంధ శ్రమ మూలంగా శ్రమ పట్ల విముఖత ఏర్పడే అవకాశం ఉంది.

వలస మూలంగా ఆహారపు అలవాట్లపై దుష్ప్రభావం పడుతున్నది. ఆరోగ్యవంతంగా జీవించడానికి అవసరమైన సగటు పోషకాలు అందుతాయో లేవో కాని, ఇక్కడి తిండిలో వైవిధ్యానికి మాత్రం కొదవలేదు. బయటి సమాజంలో జీవించే వారికి అసాధ్యమైనవెన్నో ఇక్కడ దొరుకుతాయి. పైగా ఎరువులు, క్రిమి సంహారక మందులు, కాలుష్యం సోకనివి. వలస పోయినప్పుడు ఇవన్నీ దొరకక, అక్కడి తిండి సరిగా తినలేక వీళ్ల ఆరోగ్యాలు కూడా దీర్ఘకాలికంగా ప్రభావితం అయ్యే అవకాశం వుంది. కనీస విశ్రాంతి లేకుండా గొడ్డు చాకిరీ చేయడం మూలంగా కూడా ఆరోగ్యాలు దెబ్బతినే అవకాశం వుంది. ఇన్నాళ్లూ వీళ్లకు అలవాటు లేని బ్రాందీ, విస్కీలు లాంటివి తాగడం నేర్చుకుంటున్నారు. ఇది ఎన్నో రకాలుగా జీవితాలను ప్రభావితం చేస్తుంది.

సుదీర్ఘ కాలం పాటు పిల్లలకు తండ్రులు దూరంగా వుండడం, తల్లి దండ్రులకు ఎదిగిన పిల్లలు దూరంగా వుండడం, భార్యా భర్తలు ఒకరికొకరు దూరంగా వుండడం అనేది కుటుంబ సంబంధాలను తీవ్రంగా ప్రభావితం చేసే విషయం.

ఇక్కడ ఆత్మ గౌరవం సమస్య కూడా ముందుకొస్తుంది. అపారమైన ప్రకృతి సంపదలకు హక్కుదారులైన వీళ్లు అర్ధ బానిసల వలె అదిలింపులకు, బెదిరింపులకు, అవమానాలకు, అత్యాచారాలకు గురవుతూ అణిగిమణిగి వుండాల్సి వస్తుంది. ఈ స్థితి వాళ్ల చైతన్యాన్ని మసకబారుస్తుంది. వారిని మరింతగా బానిసత్వంలోకి నెడుతుంది.

ఇన్ని రకాలుగా దుష్ప్రభావాన్ని వేస్తున్న వలసలకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం వుంది. ఉపాధి అవకాశాలు పెరగడమే అందుకు మార్గం. 'మేక్ ఇన్ ఇండియా' 'మేక్ ఇన్ ఛత్తీస్‌గఢ్'లు ఉపాధి అవకాశాలను పెంచుతాయని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఊదరగొడుతున్నాయి. కానీ అవి ఇక్కడి వనరులను కార్పొరేట్లకు కట్టబెట్టి ఇక్కడి యువతను కూలీలుగా మార్చే కార్యక్రమాలు. ఇక్కడి విప్లవోద్యమం వ్యవసాయాన్ని అభివృద్ధి చేయడం ద్వారా, ఉపాధి అవకాశాలను పెంచే కృషి చేపట్టింది. అందులో భాగంగా ప్రతి ఏటా ఇక్కడి క్రాంతికారీ జనతన సర్కార్లు భూమి చదును కార్యక్రమం చేపడుతున్నాయి. ఈ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొంటున్న ప్రజలు వేలాది ఎకరాల భూమిని సాగుయోగ్యం చేసుకుంటున్నారు. నీటి వసతిని మెరుగుపర్చుకుంటున్నారు. కొత్తగా కల్పించుకుంటున్నారు. అటవీ ఉత్పత్తుల ద్వారా వస్తున్న ఆదాయాన్ని మెరుగుపర్చుకోవడానికి ప్రతీ సంవత్సరం ధరలు పెంపుదలకు పోరాడుతున్నారు. తునికాకు సేకరణ, వెదురు నరికివేతల రేట్లు పెంచుకోవడానికి పోరాడుతున్నారు. ఈ విప్లవ సంస్కరణలు, పోరాటాలు అన్నీ కూడా దోపిడీ సమాజాన్ని సమూలంగా మార్చే సుదీర్ఘ ప్రక్రియలో భాగమే. ఈ కార్యక్రమాలను, పోరాటాలను మరింత ఉధృతం చేయాలి. జల్-జంగల్-జమీన్‌లపై అధికారాన్ని, ఆత్మ గౌరవాన్ని పరిరక్షించుకునేందుకు ప్రజలు, ముఖ్యంగా యువత విస్తృతంగా పోరాటాల్లో కదలాలి. అప్పుడే వలస బతుకులకు అడ్డుకట్ట పడుతుంది. ○

**ఆదివాసులు అపారమైన ప్రకృతి సంపదలకు హక్కుదారులు**

**వారి వలస పాలకవర్గాల దుర్మార్గాల ఫలితం**

# ప్రపంచ తెలుగు మహాసభలు

## అగ్రకుల, భూస్వామ్య బ్రాహ్మణీయ సంస్కృతి, భావజాలం, సంస్కృత భాషలకు వేడుకలు జరిపి ప్రజల ఉద్యమ చరిత్ర సంస్కృతి, జీవ భాషను నిర్లక్ష్యం చేసాయి

5 రోజులు ఘనంగా తెలుగు మహాసభల ఉత్సవాలు హైదరాబాద్‌లో జరిగాయి. వేలాది మంది ప్రజలు హాజరయ్యారు. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, గవర్నర్, ముఖ్యమంత్రి లతో పాటు వందలాది మంది ప్రసంగాలు చేశారు. 1500 మంది కవితా గానం చేశారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అత్యద్భుతంగా వినియోగించి లేజర్ కిరణాల తళతళల్ని జిగేలుమనిపించారు. వెలుగు జిలుగుల బాణసంచా పేల్చారు. తెలంగాణ సాహిత్యానికి పట్టం కట్టే సభలు, భాషను కాపాడే సభలు తళుకు బెళుకుల్లో లక్ష్యాన్ని, పరమార్థాన్ని వదిలి భజన సంకీర్తనలతో కొనసాగి సమాప్తమయ్యాయి.

పాలకవర్గాలు రాచరికాలయినా, సంస్థానాలయినా ఆనాటి వలస పాలనలోనూ, తర్వాత దళారీల పాలనలోనూ, ఇప్పుడు కేసీఆర్ హయాంలోనూ భాషా సాహిత్యాలు, సంస్కృతిపై ఎలా ఆధిపత్యం కొనసాగిస్తాయో ఈ సభలతో స్పష్టమవుతుంది. పద్యానికీ, అవధానానికీ విశేష ప్రాధాన్యత నిచ్చి (80 గంటలు) కేసీఆర్‌ను కీర్తించడానికి, ఫ్యూడల్ భావజాలాన్ని వ్యాప్తి చేయడానికి ఈ సభలు ఉపయోగపడ్డాయి. ఆధునిక ప్రక్రియలకు నామ మాత్రపు సమయం ఇచ్చి నామ మాత్రంగానే నడిపించారు. సన్మానాలు, నగదు బహుమతులు అన్నీ బహు పసందుగా జరిపి ప్రజల డబ్బు వందల కోట్ల రూపాయలు 'రాజులు డబ్బు రాళ్ళపాలు చేసినట్లు' మంచి నీళ్ల ప్రాయంగా ఖర్చు చేసారు. సాహిత్యంపై సమగ్ర చర్చలేదు. వర్తమాన సాహిత్య ప్రక్రియలు, కళా సాంస్కృతిక ప్రక్రియలపై చర్చా వారి లక్ష్యం కాదు. నిజానికి వారి స్వభావానికి విరుద్ధం కూడా. సభలు ఆసాంతం ప్రజాస్వామిక ప్రక్రియ, పటిష్టమైన కార్యాచరణ పథకం కానరాలేదు.

తల్లి భాషలో విద్యా బోధనకు ప్రభుత్వం సహకరించిన దానికన్నా నిర్లక్ష్యం చేసిందే ఎక్కువ. చిత్తశుద్ధి లేని ప్రకటనలు మాత్రం కోకొల్లలు పత్రికల్లో పతాక శీర్షికలుగా వెలుగొందాయి. పిల్లల్లో సహజ సృజన, పరిశోధనా జిజ్ఞాస, వ్యక్తిత్వ వికాసంకు మాతృభాషలో విద్యాభ్యాసం చాల అవసరం. భాష పరిశోధకులు, సంస్కర్తలు, మేధావి వర్గం ప్రతిపాదనలు ఎన్నో చేశారు. ఆఖరుకు రాజ్యాంగం, చట్టాలు, న్యాయస్థానాల తీర్పులు ఎన్ని ఉన్నా మాతృభాషలో బోధనకు కట్టుబడింది లేదు. పరిశోధనలు లేవు. ప్రామాణిక నిఘంటువులు లేవు. ఇటువంటి పరిస్థితుల్లో యువతరానికీ, నూతన తరాలకూ భాష పట్ల ఆసక్తి ఎలా కలుగుతుంది?

ఎన్నెన్నో కళా రూపాలను, జానపద ప్రక్రియలను జనపదాలు తమ గుండెల్లో పొదుగుకున్నాయి. ఇందులో ప్రజల ఆశ, శ్వాస, ధ్యాస నిండుగా, మెండుగా ఉప్పొంగాయి. సాహితీ సాంస్కృతిక రంగాన జరిగిన కృషి గొప్పది. జాతిని, సంస్కృతిని, భాషను సుసంపన్నం చేసిన మహనీయుల కృషిని కొనసాగించాలి. **మానవ మస్తిష్కంలో పదిల పరుచుకున్న పురాతన ఆయుధం భాష.** ఆ భాషకు పట్టం కట్టి మహాసభలు జరుపుతూ ప్రజా పోరాటాలను, ఉద్యమ భాషను, ఉద్యమ సాహిత్యాన్ని, కళలను నిర్లక్ష్యం చేయడం ఎలా అర్థం చేసుకోవాలి?

వర్తమానంలో మన భాష స్థితిని విశ్లేషించుకొని, భవిష్యత్తులో అభివృద్ధికి మార్గాన్ని నిర్దేశించుకోవాలి. భాషా మహాసభల లక్ష్యం పరమార్థం అదే ఉండాలి. దోపిడీ పాలకవర్గాలు ప్రజల భాషను, కళా సాహిత్య సంస్కృతులను కొల్లగొట్టగల దిట్టలని, భజన పరుల బృందాలను తెలివిగా సమకూర్చుకుంటారని ఈ సభలు మరోసారి రుజువుచేశాయి.

తిరుపతిలో జరిగిన తెలుగు మహాసభల్ని బహిష్కరించిన ప్రజాకవి నందిని సిధారెడ్డికి దృక్పథంలో వచ్చిన లోపం కారణంగానే తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షుడయాడని, పాలకవర్గాల భాజా–భజంత్రీల్లో భాగమై తనివితీరా పులకిరిస్తున్న వాస్తవం బహిరంగమైంది.

అగ్రకుల భూస్వామ్య దోపిడీ పాలకవర్గాల బ్రాహ్మణీయ సంస్కృతిని, భాషను, భావజాలాన్ని ప్రచారం చేయడానికి, పాలకుల మీద వ్యక్తమవుతున్న ప్రజా నిరసనను పక్కదారి పట్టించడానికి ఈ సభలను నిర్వహించారు.

ఎన్‌కౌంటర్లు, రాజద్రోహం కేసులు, అరెస్టులు, కార్యాలయాలపై దాడులు, స్థూపాల నిర్మాణాల్ని అడ్డుకోవడం, పోరాడుతున్న రైతాంగానికి బేడీలేయడం, ఆదివాసీ పోడు భూములను దురాక్రమించడం, మల్లన్న సాగర్‌లో రైతాంగ బతుకులను ముంచడం, నేరెళ్ల దళితులపై పాశవిక దాడులు, ప్రజల నిరసన గళం విప్పే ధర్నాచౌక్ ఎత్తివేయడం, వాక్ స్వాతంత్రాన్ని అడ్డుకోవడం, కోదండరాం లాంటి నాయకులను నిర్బంధించడం చేస్తూ, ప్రజలలో పెరిగిన ఆగ్రహజ్వాలలు పక్కదారి పట్టించడానికే తెలుగు మహాసభల నిర్వహణ చేపట్టాడు కేసీఆర్.

హక్కులు హననం జరిగిన సందర్భాలలో చరిత్ర పొడవునా ప్రతి సారీ కవి, రచయిత, కళాకారుడు ప్రజల పక్షం వహించారు. శ్రమజీవుల ఆరాట పోరాటాలే రచనకు వస్తువులు అని భావించే వారే ప్రజా రచయితలు. కష్టజీవులకు ఇరువైపులా ఉండే వాళ్లే కవులు. ప్రజా కళాకారులు ప్రజల జీవన్మరణ పోరాటాలను గానం చేస్తున్నారు. అటువంటి కళాకారులను హత్యలు గావిస్తూ ప్రజా పోరాటాలను అణిచివేస్తూ, జరుపుతున్న ఈ ప్రపంచ తెలుగు మహాసభలను రెండు రాష్ట్రాల్లోని ప్రజా కవులు, కళాకారులు,

మేధావులు వివిధ రూపాల్లో నిరసిస్తూ ప్రకటనలు చేసారు.

కవులు, కళాకారులు అనధికార ప్రతిపక్షం. ప్రజల వాణిని, బాణిని వినిపిస్తారు. అటువంటి వారిని ఈ మహాసభల ద్వారా భాగం చేసుకోవడానికి పాలక వర్గాలు కుట్ర చేస్తున్నాయి. జాతి, భాష, సంస్కృతి, సాహిత్యం, కళలు వేటినీ అభివృద్ధి చేయని దోపిడీ పాలకవర్గాలు ఈ సభల ద్వారా బూర్జువా, భూస్వామ్య సంస్కృతికి నీరాజనం పడుతున్నాయి. శ్రమ జీవులకు విలువలేని, కలవారి వినోద కార్యక్రమాలుగా, పాలకులను పొగడ్తలతో ముంచెత్తే బట్రాజు మేళాలుగా మహాసభలు జరిగాయి. తెలుగు మహాసభల ద్వారా సాహిత్యాన్ని, సాహిత్య కారులను లోబర్చుకొని తమ వర్గంలో కలుపుకునే పాలకవర్గాల కుటిల నీతిని ఖండించాలి.

శ్రీశ్రీ నాయకత్వంలో మొదటి మహాసభలను బహిష్కరించినపుడు ప్రభుత్వం అరెస్టు చేసింది. తిరుపతిలో మహాసభలను నిరసించినప్పుడు కూడా ప్రభుత్వం విప్లవ రచయితలు, ప్రజాపక్షం వహించిన కవులు, కళాకారులను అరెస్టు చేసింది. ఇప్పుడు కూడా నిరసనను అడ్డుకొని 50 ఏళ్లుగా తెలంగాణ కోసం, తెలుగు సాహిత్యం కోసం అనుక్షణం శ్రమిస్తున్న విప్లవ రచయిత వరవరరావుతో సహా అనేక మంది ప్రజాపక్ష కళాకారులను అరెస్టు చేసింది.

తెలంగాణ సాహితీ ప్రముఖులను బయటకు తీసేందుకు, తెలుగు ప్రజల మాతృ భాషను విద్యా సంస్థలలో, ప్రభుత్వ కార్యాలయాల్లో అమలు చేసేందుకు తెలంగాణ భాష, సంస్కృతి, చారిత్రక ఔన్నత్యం కాపాడేందుకు ఈ సభలు నిర్వహిస్తున్నట్లు పాలకులు చెప్పుకున్నారు. యజ్ఞాలు, గుడులు, పండుగల చుట్టూ మొత్తం కార్యకలాపాలని తిప్పుతున్న కేసీఆర్ ఏ సంస్కృతిని అభివృద్ధి చేయాలనుకుంటున్నాడో అందరికీ స్పష్టమే. తెలంగాణ చరిత్ర, సంస్కృతి, భాష, సాహిత్యాలను తవ్వి తీసి సమున్నతంగా నిలిపి, గౌరవాన్ని కల్పించడం ప్రజల పక్షాన ఉన్న వారి బాధ్యత. అది ప్రజల చరిత్రగా, ప్రజల సంస్కృతిగా, ప్రజల జీవ భాషగా సాహిత్యంలో సజీవంగా ప్రతిఫలిస్తుంది. ప్రజా పీడకులు తమ దోపిడీ, పీడనలను కానరాకుండా చేసే జిమ్మిక్కుల్లో భాగంగా, పాలకవర్గాల దోపిడీ సంస్కృతుల ప్రతిబింబంగా నిర్వహించే ఈ మహాసభలు కేసీఆర్ కుటుంబ సభ్యులను పొగడ్తలతో ముంచెత్తడానికే పరిమితమయ్యాయి. పెట్టుబడిదారుల ఆశిస్సులతో, పాలకుల ఆదేశాలతో, బ్రాహ్మణీయ విలువలతో, తిరోగామి భావజాలంతో జరిగే సభలు ప్రజల డబ్బుతో పాలకులు పల్లకి ఎక్కడం తప్ప మరొకటి కాదు. దోపిడీ పాలనను, సంస్కృతిని వ్యతిరేకించడంలో భాగంగా విప్లవ ప్రజలు వీటిని బహిష్కరిస్తారు.

*(...........16వ పేజీ తరువాయి)*

రాజకీయ పునాది ఫాసిస్టు పునాది అని అర్థమవుతుంది.

అయితే అమెరికాలో పెరుగుతున్న రాజకీయ, ఆర్థిక, సామాజిక సంక్షోభంలో ప్రజలు సామ్రాజ్యవాదం బదులు సోషలిజాన్ని కోరుకుంటున్నారు. అమెరికా, బ్రిటన్లలో జరిగిన ఎన్నికల్లో బర్నీసాండర్స్, జర్మికార్బైను లాంటి బూర్జువా నాయకులు వెల్ఫేర్ స్టేట్ అనే ధోరణికి ఇప్పటివరకైతే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అందుకే వారికి కార్మికులు, నల్లజాతి ప్రజలు, వలస ప్రజల్లో ఎక్కువ ఆదరణ ఉంది. ఈ దేశాల్లో నిరుద్యోగం, తక్కువ జీతాలు, ఇల్లు కొనుక్కోలేని పరిస్థితి, ఉన్నత విద్యకు చేరలేని పరిస్థితి, వైద్య ఇన్సూరెన్స్ అందని పరిస్థితి లాంటి స్థితిలో ప్రజల్లో ప్రభుత్వాల తీవ్ర వ్యతిరేకత పెరిగింది. సమాజంలో అసమానతలు పెరిగిపోయాయి. ఇలా సామ్రాజ్యవాదానికి ప్రత్యామ్నాయంగా సోషలిజం వైపు ప్రజలు మొగ్గు చూపుతున్నారు. మరో వైపున నయా వలస విధానం యావత్తు వెనకబడిన దేశాల్లో బహిర్గతమై ప్రజలు ఈ విధానానికి వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధమవుతున్నారు. ప్రపంచ పర్యావరణానికి ప్రమాదకారులైన సామ్రాజ్యవాదం ప్రపంచ ప్రజల వ్యతిరేకత ఎదుర్కొంటున్నది. నేటి ద్రవ్య సంక్షోభం నుండి బయటపడడమెలాగో అంతుపట్టనీ బూర్జువా ఆర్థిక శాస్త్రవేత్తలు కూడా మళ్లీ మార్క్స్ కాపిటల్, లెనిన్ సామ్రాజ్యవాదాన్ని లోతుగా చదువుతున్నారు.

సామ్రాజ్యవాదమంటే మరణశయ్యపై ఉన్న పెట్టుబడిదారీ విధానమని, అది యుద్ధాన్ని కోరుకుంటుందని కామ్రేడ్ లెనిన్ చెప్పాడు. నేడు సామ్రాజ్యవాదం యుద్ధాలు లేకుండా జీవించలేని పరిస్థితి ఉంది. అది ప్రపంచమంతా ప్రత్యక్ష, ప్రచ్ఛన్న యుద్ధాల్లో పాల్గొంటున్నది. ప్రస్తుతం అమెరికా చైనాను చుట్టుముట్టి దెబ్బతీసే వ్యూహంతో పని చేస్తున్నది. దీనితో ప్రపంచ యుద్ధ వాతావరణం వేడెక్కుతున్నది. రేపు రాబోయే రోజుల్లో జరగబోయే యుద్ధం న్యూక్లియర్ యుద్ధంగా మారి ప్రపంచానికి ఎంతో విఘాతాన్ని కల్గిస్తుంది. అయితే ప్రపంచ ప్రజలు ఈ యుద్ధాన్ని ఎదుర్కొంటూనే, యుద్ధాన్ని అంతం చేసి విప్లవాలను కొనసాగించి సామ్రాజ్యవాదానికి ఘోరికట్టక తప్పరు. ఎందుకంటే ఇది విప్లవాల యుగం అని కామ్రేడ్ మావో చెప్పిన విషయం వాస్తవమవుతోంది.

మన దేశం ఆర్థిక మాంద్యంలోకి జారిపోయి కొట్టుమిట్టాడుతున్న పాలకవర్గాలు కూడా ఫాసిజాన్ని ఆశ్రయించి ప్రజా ఉద్యమాలను దెబ్బతీయ పూనుకుంటున్నాయి. కేంద్రంలో మోడీ నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వం బ్రాహ్మణీయ హిందూ ఫాసిజంతో పీడిత ప్రజలను, జాతులను అణిచివేస్తున్నది. దేశ ప్రజలు పాలకవర్గాల పార్టీలపై విశ్వాసాన్ని కోల్పోతున్నారు. వారు ప్రత్యామ్నాయం కోసం చూస్తున్నారు. ఇలాంటి విప్లవ పరిస్థితిలో మన పార్టీ ప్రజలకు సాహసోపేతంగా నాయకత్వం అందించాలి. బోల్షివిక్ విప్లవ స్ఫూర్తితో దేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయడానికి మనమంతా ఉత్సాహంగా ముందుకు సాగాలి.

★**మార్క్సిజం - లెనినిజం - మావోయిజం వర్ధిల్లాలి**

★**ప్రపంచ సోషలిస్టు విప్లవం వర్ధిల్లాలి**

నిర్బంధం

## దండకారణ్యం, తెలంగాణ లలో
# రోజురోజుకు పెరుగుతున్న నిర్బంధానికి వ్యతిరేకంగా పోరాడుదాం

నరేంద్రమోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం అడవులలోని సహజ వనరులను దోచుకోవడం కోసం ఆదివాసీ ప్రజలను అక్కడ నుంచి ఖాళీ చేయించడానికి, ఆ ప్రజల్లో బలంగా వెళ్లూనుకుని విప్లవోద్యమాన్ని నిర్మిస్తున్న మావోయిస్టు పార్టీని నిర్మూలించేందుకు కొత్తగా పెట్టుకున్న లక్ష్యం 'సమాధాన్ 2022'. కేంద్ర ప్రభుత్వం ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ప్రభుత్వాలు సమన్వయంతో 2లక్షల మంది పోలీసు, పారా మిలిటరీ బలగాలను సమన్వయించి నిరంతరం ఫాసిస్టు దాడులకు పాల్పడుతున్నారు. అందులో భాగంగా ఈ నడుమ జరిగిన ఆపరేషన్ ప్రహార్-2లో 2017 ఆగస్టు 16 నుండి 2018 జనవరి 10 నడుమ 60 మందికి పైగా కామ్రేడ్స్‌ను బూటకపు ఎన్‌కౌంటర్‌లో కాల్చిచంపారు. పశ్చిమ్ సబ్ జోన్‌లో 15 మంది కామ్రేడ్స్, ఉత్తర సబ్ జోన్‌లో 9 మంది కామ్రేడ్స్, దక్షిణ్ సబ్ జోన్‌లో 26 మంది కామ్రేడ్స్ అమరులయ్యారు.

2017 చివరిలో అమరులైన వారి వివరాల్లోకి వెళ్లితే పశ్చిమ్ సబ్ జోన్‌లో కా॥ మడ్కం రాజే (సోనీ) (ఏసీఎమ్) కా॥ మంగ్లి, కా॥ మంగ్డు, కా॥ కరణ్‌లతో పాటు డిసెంబరు 6న మహారాష్ట్ర-తెలంగాణ సరిహద్దు గ్రామం కల్లెడ అటవీ ప్రాంతంలో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో కా॥ మంగాపెందామ్ (ఐతూ, అశోక్)( ఏసీఎస్) సిరోంచా కమాండర్, కా॥ పల్లె చందూ (కుమ్మ) (ఏసీఎమ్), కా॥ సరిత (జ్యోతి) కమలా వడ్డే, కా॥ మహారీ ఆత్రం (అఖిలా), కా॥ రేలా కోవాసి, కా॥ కోర్చా మున్ని (**ప్రమీల/విమల ది ఛత్తీస్‌గఢ్ బీజాపూర్ జిల్లా, గంగాలూరు బ్లాకు కోర్మా గ్రామం. తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఆదిలాబాద్ డివిజన్‌లో పనిచేస్తుంది.**) ఇదే ఎన్‌కౌంటర్ సందర్భంగా ఆదిలాబాద్‌కు చెందిన ఇద్దరు మహిళా కామ్రేడ్స్ గాయాలతో బయటపడగా వారిని అరెస్టు చేసి తరువాత చూయించారు. మరో నలుగురు కామ్రేడ్స్‌తో పాటు మరో స్థానిక గ్రామస్తుడు కూడా అమరుడయ్యాడు. అక్టోబర్ 26న రాజ్‌నంద్‌గాం జిల్లాలో ఆర్‌కేబీ డివిజన్, పల్లెమాడి ఏరియా కమిటీలో సీనియర్ సభ్యులు కామ్రేడ్స్ రాకేష్ దుగ్గ (ఎల్ఓఎస్ కమాండర్), మహేష్, రంజిత్ నూరేటి (డిప్యూటీ) ఖదర్ గ్రామ శివార్లలో జరిగిన ఘటనలో డిసెంబరు 2న మాడ్ డివిజన్‌లో దుర్వేడ ఘటనలో కా॥ అనిత (మాడ్ డివిజన్ స్టాఫ్), నేలనార్ ఏరియా ఇర్పనార్ ఘటనలో కా॥ జ్యోతి (డికే సీఎన్ఎమ్), కా॥ సరిత, కా॥ రోణి, కా॥ సంగీత స్థానిక మిలీషియా కమాండర్ ఫగ్ను అమరులయ్యారు. దక్షిణ బస్తర్ డివిజన్‌లో జరిగిన వివిధ ఘటనల్లో కామ్రేడ్స్ పొడియం సన్నా, దూల, సోడీ, సీత, సోడీ లక్మా, మాడవి సోమ్‌డాల్, పొడియమ్ సన్నాల్, పొడియమ్ జోగి, సోయం సేంచా, ముచారి బండి, హిడమా, పొడియమ్ భీమా, దీపక్, పొజ్జా అమరులయ్యారు. పశ్చిమ్ బస్తర్‌లో కామ్రేడ్స్ మొడియమ్ మన్ను, కురసా సోను, తాతి గుడ్డు, పూనమ్ రాజు, పర్స పైకు, కొమ్మ వంజరం అమరులయ్యారు. దర్బ డివిజన్‌లో కామ్రేడ్ మడ్కం దూక అమరుడయ్యాడు. ఇంకా మరికొంత కామ్రేడ్స్ కూడా బూటకపు ఎన్‌కౌంటర్‌లో అమరులయ్యారు.

మహారాష్ట్ర, తెలంగాణ సరిహద్దుల్లో అహిరి ఏరియాలో కలెధా అటవీ ప్రాంతంలో డిసెంబరు 6న సీ-60 పోలీసులు, గ్రేహౌండ్స్ బలగాలు గుట్ట దిగి వస్తున్న దళం కొరకు ఆంబుష్ ఏర్పాటు చేసి కిల్లింగ్ జోన్‌లోకి రాగానే రాపిడ్ ఫైర్ చేయడంతో ఏడుగురు కామ్రేడ్స్ అక్కడికక్కడే అమరులయ్యారు. మరో నలుగురు గాయాలతో రెండవ రోజు చనిపోయారు. మరో ఇద్దరు సీరియస్ గాయాలతో బయటపడ్డారు. ఈ మధ్య కాలంలో గడిచిరోలిలో జరిగిన పెద్ద ఘటన. ఈ ఘటన జరిగిన వెంటనే కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ మహారాష్ట్ర ప్రభుత్వాన్ని అభినందించాడు. పాలకవర్గాల రక్తపిపాస ఏస్థాయిలో ఉందో దీన్ని బట్టి అర్థమవుతుంది.

దక్షిణ బస్తర్‌లో కిష్టారం ఏరియాలో డిసెంబర్ 3 నుండి 7 వరకు పెద్ద దాడి జరిగింది. ప్రధానంగా 3 గ్రామాలను టార్గెట్ చేస్తూ వస్తూ వెళ్తు మరో 10 గ్రామాలను నష్టం చేస్తూ ఈ అభియాన్ నడిచింది. మెట్టగూడెం గ్రామం వద్ద పొలంలో పని చేస్తున్న మాడవి సోమ్డా వడ్డే అనే రైతును ఎటువంటి హెచ్చరికా లేకుండా కాల్చి చంపారు. కన్నెమరక గ్రామ ప్రజల మీద విచ్చలవిడిగా కాల్పులు జరిపి సెల్స్‌తో దాడిచేస్తూ వెళ్లారు. గుండ్రాయి, వెలమగొండలలో వేల రూపాయల ఆస్తులను ధ్వంసం చేశారు. ప్రజలను ముఖ్యంగా మహిళలను తీవ్ర చిత్రహింసలు పెట్టారు. దారిలో పీఎల్‌జీఏ బలగాలపై కాల్పులు చేశారు. ఎవరికీ ఏమీ నష్టం జరగలేదు. డిసెంబర్ 5న సల్లాం గ్రామం మీద దాడిచేసి మిల్లును, మోటారు సైకిల్లను, గ్రామస్తుల ఆస్తులను నష్టపరిచి, అక్కడి నుండి నలుగురు రైతులను అరెస్టు చేసి తీసుకు వెళ్లారు. దుగ్గం, సల్లాం గుట్ట బోర్ల మీద 300 మంది పోలీసులు ఆరు కిలోమీటర్ల దూరం ఆంబుష్ కూర్చున్నారు. మరో బ్యాచ్ తోండం గ్రామం మీద దాడిచేసింది. ఒకేసారి వేలమంది పోలీసులు వచ్చి అనేక బ్యాచ్‌లుగా గ్రామాలపై దాడులు చేసి లక్షల విలువయిన ఆస్తులను ధ్వంసం చేయడం, దగ్ధం చేయడం చేశారు. మొత్తం 20 మందిని అరెస్టు చేసి తప్పుడు కేసులు బనాయించి జైలులో పెట్టారు.

2018 జనవరి ప్రారంభంలో జరిగిన అభియాన్ వివరాలు

ఇలా ఉన్నాయి:

పశ్చిమ బస్తర్ డివిజన్ గంగలూర్ ఏరియాలో కేంద్ర, రాష్ట్ర బలగాలు సంయుక్తంగా జనవరి 4నుండి 10వ తారీఖు వరకు వారం రోజుల పాటు మరో పెద్ద దాడి చేశారు. ఈ దాడిలో ముగ్గురు కామ్రేడ్స్ (ఒక బాలుడుతో సహా) అమరులయ్యారు. కావడి-ముద్దుం మధ్య జరిగిన ఫైరింగ్‌లో గంగలూర్ ఏరియా ఏసీఎం దొడ్డి బుదరాం, జోన్ ఐ టీం సభ్యురాలు కామ్రేడ్ క్రాంతి (వీరిద్దరు సీనియర్ ఏసీ సభ్యులు). వెంగూర్-ఎర్రాల్ నడుమ జరిగిన ఫైరింగ్‌లో గ్రామ మిలీషియా దళ కమాండర్‌కు గాయాలయ్యాయి. కర్కా గ్రామానికి చెందిన ప్రజలపై కాల్పులు జరిపినపుడు 13 సంవత్సరాల బాలుడు సోమాలు చనిపోయాడు. 12 సం॥ల బాలుడు మడకం బోటితో సహా 5గురు గాయపడ్డారు. అనేక గ్రామాలలో ఆస్థులను దగ్ధం, ధ్వంసం చేశారు.

ఈ రకంగా నిత్యం దండకారణ్యంలోని వివిధ ప్రాంతాల్లో పాశవిక నిర్బంధం కొనసాగుతూనే ఉంది. పాలకవర్గాలు అనుసరిస్తున్న విధానాలను, ఈ పోలీసు దాడులను ప్రతిఘటిస్తూ ప్రజలు విప్లవోద్యమాన్ని కాపాడుకుంటున్నారు. ఆదివాసీ ప్రజల అస్థిత్వానికే ప్రమాదాన్ని తెచ్చిపెడుతున్న ఈ ముష్కర దాడులను ఖండించాల్సిందిగా కోరుతున్నాము.

### తెలంగాణాలో నిర్బంధం

తెలంగాణాలో గోదావరిపై కొత్తగా నిర్మిస్తున్న ప్రాజెక్టులకు మావోయిస్టుల వల్ల ముప్పు ఉందని ప్రభుత్వం బూటకపు ప్రచారం చేస్తూ గోదావరి తీరప్రాంతమంతా పోలీసు క్యాంపులు ఏర్పరిచి నిర్బంధాన్ని తీవ్రతరం చేసింది. తుపాకుల గూడెం, మేడిగడ్డ మొదలు గోలీవాడ వరకు పోలీసు క్యాంపులు వెలిసాయి. ఈ ప్రాంతమంతా డిప్లాయ్ చేసిన సిఆర్‌పిఎఫ్ బలగాలకు తోడు గ్రేహౌండ్స్ బలగాలు నిరంతరం పెట్రోలింగ్‌లు చేస్తూ గస్తీ చేస్తూన్నారు. గోదావరి వెంట డ్రోన్‌ల సహయంతో నిఘా కొనసాగిస్తున్నారు. తీర ప్రాంతంలో పోలీసులు ఏర్పరుచుకున్న ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్ ద్వారానే తెలంగాణ పోలీసులు ఇచ్చిన సమాచారంతో సిరోంచలోని కల్లెడ అటవీ ప్రాంతంలో మావోయిస్టు గెరిల్లా దళాలపై తెలంగాణ, మహారాష్ట్ర స్పెషల్ బలగాలు కలిసి ఆంబుష్ నిర్వహించాయి. ఛత్తీస్‌గఢ్ నుండి మావోయిస్టు గెరిల్లాలు తెలంగాణాలోకి ప్రవేశించకుండా చర్యలు చేపడుతున్నామని ప్రభుత్వం చెబుతూ వస్తున్న ప్రణాళికలో భాగమే ఈ రకమైన పోలీసు పహారా అనే విషం అర్థం చేసుకోవాలి.

తెలంగాణ రాజధాని హైదరాబాద్‌తో సహా కరీంనగర్, వరంగల్ లాంటి పట్టణాల్లో ఏర్పాటు చేస్తున్న కమాండ్ కంట్రోల్‌కు రాష్ట్రంలో పది లక్షల కెమోరాలను అనుసంధానం చేయాలనే పథకం వేగంగా ప్రభుత్వం కొనసాగిస్తున్నది. ఈ పథకం ద్వారా రాష్ట్రమంతా పోలీసుల నిఘా నేత్రాల కిందకు వచ్చి ప్రజల భద్రతకు, ప్రైవసీకి పెద్ద ముప్పుగా పరిణమించబోతున్నది.

పోలీసులు రాష్ట్ర బడ్జెట్‌లో అత్యధిక వాటా పొందడంతో "పోలీసు సంస్కరణలు" అమలు చేసున్నారు. అత్యంత ఖరీదైన టెక్నాలజీని వినియోగిస్తున్నారు. విలాసవంతమైన సౌకర్యాలు అనుభవిస్తున్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ పేరిట ఈ వ్యవహారామంతా నడిపిస్తున్నారు. పోలీసులు ఈ సాఫ్ట్ ఫోజు పెడుతూనే ప్రజలపై ముఖ్యంగా దళితులు, ఆదివాసులు, మైనారిటీలు, విప్లవకారులు, ప్రజాస్వామిక వాదులపై అమానుష నిర్బంధకాండ కొనసాగిస్తున్నారు. థర్డ్ డిగ్రీ పద్ధతులు, వేధింపులు, లాకప్పు హత్యలు, అక్రమ అరెస్టులు, బూటకపు ఎన్‌కౌంటర్లు లాంటి నిర్బంధ చర్యలను పోలీసులు యధేచ్ఛగా కొనసాగిస్తున్నారు. ప్రజా ప్రదర్శనలపై లాఠీ చార్జీలు సర్వ సాధారణంగా కొనసాగిస్తున్నాయి. బహిరంగ సభలకు పర్మిషన్‌లు నిరాకరించడం, 144 సెక్షను విధించడం లాంటివి సర్వ సాధారణమై పోలీసు రాజ్యం కొనసాగుతున్నది.

2017 డిసెంబర్ 14న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కోడేవాగు వద్ద బూటకపు ఎన్‌కౌంటర్‌లో సీపీ బాట గ్రూపుకు చెందిన 8మంది కార్యకర్తలను కాల్చి చంపింది.

జనవరి 5న శుక్రవారం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బైరంగడ్ తాలుకా ఉర్రెం గ్రామానికి చెందిన మాడివి పాండే (సుశీల-ఏసీ మెంబర్)ను వరంగల్ ఆసుపత్రి నుండి తిరిగి వస్తుండగా సుశీలతో పాటు పామేడ్ ఏరియాకు చెందిన ఇద్దరు సాధారణ పౌరులను జయశంకర్ జిల్లా వెంకటాపురం పోలీసులు అరెస్టు చేసి తప్పుడు కేసులు బనాయించి జైలులో వేసారు.

## బంద్ పిలుపు

**దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ, తెలంగాణ రాష్ట్ర కమిటీల సంయుక్త ప్రకటన**

**కేంద్ర-రాష్ట్ర పాలకులు మావోయిస్టులను నిర్మూలించే పేరుతో ప్రజలపై చేస్తున్న ఫాసిస్టు నిర్బంధానికి వ్యతిరేకంగా దండకారణ్య-తెలంగాణ ప్రాంతాలలో 2018 ఫిబ్రవరి 5న ఒక రోజు బంద్‌ను జయప్రదం చేయండి**

# దొరల తెగ సముదాయపు ముద్దు బిడ్డ, దండకారణ్యపు భూమి పుత్రిక
# దక్షిణ బస్తర్‌లో పుట్టి ఉత్తర గడ్చిరోలిలో అమరురాలైన
# సీనియర్ కామ్రేడ్ మడకం రాజే (సోనీ)కి విప్లవ జోహార్లు



అక్టోబర్ 14, 2017 మహారాష్ట్రలోని ఉత్తర గడిచిరోలి టిప్రాగడ్ ఏరియా టవేకసా గ్రామంలో ఒక దేరాపై సీ-60 కమాండో బలగాలు చేసిన దాడిలో తూటాలు తగిలి అమరురాలయ్యింది. కామ్రేడ్ సోనీ అసలు పేరు మడ్కం రాజే. సుక్మా జిల్లా కోంటా తాసీల్ డెడ్రాయ్ గ్రామం. ఇది దక్షిణ బస్తర్ డివిజన్‌కు చెందిన కోంటా ఏరియా పరిధిలో ఉంది. ఆమె 36 సంవత్సరాల క్రితం మడ్కం కన్నా, దూలే లకు జన్మించింది. వారిది దొర్ల సముదాయంలోని మధ్యమ వర్గం. దొర్ల పిల్ల అయినప్పటికి మాడియా గోండితో పాటు అనేక ఏరియాలకు చెందిన రకరకాల గోండి భాషలను, తెలుగు, ఛత్తీస్‌గఢ్ భాషలను నేర్చుకోగలిగింది. చురుకుగా, ఉత్సాహంగా ఉండే సోనీ 1998 నాటికి పూర్తికాలం కార్యకర్తగా విప్లవోద్యమంలో చేరి, ఉద్యమ అవసరాల రీత్యా గడిచిరోలి దళాలలోకి పంపబడింది. 20 సంవత్సరాల విప్లవ కార్యాచరణలో ఆమె పనిచేసిన అన్ని ఏరియాలలోను, అన్ని సెక్షన్‌ల ప్రజల విశ్వాసాన్ని పొందింది. మిలిషియా, పార్టీ నిర్మాణం, పార్టీ అప్పగించిన అనేక రకాల పనులలో బాధ్యతాయుతంగా, క్రమశిక్షణగా మెలిగి అందరి విశ్వాసాన్ని పొందే విధంగా కృషి చేసింది. టిప్రాగడ్ ఏరియా కమిటీలో ఏసీఎమ్‌గా పనిచేస్తూ, జిల్లా నాయకత్వ టీంకి ఆధారపడదగిన కామ్రేడ్‌గా విశ్వాసాన్ని పొందింది. ఏరియా నుండి అనేక మందిని పీఎల్‌జీఏలోకి భర్తీ చేయడంలోను, రాజకీయాలు నేర్చుకుంటూ ప్రజలకు పోరాట మార్గాన్ని అర్థంచేయించడంలో విశేషంగా కృషి చేసింది. డికే విముక్తిలో భాగంగా జనతన సర్కార్ నిర్మాణాన్ని గడిచిరోలిలో 2006 నాటికే ప్రారంభించారు. 2010లో టిప్రాగడ్ ఏరియాలో జనతన సర్కార్ల నిర్మాణం జరిగింది. ఆ నిర్మాణ కృషిలో కామ్రేడ్ సోనీ ముఖ్యమైన పాత్ర నిర్వహించింది. సూర్జాగడ్ గనుల తవ్వకాలకి వ్యతిరేకంగా ప్రజల్ని కదిలించి పోరాడడంలో, ప్రజా సమస్యలకు నాయకత్వం వహించడంలో ముందు పీఠిన నిలిచింది.

కామ్రేడ్ సోనీ 2003లో భామ్రాగడ్ ఏరియాలో పనిచేస్తున్నప్పుడు, కలిసి పనిచేస్తున్న క్రమంలో ఒక కామ్రేడ్‌ను ఇష్టపడి పార్టీ పద్ధతిలో పెళ్లి చేసుకుంది. 15 సంవత్సరాల వైవాహిక జీవితంలో ఎటువంటి సమస్యలు రాకుండా విప్లవోద్యమంలో సహచర జీవితాన్ని కొనసాగించింది. 20 సంవత్సరాల ఉద్యమ జీవితం ఉన్న సీనియర్ కామ్రేడ్‌గా జిల్లా కోరులోకి ఎన్నికయింది. రాజ్యాధికారం లక్ష్యంగా జరిగే వర్గపోరాటంలో విరామం ఎరుగక కఠోర శ్రమకోర్చి కమ్యూనిస్టు ఆదర్శంతో పనిచేయడం వల్ల ప్రజల్లో, క్యాడర్‌లో విశ్వాసాన్ని పొందింది. హుషారుగా, సందడిగా ఉండే సోనీ ఎప్పుడూ గలగలా నవ్వుతూ ఉండేది. బస్తర్‌లో పుట్టి గడిచిరోలిలో అమరురాలయిన కామ్రేడ్ సోనీ ఆదర్శాన్ని ముందుకు తీసుకువెళ్దాం. ○

---

## చంద్రపుల్లారెడ్డి బాట గ్రూపు కార్యకర్తలు 8 మందిని బూటకపు ఎన్‌కౌంటర్ చేసి చంపడాన్ని ఖండించండి!

డిసెంబర్ 14, 2017న తెలంగాణ రాష్ట్రం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, టేకులపల్లి మండలం, గంగారం పంచాయితీ పరిధిలోని నేలమడుగు గ్రామం కోడేవాగు సమీపంలో తెలంగాణ పోలీసులు జరిపిన బూటకపు ఎన్‌కౌంటర్‌లో 8 మంది కామ్రేడ్స్ అమరులయ్యారు. వీరు కొత్తగా ఏర్పడిన చంద్రపుల్లారెడ్డి బాట గ్రూపు కార్యకర్తలు. 25- 30 సం॥రాల మధ్యగల యువకులు. వీరు ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలంగా పాల్గొన్నారు.

ఎన్‌కౌంటర్‌లో చనిపోయారని చెబుతున్న ఎనిమిది మందిని ముందే అరెస్టు చేసి కాల్చి చంపారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఇందులో చనిపోయిన గాడుదల శ్రీనుకు ఇటీవల సబ్సిడీ గొర్రెల పథకంలో గొర్రెలను కూడా ప్రభుత్వం ఇచ్చింది. గొర్రె పిల్లను వెతికేందుకు వెళ్లిన శ్రీనును పట్టుకొని కాల్చి చంపారు. పోలీసులు ఎన్‌కౌంటర్ మృతుల వివరాలు చాల సేపటివరకు ప్రకటించలేదు. ఉదయం 6.30 గంటలకు ఎన్‌కౌంటర్ జరిగితే మధ్యాహ్నం 1 గంట వరకు ఎవరినీ అక్కడికి అనుమతించలేదు. మృతదేహాలను రాత్రివేళ పోస్టుమార్టం నిర్వహించవద్దని, వరంగల్, లేదా ఉస్మానియా ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించాలని కుటుంబ సభ్యులు కోరినప్పటికీ పోలీసులు పట్టించుకోకుండా హడావిడిగా పోస్టుమార్టం నిర్వహించారు.

పట్టుకొని చిత్రహింసలు పెట్టిన గుర్తులున్నట్లు ప్రజాసంఘాలు, పౌరహక్కుల సంఘాలు, కుటుంబాలు వెల్లడిస్తున్నాయి.

### భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎన్‌కౌంటర్‌లో అమరులయిన కామ్రేడ్స్

మోకాళ్ళ సమ్మయ్య దళ కమాండర్, లక్ష్మి దేవపల్లి మండలం (మర్రిగూడెం) ఎట్టి కుమార్ అలియాస్ రాఖీ, సునావత్ అర్జున్

*(మిగతా 53వ పేజీలో......)*

# మూల ఆదివాసులకు యావత్తు ప్రజానీకం మద్దతునివ్వాలి

## సామాజిక ఆర్థిక ప్రమాణాల ప్రాతిపదికగా రిజర్వేషన్లు అమలు కావాలి

### వలస లంబాడాల్లో 1976 కటాఫ్ ఇయర్‌గా గుర్తించి రిజర్వేషన్ల నుండి వారిని మినహాయించాలి

భారత దేశ జనాభాలో ఆదివాసులు 8.2 శాతం వరకు ఉన్నారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు కేంద్ర పాలిత ప్రాంతాల్లో వారు విస్తరించి ఉన్నారు. సాధారణ జనావాసాలకు ఎంతో దూరం ఉంటున్నారు. వెనుకబాటు తనం ఏ స్థాయిలో ఉంది-సంస్కృతి, భాష, మత పరపరమైన విశేషాలు, విశిష్టతలు ఏమిటి? జనంతో కలవడానికి ఎంతవరకు వెనకాడుతున్నారు. వంటి అంశాలను ప్రాతిపదికగా చేసుకొని ఆదివాసులను గుర్తించారు. ప్రభుత్వం దేశవ్యాప్తంగా 573 సమూహాలను ఆదివాసులుగా గుర్తించింది. వాళ్ళు రిజర్వేషన్లకు అర్హులు. వీరిలో అతిపెద్ద జన సమూహం గోండులు లేదా కోయలు. వీరు దాదాపు కోటి 60లక్షల (రాజ్‌గోండి) (దొరల కోయ) కోయ, మాడియా కోయ) మంది ఉంటారు. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్‌లలో వీరు విస్తరించి ఉన్నారు. తర్వాత సంతాల్ లో కోటి 40 లక్షల మంది ఉన్నారు. దేశంలోని అతిపెద్ద ఆదివాసీ తెగలన్నీ మధ్య భారతంలోనే ఉన్నాయి. మొత్తం ఆదివాసుల్లో 75శాతం దాకా ఈ ప్రాంతంలోనే ఉన్నారు. ఆదివాసులంటే మూలవాసులనీ అర్థం. రాజ్యాంగం ప్రకారం అసలు షెడ్యూల్డ్ తెగ అనే మాట షెడ్యూల్డ్ ప్రాంతాల్లో నివసించే ఆదిమ తెగలను మాత్రమే సూచించేది. ఆ అర్థం ధ్వనించాలనే ఉద్దేశ్యంతోనే 1930 నుంచి ఈ పదాన్ని వాడుతున్నారు. ఒక తెలంగాణ, దేశంలోనే అనే కాదు ప్రపంచ వ్యాప్తంగానే అడవిలో ఉన్న వారిని మాత్రమే మూల ఆదివాసులుగా (aboriginals) చరిత్ర గుర్తించింది. ఆదివాసీ అనే మాటగానే ఇంగ్లీష్‌లో కూడా అది అడవిలో ఉండే మూల ఆదివాసులకు పర్యాయ పదమైంది. భారత రాజ్యాంగం కూడా అంటరానితనం ప్రాతిపదికగా ఎస్.సీ.లను గుర్తించినట్లే అడవిలో నివసించేవారు అనే ప్రాతిపదికపై ఎస్.టీ.లను గుర్తించింది. సామ్రాజ్యవాదులు, దళారీ పెట్టుబడిదారులు, భూస్వాముల దోపిడీ కారణంగా భూములు కోల్పోయి జల్, జంగల్, జమీన్, ఖనిజాలు అదృశ్యమై ఆదివాసులు తమ జీవనాధారాన్ని కోల్పోతున్నారు. ఇంకా అభివృద్ధికి ఆమడ దూరంలోనే ఉన్నారు. ఆదివాసేతరుల వలసలు పెరిగి లంబాడీ తెగ ప్రజలను ఎస్.టీ. జాబితాలో కలుపడంతో ఉన్న కొద్దిపాటి భూములు, రిజర్వేషన్లు దక్కని పరిస్థితి ఏర్పడింది. ఇలాంటి పరిస్థితుల్లో ఆదివాసీ ప్రాంతాల్లో ఆగ్రహం రాజుకుంటున్నాయి.

ఆదివాసుల ప్రతిఘటనా పోరాటాల ఫలితంగా బ్రిటీష్ పాలకుల నుంచి నేటి పాలకుల వరకు ఆదివాసుల రక్షణ కోసం అనేక చట్టాలు చేశారు. కానీ అవి పేరుకు మాత్రమే చేశారు. వాటిని అమలు చేయడం లేదు. ఐ.టీ.డీ.ఏ. లాంటి సంస్థల ద్వారా కుహనా సంస్కరణలు చేస్తూ మౌలిక సమస్యలు పరిష్కరించకుండా ఆదివాసులను పోరాడకుండా చేయాలని చూస్తున్నారు.

నీళ్ళు-నిధులు-నియామకాలు లక్ష్యంతో సాధించుకున్న ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో ఆదివాసుల సమస్యలు పరిష్కారమవుతాయని ఎన్నో ఆశలతో ఆదివాసులు ఉద్యమంలో భాగస్వాములయ్యారు. కానీ అధికారానికి వచ్చిన కేసీఆర్ ప్రభుత్వం ఈ మూడున్నరేళ్ళ పాలనలో ఆదివాసుల హక్కులను కాలరాస్తున్నది. అణచివేస్తున్నది. ఎన్నో వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన టీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజలందర్నీ మోసం చేస్తూనే, మాది చేతల ప్రభుత్వమని గప్పాలు కొట్టుకుంటున్నది. నయా నిజాంగా మారిన కేసీఆర్, తెలంగాణ ప్రజల మాన, ధన, ప్రాణాలను దోసిన, తీసిన నైజాం రాజును 'తెలంగాణను అభివృద్ధి చేసిన గొప్ప రాజు' అని పొగుడుతూ, ముస్లిం ఓట్లను కొల్లగొట్టడానికి 12శాతం రిజర్వేషన్ కల్పిస్తామని భ్రమలు కల్పిస్తున్నాడు.

ఓటు బ్యాంకు కోసమే బీసీ లు గా ఉన్న కాయితా లంబాడీలను, వాల్మీకి బోయలను ఎస్.టీ. జాబితాలో చేర్చి వాళ్ల ఓట్లను పొందడానికి పథకం వేశాడు. కుట్రతో 1/70 చట్టాన్నీ, అటవీ హక్కుల చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ హరితహారం పేరుతో ఆదివాసులను 40 సంIIల నుండి సాగు చేసుకుంటున్న పోడు భూముల నుండి గెంటి వేస్తున్నాడు. గ్రామాలను తగులబెడుతూ, ఆదివాసులను పోలీసులు ఫారెస్టు బలగాలతో చిత్రహింసలకు గురిచేస్తూ జైళ్లలో బంధిస్తున్నారు. ఓపెన్‌కాస్ట్‌లు, టైగర్‌జోన్‌లు, ప్రాజెక్టుల నిర్మాణాల ద్వారా ఆదివాసులను తమ భూముల నుండి గెంటివేస్తూ నిర్వాసితులను చేస్తూ సమాధి చేయబోతున్నారు. అనేక వేల ఎకరాల భూములు పరాయికరణ చెందుతున్నాయి.

ఆదివాసీ జిల్లాలైన ఉమ్మడి ఆదిలాబాద్, వరంగల్, ఖమ్మం జిల్లాలను ముక్కలు, ముక్కలుగా చేసి 5వ షెడ్యూల్డ్ అమలు కాకుండా ఆదివాసులను మైనారిటీలుగా మార్చివేశారు. హిందూ సంప్రదాయాలను చొప్పిస్తూ ఆదివాసుల సంస్కృతి, సంప్రదాయాలను ధ్వంసం చేస్తున్నారు.

ఈ దోపిడీ పాలకులే ఇప్పుడు మూల ఆదివాసుల-లంబాడీల మధ్య ఘర్షణలను సృష్టించారు. జోడెన్‌ఘాట్ లోని ఆదివాసీ మ్యూజియంలో పాలకులు తమ రాజకీయ లబ్ధి కోసం ఆదివాసుల ఆత్మ గౌరవాన్ని అగౌరపరిచే విధంగా లంబాడీల సాంస్కృతిక ప్రతీకైన సూంకీ మాత విగ్రహాన్ని ప్రతిష్టించారు. అందుకు లంబాడీ

కలెక్టర్, రాజకీయ నాయకులు సహకరించారు. జల్, జంగల్, జమీన్ కోసం నిజాం రాజును, బ్రిటీష్ ప్రభుత్వాన్ని ఎదిరించి పోరాడి ప్రాణాలర్పించిన ధీరుడు కుమురం భీం విగ్రహం పక్కన, లంబాడీ తెగల సూంకి మాతను ప్రతిష్టించటంతో ఆగ్రహానికి గురైన మూల ఆదివాసులు 2017 అక్టోబర్ 6న సూంకి మాత విగ్రహాన్ని ధ్వంసం చేశారు. కేసీఆర్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. దీనితో రెండు తెగల మధ్య ఘర్షణ మొదలైంది. ఇప్పటికీ గత కొంత కాలంగా రాష్ట్రంలో, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో లంబాడీల- మూల ఆదివాసుల మధ్య ఘర్షణలు ఆరిపోని చిచ్చులా రగులుతూనే ఉన్నాయి.

ఈ ఘర్షణలకు మూలం 1976లో కాంగ్రెస్ ఓటు బ్యాంకు కోసం లంబాడాలను షెడ్యూల్డ్ ట్రైబ్స్‌లో చేర్చడం దీనితో మహారాష్ట్ర ప్రభుత్వం బీసీ-ఏగా, కర్ణాటకలో ఎస్.సీ.లుగా, రాజస్థాన్‌లో ఓ.సీ.లుగా ప్రభుత్వాలచే గుర్తించబడుతున్న, లంబాడీలకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో షెడ్యూల్డ్ తెగగా ప్రకటించడంతో దీన్ని అవకాశంగా తీసుకొని మహారాష్ట్ర, రాజస్థాన్, కర్ణాటక రాష్ట్రాల నుండి ఆదిలాబాద్ జిల్లాకు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లకు లంబాడాల వలసలు పెద్ద ఎత్తున వెల్లువలాసాగాయి. ఈ వలసల ఉధృతివల్ల తెలంగాణలో లంబాడాల జనాభా 1961లో 81,366, 1981లో -9,80,242లు, 2011లో- 20,99,524లుగా పెరిగి పోయింది. మూల ఆదివాసుల జనాభా 9లక్షలు మాత్రమే ఉంది. లంబాడాలను ఎస్.టీ. జాబితాలో కలపడాన్ని మూల ఆదివాసులు అప్పుడే వ్యతిరేకించారు. ఆనాటి నుండి ఈ విషయంపై ఆదివాసీలు అసంతృప్తితో అనేక సార్లు బహిరంగంగా వ్యతిరేకిస్తూ ప్రకటిస్తూనే వస్తున్నారు. ఆ అసంతృప్తి కట్టలు తెంచుకొన్న ఆందోళన అలజడిగా ఇప్పుడు తీవ్రస్థాయికి చేరింది.

**అసలు లంబాడీల గురించి వివరాల్లోకి వెడితే:**

లంబాడాలు రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన వారు. వీరి ప్రధానమైన వృత్తి పశు పోషణగా ఉండేది. వీరు 15వ శతాబ్దంలో మొగలులు వింధ్యా పర్వతాలను దాటి దక్షిణ భారతదేశంపై దండయాత్రలు చేసినప్పుడు వారికి సరుకుల సప్లై దారులుగా పర్వతాలను దాటి దక్షిణానికి వచ్చారు. 1850 వరకు ఈ ప్రాంతాల్లో సాగిన అనేక యుద్ధాల్లో ఆయా రాజులకు సరుకుల సప్లై దారులుగా ఉండి జీవనం వెళ్ళదీసారు. 1850 చివరిల్లో జరిగిన మారాట-బ్రిటిష్ యుద్ధం తర్వాత ఈ ప్రాంతంలో బ్రిటిష్ పరిపాలన బలపడి యుద్ధాలు లేకుండా పోయాయి. దీనితో వీరు జీవనోపాధి కోల్పోయారు. వీరు తదుపరి వ్యవసాయం, పశుపోషణతో ఆ యా ప్రాంతాల్లో స్థిరపడిపోయారు. ప్రధానంగా అటవీ ప్రాంతాలకు ప్రక్కగా ఉన్న మైదాన ప్రాంతాల్లో వీరంతా సెటిల్ అయినారు. ఇదంతా పూర్వం జరిగిన వలసగా మనం చూడవచ్చు. తెలంగాణ నైజాం పరిపాలనలో 1920-40ల మధ్య ఆదివాసీ ప్రాంతాల్లోకి మరో మారు వలస కొనసాగింది. నైజాం పరిపాలనలో అడవులకు, ఆదివాసీలకు ఎలాంటి ప్రొటెక్షన్ చట్టాలు లేక ఫ్రీ జోన్‌గా ఉండేది. అంతేగాక నైజాం రాజు అటవీ ప్రాంతాల్లోకి వలసలను ప్రోత్సహించాడు. ఎవరైనా మోతుబరి రైతు చేతి వృత్తుల వారిని తీసికొని వచ్చి అటవీ ప్రాంతాల్లో గ్రామం పొందిస్తే వారికి ఆ గ్రామంపై వతన్ ఇచ్చాడు. దీనితో దక్షిణాన గల మైదాన ప్రాంతాల నుండి వివిధ వ్యవసాయ కులాల నుండి ఈ ఆదివాసీ ప్రాంతాలకు వలస పెరిగింది. దీనిలో భాగంగానే వెలమ, రెడ్డి, కాపు ఇతర శూద్ర కులాలు ఈ ప్రాంతాలకు వలస వచ్చారు. మరోవైపు ఉత్తరం నుండి లంబాడాలు, మరాట బ్రాహ్మణులు, ఠాకురులు ఇతర జాతుల ప్రజలు కూడా ఈ ప్రాంతాల్లోకి వలస వచ్చారు.

60వ దశకంలో లంబాడాలను ఓటు బ్యాంకుగా వినియోగించుకోవడానికి పాలకవర్గాలు ఎప్పుడైతే సిద్ధమైనాయో అప్పుడు వారిని కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్టీ జాబితాలో 1978లో చేర్చింది. దీని తర్వాత వలసలు చాల తీవ్రస్థాయిలో జరిగాయి. దీని ఫలితంగానే 1961లో 81,366 జనాభా 2011లో 20,99,524లకు పెరిగింది. ఇలా 20 రేట్లకు పైగా జనాభా పెరుగుతూ ఉంది. ఈ వలసలు ఆదివాసీ ప్రజల జీవనాన్ని చిన్నాభిన్నం చేసింది. 19వ శతాబ్దంలో జరిగిన ఈ వలసల వల్ల వారి జీవనాధారం అయిన అడవులను నరకడం, భూములు లాక్కోవడం వలన ఆదివాసులు లోతట్టు ప్రాంతాల్లోకి వెళ్లిపోవడం జరిగింది. నిరంతరం సాగే వలసలో ముఖ్యంగా 70వ దశకం నుండి వలస వలన ఆదివాసీ భూములను చాల చౌకగా కొనివేయడం, ఒక్క రకంగా ఉప్పు, మిరపకాయలకు స్వంతం చేసుకోవడం, వడ్డీ వ్యాపారంతో లాగి వేసుకోవడం, బలవంతంగా లాక్కోవడం ఇలా అనేర రకాల పద్ధతుల్లో ఆదివాసీ రైతాంగం భూములు కోల్పోయి వ్యవసాయ కూలీలుగా మారిపోయిన పరిస్థితి ఏర్పడింది. హైమన్ డార్ఫ్ 1980 దశకంలో తెలంగాణను ముఖ్యంగా ఆదిలాబాద్ జిల్లాను పునఃసందర్శించి, చేసిన పరిశోధనలో ఈ పరిస్థితిపై వ్యాఖ్యానిస్తూ-చరిత్రలో భారతదేశంలోకి ఆర్యుల వలస లాగా మూలవాసులు జీవిస్తున్న ఈ అటవీ ప్రాంతాలకు వలసలు సాగాయని తన రచనలో రాసాడు. గతంలో వెలమ, రెడ్డి, బ్రాహ్మణ, ముస్లిం భూస్వాములతో పాటు 80వ దశకం తర్వాత లంబాడాల్లో కూడా భూస్వాములుగా, రాజకీయ నాయకులుగా బ్యూరాక్రాట్లుగా, పోలీసు అధికారులుగా ఎదగడం ప్రారంభమైంది. ఇక్కడ లంబాడాల విషయం పేర్కొనాలంటే వీరు ఆర్థికంగా, సాంస్కృతికంగా, సామాజికంగా మూల ఆదివాసుల కంటే కొంత అభివృద్ధి చెందిన జాతిగా రిజర్వేషన్లలో అధిక భాగం కొల్లగొట్టడం కూడా ఈ 4 దశాబ్దాల్లో ముందుకు వచ్చింది. అయితే లంబాడాల్లో ఇప్పటికీ పేద ప్రజానీకం అధికశాతంగా ఉన్నారు.

గోదావరి పరివాహక ప్రాంతలో ముఖ్యంగా తెలంగాణలో 9

తెగలను (ఆదిలాబాద్ గోండు, కోలామ్, నాయకపోడ్, ధోయిటీ, పరధానులు -ఖమ్మం, కరీంనగర్, వరంగల్, మహబూబ్‌నగర్ లలో కోయ, కోయ కమ్మరి, చెంచు వగైరా మూల ఆదివాసులు) మూల ఆదివాసులుగా హైమన్‌డార్ఫ్ 1940 దశకంలో ప్రభుత్వానికి రెకమెండ్ చేసాడు. భారత ప్రభుత్వం కూడ ఈ 9తెగలనే గుర్తించింది. ఆంధ్ర రాష్ట్రం, తెలంగాణ రాష్ట్రాలు కలిసి ఆంధ్రప్రదేశ్‌గా అవతరించడంలో 1956లో ఆంధ్ర రాష్ట్రంలోని సుగాలీలు ఎస్‌టీ జాబితాలో ఉండడంతో, ఇక్కడ తెలంగాణ లంబాడీలను కూడా ఎస్‌టీలు గానే పరిగణించారు. ఆ తర్వాత 1978 మే 3న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జారీ చేసిన G.O.No 149 (S.W) ప్రకారం డీనోట్‌పై ట్రైబ్స్‌గా పేర్కొంది. ఈ జి.వో. ద్వారా విద్యా రంగంలో మాత్రమే రిజర్వేషన్లు కల్పించారు.

ఇక్కడ అడవులు, భూములు, సహజ వనరులపై మూల ఆదివాసులకే హక్కు ఉంటుంది. ఈ హక్కును ఏ ప్రభుత్వాలు, వారి చట్టాలు గాని అతిక్రమించజాలవు. కాని బ్రిటీష్ కాలం నాటి నుండి ఇప్పటి ప్రభుత్వాల వరకు ఈ అతిక్రమణలు ప్రభుత్వాలు కొనసాగిస్తూనే ఉన్నాయి. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా మూల ఆదివాసులు తర తరాలుగా పోరాడుతూనే ఉన్నారు. ఈ కోణంలో చూసినపుడు వలస వచ్చిన లంబాడీలకు కూడ ఇక్కడ అడవులు, భూములు, సహజ వనరులపై ఎలాంటి హక్కు లేదు. వారు అక్రమంగా ఆక్రమించుకొన్న భూములపై వారికి ఎలాంటి అధికారం లేదు. మావోయిస్టు పార్టీకీ గల ఈ పాలసీపై ఆధారపడి మూలవాసులకు, లంబాడాలకు మధ్య తలెత్తిన వివాదాలను పరిష్కరించడానికి కృషి చేసింది.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఆదివాసులపై ఇంద్రవెల్లి మారణకాండ సమయంలో కూడా ఆదివాసీ, గైరాదివాసీ సమస్యలను వర్గ ప్రాతిపదికన పరిష్కరించింది. భూస్వాములకు అన్యాక్రాంతమైన ఆదివాసీ భూములను పార్టీ జప్తు చేసుకొని ఆదివాసులకు ఇచ్చింది. లంబాడీల్లో కూడ ఇదే ప్రాతిపదికపై భూస్వాముల నుండి భూములు తీసికొని ఆదివాసులకు ఇచ్చింది. అయితే ఆ రోజు లంబాడీల్లో భూస్వాములు వేళ్ల మీద లెక్క పెట్టదగిన వారుగానే ఉన్నారు. లంబాడీల్లోని మధ్య, పేద రైతాంగం చేతిలోకి అన్యాక్రాంతమయిన భూములను ప్రజా పంచాయితీల ద్వారా మూల ఆదివాసులకు న్యాయం కలిగేలా పునఃపంపిణి చేసింది. ఈ విధానం వలన ఆ రోజు కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాలు అనుసరించిన విభజించు పాలించు అనే విధానాలను తిప్పికొట్టి మావోయిస్టు పార్టీ ప్రజల మధ్య ఐక్యతను నెలకొల్పింది. ఈ విధానం వలన లంబాడీల్లో అత్యధిక ప్రజానీకం మావోయిస్టు విధానాలను అంగీకరించి పార్టీలో ప్రజాసంఘాల్లో పని చేసారు.

90వ దశకం నుండి పరిస్థితులు పూర్తిగా మార్పు చెందాయి. రాష్ట్రంలో లంబాడీల్లో ఒక సెక్షన్ బాగా అభివృద్ధి చెంది ఆర్థికంగా, రాజకీయ, సాంస్కృతిక, సామాజిక రంగాల్లో ముందుకు వచ్చారు. ఇందుకు ఎన్.టీ. రిజర్వేషన్లు వారికి ఎంతగానో ఉపయోగపడినాయి. ఈ రోజు సమస్య రిజర్వేషన్ల చుట్టూ చర్చనీయంశంగా ముందుకు వచ్చినప్పటికీ, అసలు సమస్య భూమి, అటవీ, సహజ వనరుల సమస్య తీవ్రమైనదిగా ఉంటుంది.

మైదాన ప్రాంతాలలో నివసిస్తున్న లంబాడీ తెగ ప్రజలలో పేదవాళ్ళు ఉన్నప్పటికీ మూల ఆదివాసులకన్నా, సామాజికంగా, నాగరికంగా అభివృద్ధి చెందినవాళ్లు కావడంతో తమ తెలివి తేటలతో 60-70 శాతం ఎన్.టీ. రిజర్వేషన్లను ఉపయోగించుకుంటున్నారు. 1970లో (1793 (ఎస్.డబ్లూ) జీ.వో. ప్రకారం బీ.సీ.-ఏ లుగా రిజర్వేషన్ పొందుతున్న లంబాడాలను జీ.వో.నెం. 149 (యస్.డబ్లూ) 1978 మే 3న తెలంగాణలో డీ.ఎన్.టీ. (డీ నోటిఫైడ్ ట్రైబ్స్)గా 5'వ షెడ్యూల్డ్ ఆదివాసీ భూభాగంలో కాకుండా మైదాన ప్రాంతంలో అది కూడా విద్యా రంగంలో ఎస్.టీ. జాబితాలో కలిపారు తప్పా, ట్రైబల్ అఫైర్స్, న్యూఢిల్లీ వారు కూడా ట్రైబ్స్‌గా గుర్తించలేదు. గత పాలకులైన కాంగ్రెస్ పార్టీ నుండి మొదలు టీ.డీ.పీ, టీ.ఆర్.ఎస్. ప్రభుత్వాల వరకు రాజకీయ లబ్ధి కోసం, ఓటు బ్యాంకు కోసం లంబాడీలను ఎస్.టీ.లుగా గుర్తిస్తూ మూల ఆదివాసులకు తీరని అన్యాయం చేస్తున్నారు. పాలకులు ఇచ్చిన అవకాశాన్ని లంబాడాలోని ధనిక వర్గం సద్వినియోగం చేసుకుంటూ మూల ఆదివాసుల రిజర్వేషన్లను, భూములను దోచుకుంటున్నారు. గత 70 ఏళ్ల ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో ఇదే జరుగుతున్నది.

**సమస్య తీవ్రతను అర్థం చేసుకునేందుకు గణాంకాలలోకి వెడితే-**

2010లో ఉద్యోగాల గణాంకాలు చూస్తే 100శాతం ఉద్యోగాలలో 57శాతం లంబాడా, 26శాతం ఎరుకల, 7శాతం యానాది మొత్తం 90శాతం పొందగా 10శాతం ఉద్యోగాలు మాత్రమే 30 ఆదిమ తెగలు పొందాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో ఒక్క ఆదివాసీ కూడా ఇంతవరకు ఐ.పీ.ఎస్., ఐ.ఎ.ఎస్.గాని లేదు. తెలంగాణలో 70 మందికి పైగా లంబాడా ఐ.ఏ.ఎస్.లు ఉంటే నిర్మల్ జిల్లా ఒక్క ఖానాపూర్ మండలంలోనే 27 మంది ఐ.ఎ.ఎస్.లు ఉన్నారు.

లంబాడీలు గ్రూప్-1, గ్రూప్-2 లలో 95శాతం ఉన్నారు. విద్యారంగంలో చూస్తే తెలంగాణ రాష్ట్రంలో మెడికల్ కాలేజీల్లో 60.84శాతం; ఇంజనీరింగ్‌లో 66.54శాతం; బీ ఎస్సీ అగ్రికల్చరల్‌లో 64.85శాతం; పాలిటెక్నిక్‌లో 55.71శాతం; ఎల్.ఎల్.బీ., ఎల్.ఎల్.ఎం.లలో 80శాతం; ఎం.సీ.ఏ.లో 67శాతం; పీ.జీ.లో 83శాతం లంబాడీలే పొందినారు.

గిరిజన ఆశ్రమ పాఠశాలలో, గిరిజన గురుకులాలలో, కళాశాలలో 80శాతం వారే నిండి ఉన్నారు. ఇటీవల కాలంలో తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన 15 గిరిజన డిగ్రీ గురుకులాలను లంబాడా ప్రాంతంలోనే ఏర్పాటు చేసింది. రాజకీయ కుట్రలతో కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయాన్ని కూడా 5వ షెడ్యూల్డ్ ఆదివాసీ ప్రాంతంలో కాకుండా లంబాడాలు ఉండే మైదాన ప్రాంతమైన ములుగులో ఏర్పాటు చేస్తున్నారు. రాజకీయంగా చూస్తే సర్పంచు స్థాయి నుండి ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీ, గిరిజన శాఖ మంత్రి, పార్లమెంటు సభ్యులుగా, టీ.ఎస్.పీ.ఎస్సీ. లో ఎక్కువ మంది సభ్యులుగా లంబాడాలనే కేసీఆర్ ప్రభుత్వం నియమించింది.

భారత రాజ్యాంగం 5వ షెడ్యూల్డ్ ఆర్టికల్ 244 పేరా (1) ప్రకారం 1950లో గుర్తించబడిన తెగలకు మాత్రమే షెడ్యూల్డ్ ప్రాంతాలలో 29శాఖలలో ఉద్యోగాలు కల్పించాలి. కానీ అక్రమంగా షెడ్యూల్డ్ ఏరియాలోకి వలస వచ్చిన లంబాడాలు అధికారుల దగ్గర తమ అంగ, ఆర్థిక, రాజకీయ బలంతో ఏజెన్సీ సర్టిఫికెట్స్ పొంది ఆదివాసీ ప్రాంతంలో వేల ఉద్యోగాలు పొందారు. ఉదాహరణకు ఖమ్మం జిల్లా ఆదివాసుల అధికంగా ఉన్న భద్రాచలం ఐ.టీ.డీ.ఏ. ప్రాంత పరిధిలో 2012 డి.ఎస్.సీ. లో 405 పోస్టులలో 400 లంబాడా, 5 ఆదివాసీలు పొందారు. ఈ పరిస్థితుల్లో కేసీఆర్ ప్రభుత్వం రాజకీయ లబ్ధి కోసం లంబాడాలనే నిజమైన ఆదివాసీలుగా గుర్తిస్తూ వలసలను ప్రోత్సహిస్తున్నది. ప్రజల మౌలిక సమస్యలను పరిష్కరించకుండా మాయ చేస్తూ పాలకులే చీలికలు, కొట్లాటలు సృష్టిస్తున్నారు.

సామ్రాజ్యవాదుల, దళారీ పెట్టుబడిదారుల, భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటం కొనసాగుతున్న ఈ తరుణంలో పాలకులు తమకు వ్యతిరేకంగా కొనసాగిస్తున్న పోరాటాన్ని ప్రక్కదారి పట్టించడానికి ప్రజల మధ్య తగాదాలు సృష్టించారు. భౌతిక దాడులు చేసుకునే పరిస్థితి ఏర్పడింది. ఈ ఘర్షణ కారు చిచ్చుగా రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించింది. దీని వెనుక మావోయిస్టులు ఉన్నారని బూచి చూపుతూ ఇదే శాంతి భద్రతల సమస్యగా పరిగణిస్తూ టీఆర్ఎస్ ప్రభుత్వం జిల్లా, మండల, గ్రామ స్థాయిలో కూడా 144 సెక్షన్ విధించింది. ఆదిలాబాద్ మరియు ఇతర జిల్లాలలో న్యాయం కోసం పోరాడుతున్న వందలాది మంది ఆదివాసులపై అక్రమ కేసులు పెట్టింది. టీఆర్ఎస్, కాంగ్రెస్, బిజేపీ, టీడీపీ, సీపీఐ, సీపీఎమ్ లాంటి బూర్జువా పార్టీలన్నీ ఈ ఘర్షణలను తమకు అనుకూలంగా మలుచుకోవడానికి ఆదివాసీ, లంబాడి తెగలలోని ప్రతినిధులను ముందుపెట్టి లబ్ధి పొందడానికి ప్రయత్నాలు కొనసాగిస్తున్నాయి తప్పా పరిష్కారం చూపించడం లేదు. కేసీఆర్ ప్రభుత్వం మాత్రం న్యాయం కోసం పోరాడుతున్న ఆదివాసులను మావోయిస్టుల బూచి చూపి అణచివేయచూస్తున్నది. ఇంత పెద్ద ఎత్తున ఉద్యమం కొనసాగుతున్న ఏమీ మాట్లాడకుండా ఇక చివరికి కేసీఆర్ ప్రభుత్వం నవంబరు 18వ తేదీన అసెంబ్లీలో గిరిజనులకు ముఖ్యమంత్రి వరం పేరిట మాయ చేస్తూ ప్రజల మౌలిక సమస్యలను, న్యాయమైన సమస్యలను పరిష్కరించకుండా చూస్తున్నాడు.

జనాభా రీత్యా ఓట్ల కోసం పాలకవర్గ పార్టీలు లంబాడీలను విపరీతంగా ప్రోత్సహించడంతో సమస్య మరి జఠిలమవుతున్నది. లంబాడీల్లోనే భూస్వామ్య, బ్యూరాక్రటిక్ వర్గం పాలకవర్గ పార్టీల్లో క్రియాశీలకంగా పాల్గొంటూ మూల ఆదివాసులపై అణచివేత కొనసాగిస్తున్నది. వీరి దౌర్జన్యాలకు పేద లంబాడీలు కూడా గురవుతున్నారు. అయితే ఇవి బయటకు ప్రచారం కావడం లేదు. రిజర్వేషన్ల వలన లబ్ది పొందిన, మూల ఆదివాసుల భూములు లాక్కొన్న లంబాడీలకు కలిగే ప్రయోజనాలను వారు వదులుకోవడానికి ఏ మాత్రం సిద్ధంగా లేక మూల ఆదివాసులపై ఆధిపత్యాన్ని చెలాయించే విధానాలను అనుసరించడంతో సమస్య మరింత క్లిష్టంగా మారుతున్నది. లంబాడీ జాతి, మూల ఆదివాసీలుగా సమస్య ఫోకస్ అవుతుంది.

లంబాడాల్లోని పేద ప్రజానీకం ఎలాంటి దురహంకారానికి గురికాకుండా వాస్తవాలను ఆలోచించాలి. లంబాడాల్లో బ్రతుకు దెరువు కోసం చిన్న పిల్లలను అమ్ముకొనే దుస్థితి ఉంది. అటవీ సేకరణ ద్వారా జీవనం వెళ్ల దీసుకోవడమే గాక ప్రభుత్వ విధానాల వలన భూములు కూడా కోల్పోతున్నారు. తెలంగాణ ఉద్యమ కాలంలో కూడ లంబాడీల పేదరికపు బ్రతుకుల దుర్భరత్వం ముందుకు వచ్చింది. కాబట్టి లంబాడీలు, మూల ఆదివాసులతో కలిసి మెలిసి ఉండాలి. సమస్యలను సామరస్య పూర్వకంగా పరిష్కరించుకోవాలి. పాలకవర్గాల ప్రయోజనాల కోసం బలికావద్దు.

రిజర్వేషన్లలో మూల ఆదివాసులకు జరుగుతున్న అన్యాయాన్ని వెంటనే ప్రభుత్వం సరిదిద్దాలి. లంబాడీలను ఎస్.టీ.లో కలపడం వలన ఉత్పన్నమైన ఈ విపత్కర పరిస్థితిని ప్రభుత్వం ముందుగా గుర్తించాలి. ఏ ప్రాతిపదికపై మూల ఆదివాసీలుగా 9 తెగలను గుర్తించడానికి గల కారణాలను దృష్టిలో ఉంచుకొని, సామాజిక, ఆర్థిక, రంగాల్లో గల అసమానతలను దృష్టిలో ఉంచుకొని మూల ఆదివాసుల రిజర్వేషన్లు వారికి న్యాయంగా అందేలా చర్యలు తీసికోవాలి. ఏబీసీడీ లుగా వర్గీకరణ చేపట్టి, అందులో జనాభా ప్రాతిపదికపై రిజర్వేషన్లు కల్పించాలనే అవగాహనను పక్కకు పెట్టి, సామాజిక, ఆర్థిక ప్రమాణాలను ప్రాతిపదిక చేసుకోవాలి. రెండవ అంశంగా రాష్ట్రంలో 1976 తర్వాత 20 రెట్లు పెరిగిన లంబాడా జనాభాను దృష్టిలో ఉంచుకోవాలి. రిజర్వేషన్ల ప్రాతిపదికకు 1976 సంవత్సరంను కటాఫ్ సంవత్సరంగా గుర్తించాలి. ఈ ప్రాతిపదికన విద్యా, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు అమలు చేయాలి. ఒకే జాతికి కటాఫ్ ప్రకటించడం వలన రిజర్వేషన్లలో ద్వంద్వ ప్రమాణాలుగా

ముందుకొస్తాయనే వాదనకు ఎలాంటి బేసిస్‌గా ఉండకుండ వీరిని అక్రమ వలసదారులుగా గుర్తించడం వలన ఈ సమస్యను నివారించాలి. అయితే వీరు రాష్ట్రంలో సగర్వంగా బ్రతికే అవకాశం ఉంటుంది. ఈ అక్రమ వలసదారుల్లో, ఇక్కడ పాత కాలం నుండి నివసిస్తున్న లంబాడీల్లో భూస్వామ్య కుటుంబాలను గుర్తించాలి. కటాఫ్ ఇయర్ కంటే ముందు వారి పరిస్థితులను అధ్యయనం చేస్తే చాల వరకు గతంలో కూడ ఉన్నత స్థితిలో ఉన్నవారే అయి ఉండి రిజర్వేషన్లను తమకు అనుకూలంగా వినియోగించుకొన్నవారుగా తేలక తప్పదు. అప్పుడు అక్రమ వలసదారుల్లో పేదలను గుర్తించి వారికి ఏ విధంగా సహాయపడవచ్చో ఆలోచన చేయవచ్చు.

1976 ఓటరు లిస్టు ప్రకారం అక్రమ వలస దారులను గుర్తించి భూముల పంపిణి కూడ చేపట్టవచ్చు. ఈ క్రమంలో మూల ఆదివాసీల భూములు అన్యాక్రాంతమైన విషయాన్ని తేల్చి భూములు తిరిగి మూల ఆదివాసులకు దక్కేలా చర్యలు తీసికోవాలి. ఇందుకోసం మూల ఆదివాసులకు యావత్తు ప్రజానీకం మద్దతునివ్వాలి.

**ప్రియతమ ప్రజలారా!**

ప్రభుత్వాలు ప్రజల మధ్య విభజనలను సృష్టించి తమ పబ్బం గడుపుకుంటున్నాయి. లంబాడా, మూల ఆదివాసుల మధ్య టీఆర్ఎస్ ప్రభుత్వం చిచ్చు పెట్టి మంటల్లో చలి కాచుకుంటున్నది. ప్రజల మధ్య చెలరేగిన ఈ సమస్యకు పరిష్కారం కోసం ముఖ్యమంత్రి చొరవ తీసికోలేదు. ప్రగతి భవన్ ఇందుకు ఉపయోగపడడం లేదు. దినదినం ప్రజల్లో టీఆర్ఎస్ ప్రభుత్వం పట్ల ఏర్పడుతున్న అసంతృప్తిని ప్రక్కదారి పట్టించడానికి ఈ రకమైన అమానుష క్రీడను టీఆర్ఎస్ ప్రభుత్వం కొనసాగిస్తున్నది. రిజర్వేషన్లు పేద ప్రజల మొత్తం సమస్యలను పరిష్కరించలేవు. వాటి ఉపయోగం కొంతమేరకు ఉంటుంది. ప్రభుత్వాలు అనుసరిస్తున్న నూతన ఆర్థిక విధానాల వలన ఉద్యోగాలే కరువైన కాలంలో మనం ఉన్నాం. పేదలు సర్వ సమగ్రమైన వికాసానికి, ఆర్థికంగా స్వయం సంపూర్ణం కావడానికి, సామాజికంగా గౌరవం పొందడానికి, మనషులందరూ సమానమే అనే భావన పెంపొందడానికి, రాజకీయంగా సాంస్కృతికంగా ఎదగడానికి అవసరమైన వ్యవస్థ నిర్మాణం కోసం పేద ప్రజలంతా ఐక్యం కావాలి. జల్, జంగల్, జమీన్‌పై ఆత్మగౌరవం, అధికారం కోసం ఐక్యంగా పోరాడాలి. సర్వహక్కుల కోసం మూల ఆదివాసులు, లంబాడాలు, ఇతర ప్రజలంతా ఐక్యమై ఈ ప్రభుత్వాల దోపిడి విధానాలకు వ్యతిరేకంగా పోరాడడం వలన పేదలకందరికీ సుందర భవిష్యత్తు దొరుకుతుంది. దోపిడీకి, అసమానతలకు వ్యతిరేకంగా బరిగీచి నిలిచిన తెలంగాణ ప్రజల పోరాట సంప్రదాయాన్ని ఎత్తిపట్టి మన మధ్య సమస్యలు పరిష్కరించుకుంటూ ప్రభుత్వ వ్యతిరేక పోరాటాలకు ఐక్యంగా సిద్ధం కావడం ద్వారానే మనం అన్ని వర్గాల, సెక్షన్లకు అందాల్సిన హక్కులను పొందగలం.

ఆదివాసీ ప్రజలారా! మీ సమస్యలు పరిష్కరించేవరకు ప్రభుత్వానికి వ్యతిరేకంగా మిలిటెంట్‌గా పోరాటాలు కొనసాగించాలి. అంతిమంగా నూతన ప్రజాస్వామిక విప్లవం విజయవంతం ద్వారానే ఆదివాసుల సమస్యలు పరిష్కారమవుతాయి. ○

*(..........48వ పేజీ తరువాయి)*

అలియాస్ నవీన్ (20), బూర్గంపాడ్ మండలం (సారపాక), ఈసం నరేశ్ అలియాన్ సుదర్శన్ (30) గుండాల మండలం (కొడవటంచ), తిరుకొళ్ళూరి మధు (గుండాల), గాడుదల శ్రీను టేకులపల్లి మండలం (కోయగూడెం), బోయిన ఓంప్రకాశ్ అలియాస్ గణేశ్, మహబూబాబాద్ జిల్లా కొత్తగూడం మండలం పెద్ద ఎల్లాపురం, ఆజాద్.

ఇందులో చనిపోయిన గాడుదల శ్రీనుకు ఇటీవల ప్రభుత్వం సబ్సిడీ గొర్రెల పథకంలో గొర్రెలను ఇచ్చింది. గొర్రెపిల్లను వెతికేందుకు వెళ్లిన శ్రీనును పట్టుకుని కాల్చి చంపడం లాంటి విషయాలు, పౌరుహక్కుల సంఘాలు నిర్ధారించిన వాస్తవాలు, అమరులైన కార్యకర్తల నేపథ్యం చూస్తే తెలంగాణ పోలీసుల పాశవిక హత్యాకాండకు అంతూ దరి లేదని, ఇది రాజ్యం తాలూకు నిర్బంధపు పైశాచికత్వం తప్ప మరొకటి కాదని స్పష్టమవుతుంది. పోలీసు నిర్బంధకాండకు వ్యతిరేకంగా, బూటకపు ఎన్‌కౌంటర్లకు వ్యతిరేకంగా అన్ని సెక్షన్‌ల ప్రజానీకాన్ని ఉద్యమించాల్సిందిగా కోరుతున్నాము. మృతదేహాలను తరలించేందుకు వచ్చిన ట్రాక్టర్‌పై అప్పటికే రక్తపు మరకలు ఉన్నాయి.

ఇది ఎన్‌కౌంటర్ కాదని, స్వయంగా ప్రభుత్వమే హత్య చేసిందని "మేళ్ల మడుగు ఎన్‌కౌంటర్ ముమ్మాటికీ బూటకం. పోలీసులు ఆడుతున్నదంతా పచ్చి నాటకం" అని తెలంగాణ, ఏపీ రాష్ట్రాల పౌరహక్కుల సంఘం నేతల నిజ నిర్ధారణ బృందం ప్రకటించింది. హైకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.

ఈ బూటకపు ఎన్‌కౌంటర్‌కు నిరసనగా ఆంధ్రా, తెలంగాణ పౌరహక్కుల సంఘాలు సీపీఐ, సీపీఎమ్, టీడీపీ, న్యూడెమక్రసీల నేతృత్వంలోని అఖిలపక్షం ఆధ్వర్యంలో ఆదివారం ఇల్లెందు పట్నంలో నిరసన ప్రదర్శన జరిగింది. ఎన్‌కౌంటర్ పేరుతో హత్యలు చేస్తే ప్రజలు గుణపాఠం చెపుతారని, ఉద్యమాలు మరింత ఉధృతం అవుతాయని హెచ్చరించారు. కొందరు కాంగ్రెస్ నాయకులు కూడా ఈ బూటకపు ఎన్‌కౌంటర్ ఖండిస్తూ జిల్లా ఎస్పీ. పోలీసులపై హత్యానేరం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ○

పతిక్రా పకట్రన

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) కేంద్ర కమిటి పిలుపు

**బ్రాహ్మణీయ హిందూ ఫాసిజానికి వ్యతిరేకంగా సమైక్యంగా పోరాడుదాం!**

**హిందూ మతోన్మాదానికి వ్యతిరేకంగా కార్యాచరణ వారం**

***2017 డిసెంబరు 6 నుండి 12 వరకు పాటిద్దాం! డిసెంబరు 12న భారత బంద్ జయప్రదం చేద్దాం!***

**ప్రియమైన ప్రజలారా! ప్రజాస్వామిక, లౌకిక మిత్రులారా!**

మన దేశంలో గత మూడేళ్లకుపైగా పదహారణాల బ్రాహ్మణీయ ఫాసిస్టు శక్తుల పాలన కొనసాగుతోంది. రోజురోజుకూ కాషాయ ఉగ్రవాద ప్రమాదం పెరుగుతోంది. ఆశేతు హిమాచలం దుష్ట హిందుత్వ శక్తుల దాడులతో అట్టుడికి పోతున్నది. దేశంలోని మత మైనారిటీలు, దళిత, ఆదివాసీ ప్రజా సముదాయాలు; ప్రజాస్వామిక, లౌకిక శక్తులు; విప్లవకారులు, వామపక్ష వాదులు, నిజమైన దేశభక్తులు, పాత్రికేయులు, మహిళలు, విద్యార్థులు రోజూ ఎక్కడోచోట బ్రాహ్మణీయ ఫాసిస్టు శక్తుల దాడులకు గురవుతూనే ఉన్నారు. మసీదులు, క్రైస్తవ చర్చిలు, ఆదివాసీల గుళ్లు, కాషాయశక్తుల దాడులకు గురవుతున్నాయి. దేశంలో ఇలాంటి భయభీభత్స వాతావరణం నెలకొంటున్న పరిస్థితులలో బ్రాహ్మణీయ ఫాసిస్టు శక్తులతో పోరాడి వాటిని ఓడించకుండా ప్రజాస్వామ్యాన్ని, నిజమైన లౌకికవాదాన్ని నిలబెట్టుకోలేం. అందుకే సమస్త ప్రజాస్వామిక వాదులు, రచయితలు, కళాకారులు, పాత్రికేయులు, మేధావులు, లౌకికవాదులు, మహిళలు, విద్యార్థులు, నిరుద్యోగ యువత, ఉద్యోగులు, వామపక్షమిత్రులు సమైక్యంగా దేశంలో నానాటికీ విజృంభిస్తున్న ఫాసిస్టు శక్తుల దాష్టీకాలను గట్టిగా ప్రతిఘటించి ఓడించాల్సిన తరుణమిది. వారి దుశ్చర్యలన్నింటినీ కేవలం ఎండగట్టడమే కాకుండా ఆ శక్తులకు తగిన బుద్ధి చెప్పాల్సిన సమయమిది. అందుకు మనమంతా సమైక్యంగా పోరాడుదాం. మా పార్టీ డిసెంబరు 6 నుండి 12 వరకు తలపెట్టిన హిందూ ఫాసిస్టు వ్యతిరేక ఆక్షన్ వీక్‌లో చురుగ్గా పాల్గొని డిసెంబరు 12 నాడు భారత బంద్‌ను జయప్రదం చేయాల్సిందిగా యావత్ ప్రజానీకానికి ముఖ్యంగా మతమైనారిటీలకు దళిత, ఆదివాసీ, విద్యార్థి, మహిళా సముదాయాలకు లౌకిక వాదులకు, మేధావులకు విజ్ఞప్తి చేస్తున్నది.

1992 డిసెంబరు 6 భారతదేశ ప్రజల మత సామరస్య ఆచరణలో విద్వేషాలను రెచ్చగొట్టి విధ్వంసానికి పాల్పడిన రోజుగా చరిత్రలో నిలిచిపోయి ఇరువైఅయిదు సంవత్సరాలు పూర్తవుతున్నాయి. ఇరువైఅయిదు సంవత్సరాల క్రితం దేశవ్యాప్తంగా ఉన్న వేలాది హిందుత్వ (లంఫెన్) శక్తులను గుడ్డి మతాభిమానులను కరసేవకులుగా ఫాసిస్టు శక్తులు పోగుచేసి వారిలో పరమత విద్వేషాన్ని రెచ్చగొట్టి 5 గంటలపాటు అయోధ్యలో బాబ్రీ మసీదు కూల్చివేత తాండవమాడారు. 462 సంవత్సరాల క్రితం రామాలయంపై నిర్మించిన మసీదంటూ తమకు తోచిన చరిత్రకు పట్టం కడుతూ ముస్లింల ప్రార్థనా మందిరాన్ని కూల్చివేశారు. దేశవ్యాప్తంగా అనేక పట్టణాలలో మత కల్లోలాలు చెలరేగి 213 చోట్ల కర్ఫ్యూలు విధించాల్సి వచ్చింది. దాదాపు 10 కోట్లకు పైగా ప్రజానీకం ఆనాడు దేశవ్యాప్తంగా విస్తరించిన మతకల్లోలాల బాధితులయ్యారు. హిందూ ఫాసిస్టుల మాతృసంస్థ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ దాని అనేక అనుబంధ సంస్థలలో ముఖ్యమైన విశ్వ హిందూ పరిషత్తు, భజరంగ్ దళ్ ఆ తాండవంలో త్రిశూలాలతో అగ్రభాగాన నిలిచారు. గత రెండున్నర దశాబ్దాలుగా ఆ శక్తులు అయోధ్యలో శాంతిని నెలకొననీయడం లేదు. ఇక ఇప్పుడు కరుడుగట్టిన హిందుత్వ మొనగాడు యోగి ఆదిత్యనాథ్ ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి అయ్యాక అయోధ్యలో ఎప్పుడు ఏమవుతుందోనన్న వాతావరణంలో అక్కడి ప్రజలు ముఖ్యంగా ఆ రాష్ట్రంలోని ముస్లిం ప్రజానీకం భయం గుప్పిట్లో రోజులు గడుపుతున్నారు. ఇలాంటి పరిస్థితులలో 2017 డిసెంబరు 5 నాడు అలహాబాద్ హైకోర్టు అయోధ్య వివాద పరిష్కారపు తీర్పుకు సిద్ధమవుతున్నది. ఆ కోర్టు వెలువరిచే తీర్పు ఎలా ఉండబోతుందో ఈ దేశంలోని న్యాయవ్యవస్థ స్వభావమెరిగిన వారు ఊహించడం పెద్ద కష్టమేమీ కాదు. సాధ్వి ప్రజ్ఞా ఠాకుర్ సహా అనేకమంది కటకటాల నుండి నిర్దోషులుగా రోడ్లపైకి వచ్చి విరుచుకపడుతున్న కోర్టు తీర్పుల నేపథ్యంలో; 2002 నాటి గుజరాత్ మతకల్లోలాల బాధితురాలు బిల్కిస్ బానో కేసులో నేరస్థులను కఠినంగా శిక్షించడంలో తన అసమర్థతను చాటుకున్న దేశ అత్యున్నత న్యాయస్థాన తీర్పు నేపథ్యంలో; మాజీ ప్రధాని వాజ్‌పేయి తన హయాంలోనే ముందుకు తెచ్చిన హిందూ అనుకూల పరిష్కార నీతి ఎరిగిన వారికి అలహాబాదు హై కోర్టు తీర్పులో ఇపుడు కొత్తదనమేముంటుంది? దేశంలో మత మరణకాండ జ్వాలలను మరింత ఎగదొయ్యడానికి కావల్సిన ఆజ్యాన్ని అందివ్వడమే ఆ కోర్టు చేస్తుందన్న విషయం విజ్ఞులకు వివరించనక్కరలేదు.

నిజానికి అయోధ్యలో మత విద్వేషాలకు బీజాలు వేసింది 1949 డిసెంబరులోనన్న వాస్తవాన్ని చారిత్రిక రహస్యాలు విడమర్చి చెప్తున్నాయి. అధికార యంత్రాంగ కుమ్మక్కులతో దొంగతనంగా విగ్రహాలను ప్రతిష్టించినది అప్పటి కాంగ్రెస్ హయాంలోనేనన్నది గుర్తుచేసుకుంటే 1986లో ఆ విగ్రహాలకు ఓటు బ్యాంకు రాజకీయాలతో పూజకనుమతించింది కూడా వారి హయాంలోనన్న వాస్తవం గుర్తొస్తుంది. ఆ తర్వాత ఆరేళ్లకు జరిగిన బాబ్రీ విధ్వంసం కూడా కేంద్రంలో కాంగ్రెసు ప్రభుత్వం ఉన్నప్పుడే నన్నది తల్చుకుంటే తొలినుండీ హిందువులను మచ్చిక చేసుకోవడానికి కాంగ్రెస్ అనుసరించిన కుటిల విధానాలు. కాషాయ ఫాసిస్టు శక్తుల నేటి విధ్వంసకర విధానాలను ఎగదోస్తున్నాయని నిర్ద్వంద్వంగా చెప్పవచ్చు. హైందవ ధర్మ లోతులు గాంధీ నుండి బాగా గ్రహించగలిగిన దేశ తొలిప్రధాని నెహ్రూ ముస్లిం మతోన్మాదం భారత సమాజంలో ఆధిపత్యానికి వచ్చి ఫాసిజాన్ని అమలుచేయజాలదు. ఆ పని చేయగలిగేది హిందూ మతోన్మాదం మాత్రమే అన్నది వర్తమానంలో వాస్తవ రూపం దాల్చడంలో కాంగ్రెస్ పాత్ర తక్కువేమీ కాదు.

మన దేశంలో ఎప్పటికప్పుడు కొత్త సమస్యలను సృష్టించి ప్రజల మత సామరస్యాన్ని దెబ్బతీసి మత విద్వేషాలను రెచ్చగొట్టడం బాబ్రీ మసీదు కూల్చివేత ముందూ తర్వాతా జరిగాయి, జరుగుతున్నాయి. 1947 దేశ విభజన సమయంలో లక్షలాది ప్రజల నెత్తుర్లు దేశ సరిహద్దులను ముంచేశాయి. ఆ తర్వాత అహ్మదాబాద్ (1969), భివండి (మహారాష్ట్ర-1970), తెల్లచ్చేరి (కేరళం-1971), జెంషెడ్‌పూర్ (ఝార్ఖండ్-1979), భాగల్పూర్(బిహార్), మీరట్ (ఉత్తర ప్రదేశ్-1980), తమిళనాడు(1982), గుజరాత్(2002), కందమాల్ (ఒడిశా-2008), ఉత్తరప్రదేశ్(2013) లాంటివి విస్తృత స్థాయిలో జరిగిన ఘర్షణలు పెద్దఎత్తున ప్రజల ప్రాణ, ఆస్తి నష్టాలకు దారితీశాయి. ప్రధానంగా దేశంలో ముస్లిం ప్రజలు తీవ్రమైన అభద్రతకు లోనవుతూ నిత్యం భయం నీడలో బతుకులీడుస్తున్నారు. 2014లో హిందూ ఫాసిస్టులు అధికారాన్ని చేపట్టాక అఖ్లాక్ నుండి ఇటీవల రాజస్థాన్‌లోని పహలూఖాన్ నుండి ఇలాంటి ప్రజా నాయకుడు అహ్మద్ ఖాన్ వరకు పలువురు ముస్లిం సోదరుల ప్రాణాలను హిందుత్వ మూకలు నిర్దాక్షిణ్యంగా హత్య చేశాయి.

మన దేశంలో శతాబ్దాలుగా కొనసాగుతున్న నిచ్చెనమెట్ల బ్రాహ్మణీయ నికృష్ట కుల వ్యవస్థలో దళితుల జీవితాలు కడదేరుతున్నాయి. పునాది వర్గాల శ్రమజీవులు వాళ్లు. వాళ్ల శ్రమ లేకుండా ఉన్నత వర్గాల, కులాల మనుగడే ఉండదంటూ కులవ్యవస్థ ప్రణిత మనువు ఎన్నడో తేల్చిచెప్పాడు. శూద్రులు, వైశ్యులు (ఆనాటి వ్యవసాయదారులు) తమ వృత్తులను మానుకుంటే ప్రపంచమే అస్తవ్యస్తమవుతుందన్నాడు. దోపిడి సమాజంలో దళితుల జీవితాలను అగ్రకులాలు, దోపిడీ వర్గాలు అన్ని విధాలా బలిగొంటున్నాయి. అధికార మార్పిడి తర్వాత కూడా రాజ్యాంగ సాక్షిగా వారిని అస్పృశ్యులుగానే చూస్తున్నారు. వారిని అంటరానివారుగానే అవమానపరుస్తున్నారు. వేధిస్తున్నారు. వారిపై 'స్వతంత్ర' దేశంలో హంతక దాడులు ఆగిందెన్నడూ లేదు. బిహార్‌లోని బెల్చిలో 11 మంది దళితుల సజీవ దహనం, తమిళనాడులోని కిల్వెన్‌మణి(1968)లో భూమి ఘర్షణల్లో 45 మంది దళితులను అగ్రకులాలు ఊచకోత కోశాయి. ఆ తర్వాత బథానీటోల (బిహార్), చుండూర్(ఆంధ్ర ప్రదేశ్) నుండి ఖైర్లాంజి(మహారాష్ట్ర), ఈ నాటి జీవ్‌ఖేడ(మహారాష్ట్ర) వరకు వందలాది దళితులు అగ్రకులాల పైశాచికత్వానికి ప్రాణాలు కోల్పోయారు. 2014లో మోదిత్వ శక్తులు గద్దెకెక్కిన తర్వాత ఊనా(గుజరాత్) మొదలు నలంద జిల్లా ఆజాద్‌పూర్‌లో క్షురకుడు మహేశ్ ఠాకుర్ (బిహార్) వరకు ఎదుర్కొన్న ఘోరమైన అవమానాలు, అమానుషమైన అత్యాచారాలు ఇటీవలి పరిణామాలు మనువు గారి వర్ణాశ్రమ ధర్మాన్ని తు.చ. తప్పకుండా పాటింపచేసే 'ధర్మ'బుద్ధితో అపర మనువు ప్రధాని మోదీ 2010లో కర్మభూమి పేరుతో ఏకంగా ఓ పుస్తకాన్నే (మోదీ స్మృతి) రాసేశాడు. సమాజంలో అత్యంత దుర్మార్గమైన హిందుత్వ కుల వ్యవస్థ దాష్టీకాలను ప్రత్యక్షంగా అనుభవించిన పీడిత ప్రజల పక్షపాతి డాక్టర్ అంబేద్కర్ చేసిన హెచ్చరిక నేడు ఎంతో ప్రాసంగికతను సంతరించుకుంది. "ఒకవేళ హిందుత్వం గద్దెనెక్కడమే జరిగితే నిస్సందేహంగా దేశానికి పెనువిపత్తుగా మారుతుంది. హైందవులు ఏమి చెప్పినప్పటికీ స్వేచ్ఛ, సమానత, సౌభ్రాతృత్వాలకు హిందుత్వం ప్రమాదకరం." అన్నాడు. ప్రస్తుతం మన దేశం ఆ ఫాసిస్టు శక్తుల ప్రమాదకర పాలనలోనే నలుగుతుంది. ముందు తరాలవారు భావి తరాల కందించిన జీవిత వాస్తవాల వెలుగులో ఫాసిస్టు శక్తుల ప్రమాదాన్ని ఓడించడం మనందరి బాధ్యత.

దేశంలోని అత్యున్నత స్థాయి విద్యా సంస్థలలో విశ్వ విద్యాలయాలల్లో బ్రాహ్మణీయ శక్తులు పెచ్చరిల్లిపోతున్నాయి. 1991లో దేశ దోపిడి పాలక వర్గాలు తలకెత్తుకున్న సామ్రాజ్యవాద ఆదేశిత ఆర్థిక విధానాల మూలంగా పేదలు విద్యనభ్యసించడమే దుర్భరంగా మారింది. కాగా మోదీ అండ్ కంపనీ పాలనలో నూటికి నూరు శాతం విద్యారంగాన్ని ప్రైవేటుపరం చేయడంతో మధ్యతరగతి ప్రజలు కూడా తమ పిల్లలను చదివించడం శక్తికి మించినదవుతున్నది. పరీక్ష పోటీలు విద్యార్థులకు ప్రాణగండంగా మారుతున్నాయి. ఒక ఆంధ్రప్రదేశ్‌లోనే 1995-2000ల మధ్య 1400 మంది విద్యార్థులు బలవన్మరణం పాలయ్యారు. ఈ ఒక్క 2017 అక్టోబరు నెలల్లోనే ఉభయ తెలుగు రాష్ట్రాలలో బలవన్మరణాలకు పాల్పడిన విద్యార్థుల సంఖ్య 50. "కార్పొరేటు కళాశాలలే ఈ పాపాన్ని ఎలాంటి భీతిలేకుండా మూటగట్టుకుంటున్నాయి." అంటూ ప్రముఖ విద్యావేత్త చుక్కా

రామయ్య వాపోయాడు. విద్యా వ్యవస్థలో చదువుల కొనుగోళ్ళు, పరీక్షా పోటీల వ్యవహారం ఇలా ఉండగా దేశంలోని అనేక విశ్వ విద్యాలయాలల్లో దళిత విద్యార్థులపై, ప్రొఫెసర్లపై బ్రాహ్మణీయ శక్తుల దాడులు ముమ్మరమైనాయి. విద్యా సంస్థలు కాషాయ శక్తుల ఆధిపత్యంలో నడుస్తున్నాయి. పాఠ్య ప్రణాళికలు బ్రాహ్మణీకరణ చెందుతున్నాయి. చెన్నైలోని ఐఐటి, పూణెలోని ఎఫ్‌టిఐఐ, హైద్రాబాద్ కేంద్ర విశ్వవిద్యాలయం, జాదవ్‌పూర్ యూనివర్శిటీ, ఢిల్లీలోని జెఎన్‌యూ, కాశీ(వారణాసి)లోని బిహెచ్‌యు, జోథ్‌పూర్ యూనివర్శిటీ, హర్యానాలోని మహేంద్రగడ్ కళాశాలలో మహాశ్వేతాదేవి నాటకాన్ని ప్రదర్శించిన విద్యార్థి, ఉపాధ్యాయులపై సాగిన వేధింపుల వరకు చూస్తే దేశంలోని ఏ కళాశాలా, ఏ విశ్వవిద్యాలయంలో విద్యార్థులు కాషాయ శక్తుల మూలంగా ప్రశాంతంగా చదువుకోలేక పోతున్నారు. మరోవైపు ప్రగతిశీల విద్యార్థులు అవమానాలు, వేధింపులు, దౌర్జన్యాలు భరించడమే గాకుండా హత్యల పాలవుతున్నారు. సర్కార్ రిపోర్టులు ఎన్ని దగుల్బాజీ అబద్ధాలు ప్రకటిస్తున్నప్పటికీ ప్రగతిశీల మేధావి విద్యార్థి రోహిత్ వేముల ఆత్మహత్య రూపంలో సాగిన హత్య కాషాయి గుండాల వేధింపుల ఫలితమేనన్నది జగమెరిగినదే. ఇక 2016 నవంబరు 14 నాడు జెఎన్‌యూ విద్యార్థి నజీబ్ అదృశ్యం ఎబివిపి గుండాల మతోన్మాద హంతక రాజకీయాల ఫలితమే. ఢిల్లీ జెఎన్‌యూ విద్యార్థి నాయకుడు కన్హయ్ కుమార్ ఎదుర్కొంటున్న వేధింపులకు అడ్డులేకుండా పోయింది. ఇలాంటి దుస్థితిలో మన యావత్తు విద్యార్థి యువజనులు నడుం బిగించి బ్రాహ్మణీయ శక్తులను సమరశీల పోరాటాల ద్వారా ప్రతిఘటించే సామాజిక చోదక శక్తులుగా తమ సత్తాను చాటుకోవల్సి ఉంది.

దేశంలో వివిధ జాతుల పోరాటాలు ఎన్ని నష్టాలను, విధ్వంసాలను ఎదుర్కొంటున్నప్పటికీ తమ న్యాయమైన జాతి సమస్యలపై దశాబ్దాలుగా అవి పోరాడుతూనే ఉన్నాయి. కానీ భారత పాలక వర్గాలు ఆ ప్రజల న్యాయమైన పోరాటాలను, ఆకాంక్షలను తప్పుపడుతూ విచ్ఛిన్న చర్యలుగా నిందిస్తూ పాశవికంగా అణచివేస్తున్నాయి. కశ్మీర్ ప్రజ అనేక త్యాగాలు చేస్తూ పోరాడుతుంటే మోదీ అండ్ కంపెనీ కేవలం పాకిస్తాన్ రెచ్చగొడుతున్న భారత విచ్ఛిన్నకర చర్యలుగానే ఆ పోరాటాన్ని చిత్రిస్తూ భారత సైనికుల ఉక్కుపాదాల కింద అణచివేయజూస్తున్నది. కానీ ఆ లోయ కశ్మీరీ జాతి పోరాట విస్ఫోటన కేంద్రంగా నిలుస్తున్నది. తుదకు అక్కడి అవకాశవాద, దళారీ రాజకీయ నాయకుడు ఫారుక్ అబ్దుల్లా కశ్మీర్ ప్రజా పోరాట మంటలను చల్లార్చలేరంటూ ఈ నాడు ప్రకటించే స్థితి రావడం మోదిత్వ శక్తుల పుణ్యమే! మణిపూర్‌లో ఎంతటి ఊచకోతకు పాల్పడుతున్నా అక్కడి ప్రజా విముక్తి సేన మణిపూర్ మావోయిస్టులు భారత సైన్యాలను గట్టిగా ఎదుర్కొంటూనే ఉన్నారు. ఒకే జాతి, ఒకే ఖండం అంటూ సెలవిచ్చే బ్రాహ్మణీయ శక్తుల దుష్టకలలు ఎల్లకాలం సాగవంటూ కశ్మీరీ యువత మరింత అధికంగా సాయుధమవుతోంది.

దేశంలో గత మూడేళ్లలో పెరిగిన హిందూ ఫాసిస్టుల అణచివేత చర్యలు, హంతక దాడులకు నిరసనగా దేశంలోని మేధావులు, ప్రజాస్వామిక వాదులు, లౌకిక శక్తులు, చరిత్రకారులు, రచయితలు, కళాకారులు, శాస్త్రజ్ఞులు సహా పలురంగాలల్లో లబ్ధ ప్రతిష్టులైన భారత పౌరులు తమ అవార్డులను ప్రభుత్వ ముఖాన తిప్పికొట్టారు. దేశంలో హిందుత్వ శక్తుల ఆగడాలను అడ్డుకొంటున్న అభ్యుదయవాదులను కాషాయ గుండాలు వరుసగా హతమారుస్తున్నారు. ఒక దాభోల్కర్, మరో పన్సారే, కల్‌బుర్గిల నెత్తుటి మరకల తడి ఆరకముందే 2017 సెప్టెంబరు 5 నాడు గౌరీ లంకేశ్‌ను ఆ శక్తులు పొట్టనపెట్టుకున్నాయి. "మన దేశ రాజకీయాల్లో మతం ప్రధానపాత్ర పోషిస్తున్నది." "మన లౌకిక రాజ్యాంగ రాజకీయాల నుంచి మతాన్ని వేరుగా చూడాలి." అంటూ గౌరీ హిందుత్వ వ్యతిరేక పోరాటం ఆమె ప్రధాన ఎజెండాగా తన పత్రిక సంపాదకీయాల్లో నిల్పింది. గురుమిత్ రాం రహీంతో మోదీ సహా హర్యానా మంత్రుల ఫోటోల భండారం ఆమె బయటపెట్టింది. గోరఖ్‌పూర్ ఆస్పత్రిలో పసిపిల్లల మరణాలు బిజెపి నరమేధంగా అభివర్ణించింది. ఇవన్నీ మింగుడుపడని కాషాయ శక్తులు ఆమెను బలితీసుకున్నాయి. పైగా ఆమెను మావోయిస్టులు హత్య చేశారంటూ బొడ్డూడని శిశువులు సైతం నమ్మని విధంగా అసత్యాలకు పూనుకున్నారు. ఇటీవల సామాజికవేత్త, రచయిత అయిన కంచ అయిలయ్య రాసిన "సామాజిక స్మగ్లర్లు కోమటోళ్లు" పుస్తకాన్ని నిషేధించాలని పెద్దేత్తున వైశ్య సంఘాలు కులాన్ని కేంద్రంగా చేసుకుని రంగంలోకి దిగడమే గాకుండా పార్లమెంటు సభ్యుడు టిజి వెంకటేశ్ బెదిరింపులకు దిగాడు. ఆయనను హతమారుస్తామంటూ కొన్ని ఉన్మాద శక్తులు బహిరంగంగా ప్రకటిస్తున్నాయి. ఛత్తీస్‌గఢ్‌లో ప్రముఖ పాత్రికేయుడు వినోద్ వర్మను సోకాల్డ్ సిడి కేసులో ఇరికించి హిందుత్వ శక్తులు కటకటాలపాలు చేశాయి. హిందుత్వ వ్యతిరేక మేధావులపై జరుగుతున్న అన్నిరకాల దాడులను వాక్, సభ, పత్రిక స్వతంత్రాలను ఎత్తిపట్టే ప్రతి ఒక్కరూ ఖండించాలని మా పార్టీ కోరుతోంది. ఇలాంటి దుష్ట శక్తులకు గట్టిగా బుద్ధి చెప్పడానికి ప్రత్యేకించి కలం యోధులంతా అండగా నిలవాలని విజ్ఞప్తి చేస్తున్నది.

దేశంలో బ్రాహ్మణీయ శక్తుల ఫాసిస్టు చర్యలను ఖండిస్తూ పోరాటాలకు నడుం బిగించడమంటే, ఆ శక్తులు చేపట్టిన సామ్రాజ్యవాదుల ప్రయోజనాలను ఈడేర్చే ఆర్థిక, రాజకీయ విధానాలన్నింటినీ ఎదుర్కొని ఓడించడమేనన్న విషయాన్ని విడిగా చెప్పాల్సిన అవసరం లేదు. దేశంలోని అన్ని సెక్షన్ల ప్రజలు అనేక సమస్యలతో సతమతమవుతున్నారు. చివరకు భారతీయ జనతాపార్టీ అనుబంధ కార్మిక సంఘం భారతీయ మజ్దూర్ సంఘ్ నవంబరు

17 నాడు కార్మిక వ్యతిరేక ప్రభుత్వ విధానాలను ఖండిస్తూ ఢిల్లీలో రోడ్లమీదికి రాక తప్పలేదు. రైతాంగం ఆత్మహత్యలు కొనసాగుతూనే ఉన్నప్పటికీ మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, తెలంగాణ, ఉత్తరప్రదేశ్, తమిళనాడు సహా పలు రాష్ట్రాల రైతాంగం తుపాకి తూటాలకు వెరవక సమరశీల పోరాటాలకు దిగుతున్నారు. అక్టోబర్ 20 నాడు దేశంలోని వేలాది మంది రైతులు "కిసాన్ ముక్తి సంసద్" రైతు వ్యతిరేక ప్రభుత్వ విధానాలను ఖండిస్తూ ర్యాలీ నిర్వహించారు. పేరుతో వివిధ శాఖల్లోని ప్రభుత్వోద్యోగులు సమ్మెలు చేస్తున్నారు. ఉద్యోగ కల్పన లేని దేశ "అభివృద్ధి" విధానాల మధ్య ఒకవైపు లక్షల సంఖ్యలో శ్రామికులు నిరుద్యోగులవుతుంటే కేవలం రక్షణ, పోలీసు శాఖలు మరియు మౌలిక సదుపాయాల రూపకల్పనలో లక్షలాది ఉద్యోగాలు సృష్టిస్తామంటూ పాలకులు తమ దోపిడీ స్వభావాన్ని చాటుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితులల్లో మోదీ 2022 నాటికి నవ భారత నిర్మాణమంటూ షైనింగ్ ఇండియా దారిలో ప్రజలను మభ్యపెడుతున్నాడు. పెద్దనోట్ల రద్దు, సామాన్యులు మోయలేని జిఎస్‌టి పన్నుల భారంతో దేశం అట్టుడికి పోతుంటే ప్రపంచంలోనే అభివృద్ధి పథంలో వెలుగొందుతున్న భారత్ అంటూ మోదీస్ రేటింగ్ ఏజన్సీ దేశ రేటింగ్‌ను పైకి పెంచిందంటూ పాలకులు సంబరాలు పంచుకుంటున్నారు. స్వప్నింపజేస్తున్నారు.

ఒకవైపు మనుశిక్షా స్మృతిని గుర్తుకు తెస్తున్న రీతిలో హిందూ రౌడీ మూకలు చిత్రహింసలు పెట్టి నడి బజారులో వ్యక్తులను (మాబ్ లించింగ్) హతమారుస్తుంటే, ఆడపిల్లల జడలు కత్తిరిస్తుంటే "కులతత్వ విషం గ్రామాలను నాశనం చేస్తున్నది. గ్రామాల స్వప్నాలను ధ్వంసం చేస్తున్నది." అంటూ అపర మను మోదీ నవ భారత నిర్మాణంలో భారత సర్వతోముఖాభివృద్ధికి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలంటూ జబ్బు ఒకటైతే మందు మరొకటన్న చందంగా తన చతికిలబడ్డ మేక్ ఇన్ ఇండియా లక్ష్య సాధనలో కలలు కంటున్నాడు. ఆయన గాంధీ, దీన్‌దయాళ్‌లకు, లోహియాను జతచేసి ఆ ముగ్గురి విధానాలతో ఈ దేశం అభివృద్ధి పథంలో పురోగమించనుందంటూ ప్రజలను మూర్ఖులను చేస్తున్నాడు. అయోధ్యపై ఆరని మంటల మధ్య తాజాగా వారి పార్టీ నాయకులు, మంత్రులు సంగీత్ సోమ్, అనిల్ విజ్ తాజ్‌మహల్‌పై ప్రజల మనోభావాలను ముఖ్యంగా ముస్లిం సోదరుల విశ్వాసాలను దెబ్బతీసే ప్రకటనలు చేశారు. ఇలాంటి ప్రకటనలు గత మూడేళ్లుగా వివిధ సందర్భాలలో హిందూ సంత్‌లు, సాధ్వీలు, స్వాములు అనేకం చేస్తూనే ఉన్నారు. వీరి ప్రకటనలు ఏ క్షణాన్నైనా, ఏ రూపంలోనైనా కార్యరూపం తీసుకోవచ్చునన్న భీతావహ వాతావరణం నేడు దేశం ఎదుర్కొంటున్నది. ఇలాంటి పరిస్థితులను ఓడించడానికి సమస్త ప్రగతిశీల బ్రాహ్మణీయ వ్యతిరేక శక్తులు సమైక్యంగా పోరాడాలని మా పార్టీ విజ్ఞప్తి చేస్తున్నది.

ప్రజా విముక్తి గెరిల్లా సైనికులారా!

యేటా డిసెంబర్ 2 నుండి 8 వరకు మన పార్టీ పిఎల్‌జీఏ వారోత్సవాన్ని జరుపుకుంటున్నది. ఈ సంవత్సరం ప్రభుత్వ నూతన దాడి వ్యూహం సమాధాన్‌ను ఓడించాలని కేంద్ర సైనిక కమీషన్ పిలుపునిచ్చిన నేపథ్యంలో "యాక్షన్ వీక్ ఎగెనెస్ట్ హిందూ ఫాసిజం"ను డిసెంబరు 6 నుండి 12 వరకు పాటించి జయప్రదం చేయడంలో మీరు చురుగ్గా పాల్గొనాలి. ఈ దేశ పీడిత ప్రజల సైన్యం పిఎల్‌జీఏ వారిని అన్నివిధాలా హిందూ ఫాసిస్టుల దాడి నుండి రక్షించడానికి నడుం బిగించాలి. వారి చురుకైన మద్దతు లేకుండా పీఎల్‌జీఏ తన లక్ష్యాలను సాధించలేదు. సమాధాన్ వ్యూహాలను ఓడించలేదు. దేశంలోని ప్రగతిశీల ప్రజాస్వామ్య ఆదివాసీ శ్రేయోభిలాషుల అపార అండదండలతోనే గతంలో సల్వాజుడుం, సేంద్ర లాంటి ప్రభుత్వ ప్రాయోజిత శ్వేత మిలిషియా ఫాసిస్టు దాడులనూ, ఆపరేషన్ గ్రీన్ హంట్ రెండు దశలనూ ఓడించగలిగాం. నేటి మూడవ దశలో సమాధాన్ వ్యూహాన్ని ఎదుర్కొంటున్నాం. ఇలాంటి తరుణంలో బిడి శర్మ లాంటి ఆదివాసీ శ్రేయోభిలాషులు లేకపోవటం పెద్ద లోటే. ఆ లోటు తీర్చుకోవడమంటే ఆయన దారిలో పీడిత ప్రజల పక్షాన నిలిచి మరింత దృఢంగా పోరాడడమే తప్ప మరేమీ కాదు. ఈ దేశంలో బ్రాహ్మణీయ ఫాసిస్టు శక్తుల దాడిలో తమ అశువులుబాసిన ప్రగతిశీల, ప్రజాస్వామ్య, లౌకిక శక్తుల త్యాగాలను ఎత్తిపడుతూ వారి స్వప్నాలను సాకారం చేయడానికి యాక్షన్ వీక్‌ను జయప్రదం చేయండి.

- డిసెంబరు 6 నుండి 12 వరకు యాక్షన్ వీక్ ఎగెనెస్ట్ హిందూ ఫాసిజం జయప్రదం చేయండి!
- డిసెంబరు 12 నాడు భారత బంద్‌ను జయప్రదం చేయండి!
- గ్రామాలు, నగరాలు, పట్టణాలలో వివిధ సెక్షన్ల ప్రజలతో కలిసి ర్యాలీలు, చర్చాగోష్ఠులు, బహిరంగసభలు నిర్వహించండి!
- హిందూ ఫాసిస్టు శక్తుల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా చురుగ్గా కదలండి!
- నూతన ప్రజాస్వామిక విప్లవం, నూతన ప్రజా సంస్కృతి వర్థిల్లాలి!

విప్లవాభి వందనాలతో

Abhay

**అభయ్**

**అధికార ప్రతినిధి, కేంద్ర కమిటీ**

**16 నవంబరు 2017** **భారత కమ్యూనిస్టు పార్టీ(మావోయిస్టు)**

*(......చివరి పేజీ తరువాయి)*

కొనసాగాడు. ముఖ్యంగా చివరి కొన్ని సంవత్సరాలుగా ఈ నకారాత్మక అంశాలు ప్రభలమై చివరికి పార్టీ, ఉద్యమం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు బహిర్గతమయ్యాయి. శత్రువు పట్ల ఉన్న భయాలు ప్రధానం కావడంతో పార్టీ అతనికి అప్పగించిన బాధ్యతలను ఇంక ఎంత మాత్రము నిర్వహించలేని పరిస్థితికి లోనయ్యాడు. శత్రు దాడులు జరిగే అవకాశముందన్న కారణం చూపి ముఖ్యమైన సమావేశాలకు రాకుండా తిరస్కరించాడు. అలాంటి వివత్కర పరిస్థితుల్లోనే ఇతర కామ్రేడ్స్ భాగస్వాములయ్యారు. అందులో భాగంగానే ఉన్నత కమిటీలకు చెందిన కామ్రేడ్స్, అతని రక్షణ కామ్రేడ్స్ కూడా అతనిలోని భయాందోళన స్వభావాన్ని, ఓటమితత్వాన్ని విమర్శించారు. శత్రువు యొక్క తీవ్ర దాడి ఉన్నత స్థాయిలో ఉన్నప్పుడు పార్టీ నాయకత్వ కామ్రేడ్స్ యుద్ధ రంగంలో దృఢంగా, విశ్వాసంగా ఉండాలని, ధైర్యంగా తమనుతాము రక్షించుకోవడం పార్టీ, పీఎల్‌జీఏ, ఉద్యమాన్ని రక్షించడం నుండి విడదీయరాని విధంగా ఉండాలని ప్రస్తుత పరిస్థితి డిమాండ్ చేస్తుంది.

ఇది విప్లవోద్యమం పనిలో అన్ని రంగాల్లోను, మిలటరీ రంగంతో సహా జరగాలి. కానీ నరసింహారెడ్డి కేంద్రకమిటీ సభ్యుడుగా పార్టీ ఇచ్చిన ఉన్నత స్థాయి బాధ్యతను, లక్ష్యాలను కొనసాగించడంలో విఫలమయ్యాడు. ఉన్నత రాజకీయ చైతన్యాన్ని, సంసిద్ధతను, ధైర్యాన్ని, క్రమశిక్షణను, నిస్వార్థత్యాగాన్ని, ఆత్మవిమర్శ విధానాన్ని, ఇతర నాయకత్వ లక్షణాలను ప్రదర్శించలేదు.

పాతుకుపోయిన బలహీనతలు, పరిమితులు కొనసాగి ఒక తీవ్ర స్థాయికి చేరిన నరసింహారెడ్డి పనిని మా కేంద్ర కమిటీ సమీక్షించింది. అతను స్వీయాత్మకతలో తీవ్రంగా కూరుకు పోయి దాని ఫలితంగా శత్రువును అతిగా అంచనా వేయడం, విప్లవోద్యమాన్ని, ప్రజలను తక్కువ అంచనా వేయడం చేస్తున్నాడని నిర్ధారించింది. అతను సంసిద్ధతను కోల్పోయి పార్టీ నాయకత్వం కమిటీ సభ్యుడుగా వాస్తవ పరిస్థితిని విశ్లేషించలేకపోతున్నాడు. తప్పుడు నిర్మాణ పద్ధతిని మరలా మరలా అనుసరిస్తున్నాడు. అతనికి ఇచ్చిన ముఖ్యమైన నాయకత్వ బాధ్యతలను నిర్వహించడంలో విఫలమవుతున్నాడు. తనకు దీర్ఘకాలంగా ఉన్న స్వీయాత్మకత, వ్యక్తిగత ఆలోచనను పార్టీ కమిటీల మీద రుద్దే బలహీనతకు ఇది అధనము. కేంద్రీకృత ప్రజాస్వామ్యాన్ని, శ్రామికవర్గ క్రమశిక్షణను ఉల్లంఘిస్తూ ఒంటెద్దుపోకడతో యదేచ్ఛగా వ్యక్తిగత సమస్యలను తగాదాలుగా, అన్యాయమైన వాగ్వాదాలుగా మార్చడం అతనికి ఒక అలవాటుగా మారింది. ఇతర కామ్రేడ్స్ విమర్శించినపుడు కొన్ని సమయాల్లో సంబంధిత పార్టీ కమిటీల పని విధానాన్ని స్తంభింపజేసేవాడు. కొన్ని సమావేశాలు బహిష్కరించేవాడు. అతని నిర్మాణ వ్యతిరేక స్వభావం, పని విధానం వలన అతనితో ఉన్న కామ్రేడ్స్‌లోనే క్రమంగా అతను విశ్వాసం కోల్పోయాడు. ఒంటరయ్యాడు. అతనికి సహాయం చేయాలని, తప్పులను, బలహీనతలను సరిదిద్దాలని, ఆ ప్రాతిపదికన ఐక్యతను సాధించాలని సంబంధింత పార్టీ కమిటీలకు చెందిన కామ్రేడ్స్ అనేక సందర్భాలలో ఇటువంటి అన్ని రకాల తప్పుడు విషయాలని విమర్శించడం జరిగింది. కానీ తనలో ఉన్న చెడు ధోరణులను, వాటి గాఢతను గుర్తించడంలో విఫలమయ్యాడు. మొండిగా ఆత్మవిమర్శ చేసుకోవడాన్ని తిరస్కరించాడు. మార్క్సిజం-లెనినిజం-మావోయిజం వెలుగులో అతని ప్రాపంచిక దృక్పథాన్ని మలుచుకోవడంలో విఫలమయ్యాడు. ఇది అతని పతనానికి దారి తీయడమే కాకుండా పార్టీకి కూడా తీవ్రమైన నష్టాన్ని కలిగించింది.

వీటన్నిటినీ పరిగణలోకి తీసుకొని మా కేంద్రకమిటీ అతని తప్పులను, బలహీనతలను గుర్తించి కామ్రేడ్స్ యొక్క సహాయంతో తీవ్రంగా ప్రయత్నించి, సరిదిద్దబడతాడని ఆశించి ఒక సంవత్సరం క్రితం అతనిని కేంద్రకమిటీ నుండి 2 సం॥రాలు సస్పెండ్ చేయడం జరిగింది. అయినప్పటికీ అతను ఆ నిర్ణయాన్ని సకార్మాకంగా ఆమోదించలేదు. అలాగే ఇప్పటిదాకా ఆత్మవిమర్శకు సిద్ధపడలేదు. కేంద్రకమిటీ అతనికి రాష్ట్ర కమిటీ సభ్యుడుగా ఇచ్చిన బాధ్యలను స్వీకరించలేదు. పెటీబూర్జువా కుహనా ప్రతిష్టను, స్వార్థపూరిత, సంకుచిత మానసపిక స్థితిని అదిగమించలేక పార్టీ నిర్ణయానికి భిన్నంగా కార్మిక వ్యతిరేక విశ్వాసఘాతుకానికి దిగజారి నిరంతరం అభివృద్ధి చెందాల్సిన విప్లవకారుడుగా తన్నుతాను సరిదిద్దుకోవడంలో విఫలం అయ్యాడు. విప్లవానికి, ప్రజలకు తలవంచి హుందాగా సేవచేయడానికి బదులుగా, దానికి భిన్నంగా లొంగిపోయి చీడపురుగులాగా శత్రువుకి సేవచేయడానికి సిద్ధపడ్డాడు. ఈ రకంగా ఒక విప్లవకారుని మార్పు విద్రోహిగా, పనికిరానివాడిగా పూర్తయ్యింది.

ఎప్పుడైతే కేంద్రకమిటీ అతని మీద సస్పెన్సన్ నిర్ణయం తీసుకుందో అప్పుడు పార్టీ పంథాతో రాజకీయ విభేధాలు లేవనెత్తాడు. "ఇప్పుడు భారతదేశం అర్ధవలస, అర్ధభూస్వామ్య దేశం కాదు అది పెట్టుబడిదారీ దేశంగా మారింది." కాబట్టి మన పార్టీ పంథా పరిస్థితులకు అనుకూలంగా మారాలి. భారతదేశంలో మారిన పరిస్థితులకు అనుగుణంగా సార్వత్రిక తిరుగుబాటు పంథాను చేపట్టాలి. అతను నిర్మాణంలో చర్చించలేదు. కానీ విడి వ్యక్తులతో చర్చించాడు. ఆ కామ్రేడ్స్ 'నీవు పార్టీ నిర్మాణంలో చర్చించి సమస్యను పరిష్కరించుకోవాలి' అని చెప్పారు. కానీ ఆయన దానికి సిద్ధం కాకుండా, పార్టీని విడిచిపోయాడు. ఈ రాజకీయ విభేదాలు తన దిగజారుడుతనాన్ని కప్పిపుచ్చుకోవడానికే తప్ప

మరేమీ కాదు.

అన్ని విప్లవాలు మలుపులు మెలికలతోను, ఎత్తు పల్లాలతోను, క్లిష్ట పరిస్థితులలోను సాగుతాయి. శ్రామికవర్గ పార్టీ అటువంటి సవాల్‌ను నిబ్బరంగా ఎదుర్కోవడం ద్వారా ఉక్కులా తయారయ్యి విప్లవాన్ని విజయంవైపు తీసుకెళ్ళే సామర్థ్యాన్ని సాధిస్తుంది. ఇటువంటి సమయాల్లో కమ్యూనిస్టులందరికీ –ముఖ్యంగా శ్రామికవర్గేతర వర్గాల నుండి వచ్చి కమ్యూనిస్టు పార్టీలో చేరిన వారికి– లోతైన సైద్ధాంతిక, రాజకీయ అవగాహనను పెంచుకొని శ్రామిక వర్గ ప్రాపంచిక దృక్పథాన్ని స్వీకరించి దానికి కట్టుబడి ఉండడం తప్పని సరిగా మిక్కిలి అవసరం. వారు కేంద్రీకృత ప్రజాస్వామిక దృక్పథానికి పార్టీ ఉక్కు క్రమశిక్షణకు లోబడి కామ్రేడ్స్‌తోను, ప్రజలతోను అత్యంత సన్నిహితంగా కలిసిపోయి, ఆచరణ నుండి నేర్చుకొని తప్పులను సరిదిద్దుకొని స్వార్థానికి వ్యతిరేకంగా పోరాడాలి. నిస్వార్థంగా ప్రజలకు సేవచేయాలి. నిబద్ధత గల విప్లవకారుడుగా ఉద్యమంలో ముందుపీటిన నిలబడి అంతిమ విజయం వరకు పోరాడడం ద్వారా నిబద్ధత గల విప్లవకారునిగా తనను తాను నిలబెట్టుకోవాలి. కానీ ఇటువంటి పరీక్షా సమయాల్లో కొద్ది మంది విఫలమవుతున్నారు. చరిత్రలో కొద్ది మంది వ్యక్తులు తమను తాము మలుచుకోకుండా, త్యాగానికి సిద్ధపడకుండా, ఉద్యమం నుండి దూరమవుతూ ఇటువంటి సంక్షోభ సమయాల్లో వారి మనుగడ కోసమే ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నారు. వాళ్ళు విప్లవ క్యాంపును వీడి కొన్ని సార్లు ప్రతీఘాతుక విప్లవకారులుగా శత్రువుకు సేవ చేస్తున్నారు. ఒక విప్లవకారుడు క్యాడర్‌తోను, ప్రజలతోను మమేకం కాకుండా, తనలోని బలహీనతలకు వ్యతిరేకంగా పోరాడకుండా శత్రువు పక్షాన చేరడం అనేది నరసింహారెడ్డి మన ముందుకు తెస్తున్న ప్రస్ఫుటమైన నకారాత్మక ఉదాహరణ. భయానికి లోనయ్యి, దయనీయంగా వర్గ శత్రువు ముందు సాగిలపడి ప్రజలకు ఉపయోగపడే పరిస్థితులకు తమ చేజేతులా ముగింపు పలికారు. వర్గపోరాట క్రమంలో ఆయా సందర్భాలలో విప్లవం అటువంటి మనుషులను పనికి రాని చెత్తగా తీసి బయటికి విసిరివేస్తుంది.

ఇటువంటి నీచమైన వ్యక్తులు పార్టీ మీద, నాయకత్వం మీద, విప్లవోద్యమం మీద భవిష్యత్ భారతవిప్లవం మీద శత్రువు గొంతుకు వంత పాడుతూ దూషణకు దిగినా ఆశ్చర్య పోవలసిందేమీ లేదు. శత్రువు ఇచ్చిన ఆసరాతో వాళ్ళు నూతన అవతారాలతో (నకిలి) "మేధావులు", "జర్నలిస్టులు," "సామాజిక" కర్యకర్తలు మున్నగు పేర్లతో ప్రజల ముందుకు వచ్చి పార్టీకి, విప్లవానికి నష్టం చేసే లక్ష్యంతో వస్తారు. మన కామ్రేడ్స్, మిత్రులు, భారతవిప్లవ శ్రేయోభిలాషులు ఇటువంటి పరిస్థితులపట్ల జాగురుకతతో ఉండి వారికి సరైన సమాధానం చెప్పాలి. వారిని శత్రువు యొక్క గోబెల్స్ ప్రచార యంత్రాంగంగా గుర్తించి వర్గ చైతన్యం కలిగిన పీడిత ప్రజలు ఆ ద్రోహులని చెత్తకుప్పలోకి విసిరేయాలి.

ఈ మొత్తంలో ద్రోహులు, వంచకులకు ప్రతిగా శ్రామికవర్గ విప్లవము రాజీలేని కమ్యూనిస్టు యోధులను, ఎవరైతే చివరి శ్వాస వరకు పనిచేస్తారో వారిని ముందుకు తెస్తుంది. భారత విప్లవం కూడా దీనికి మినహాయింపు కాదు. నిస్వార్థ త్యాగాలతో వేలాది మంది అమరవీరులు సుదీర్ఘ మహోత్తర సాంప్రదాయాన్ని కొనసాగించారు. వారిలో మన ప్రియతమ నాయకులు, కేడర్‌లు, కామ్రేడ్స్ చారుమజుందార్, కన్హయ చటర్జీ, సరోజ్ దత్తా, సుశీతల్ రాయ్ చౌదరి, అమూల్యసేన్, చంద్రశేఖర్ దాస్, కృష్ణమూర్తి, సత్యం, కైలాశం, అప్పు, వర్గేశ్, బిశ్వకర్మ, బాలన్, దినకర్, శ్యాం, మహేష్, మురళీ, కరమ్ సింగ్, పరిమాల్ సనేన్, సన్‌దే రాజ్‌మౌలి, వద్కాపూర్ రాజమౌళి, అనురాధా గాంధీ, పటేల్ సుధాకర్, చెరుకూరి రాజ్‌కుమార్, మల్లోజుల కోటేశ్వర్లు, రఫూప్, సుశీల్ రాయ్, శ్రీధర్ శ్రీనివాసన్, కుప్పు దేవరాజ్, నారాయణ సన్యాల్, శాఖమూరి అప్పారావు, రాంచందర్, శ్రీకాంత్, సుఖదేవ్, పద్మ, లలితక్క, ఊర్మిళ, రజిత, అజిత, సాకేత్ రాజన్, మైముద్దీన్, ఆసిష్ యాదవ్, ప్రసాద్, దయా, ప్రభాకర్,... షహీదా, ఆర్‌కె, యాదన్న, మాధవ్, మహీందర్, మస్తాన్ రావు, పులి అంజన్న, కాంచన్, శశిధర్ మహతో, జనార్దన్, భూమయ్య–కిష్టగౌడ్, అనేక వేల మంది అమరులైన కామ్రేడ్స్‌లాగ, కొన్ని పేర్లే పేర్కొన్న ఎవరైతే నిజంగా విప్లవానికి, ప్రజలకి చివరివరకు అంకితమై పనిచేశారో వారంతా నిజమైన వీరులు. ప్రజా వీరులు. మార్గాన్ని చూపినవారు.

పలాయనం, ద్రోహము, వంచనతో విద్రోహులు ప్రతీఘాతుక పాలకవర్గాల వేతనాలకు పనిచేసేవారు విప్లవాన్ని ఎప్పటికి ఆపలేరు. వారు కొన్ని తాత్కాలికమైన అడ్డంకులను, కొన్ని నష్టాలను మాత్రం కలిగించవచ్చు. కానీ విప్లవం అటువంటి చీడపురుగుల్ని దిబ్బమీదకు నెట్టి అనుకున్న లక్ష్యంవైపు అలలు అలలుగా ముందుకు సాగుతుంది. శ్రామికవర్గ విప్లవకారులు అమరవీరులచేత ఉత్తేజితులయ్యినవారు ఈ దేశంలో ఉన్న లక్షోపలక్షల పీడిత ప్రజలు వీరిని చరిత్ర పెంటకుప్పలోకి విసిరేసి అంతిమ విజయాన్ని సాధిస్తారు.

విప్లవాభి వందనాలతో

Abhay

**అభయ్**

**అధికార ప్రతినిధి, కేంద్ర కమిటీ**

**28 డిసెంబరు 2017** **భారత కమ్యూనిస్టు పార్టీ(మావోయిస్టు)**

# పత్రికా ప్రకటన
# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటి

## జినుగు నరసింహారెడ్డి అవమానకర, విద్రోహపూరిత లొంగుబాటును నిరసించండి!
## నిస్వార్థ త్యాగం, రాజీలేని పోరాట విప్లవ సాంప్రదాయం వర్ధిల్లాలి!
## అన్ని రకాల మకిలిని తుడిచేస్తూ విప్లవం అలలు అలలుగా ముందుకు సాగుతుంది.

మా పార్టీ కేంద్రకమిటీ సభ్యుడు జినుగు నరసింహారెడ్డి (జంపన్న, రాజేష్) శత్రువు ముందు లొంగిపోయాడు. అతను ముందుగానే అజేయమైన శక్తిగల శ్రామికవర్గ సిద్ధాంతం, మావోయిస్టు పార్టీ, దీర్ఘకాలిక ప్రజాయుద్ధం, విప్లవోద్యమం, పీడిత ప్రజల ఎడల విశ్వాసం కోల్పోయాడు. వర్గపోరాటంలో భాగంగా శత్రువు తీవ్రతరం చేసిన బహుముఖ దాడి వలన వాస్తవ పరిస్థితుల్లో వచ్చిన మార్పులను నూతన, వివత్కర పరిస్థితులను ఎదుర్కోలేక అతను అత్యంత స్వార్థ బుద్ధితో ఏహ్యంగా, పిరికితనంతో పారిపోయి నిస్సిగ్గుగా శత్రువు ముందు మోకరిల్లాడు. ఇది ఖచ్చితంగా భారత పీడిత వర్గానికి, దాని మార్గదర్శక పార్టీకి, భారత విప్లవోద్యమానికి, వీరోచిత పోరాటాలు చేస్తున్న దేశ ప్రజలకు చేసిన విద్రోహమే. ఏ వర్గ శత్రువుకు ఎదురుగా నిలిచి, వేలాది మంది విప్లవ అమరులు నిస్వార్థంగా పోరాడి ప్రాణాలర్పించారో, ఆ శత్రువును రాజేష్ ఇపుడు సిగ్గులేకుండా కౌగిలించుకుంటున్నాడు. దీనితో అతని మూడు దశాబ్దాల విప్లవ జీవితం అవమానకరంగా ముగిసింది. మన కేంద్రకమిటీ అతని విద్రోహాన్ని బలంగా ఖండిస్తుంది. అటువంటి ద్రోహులను, దుర్మార్గమైన లొంగుబాటు విధానాన్ని వ్యతిరేకించాలని వివిధ శ్రేణులను, మొత్తం విప్లవ శిబిరాన్ని, విశాల విప్లవ ప్రజానీకాన్ని, భారత విప్లవ మిత్రులను కోరుతున్నది. నరసింహారెడ్డి పతనం, దిగజారుడుతో ఆందోళన చెందకుండా మన తక్షణ, దీర్ఘకాలిక లక్ష్యాలకు అనుగుణంగా వర్గ పోరాట గొప్పనైన ఎర్ర పతాకను మా కేంద్రకమిటీ సందిగ్ధానికి తావులేకుండా, దృఢంగా ఎత్తిపడుతుంది.

నరసింహారెడ్డి హైదరాబాదులో ఒక ఫ్యాక్టరీలో టెక్నిషియన్‌గా పనిచేస్తూ 1980ల ప్రారంభంలో ఉద్యమంలో చేరాడు. అతను వృత్తి విప్లవకారుడుగా మారిన తరువాత వరంగల్ జిల్లాలో ఏటూరునాగారం అడవికి గెరిల్లా దళ సభ్యుడుగా పని చేయడానికి పార్టీ పంపింది. ఆ క్రమంలో అతను 1986 నుండి 1995 వరకు ఒక దళ కమాండురుగా, ఏరియా కమిటి సభ్యునిగా, జిల్లా కమిటీ సభ్యునిగా, అలాగే జిల్లాకమిటీ కార్యదర్శిగా ఎదుగుతూ వచ్చాడు. ఆ జోన్‌లో ఒక పథకం ప్రకారం గెరిల్లా యుద్ధాన్ని ఉన్నత స్థాయికి అభివృద్ధి చేసే లక్ష్యంతో 1995లో ఉత్తర తెలంగాణ జోనల్ కమిటీ (ఎన్‌టి ఎస్‌జెడ్‌సీ) నిర్మాణం అయింది. అదే సంవత్సరం జరిగిన ఎన్‌టీ ఎస్‌జెడ్‌సీ మొదటి మహాసభలో కమిటీలోకి ఎన్నికయ్యాడు. 2000 సం॥లో ఎన్‌టీ ఎస్‌జెడ్‌సీ కార్యదర్శిఅయ్యి, ఆ హోదాలోనే 2007 వరకు కొనసాగాడు. అతను 2001లో కేంద్రకమిటీలోకి ఎన్నుకోబడి 2001నుండి 2007 వరకు ఉత్తర తెలంగాణలో సీసీఎమ్‌గా పని చేశాడు. అతను 2007లో సిఎమ్‌సీలోకి కోఆప్ట్ చేయబడి ఉత్తర తెలంగాణలో మరియు కేంద్ర ప్రాంతంలోని ఇతర కొన్ని భాగాలలో పని చేశాడు. అతను 2011లో ఒడిశాకు బదిలీ చేయబడి 2016 చివరి వరకు అక్కడ పనిచేశాడు. గత ఒక సంవత్సరకాలంగా సైద్ధాంతిక, రాజకీయ ఊగిసలాటలో మునిగి చివరికి నవంబర్ 2017లో తను లొంగిపోతానన్న నిర్ణయాన్ని సంబంధిత సీసీఎమ్‌కు తెలియజేసాడు.

వాస్తవానికి నరసింహారెడ్డి సాపేక్షికంగా మూడు దశాబ్దాల సుదీర్ఘకాలం విప్లవోద్యంలో పాల్గొని, రాజకీయంగా అభివృద్ధి చెంది, ఉన్నత నాయకత్వ కమిటీ కేంద్ర కమిటీలోకి ఎదిగి ఆ క్రమంలో ఉద్యమానికి దోహదపడ్డాడు. అయినప్పటికి అదే సమయంలో అతనిలో అనేక తీవ్రమైన బలహీనతలు, పరిమితులు, వ్యక్తివాదం, పెత్తందారీతనం, కుహనాప్రతిష్ఠ లాంటి కార్మికవర్గేతర ధోరణులు అతని విప్లవ జీవితంతో పాటు కొనసాగాయి. అతనితో పాటు పనిచేస్తున్న కామ్రేడ్స్ దళ సభ్యులు, పార్టీ కమిటీలు, నాయకత్వ కామ్రేడ్స్ అతని నకారాత్మక అంశాల విషయంలో నిరంతరంగా ఆ కాలమంతా పోరాడుతూనే ఉన్నారు. సంబంధిత కమిటీలు ప్రతి సందర్భంలో అతనిని సరిదిద్దడం కోసం ప్రయత్నాలు చేశారు. చాలా విమర్శలను అతను కూడా ఏదోఒక రకంగా అంగీకరిస్తూ వచ్చాడు. అయినప్పటికీ అతను బలహీనతలు, తప్పులు, పరిమితుల నుండి బయట పడకుండానే

*(మిగతా 58వ పేజీలో.....)*